


మాయాదర్పణం

ర్వం అమరావతీ రాజ్యాన్ని పరంతపుడు రాజు పరిపాలిస్తూ వుండేవాడు. అతడు ర్మ పాలకుడు. సత్యంలో హరిశ్చంద్రుణ్ణి ప్రజా రంజకత్వంలో శ్రీరాముణ్ణి తలపించే వాడు.

పరంతపుడి పట్టమహిషి పేరు కల్పనా దేవి. ఆమె కాశ్మీర దేశపు రాజకుమారి. వారి న్యోన్య దాంపత్యం చూడ ముచ్చటగా ఉండేది. పరంతపుణ్ణి శ్రీరామచంద్రుడనీ, కల్పనాదేవిని సీతా మహా సాధ్వి అనీ ప్రజలు ప్రేమతో పిల్చుకొనే వారు.

మహారాజుకు అన్ని వైభవాలున్నప్పటికీ, త కాలానికీ సంతానం కలగ లేదు. అతడు సత్యనారాయణ వ్రతం నుండి పుత్రకామేష్టి యాగం వరకు అన్ని వ్రతాలూ చేయించాడు. దాన ధర్మాలు చేశాడు.


కాని, అదేమి దురదృష్టమో నాటిలో ఒక్కటి ఫలించ లేదు.

దానితో పరంతపుడికి రాజ్య పాలన మీద ధ్యాస తగ్గి పోయింది. కల్పనాదేవి కూడా దిన దినానికి నీరసించి పోసాగింది. దీనితో మహామంత్రి బృహస్పతిభట్టుకు రాజ్యపాలన పెద్ద సమస్యగా పరిణమించింది.

బృహస్పతిభట్టు పరంతపుణ్ణి ఏకాంతంగా కలుసుకొని, "మహాప్రభూ. మనోవ్యాధికి మందు లేదంటారు. మీరిలా దిగులు పెట్టుకొని ప్రయోజనం లేదు. రాజ వంశానికి అనాదిగా భరద్వాజ ఆశ్రమానికి చెందిన సిద్ధ పురుషులే, కుల గురువులుగా వుంటూ వచ్చారు. ప్రస్తుతం భరద్వాజాశ్రమానికి గురుచరణ మహర్షి కులపతిగా వుంటున్నారు. ఈ సమస్యకు వారు ఏదైనా పరిష్కార మార్గం చూప గలరేమోనని నా అభిప్రాయము." అన్నాడు.

అది విని పరంతపుడు, "అలా అయితే. గురుచరణ మహర్షుల వారిని మన ఆస్థా

యం. ఉమాదేవి



నానికి ఆహ్వానించి, వారి ఆశీర్వాదం పొందుదాము," అన్నాడు.

"లాభం లేదు ప్రభూ! ఆయన క్షేత్ర సన్యాసము స్వీకరించారు. తన ఆశ్రమమూ, పరిసర వనమూ దాటి వారే నగరానికి రారు," అన్నాడు బృహస్పతిభట్టు.

"అలా అయితే, మనమే వారి దర్శనానికి వెళదాము. ఏర్పాట్లు చేయించండి," అన్నాడు పరంతపుడు.

బృహస్పతిభట్టు రథాన్ని సిద్ధం చేయించాడు. తగు పరివారంతో మహారాజు, మహారాణి కృష్ణానదీ తీరంలోని భరద్వాజ ఆశ్రమానికి బయలుదేరారు. అశ్వికులను, సైనికులను కొంత దూరంలో ఆపి వేసి పాదచారులై రాజ దంపతులు భరద్వాజ ఆశ్రమము లోనికి ప్రవేశించారు. వారి రాకను ముందే వార్తాహరుల ద్వారా తెలుసుకొన్న గురుచరణ మహర్షి రాజ దంపతులకు స్వాగతం పలికాడు. ఆశ్రమవాసులు మహారాజుకూ, మహారాణికీ పూర్ణ కుంభంతో ఆశీర్వాద మిచ్చి లోనికి తీసుకొని వెళ్ళారు. మహర్షి రాజ దంపతుల యోగ క్షేమాలను విచారించాడు.

అప్పుడు పరంతపుడు ఇలా అన్నాడు.

"మహర్షి, సంతానము లేని దంపతుల జన్మ నిరర్ధకమే కదా! అనాదిగా మీ ఆశ్రమ కులపతులే రాజ గురువులుగా వుంటూ, మా యోగ క్షేమాలన్నింటినీ చూస్తూ వుండే వారు. తమరు ఆశ్రమానికి అధిపతులు అయిన తర్వాత, భవ బంధాలను తెంచుకొని, క్షేత్ర సన్యాసము స్వీకరించి, ఎన్నడూ మా రాజ్యం లోనికి అడుగు పెట్టలేదు. దాని ఫలితాన్ని మేము ఇప్పుడు అనుభవిస్తున్నాము. మహారాణి కడుపున ఒక కాయ కాస్తే మా రాజ వంశము నిలుస్తుంది. దీనికి తమరు ఏదైన పరిష్కారము చూపించాలి. తమరి ఆశీర్వాదమే మాకు శ్రీరామ రక్ష."

గురుచరణ మహర్షి చిరునవ్వు నవ్వి, రాజ దంపతులను విశ్రమింప వలసిందిగా కోరాడు.

ఆ రాత్రి అమ్మవారి పూజలో కూర్చున్నాడు మహర్షి.

పరంతపుడి వంశము సత్యానికి, ధర్మాని

పేరెన్నిక కన్నది. ఈ ప్రభువు కూడా న్యాయ పాలకుడు. అలాంటిది ఈ వైపరీత్యమేమిటి?

ఇలా సంకల్పించి, మహర్షి ధ్యానములో కూర్చోగానే. అతడికి అమ్మవారి సంకల్పం ఏమిటో కొంత తెలిసి పోయింది.


మరునాడు ఉదయం గురుచరణ మహర్షి రాజదంపతులను పిలిచి, "రాజదంపతులారా! మీరు విచార పడకండి. మీ కడుపున కారణ జన్మురాలైన ఒక కుమార్తె కలుగబోతున్నది. ఆమె వల్ల, ఈ భరతఖండంలో ఒక విచిత్ర గాథ నడిచే సూచనలు కన్పిస్తున్నాయి. అదేమిటో నేను ఇప్పుడే స్పష్టంగా చెప్పలేను." అన్నాడు.

ఈ మాటలు విని రాజదంపతులకు ఆనందమూ, విచారమూ ఒకే సారి కలిగాయి.

"మహర్షీ, కుమారుడు కాడా? మాకు కుమార్తె కలుగుతుందా?" అన్నాడు పరంతపుడు.

"ఓయీ, రాజా! కుమారుడైనా, కుమార్తె అయినా ఒకటిగానే భావించుకో. అమ్మవారి సంకల్పాన్ని నెరవేరనీయ్. నీకు ఇంత కాలం సంతానం కలుగ లేదంటే, దానికి కూడా ఆ ఆదిపరాశక్తి సంకల్పమే కారణం కావచ్చు." అన్నాడు మహర్షి.

ఇలా చెప్పి గురుచరణ మహర్షి రాజదంపతులకు తీర్థమూ ప్రసాదమూ ఇచ్చాడు. అమ్మవారి పూజలో నుండి ఒక అమృత



ఫలాన్ని తీసి మహారాణికి ఇచ్చాడు. దానిని తొక్కతో సహా ఏదీ పారవేయకుండా తిన వలసిందిగా కోరాడు.

"ఈ సంతానానికి బాలారిష్టాలు వుంటాయి. వేయి కన్నులతో జాగ్రత్తగా చూచుకోవాలి," అన్నాడు మహర్షి.

మహారాజుకు ఇది వరమో, శాపమో తెలియలేదు. ఇటు సంతానాన్ని ఇచ్చినట్టే ఇచ్చి, అటు అరిష్టాలు వుంటాయి అని సూచిస్తున్నాడేమిటి? ఏమైనా, కానున్నది కాక మానదని మహారాజు గుండె దిటవు చేసుకొని, భార్యతో అమరావతికి చేరాడు.

కొద్ది కాలంలోనే మహర్షి ఆశీర్వాదము ఫలించింది. మహారాణి కల్పనాదేవి గర్భవతి



అయింది. నవమాసాలు నిండగానే ఆమె ఒక శుభముహూర్తాన ఆడపిల్లను ప్రసవించింది. ఆ బిడ్డకు అవంతీసుందరి అని నామకరణం చేశారు.

లేక లేక పుట్టిన ఆ శిశువును అల్లారు ముద్దుగా పెంచసాగారు. తగిన గురువులను ఏర్పాటు చేయించి, సమస్త కళలు నేర్పించారు.

ఒక నాడు మహారాణి కల్పనాదేవి, అవంతీసుందరిని వెంట బెట్టుకొని కొండమీది కాత్యాయనీదేవి దర్శనానికి వెళ్ళింది. దేవి పూజలు ముగించుకొని వారు తిరుగు ముఖం పడుతుండగా, అవంతీసుందరి మెట్లు దిగుతూ ఒక్కసారి కెవ్వున కేక వేసింది. కల్పనాదేవి భయంతో అటు చూసే సరికల్లా మెట్ల ప్రక్క నుండి ఒక పాము అవంతీసుందరి పాదాల మీదుగా ప్రాకుతూ అవతలికి వెళ్ళి పోయింది.

శూలధారులైన భటులు పరుగు పరుగున దానిని వెంబడించారు. కాని, అది కొండలోని బండలలో ఎక్కడో అదృశ్యమై పోయింది.

అంతఃపురానికి రాగానే పరంతపుడికి ఈ వార్త తెలిసింది. అతడికి కలిగిన పరితాపం ఇంతా, అంతా కాదు. ఆస్థాన జ్యోతిష్కులను పిలిచి, రాజకుమారి జాతకం మళ్ళీ పరిశీలించవలసిందిగా కోరాడు. వారు జాగ్రత్తగా లెక్కలు కట్టి చూశారు. ప్రధాన జ్యోతిష్కుడు అగ్నిభట్టు ఇలా చెప్పాడు.

"భరద్వాజ ఆశ్రమ కులపతి చెప్పిన మాటలు యథార్థంగానే కన్పిస్తున్నాయి ప్రభూ! పదహారేండ్ల వరకు ఇలాంటి గండాలు అప్పుడప్పుడూ వస్తూ వుంటాయి! ఈ జాతకురాలికి ఏదో సర్పదోషం కనపడుతున్నది."

"పోనీ, పదహారు సంవత్సరాల తర్వాత అయినా, రాజకుమారికి గండాలు తీరి పోతాయా?" అని అడిగాడు మహారాజు.

"ఏమో చెప్పలేము, ప్రభూ! పదహారవ యేట రాజకుమారి తప్పిపోయే ప్రమాదం జాతకంలో కనబడుతున్నది," అన్నాడు అగ్నిభట్టు.

ఈ మాటలు విని, మహారాజు మూర్ఛ పోయాడు.

మహామంత్రి బృహస్పతిభట్టు అగ్నిభట్టు వైపు కోపంగా చూచి. "మీకు శాస్త్రజ్ఞానమే కాని, లౌకికజ్ఞానం తక్కువ పండితులవారూ! ఒక వేళ అలాంటి గండాలు వున్నా ప్రభువుల వారితో చెపుతారా?" అన్నాడు.


"మహామంత్రీ, మాకు ఇది కఠిన పరీక్ష. చెపితే ఒక తప్పు. చెప్పకపోతే మరొక తప్పు. రాబోయే గండాన్ని దాచిపెడితే ఇంకా ప్రమాదము కదా? చెపితే, ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు," అన్నాడు అగ్నిభట్టు.

"సరే, జరిగినదేదో జరిగి పోయింది! ఈ వార్త పట్టమహిషికి, ఏ మాత్రమూ తెలియకుండా జాగ్రత్త వహించండి," అని హెచ్చరించాడు మహామంత్రి.

"చిత్తం. అలాగే మహామంత్రీ!" అన్నాడు అగ్నిభట్టు.

మహారాజు త్వరలోనే కోలుకొన్నాడు. మహామంత్రి సలహా మీద అతడు ఈ వార్తను బయటికి పొక్కనివ్వ లేదు. కాని, అతడి గుండెల్లో మాత్రం దిన దినానికి బాధ పెరుగ సాగింది.

ఒక నాడు ససైన్యంగా మహారాజు వసంత పుడు కృష్ణాతీరంలో విహారానికి వెళ్ళాడు. ఇప్పుడు అతడు కుమార్తెను ఒక్క క్షణం కూడా వదిలిపెట్టి వుండటం లేదు. అవంతి సుందరి కూడా తండ్రి పక్కనే రథం మీద కూర్చున్నది.




రథం ఒక చెట్టు క్రింది నుంచి పోతూ వుండగా. ఉన్నట్టుండి ఒక్క సారిగా గుర్రాలు ఎందుకో బెదిరాయి. రథం అటూ యిటూ వూగింది.

మరుక్షణమే పెద్ద జువ్విచెట్టు ఒకటి ఫెళ్ళున విరిగి రథం మీద పడింది. రథపు టెక్కెము, వెనుక భాగము నుజ్జు నుజ్జు అయినాయి.

మహారాజూ, అవంతీసుందరీ రథం మీది నుంచి క్రిందికి దూకారు. వెంట్రుక వాసిలో వారికి ప్రమాదం తప్పి పోయింది.

ఇది చూచి వెనుకా, ముందూ వున్న భటులు పరుగు పరుగున వచ్చి రథాన్ని చుట్టు ముట్టారు.

6



జువ్విచెట్టు పక్కకు తొలగించి చూడగా అందరికీ ఆశ్చర్యం కలిగించే దృశ్యం ఒకటి కనిపించింది. జువ్విచెట్టు క్రింది నుంచి ఒక పాము జరజర ప్రాకుతూ నదీతీరంలోని ఒక చెట్టు చాటుకు పోయి మాయమైంది.

ఈ దృశ్యం చూచిన తర్వాత మహారాజుకి ప్రాణాలు కుదుట పడలేదు. ఏదో దుష్ట గ్రహం తన కుమార్తెను అనుక్షణను పీడిస్తున్నదని అతడికి తోచింది.

అంతఃపురానికి రాగానే మహామంత్రినీ, జ్యోతిష్కులనూ, ఆంతరంగికులనూ పిలిచి సమాలోచన చేశాడు పరంతపుడు.

అప్పుడు ఎన్నో తర్జనలూ భర్జనలూ జరిగిన మీదట, అందరూ ఒక అభిప్రాయానికి వచ్చారు. వారు మహారాజుతో ఇలా చెప్పారు వినయంగా.

"మనకు ఎన్నో తరాలుగా భరద్వాజ ఆశ్రమము వారే గురువులుగా వుంటూ వచ్చారు. కాబట్టి, గురుచరణ కులపతిని ప్రార్థించి యువరాణిని కొంత కాలం వారి ఆశ్రమంలోనే వుంచుకోమని చెపుతాము. అప్పుడు దుష్ట గ్రహ వీక్షణానికి ఆయన మంత్ర మహిమ వల్ల విరుగుడు జరుగ వచ్చు. ఈ విధంగా అవంతీ సుందరికి శుభం కలుగ వచ్చు."

ఇది విని, మహారాజు కూడా బాగానే వున్నదని ఒప్పుకున్నాడు.

ఇలా నిర్ణయించుకొన్న వెంటనే, పరంతపుడి పక్షాన బృహస్పతిభట్టు సపరివారంగా కృష్ణా తీరానికి వెళ్ళాడు. కులపతికి కానుకలు సమర్పించి, తన మనసులోని మాట చెప్పాడు.

అది విని మహర్షి యిలా అన్నాడు.

"ఇది ఋష్యాశ్రమం. వనప్రదేశం. ఇక్కడ అంతఃపుర సౌఖ్యాలు లభ్యము కావు. ఈ ఆశ్రమ బాలకులతో, బాలికలతో కలిసి యువరాణి వుండ గలిగితే, మాకు అభ్యంతరము లేదు."

"మీ సన్నిధానమే మాకు అంతఃపురం కన్నా గొప్పది. ఆశీర్వదించి యువరాణీవారిని పదహారు సంవత్సరాలు నిండే వరకు మీ ఆశ్రమంలోనే ఉండనివ్వండి," అని చెప్పాడు బృహస్పతిభట్టు వినయంగా.

బృహస్పతిభట్టు తిరిగి వచ్చి, మహా రాజుకూ, మహారాణికీ ఈ విషయం చెప్పాడు. ముందు మహారాణి అంగీకరించ లేదు.

కాని, అతికష్టం మీద పరంతపుడు కల్పనా దేవిని ఒప్పించాడు. ఒక శుభముహూర్తాన అవంతీసుందరిని ఆశ్రమానికి చేర్చారు.

గురుచరణ మహర్షి అవంతీసుందరిని కన్న బిడ్డ వలె చూచుకున్నాడు.


"తల్లీ, నీవు నా అనుమతి లేకుండా ఆశ్రమము విడిచి వెళ్ళ వద్దు. ప్రతి దినమూ సంధ్యా సమయంలో ఆదిపరాశక్తి పూజ ఎటువంటి పరిస్థితిలోనూ మానవద్దు," అంటూ మహర్షి ఆమెకు కొన్ని నియమాలు పెట్టాడు.

"అలాగే గురుదేవా!" అన్నది అవంతీసుందరి.

గురువు చెప్పినట్టే నియమం వదలక అవంతీసుందరి ప్రతి సాయంకాలమూ అమ్మవారి పూజ చేస్తూనే వున్నది. ఆర్షవిద్యలను అభ్యసిస్తున్నది.

ఇలా వుండగా, ఒక నాడు ఒక విచిత్రం జరిగింది.

ఆశ్రమానికి అవతల వున్న కొండ మీదికి గుంపులు గుంపులుగా కొన్ని వేల నెమిళ్ళు ఎక్కడి నుంచో వచ్చి వాలాయి. అవి అన్నీ పురి విప్పుకొని ఆడుతుంటే, ఆ పర్వతమే పెద్ద బంగారు కన్నుల నెమిలిగా మారి నర్తిస్తున్నదా అన్నట్లు అనిపించింది.



ఆశ్రమంలోని ప్రధాన కులపాలిక ఈ దృశ్యం చూచింది. ఆమె పరుగు పరుగున కొండ దగ్గరికి వెళ్ళింది. ఆమెతోపాటే వున్న అవంతీసుందరి కూడా ఆశ్రమపు సరిహద్దు దాటి కొండ వద్దకు వెళ్ళింది.

తమకు తెలియకుండానే, వారు ఇద్దరూ అలా కొండ ఎక్కటం మొదలు పెట్టారు. నెమిళ్ళ క్రేంకారాలను వింటూ, అందమైన మయూర నృత్యాన్ని చూస్తూ, అవంతిసుందరి నెమిళ్ళ వెంట పరుగెత్తింది. అలా ఆమె కొండపై కొంత దూరం వెళ్ళింది.

అప్పటికి సాయంకాలమైంది. నెమిళ్ళను చూస్తూ ఆమె అమ్మవారిని పూజించే విషయం కూడా మరిచి పోయింది.

ఇంతలో ఉన్నట్టుండి ఒక్క సారిగా ఎవరో తరిమినట్లు అక్కడ వున్న వేల కొద్ది నెమిళ్ళు గాలిలోకి ఎగిరి పోయాయి.

"అవంతీ, చీకటి పడుతున్నది. ఇక ఆశ్రమానికి పోదాం పద," అని పిలిచింది కులపాలిక.

కాని, బదులు సమాధానం రాలేదు. కులపాలిక చుట్టూ కలియ చూచింది.

కులపాలిక భయపడుతూ, "అవంతీ, అవంతీ!" అని మళ్ళీ పిలిచింది.

యువరాణి ఎక్కడా కనిపించ లేదు. దానితో, కులపాలిక పిచ్చిదానిలాగా వెతికి, ఆ పైన ఆశ్రమం లోనికి వెళ్ళి చూచింది. అక్కడా కనబడలేదు. భయంతో కులపతి వద్దకు వెళ్ళి అంతా వివరించి చెప్పింది.

ఎన్నడూ లేనిది, గురుచరణ మహర్షికి కన్నులు ఎర్రబడ్డాయి. ఏదో జరగకూడనిది జరిగిందని అతడికి తెలిసి పోయింది. అతడికి విచారం, కోపం ఒకేసారి కలిగాయి. యిది అతడికి ఒక సవాలుగా పరిణమించింది.


మహారాజు ఎంతో బాధ్యతతో యువరాణి రక్షణను తనకు అప్పగించాడు. అలాంటిది తన ఆశ్రమం వద్దనే ఆమె అదృశ్యం కావటమా?

'ఈ నెమిళ్ళు ఏమిటి? వేల కొద్దీ రావటం ఏమిటి? కులపాలికవంటి జాగ్రత్తకల మనిషి కూడా వాటి చేత ఆకర్షింప బడటం ఏమిటి! ఏదో మోసం జరిగి పోయింది.' అనుకున్నాడు గురుచరణ మహర్షి.

ఒకవైపు ఆశ్రమవాసులను అన్ని దిక్కులకు పంపి, అవంతీసుందరిని వెతికించ సాగాడు. మరొక వైపు ఆమె జాడ కనుక్కునేందుకు వేరే దారుల కోసం వెతక సాగాడు. ఎంతో సేపు ఆలోచించి, అంజనం వేయ సంకల్పించాడు గురుచరణ మహర్షి.

—(ఇంకా ఉం





మాయాదర్పణం

2

[అమరావతి మహారాజు పరంతపుడికి గురుచరణ మహర్షి కృప వల్ల, అవంతీసుందరి అనే పుత్రిక కలుగుతుంది. ఆమెకు ఎదురయ్యే ఆపదలను చూచి, మహారాజు కలవరపడి, ఆమెను మహర్షి ఆశ్రమానికి చేరుస్తాడు. అయితే, ఒక నాడు దాపులనున్న కొండమీది నెమిళ్ళను చూడపోయి రాజకుమారి మాయమైపోతుంది. ఆమె జాడ తెలుసుకొనటానికి, అంజనం వేయ సంకల్పిస్తాడు మహర్షి. తరవాత—]

గురుచరణ మహర్షి అంజనం వేయటానికి అన్ని ఏర్పాట్లు చేశాడు. పర్ణశాలలో తూర్పు దిక్కున బియ్యపు పిండితో పెద్ద పెద్ద ముగ్గులు పెట్టించాడు. వాటి చుట్టూ పసుపు కుంకుమలతో కొన్ని కోణాలు గీచాడు. ఆ కోణాల చుట్టూ కొన్ని వలయాలు చుట్టాడు. కోణాలకు మధ్య బీజాక్షరాలు వ్రాశాడు.

ఆ తరవాత, మహర్షి వరుసగా కొబ్బరి కాయలు కొట్టి, అఖండదీపం వెలిగించాడు. ఆ దీపాన్ని గంధం, అక్షతలు, పుష్పాలతో అర్చించాడు. అప్పుడు మంత్రాక్షతలు చల్లి ఒక దేవతను ఆవాహన చేశాడు.

మరుక్షణమే, పర్ణశాలలో ఎవరో పెద్దగా నవ్వినట్లు అనిపించింది. ఆ నవ్వు విని గురుచరణ మహర్షి, ముగ్గులోకి అంజనాన్ని చూచే దేవత వచ్చిందని గ్రహించాడు.


“చిన్నసిద్ధా,” అని పిలిచాడు మహర్షి.

ఆశ్రమంలోని బాల శిష్యులలో ఒకడైన చిన్నసిద్ధుడు వచ్చి, గురువు ఆజ్ఞ ప్రకారం ముగ్గులో కూర్చున్నాడు. అప్పుడు మహర్షి చిన్నసిద్ధుడికి ధూపం వేసి, అంజనదేవతను పేరు పెట్టి పిలిచాడు. దేవత చిన్నసిద్ధుడి శరీరం మీదికి రాగానే, చిన్నసిద్ధుడు పూనకం పట్టినట్లు ఊగసాగాడు.

“ఓ అంజనదేవతా! పలుకు పలుకు. అవంతీసుందరి ఏమైంది?” అన్నాడు మహర్షి.

చిన్నసిద్ధుడు వికటంగా నవ్వి, “సముద్రాల కవతల చిత్రమైన ద్వీపం....ద్వీపంలో నెమిలి

యం. ఉమాదేవి



మయూరాక్షి.... మయూరాక్షి....మయూరాక్షికీ మాయాదర్పణానికీ లంకె .... అంజనానికి అందని అభేద్యమైన మాయ .... నెమిలి కన పడుతున్నది. నెమిలి...." అంటూ ఊగ సాగాడు.

"అవంతీసుందరి జాడ చెప్పు, అంజన దేవతా!" అని అరిచాడు గురుచరణమహర్షి.

"అంజనానికి అందని ద్వీపంలో అవంతీ సుందరి వుంది. నెమిలి మాత్రమే కనపడు తున్నది .... నెమిలి...." అని చిన్నసిద్ధుడు మళ్ళీ వికటంగా నవ్వాడు.

ఆ తరవాత, ఎన్నిసార్లు అడిగినా, యిదే సమాధానం వచ్చింది. గురుచరుణుడికి విసుగు పుట్టి అంజనదేవతకు ఉద్వాసన చెప్పాడు. చిన్నసిద్ధుడు అంజనదేవత ప్రభావం వల్ల కొంత సేపు స్పృహ తప్పి పడిపోయాడు.

గురుచరణమహర్షికి ఏమీ తోచ లేదు. తన వంటి మంత్రసిద్ధుడికి కూడా ఈ రహస్యం అంతు పట్టక పోవటం ఆశ్చర్యంగానే ఉంది. అయితే, అతడికి ఒక్క విషయం స్పష్టమైంది: రాజకుమారి ప్రస్తుతం సామాన్యమానవులు నివసించే ప్రదేశంలో లేదు. ఆమెను ఎవరో ఎక్కడో దాచారు. అలా ఎందుకు దాచారు అనేది దుర్భేద్యమైన రహస్యంగానే వుంది.

గురుచరుణుడికి ఆ రాత్రి నిద్ర పట్ట లేదు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి? తనపై నమ్మకం వుంచి, తన వద్ద రాజకుమారిని వదలి వెళ్ళిన ప్రభువుకూ, పట్టమహిషికీ ఏం సమాధానం చెప్పాలి? పోనీ, ఆమెను వెతికేందుకు ఎవరైనా యోగ్యుడైన వాడిని పంపి, అప్పటి వరకూ ఈ రహస్యాన్ని రాజధానికి చేరకుండా దాచి పెడితే ఎలా వుంటుంది?

ఇలా చేయటం నచ్చ లేదు మహర్షికి. తమ బిడ్డ విషయం తెలుపకుండా తలిదండ్రులను అలా మభ్యపెట్టటం చాలా దోషం అనిపించింది. పైగా, రాజకుమారి ఇన్నాళ్ళలో దొరుకుతుందని చెప్పటం కష్టం కదా! అలాంటప్పుడు తానెంత కాలం దాచి పెట్టగలడు?

మర్నాడు ఉదయం గురుచరణమహర్షి తన సూర్యోపాసనను ముగించుకొన్నాడు.

ఆ తరవాత, తన శిష్యులలో మైత్రేయుడనే


వాణ్ణి పిలిచి. "మైత్రేయా, నేడే నీవు రాజధానికి వెళ్ళు. మన ప్రభువులవారిని కల్సుకొని. రాజకుమారిని గూర్చిన వార్త వారికి తెలియజేయ్. అయితే, వారు ఈ విషయంలో భయపడవలసిన అవసరం ఏమీ లేదనీ. ఎంత కష్టమైనా సరే. ఆమె తిరిగి లభించే వరకు నేను—అంటే మీ కులపతి—విశ్రాంతి తీసుకోడనీ వారికి ధైర్యం చెప్పు. నేను అతి ముఖ్యమైన పని మీద ఒక చోటికి వెళుతున్నాను. త్వరలో, వెళ్ళి ప్రభువును చూస్తాను. యిది నా మాటగా ఆయనతో చెప్పు." అన్నాడు గురుచరణ మహర్షి.

మైత్రేయుడు గురుపాదాలకు నమస్కరించి, ఆ ఆజ్ఞను శిరసావహించి రాజధాని నగరానికి బయలుదేరి వెళ్ళాడు.

ఆ తరవాత, గురుచరణుడు ప్రధాన కులపాలికను పిలిచి, "నేను ఒక ముఖ్యమైన పని మీద ఒక చోటికి వెళుతున్నాను. ఎక్కడికి వెళుతున్నానో, ఎందుకు వెళుతున్నానో ఎవరికీ తెలియ కూడదు. దీనిని అత్యంత గోప్యంగా ఉంచవలసిన బాధ్యత నీది," అని చెప్పాడు.

ప్రధాన కులపాలికకు గురువులవారు రాజకుమారి అన్వేషణలోనే బయలుదేరుతున్నారన్ని అర్థమైంది. అయితే. గురువులవారు ఈ విషయాన్ని ఎందుకింత రహస్యంగా దాస్తున్నారో అర్థం కాలేదు.


బహుశః, రాజకుమారి ఏ రాక్షస మాయ



లోనే చిక్కుకొని పోయి వుండ వచ్చు. గురువులవారు చేస్తున్న ప్రయత్నాలు ముందుగానే తెలిసిపోతే. వారు అవాంతరాలు కల్పించవచ్చు. అందువల్ల. గురువులవారు ఇలా తన ప్రయాణాన్ని రహస్యంగా ఉంచారని ప్రధాన కులపాలిక గ్రహించ కలిగింది.

ఇలా గురుచరణుడు మైత్రేయుణ్ణి రాజధానికి సాగనంపాడు. ప్రధాన కులపాలికకు ఆశ్రమ బాధ్యతను అప్పగించాడు. కమండలం ధరించి. పావుకోళ్ళు వేసుకొని, వేగంగా ఆశ్రమం నుండి ఎక్కడికో ఒంటరిగా బయలుదేరాడు.

అలా అతడు మూడు రాత్రులూ, మూడు పగళ్ళూ ప్రయాణం చేశాడు. కృష్ణానదినీ



గోదావరినదిని దాటాడు. గోదావరి ఎగువ భాగాన దట్టమైన ఒక కీకారణ్యం లోనికి ప్రవేశించాడు మహర్షి.

అక్కడి ప్రకృతి చాలా మనోహరంగానూ భయంకరంగానూ వుంది. పులులూ, ఏనుగులూ, సింహాలూ, కొండచిలువలూ, ఎలుగుబంటులూ మాత్రమే కాకుండా ఎన్నో అందమైన అడవిపక్షులు కూడా అక్కడ విహరిస్తూ వున్నాయి.

గురుచరణమహర్షి ప్రయాణపు బడలిక చేత ఒక చెట్టుక్రింద విశ్రమించాడు. సమీపంలోని ఒక ఫలవృక్షపు పండ్లతో కడుపు నింపుకొని దగ్గరలోనే ఉన్న సెలయేటి నీరు త్రాగి కొద్ది సేపు పవ్వళించాడు.

అలా పడుకొన్నాడేగాని మహర్షికి నిద్ర పట్ట లేదు. అతడి మనస్సంతా కదిలించిన కండ్రీగల పుట్టవలె వుంది. రాజకుమారి అదృశ్యమైన వృత్తాంతమే అతడి మనస్సును చాలా బాధిస్తూ వుంది.

ఇంతలో వున్నట్లుండి మహర్షికి భయంకరమైన కేక వినపడింది. అతడు కనులు తెరిచి చూచాడు. తాను పడుకొన్న చెట్టుకు సమీపములో ఒక నెమిలి వచ్చి వాలింది. అవి చేసిన క్రేంకార ధ్వనే మహర్షికి వినపడిందన్న మాట!

నిజానికి మయూరనాదం ఆహ్లాదకరంగానే వుంటుంది. ఈ నెమిలి కూడా అందంగానే కూసింది.

కాని, గురుచరణుడికి ఈ కూత ఎందుకంత వికారంగానూ భయంకరంగానూ వినపడింది? దానిని బట్టి, ఇది నిజమైన నెమిలి కాదని తెలుసుకొన్నాడు గురుచరణుడు.

తనను ఎవరో మాయావులు వెంబడిస్తున్నారని కూడా అతడు గ్రహించాడు. ఎన్నడూ రానిది అతడికి కోపం వచ్చింది. వెంటనే భూమిపై నుండి ఒక పొడవైన ఎండు చితుకు పుల్లను చేతిలోకి తీసుకొన్నాడు. దానిని తన కమండలంలోని నీటిలో ముంచి అభిమంత్రించాడు.

ఇలా మంత్రించిన చితుకుపుల్లను, గురుచరణుడు విలాసంగా నెమిలి వైపుకు విసి

రాడు. చూస్తూండగానే, ఆ పుల్ల పామై పోయింది. పొడవైన తోకతో, వెడల్పయిన తలతో ఆ మంత్రసర్పం ఎండుటాకుల మధ్య నుండి జరజర ప్రాకుకుంటూ ముందుకు సాగిపోయింది.

బుసలు కొట్టుకుంటూ తన మీదికి వస్తున్న ఆ మంత్రసర్పాన్ని చెట్టు మీది నెమిలి చూచింది. దానికీ పాముకూ సహజంగా జాతి వైరం ఉంటుంది కదా! పాము అప్పటికే నెమిలి కూర్చున్న చెట్టును పాకి పైకి చేరింది. మంత్రసర్పం తోకను వేగంగా తిప్పుతూ, ఫూత్కారం చేస్తూ, చెట్టు కొమ్మల మధ్య కూర్చున్న నెమిలి మీదికి దూకింది.

నెమిలి మరుక్షణమే రెక్కలను టపటప లాడించింది. భయంకరంగా క్రేంకారం చేస్తూ మంత్రస్పరం మీదికి దూకింది. పొడవైన తన ముక్కుతో పాము కళ్ళను పొడవటానికి ప్రయత్నించింది. అయితే, మంత్రసర్పం భయంకరంగా బుసలు కొడుతూ, తన తోకతో నెమిలి కాళ్ళను చుట్టి వేసింది. పాముతలను పొడవటానికి, ముక్కు జాపి వస్తున్న నెమిలి మీదికి పాము విషాన్ని కక్కింది.

ఆ విషం భగ్గున నిప్పువలె మండింది. ఆ మంటకు చెట్టు కొమ్మలు మలమల మాడి పోయాయి. ఆ వేడికి నెమిలి పించం అంటుకొన్నది. భగభగ రగిలే సెగల మధ్య నెమిలి మలమల మాడిపోయింది.




"హతోస్మి హతోస్మి!" అని పెద్దగా అరుస్తూ ఆ నెమిలి మండుతున్న తోకతోనే గాలిలోకి ఎగురుకుంటూ పోయింది.

గురుచరణుడు నెమిలి వంక తదేకంగా చూశాడు. అరుస్తూ పోతున్న నెమిలి తోక అంటుకొని ఉండటంతో, వెలిగే కాగడా ఒకటి ఆకాశంలో పరుగెత్తి పోతున్నట్లు అనిపించింది.

గురుచరణుడికి ఇప్పుడు అసలు విషయం అర్థమయింది.

రాజకుమారిని అపహరించినపుడు కూడా పెద్ద నెమిళ్ళ గుంపు వచ్చింది. అంజనం వేసినపుడు కూడా అందులో ఒక నెమిలి కనపడింది. ఇప్పుడు తాను అన్వేషణకై బయలు



దేరినపుడు కూడా, తనను ఒక రాక్షస నెమిలి వెంబడించింది. కాబట్టి, దీని సారాంశమేమంటే, ఈ రాక్షస మయూరాలకూ, రాజకుమారి అపహరణకూ ఏదో దగ్గర సంబంధం ఉండి ఉండాలి. అదేమిటి? ఎలా తెలుసుకోవాలి?

ఈ నెమిలి సంఘటనతో గురుచరణుడికి మళ్ళీ విశ్రాంతి లేకుండా పోయింది. తన పని ముగియగానే, మంత్రసర్పం ఒక ఎండుపుల్లగా మారి నేలపై పడిపోయింది. అతడు లేచి నిలుచున్నాడు. ఎదురుగా మంటలలో కాలిపోయిన చెట్టు బోసిపోయి జాలిగా కనిపిస్తున్నది.

గురుచరణుడు పావుకోళ్లు తొడుక్కొని, భూమిపై నుండి ఒక గడ్డి పరకను తీసి మంత్రించి, దానితో పొడవైన గీతను గీచాడు.

దీని ప్రభావం వల్ల, అతడిని ఇక ఏ దుష్టశక్తులూ ఈ గీతను దాటి వచ్చి వెంబడించలేవన్న మాట!

గురుచరణ మహర్షి మళ్ళీ తన నడకను సాగించాడు.

అలా చీకటి పడే వేళ వరకూ నడుస్తూ ముందుకు సాగిపోగా, ఒక కొండ కనిపించింది. దాని కింద అరణ్యం వుంది. నిజానికి అది అరణ్యంలాగా లేదు. ఎవరో దానిని ఉద్యానవనంలాగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించినట్లూ తెలుస్తూనే ఉంది. ముళ్ళ చెట్లూ విషవృక్షాలూ ఎన్నో నరికి వేయ బడి ఉన్నాయి. ఫల పుష్పముల నిచ్చే చెట్లను నీరు పోసి, పెంచిన గుర్తులు కనపడుతున్నాయి.

అక్కడికి వచ్చేసరికి, గురుచరణుడికి మనస్సు శాంత పడింది. అతడు వెంటనే కొండ గుహల వద్దకు వెళ్ళలేదు. ఒక్క క్షణంపాటు ఒక పూలచెట్టు వద్ద విశ్రాంతి తీసుకొన్నాడు.

ఇంతలో, అతడికి ఒక విచిత్రమైన దృశ్యం కనిపించింది.

ఆరడుగుల కోతి ఒకటి తనలో తాను ఏదో గొణుగుతూ అక్కడ తిరుగుతున్నది. అది కిచకిచ శబ్దం చేస్తున్నది.

నిజానికి అవి కోతి చేసే ధ్వనులుగా లేవు. ఏవో మంత్రాలు చదువుతున్నట్లుగా ఉన్నది.

అది చూచేసరికి, గురుచరణుడికి ఎంతో ఆనందం కలిగింది. మరుక్షణమే అతడు ఒక విచిత్రం చేయాలనుకొన్నాడు.

అతడు కూడా ఒక కొండముచ్చుగా మారాడు. ఏమీ తెలియనట్లు అటూ ఇటూ ఇకిలిస్తూ, సకిలిస్తూ ముందుకు పోయాడు. అలా వెళ్ళి ఆరడుగుల కోతి తోకను పట్టుకొని ఒక్కసారి గుంజాడు.


కోతికి కోపం వచ్చింది. తన మీదికి వచ్చిన కొండముచ్చును అదిలించాలని ప్రయత్నించింది. అయితే అది సాధ్యపడలేదు.

గురుచరణుడు ఈ అడవికోతిని ఆటలు పట్టిస్తున్నాడు. క్రమంగా అడవికోతికి కోపం ఎక్కువైంది. తానొక కొండముచ్చు చేతిలో ఎందుకు ఓడిపోతున్నదో అడవికోతికి అర్థం కాలేదు.

అడవికోతి తన శక్తినంతా కూడ తీసుకొని కొండముచ్చును పట్టుకొన్నది. కోపంతో కొండముచ్చును దండించాలని ఎంతగానో ప్రయత్నించింది.

ఇంతలో, కొండముచ్చు అడవికోతి తోక పట్టుకొని, గిరగిర త్రిప్పి, సున్నితంగానే అవతలికి విసిరింది. ఆరడుగుల అడవికోతి గిరగిర తిరిగి క్రింద పడింది.

ఆ పడటం సరిగ్గా కొండముచ్చు కాళ్ళ



మీద పడింది. దానితో అడవికోతికి సహనం నశించింది.

"నీ వెవరు? కొండముచ్చువా? లేక రాక్షసుడివా? చెప్పు," అని అడవికోతి మానవ భాషలో గర్జించింది.

"హనుమంతుడి ముందు కుప్పిగంతులా అనే సామెత ఇప్పుడు నిజమైంది, నాయనా!" అన్నాడు గురుచరణుడు.

అడవికోతి ఈ గొంతును గుర్తించింది.

అడవికోతి పశ్చాత్తాపంతో నమస్కరిస్తూ, "స్వామీ, మీరు.... మీరు....?" అన్నది.

"అవును నాయనా! నేను నేనే. నీవెలా అడవికోతివి కావో, నేనలా కొండముచ్చునూ కాను. జయసింహా, నేనేనయ్యా! గురు

చరణుణ్ణి!'' అంటూ మహర్షి తన కోంద ముచ్చు రూపాన్ని వదిలి వేశాడు.

అడవి కోతి మరుక్షణమే జయసింహుడు అనే రాజకుమారుడిగా మారిపోయింది.

"మన్నించండి. గురుదేవా! మహాపచారం చేశాను. నా విద్యను పరీక్షించటం కోసం తమరు వచ్చారని తెలియక, గురువుతోనే ద్వంద్వయుద్ధానికి సిద్ధపడ్డాను." అన్నాడు జయసింహుడు ఆర్ద్రంగా.

"ఇందులో తప్పేమీ లేదు, నాయనా! ఒకప్పుడు జాంబవంతుడి వంటి శ్రీరామభక్తుడే, స్వయంగా శ్రీకృష్ణుడితో ముష్టియుద్ధం చేశాడు. పైగా. ఇది నీ కామరూప విద్యకు ఒక పరీక్ష అని కూడా అనుకో. పరీక్షలో నీవు నెగ్గావు. అందుకు నాకు ఆనందంగా ఉంది," అన్నాడు గురుచరణుడు.

జయసింహుడు ఆనందంతో గురువుని తన ఆశ్రమానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ అతడిని ఎన్నో విధాల సత్కరించాడు. బడలిక తీరి, గురువు పడుకొన్నప్పుడు, అతడి పాదాలు ఒత్తుతూ జయసింహుడు, తన కథనంతా చెప్పాడు.


ఒకప్పుడు గురువుగా జయసింహుడికి కామరూపవిద్యా మంత్రాన్ని ఉపదేశించి. ఏకాతముగా అక్కడ సాధన చేయవలసిందిగా పంపాడు. అప్పటి నుండి, ఈ అడవిలో ఈ విద్యను ఎలా సాధించాడో వివరంగా చెప్పాడు జయసింహుడు.

"గురుదేవా, నేనీ విద్యను సాధించాను. ఇందుకు మీకేమి గురుదక్షిణ ఈయగలను?" అన్నాడు జయసింహుడు.

గురుచరణుడు నవ్వి, "గురుదక్షిణ మాట తర్వాత చూద్దాం. ముందు నిన్నొక రాచకార్యం మీద, గురుకార్యం మీద పంపుతున్నాను. నీ విద్యలకు ఇదొక పరీక్ష!" అన్నాడు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

3

[అంజనం ద్వారా అవంతీసుందరి జాడ తెలియక పోవటంతో, గురుచరణుడు స్వయంగా ఆమె అన్వేషణకు బయలుదేరుతాడు. దారిలో ఏదో చెడు చేయ సంకల్పించి వచ్చిన నెమలికి శృంగభంగం చేస్తాడు. ఆ పైన కామరూప విద్యాభ్యానం చేస్తూ వున్న తన శిష్యుడు జయసింహుణ్ణి కలుస్తాడు. అతణ్ణి ఓ గురుకార్యము మీద పంప నిశ్చయిస్తాడు గురుచరణుడు.
తరవాత—]

గురుచరణుడు జయసింహుడికి అవంతీసుందరి కథ చెప్పాడు. నెమిళ్ళ గుంపు రావటము, ఆమెను అపహరించుకొని పోవటం, అంజనం వేయటం మొదలైన వివరాలు అన్నీ చెప్పాడు.


"నా అనుమానం ప్రకారం ఎవరో మాయావులు రాజకుమారిని ఎక్కడో దాచారు. ఆ దాచి పెట్టటానికి నెమిలికి ఏదో దగ్గర సంబంధము వుంది. అంజనదేవత చిన్నసిద్ధుణ్ణి ఆవహించి, 'మయూరాక్షి. మయూరాక్షి!' అని అరవటమూ, 'మాయాదర్పణం,' అని చెప్పటమూ గమనిస్తే, ఈ రెండు వస్తువులకూ, ఈ కథకూ ఏదో సన్నిహిత సంబంధం ఉన్నదని తెలుస్తున్నది," అన్నాడు గురుచరణుడు.

అది విని జయసింహుడు తల ఊపి, "నిజమే గురుదేవా! ఇది ఏదో దుర్భేద్యమైన రాక్షసమాయ వలె కనపడుతున్నది. దీనిని ఎలా నిర్మూలించాలి?" అన్నాడు.

"అదే ఆలోచిస్తున్నాను. నీకు కామరూప విద్య కూడా సిద్ధించింది. కాబట్టి, రాక్షస మాయలను ఎదుర్కొనటానికి తగిన శక్తియుక్తులు నీకు వున్నాయని నాకు తెలుసు. అందుకని, ఈ పనికి నిన్నే నియోగిస్తున్నాను. నువ్వు స్వయంగా వెళ్ళి రాజకుమారిని సాధించుకొని రా. ఇదే నువ్వు నాకు ఇవ్వవలసిన గురుదక్షిణ అనుకో." అన్నాడు గురుచరణుడు.

"మీ ఆజ్ఞ, శిరసావహిస్తాను, గురుదేవా!

యం. ఉమాదేవి



కాని. ఒక్క మాట. నేను సామాన్యుడిని. ఈ రాక్షసమాయ ఛేదించ గలిగిన శక్తి నా దగ్గర ఉన్నదంటారా?" అని సందేహం వెలిబుచ్చాడు జయసింహుడు.

"ఓయీ. జయసింహా! ఈ సృష్టిలో శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు. నేను నీ దగ్గరకు వచ్చేసరికి, నీవు హనుమంతుడి వేషంలో వున్నావు. ఇదేదో కాకతాళీయంగా జరిగిన సంఘటన కాదు. రామాయణంలో హనుమంతుడి పాత్ర వుంది. అతడు మహా శక్తి సంపన్నుడు. రుద్రాంశ వలన జన్మించిన వాడు. అయితే, అతడికి తన శక్తి తనకే తెలియదు. సముద్రలంఘనం చేయవలసి వచ్చినప్పుడు ఆ పనిని నేను చేయగలనా అని అనుమానం ప్రకటించాడు. అందరూ ఆయనను ప్రశంసించేసరికి, తన బలము ఆయనకు తెలిసింది. ఇదిగో సరిగా నీవూ అలాటి వాడివే! నీ బలం నాకు తెలుసు. అందుకే నిన్ను నే నీ కార్యానికై నియోగిస్తున్నాను. అవంతీసుందరిని తీసుకొని రావటం ఇప్పుడు మన భరద్వాజాశ్రమానికి సంబంధించి గౌరవప్రతిష్ఠలతో కూడుకొన్న సమస్య." అన్నాడు గురుచరణుడు.

జయసింహుడు గురువు ఆనతిని తలదాల్చి, అందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు గురుచరణుడు మళ్ళీ ఇలా చెప్పాడు.

"ఓయీ. జయసింహా! నిన్ను నే నీ మహా కార్యానికి పంపే ముందు, నేను నీకు కొంత సాధనసంపత్తి ఈయవలసి ఉంది. ఎన్ని విచిత్రద్వీపాలు అన్వేషించ వలసి వస్తుందో, ఎన్ని సముద్రాలు లంఘించ వలసి వస్తుందో మనకే తెలియదు. అందువల్ల, నీకు నేను గురుపాదుకలను ఇస్తున్నాను. ఈ పావుకోళ్ళను భద్రంగా నీ దగ్గర దాచి పెట్టుకో. ఇక్కడికి ఉత్తరదిశగా ప్రయాణం చేయి. అక్కడ జాంఘాలికం అనే ఒక పర్వతం వస్తుంది. దాని మీద రాత్రివేళలో మిణుగురు పురుగులులాగా మెరిసే కొన్ని పుష్పాలు కనబడతాయి. ఆ పూలు వుండే మొక్కలను జ్యోతిష్మతి మూలికలు అంటారు. అవి చాలా అరుదుగా వుంటాయి.


వాటిని రాత్రివేళలో పెరికి, వాటి వేరులు సేకరించి భస్మం చేయాలి. దానిని పావుకోళ్ళకు అడుగున రాస్తే, జాంఘాలిక పర్వత ప్రభావం వల్ల, నీకు ఆకాశగమన శక్తి లభిస్తుంది. అయితే, ఒక విషయం గుర్తుంచుకో. ఎట్టి పరిస్థితుల్లోనూ జ్యోతిష్మతి వేరులతో చేసిన భస్మం నీటితో తడియకూడదు. తడిస్తే, అది దాని ప్రభావం కోల్పోతుంది."

"చిత్తము, గురుదేవా!" అన్నాడు జయసింహుడు వినయంగా.

కులపతి గురుచరణుడు ఈ విధంగా శిష్యుడికి కర్తవ్యం ఉపదేశించి, తన వెంట తెచ్చిన ఒకానొక చిత్రాన్ని జయసింహుడికి యిచ్చాడు. అందులో అవంతిసుందరి బొమ్మ గీచి ఉంది.

విశాలమైన కన్నులతో, తుమ్మెద రెక్కల వంటి జుట్టుతో, వికసించిన కమలం వంటి ముఖముతో ఉన్న అవంతిసుందరి చిత్రాన్ని చూడగానే, జయసింహుడికి ఆనందమూ, ఆశ్చర్యమూ కూడా కలిగాయి. బ్రహ్మదేవుడి సృష్టిలో ఇంత అందమయిన స్త్రీ కూడా ఉంటుందా అని నివ్వెర పోయాడు. ఏమైనా సరే యీమెను వెతికి తీసుకొని వచ్చి, ఆమె తల్లిదండ్రులకు అప్పగించటం తన కర్తవ్యముగా భావించాడు జయసింహుడు.

"నాయనా, జయసింహా! నీ యోగక్షేమము ఎప్పటికప్పుడు నేను విచారిస్తూంటాను. తిథి



వార నక్షత్రములు చూచుకొని, అమావాస్యకు లేదా, పూర్ణిమకు ముందు నేను అంజనం వేసి, నీవు ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నది గమనిస్తూనే ఉంటాను. ఇక వెళ్ళి గురుకార్యం సాధించుకొని రా. నీకు విజయమౌతుంది," అని దీవించాడు గురుచరణుడు.

మరునాడు గురుచరణుడు తిరిగి తన ఆశ్రమానికి వెళ్ళిన తర్వాత, జయసింహుడు రాజకుమారి అన్వేషణలోని మొదటి ఘట్టంగా జాంఘాలిక పర్వతానికి ప్రయాణం కట్టాడు. గురువు చెప్పిన గుర్తులను బట్టి త్వరలోనే అతడు జాంఘాలిక పర్వతాన్ని పోల్చుకోగలిగాడు.

పర్వతం చుట్టూ దట్టమైన అరణ్యాం



ఉన్నది. అందులో పులులూ, సింహాలూ, కొండ చిలువల్లూ, ఎలుగుబంట్లూ వంటి అరణ్యప్రాణులెన్నో సంచారం చేస్తున్నాయి. వాటి నన్నింటినీ దాటి వెలుతురు బాగా ఉన్నప్పుడే, జయసింహుడు పర్వత పై భాగానికి చేరాడు. ఇందులో ఏది జ్యోతిష్మతీ మూలికయో చీకటి పడితే కాని తెలియదు. అంత వరకు పగలంతా పర్వతం పై భాగంలో అటూ ఇటూ తిరుగుతూ కాలక్షేపం చేశాడు. పర్వతం చివరి వరకూ పోయేసరికి. అక్కడి నుండి ఏదో పొగ వస్తునట్లు అనిపించింది.

జయసింహుడు ఉత్కంఠ నాపుకోలేక అదేమిటో చూద్దామని అక్కడి వరకూ వెళ్ళాడు. అక్కడ ఎవరో నిప్పు వెలిగించి దానిపై ఏవో కాయలను దుంపలను కాల్చి తింటున్నారు. జయసింహుడు కొంత దూరం నుండి జాగ్రత్తగా పరిశీలించి అతణ్ణి చూచాడు.

అక్కడ కూర్చుని ఉన్నది, జంతువు కాదు. స్పష్టంగా మానవుడే! పొడవైన గడ్డం, బిరుసైన శరీరం కలిగిన అడవి మనిషిలాగా అతడు కనపడ్డాడు. అతడు నిప్పుల మీద గెనుసు గడ్డలను కాల్చుకొని తింటున్నాడు.

జయసింహుడు ముందుకు వెళ్ళి, అతణ్ణి పలకరిద్దామా వద్దా అని ఆలోచించే లోపలే ఆ గడ్డంమనిషి వెనుదిరిగి చూచాడు.

జయసింహుణ్ణి చూడగానే అతడు కోపంతో, "ఎవడవురా, నీవు? నే నిక్కడ ఉండగానే జాంఘాలిక పర్వతం పైకి రావటానికి ఎంత సాహసం రా నీకు?" అంటూ ఒక కొరివిని చేతిలో పట్టుకొని లేచి నిలబడ్డాడు.

ఈ గడ్డంమనిషి తన కేదో కీడు తల పెడతాడని శంకించిన జయసింహుడు, మరుక్షణమే రామచిలకగా మారి ఒక చెట్టు కొమ్మ నెక్కాడు.

గడ్డంమనిషి కొరివి చేతితో పట్టుకొని, జయసింహుడి కోసం జాంఘాలిక పర్వతమంతా గాలించాడు. ఎంత వెతికినా జయసింహుడు కనపడక పోయేసరకల్లా, అతడి ముఖంలో నిరాశ నిస్పృహలు స్పష్టంగా కనిపించాయి.


'అకస్మికంగా ఇతడెలా మాయమైనాడు?

ఈ వచ్చిన వాడు మనిషియేనా? లేక మాయవి యైన రాక్షసుడెవడైనా అయి ఉంటాడా?" అని గడ్డంమనిషి ఒక్క క్షణం ఆలోచించి, ఆ పైన "అయ్యా, నీ వెవరో నాకు తెలియదు. దేవతవో, దయ్యానివో, మనిషివో, రాక్షసుడవో ఉన్నట్లుండి అదృశ్యమైనావు. నీకు నే నెటు వంటి అపకారమూ చేయను. కాబట్టి, ఒక సారి నా కన్నుల ముందు కనపడు," అని పెద్దగా అరిచాడు.

ఆ మాటలు విని, జయసింహుడు తన రామచిలుక రూపాన్ని విడచి, గడ్డంమనిషి ముందు సాక్షాత్కరించాడు.

గడ్డంమనిషి జయసింహుడిని చూచి, "ఓయీ, నేవెవరవు? ఎందుకీ జాంఘాలిక పర్వతానికి వచ్చావు? మానవులే కాదు, దేవ తలు కూడా ఇక్కడకు రావటానికి సాహసిం చరే!" అన్నాడు.

"అయ్యా, నా పేరు జయసింహుడు. నేను ఒక మహర్షి వద్ద చదువుకొన్నాను. ఆయన గురుదక్షిణగా నన్నొక పని చేసి పెట్టమన్నారు. కష్టసాధ్యమైన ఆ కార్యాన్ని సాధించాలంటే దానికి యీ జాంఘాలిక పర్వతం మీద వున్న జ్యోతిష్మతీ మూలికతో పని కలిగింది. నేను కాని, మా గురువులవారు కాని ఎవరికీ అపకారం తలపెట్టే ఉద్దేశ్యంతో ఈ పనికి పూనుకొలేదు. ఇదొక లోకోపకారహేతువైన కార్యం. అందుచేత, మీరు దయచేసి సహాయ



పడి,-ఆ మూలికలు ఎక్కడ ఉన్నవో చూపిస్తే పుణ్యం కట్టుకొన్నవారవుతారు. ఒకవేళ మీరలా చేయకపోతే, ఇక మీ చిత్తం. నేనే శ్రమపడి వెతుక్కుంటాను," అన్నాడు జయ సింహుడు.

"ఆ గురు కార్యమేమిటో నేను తెలుసు కొనవచ్చునా?" అని అడిగాడు గడ్డంమనిషి.

"క్షమించండి, కార్యసాధన జరిగే వరకూ దాని నెవరికీ చెప్పటం ధర్మం కాదు. అందు లోనూ మీరెవరో, యీ జంఘాలిక పర్వతం మీద నివసిస్తున్న విచిత్ర వ్యక్తిలాగా కనపడు తున్నారు. మీరు ఎవరో పూర్తిగా తెలియ కుండా, నేను గురు కార్యాన్ని వెల్లడి చేయటం ఔచిత్యం కాదు." అన్నాడు జయసింహుడు.



"నాయనా, నీ గురుదీక్షకు చాలా సంతోషము. నీ ముఖం చూడగానే నీవు సత్పురుషుడవని నాకు తెలిసిపోయింది. కాబట్టి, నేను నీకొక ఉపకారం చేయదలచాను. నా వెంట వస్తావా?" అన్నాడు గడ్డంమనిషి.

ఇందులో ఏమైనా మోసం ఉందేమోనని అనుమానం కలిగింది జయసింహుడికి.

'జ్యోతిష్మతి వంటి దివ్య మూలికలను గంధర్వులు కాపలా కాస్తూంటారట. వారెన్నో మాయలు పన్ని, ఆ మూలికలను సామాన్యులకు దక్కకుండా చేస్తూంటారట. ఈ గడ్డం మనిషి చేస్తున్నది కూడా అలాటి పనియేనా? అయినా. తినబోతూ రుచి అడగటమెందుకు ఇతడేం చేస్తాడో చూద్దాం.' అని సాహసంతో గడ్డంమనిషిని గబగబ వెంబడించాడు జయసింహుడు.

ముందు గడ్డంమనిషి. వెనుక జయసింహుడు నడుస్తూన్నారు. అలా వారిరువురు కొంత దూరం పోయారు.

తనకు సుపరిచితమైన జాంఘాలిక పర్వతము మీద గడ్డంమనిషి చెట్టు పుట్టలు తప్పించుకొని వడివడిగా పోతున్నాడు. అలా పోయి పోయి, కొండ చరియలోనికి దిగాడు.

అది చాలా ప్రమాదకరమైన ప్రాంతంలాగా కనపడింది. ఎటు చూచినా బండలు జారుతున్నాయి.

గడ్డంమనిషితో పాటు జయసింహుడు కూడా ధైర్యంగా బండల మీది నుండి జారుతూ కొండ చరియలోనికి ప్రవేశించాడు. అలా కొంత దూరం పోగా, ఒక చోట ఒక గుహ కనిపించింది. దాని ముఖద్వారంలో ఒక నాగసర్పం పడగ విప్పుకొని వుంది.

తన కళ్ళకు ఆ సర్పం కనపడగానే, తాను ముంగిసగా మారిపోయి దానిని సంహరిద్దామా అని ఆలోచించాడు జయసింహుడు. కాని, ఈ గడ్డంమనిషి ఎవరో, గుహ వద్దకు ఎందుకు తెచ్చాడో తెలుసుకొనకుండా తానెందుకు తొందర పడాలి అని మళ్ళీ అనుకొన్నాడు.

అడవుల్లో సర్పాలు తిరుగుతూ వుండటం సహజమే. కాని సిద్ధులు, గంధర్వులు, మంత్రవేత్తలు తాము ఎక్కడైనా ధనాన్ని

నిక్షిప్తం చేస్తే. దానికి కాపలాగా యిలాంటి మంత్రసర్పాలను వుంచటం కూడా కద్దు.

జయసింహుడి ఊహయే నిజమయింది. గడ్డంమనిషి గుహ ముఖద్వారం వద్దకు పోయి, ఏదో గుర్తు తెలియని భాషలో ఒక కేక పెట్టాడు. ఆ మంత్ర సంకేతాన్ని గ్రహించి నాగసర్పం చరచర పాకుకుంటూ ఎటో వెళ్ళిపోయింది. అంతే మళ్ళీ కనిపించలేదు. గడ్డంమనిషి గుహ లోనికి ప్రవేశించాడు.


తీరా, లోపలికి తీసుకుపోయి గుహలో తనను ఇతడు బలి తీసుకొంటాడా అని అనుమానం వచ్చింది జయసింహుడికి. అసలు అలాంటి పరిస్థితే వస్తే, దానిని ఎలా ఎదుర్కోవాలో ముందుగానే ఆలోచించుకొంటూ, సాహసంతో గుహ ముఖద్వారము నుండి లోనికి ప్రవేశించాడు జయసింహుడు.

లోపలంతా చిమ్మచీకటిగా వుంది.

కేవలం అడుగుల చప్పుళ్ళు ఆధారంగా నడుస్తూన్నాడు జయసింహుడు. అలా కొంత ముందుకు పోయేసరికి, సన్నని వెలుతురు కిరణం వచ్చింది. అక్కడి నుండి దారి స్పష్టముగా కనిపించ సాగింది.

ఆ బాట నేరుగా ఒక మందిరం వద్దకు తీసుకుపోతున్నట్టుగా జయసింహుడు గ్రహించాడు. ఈ గడ్డంమనిషి అందులోనే వుంటాడని అతడు వూహించాడు.

అంతలో, గడ్డంమనిషి నేరుగా మందిరం



లోనికి ప్రవేశించి, "రా నాయనా, రా! నిర్భయంగా లోనికి రా!" అని జయసింహుణ్ణి ఆహ్వానించాడు.

పైకి చూడటానికి, అది ఒక శిథిల మందిరములాగా కనపడుతూ వున్నప్పటికీ, ఆ పురాతన భవనంలో ఎన్నో అమూల్యమైన వస్తు వాహనాలు వుండటం చూశాడు జయసింహుడు.

జయసింహుడికి ఎంతో ఆశ్చర్యం వేసింది. భవనం లోపల గోడలకు రత్నాలు పొదగబడి వున్నాయి. పర్వతములలోని గైరికాది ధాతువులతో నిర్మింపబడిన వస్తు సముదాయమూ, ఇంకా ఎన్నో విలువగల ధన సమూహములూ అక్కడ కనిపించాయి.

ఇవన్నీ చూచి, జయసింహుడు ఆశ్చర్యపోతూ వుండగా, అంత కన్నా ఇంకా ఆశ్చర్యకరమైన సంఘటన మరొకటి జరిగింది.

భవనం లోపలి నుండి ఒక మహా సౌందర్యవతి ఇవతలికి వచ్చి, జయసింహుడి వైపు చూచి, ఆశ్చర్యపడి సిగ్గుతో తల వంచుకొని, అతడి గురించి ప్రాకృత భాషలో గడ్డంమనిషిని ప్రశ్నించింది.

"చెప్తాను," అని గడ్డంమనిషి అతణ్ణి తన కుమార్తెకు ఇలా పరిచయం చేశాడు.

"చూడమ్మా, ఇతడు ఒక సాధకుడు. మన జాంఘాలిక పర్వతానికి దివ్య మూలికల కోసం వచ్చాడు. ఇతడిని చూడగానే, నాకు ఇతడి గొప్పతనమూ, శక్తియుక్తులూ తెలిసిపోయాయి. ఇతడు కొంత కాలం పాటు మన గుహలోనే అతిథిగా వుంటాడు. ఇతడికి ఏ లోటూ రాకుండా అన్ని సపర్యలు చేయవలసిన బాధ్యత నీది."


జయసింహుడికి ఇదంతా విచిత్రంగా అనిపించింది. అనవసరంగా తానేమీ మోసంలో చిక్కుపడి పోవటం లేదు కదా అని అనుకొన్నాడు.

"మీ అభిమానానికి కృతజ్ఞుడిని. కాని, నేను అత్యవసరంగా గురుకార్యము మీద వెళ్ళి పోవాలి. అందువల్ల, మీకు అతిథిగా వుండలేను. క్షమించండి." అని జయసింహుడు అనగానే, గడ్డంమనిషి ఇలా అన్నాడు.

"ఓయీ పిచ్చివాడా! నీ గురుకార్యము ఏమిటో నాకు తెలుసు. నీ వొకానొక రాజుబిడ్డని వెదికేందుకు బయలుదేరుతున్నావు. నీకు ఆ శ్రమ అక్కర లేకుండా, నేనే వెతికి పెడతాను. నీవు ఇక్కడ సుఖంగా మా అమ్మాయితో కబుర్లు చెపుతూ కూర్చో. అదే నా కోరిక."

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

4


[జయసింహుడు తన గురువు ఆదేశాన్ని అనుసరించి, అవంతిసుందరిని వెతకటానికి బయలుదేరుతాడు. దారిలో, జ్యోతిష్మతీ మూలికల కోసం జంఘాలిక పర్వతం చేరగా, అక్కడ ఒక గడ్డంమనిషితో పరిచయం అవుతుంది. అతడు జయసింహుణ్ణి తన గుహాభవనంలోకి తీసుకొని వెళ్ళి, తన అందాల కూతురితో కబుర్లు చెపుతూ వుండమనీ, తాను అతడి కార్యం నెరవేర్చగలననీ అంటాడు. —తరవాత]

జయసింహుడు కంగారుపడి. "మీరు నన్నిలా కోరటం ఏమీ భావ్యంగా లేదు. నేను బ్రహ్మచారిని. గురు కార్య నిర్వహణకు అంకితమైన వాడిని. అలాంటిది నన్నిలా పెడత్రోవలు త్రొక్కించటం మీకు ధర్మం కాదు," అన్నాడు.

"ఓయీ, జయసింహా! నీ వూరూ, పేరూ నాకు తెలుసు. నీ గురుకార్యం కూడా నాకు తెలుసు. నీవు ఇక్కడికి రావటం నిజంగా నా అదృష్టం. నన్ను నీవు శంకించ వద్దు. నేను మాయావినీ కాదు, రాక్షసుణ్ణీ కాదు. నిజంగానే ఒక ముసలివాణ్ణి. నా కుమార్తెకు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. అప్పటి నుండి ఆమెకు నేనే తల్లినై తండ్రినై పెంచి, పెద్ద చేశాను. యుక్తవయస్సు వచ్చాక, యోగ్యుడైన వరుడికి ఇచ్చి పెండ్లి చేయాలని ఇన్నేళ్ళ నుండి నిరీక్షిస్తున్నాను. ఆ కోరిక ఇప్పటికి తీరింది. నాయనా, జయసింహా! ముసలివాడిని. నా మాట కాదని నిర్లక్ష్యం చేయకు. దయ చేసి నా కోరిక మన్నించు. నా రత్నాలనూ కన్యారత్నాన్నీ కూడా నువ్వే స్వీకరించు," అన్నాడు గడ్డంమనిషి.

ఈ విధంగా జాంఘాలిక పర్వతం మీది గడ్డంమనిషి జయసింహుడిని అర్థించాడు. అతడు అడుగుతున్న కొద్దీ, జయసింహుడికి ఇంకా అనుమానం పెరగ సాగింది. ఇతడు నిజమైన ముసలివాడు కాడనీ, తనను పెడత్రోవ పట్టించి మూలికను దక్కకుండా చేయటము కోసం ఈ పర్వతానికి కాపలా ఉన్న

యం. ఉమాదేవి



మంత్రసిద్ధులేవరో ఇలా తనను ఆకర్షిస్తున్నారనీ భావించాడు జయసింహుడు.

అప్పుడు గడ్డంమనిషి ఈ విధంగా అన్నాడు.

"ఓయీ, జయసింహా! నేను ఈ పర్వతం మీద చాలా సంవత్సరాలుగా ఉంటున్నాను. అందువల్ల, నాకు కొన్ని అతిలోక విద్యలు అలవడ్డాయి. నీ పేరు జయసింహుడని అందువలననే నేను కనుక్కొన కలిగాను.

"అంతే కాదు, మీ గురువు పేరు గురుచరణుడు. అయన గొప్ప తపస్వి. ఆయన నిన్ను ఒక రాచకార్యం మీద ఎక్కడికో పంపుతున్నాడు. అదేమిటో చెపుతాను విను. అమరావతీ రాజ్యాన్ని పరిపాలించే పరంతప మహారాజు కుమార్తె అవంతీసుందరిని ఎవరో మాయావులు ఎత్తుకొని పోయారు. ఆమెను వెతుక్కొని తీసుకొని రావలసిన బాధ్యత మీ గురువు నీ మీద పెట్టారు.

"ఆ సందర్భంలో నీకు సహాయకారిగా ఉండే నిమిత్తం, ఆకాశగమనం కోసం జ్యోతిష్మతీ మూలికను సంపాదంచ వలసిందని అయన చెప్పి పంపారు. అందుకోసమే నీవు ఇక్కడికి వచ్చావు.

"నేను ఇప్పుడు నీకు ఒక ఉపకారం కూడా చేయగలను. అదేమంటే, జ్యోతిష్మతీ మూలికను చీకటి పడగానే వెతికి ఇవ్వగలను.

"అంతే కాదు. నా కుమార్తెను ధన సంపదను కూడా నీ స్వాధీనం చేయ గలను. ఇక పోతే, గురుకార్యం మిగిలి వుంది. దానిని గూర్చి కూడా నువ్వు బాధపడ వలసిన పని లేదు. నువ్వు ఎప్పుడు నాకు అల్లుడైనావో అప్పుడే నీ యోగక్షేమాలన్నీ విచారించే బాధ్యత నాది అవుతుంది. నేను స్వయంగా ఆ రాజకుమారిని వెతికి తీసుకొని వచ్చి, మీ గురువుకి అప్పగిస్తాను. అప్పుడు అయన అవంతీసుందరిని పరంతవుడికి అప్పగించ వచ్చు.

"ఈ విధంగా, మీ గురుకార్యం నెరవేరుతుంది. దీని వల్ల, నీకు ఏ విధమైన నష్టమూ కలుగదు. మీ గురువుకి కావలసినది అవంతీసుందరి లభించటమే కాని, అమెను ఎవరు వెతికి తీసుకొన వస్తే అయనకు ఎందుకు?"

గడ్డంమనిషి చెప్పిన ఈ మాటలు విని

జయసింహుడు మాట్లాడకుండా ఊరు కున్నాడు. జయసింహుడు తన మాటలకు లొంగిపోయాడనీ అందుకే మౌనం వహించా డనీ అతడు భావించాడు. అందుకు ఎంతో సంతోషించాడు.

"నాయనా, జయసింహా! నీకు అభ్యంతరం లేకపోతే వివాహపు ఏర్పాట్లు చేస్తాను. నా భవనములోని ధనకనక సంపదలన్నీ ఇక నీకు స్వాధీనం చేస్తాను." అన్నాడు గడ్డంమనిషి.

అప్పుడు జయసింహుడు నోరు విప్పి, "అయ్యా, తమరెవరో చాలా మంచి వారిలాగా కనబడుతున్నారు. మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుడిని. అయితే, ఈ విషయంలో మీరొక ధర్మ సూక్ష్మం మరచి పోయారు. అవంతి సుందరి దొరకటం; దొరకక పోవటం మాత్రమే ముఖ్యమైన సమస్య కాదు. గురుకార్యాన్ని నిర్వహించటమే నాకు చాలా ముఖ్యమైనది. రాజకుమార్తెను వెతికి తీసుకొని వచ్చే బాధ్యత మా గురువుల వారు నాకు అప్పగించారు. కాబట్టి, ఆమెను స్వయంగా నేను వెళ్ళి వెదికి తీసుకొని రావటమే గురుకార్య నిర్వహణ ఔతుంది. అలా కాక, నాకు వారు అప్పగించిన బాధ్యతను, నేను మరొకరికి అప్పగించటం గురుద్రోహం అనిపించుకుం టుంది. ఇదే ధర్మసూక్ష్మం! అందువల్ల, నా పనిని నన్నే చేసుకోనివ్వండి. మీ ఆశీస్సులు కూడా నాకు అందివ్వండి." అన్నాడు.



ఇంతలో, గుహ మందిరపు లోపలి భాగం నుండి గడ్డంమనిషి కుమార్తె జయసింహుడిని సమీపించి, అతడికి మధురఫలములతో కూడిన పానపాత్రను అందించింది. అందులో ఏమున్నదో అనే అనుమానంతో జయసింహుడు దానిని తాకలేదు. అయితే, ఆమె సౌందర్యానికి మాత్రం ఆశ్చర్యపోయాడు జయసింహుడు. అడవిలోని ఒక గడ్డంమనిషికి నిజంగా ఇంత అందమైన కుమార్తె ఉండటం సాధ్యమేనా? ఇదంతా మాయకాదు గదా!

వారిరువురినీ స్వేచ్ఛగా మాట్లాడుకోనేందుకు వీలు కల్పించటం కోసమేమో అన్నట్లు గుహాభవనం లోపలికి వెళ్ళాడు గడ్డంమనిషి.

"ఓ జయసింహకుమారా, మా ఆతిథ్యం

మీకు రుచించలేదా? ఎందుకు ఈ సందేహం? మా తండ్రి కోర్కెను మన్నించి నన్ను ధన్యురాలిని చేయండి. మీ అపురూప సౌందర్యం నన్ను ముగ్ధురాలిని చేసింది. సిగ్గు విడిచి ఇలా మనసులోని మాట చెపుతున్నందుకు అన్యథా భావించవద్దు. నా పేరు శఫాలిక," అంది.

అప్పుడు జయసింహుడు మృదువుగా నవ్వి, "శఫాలికా, నన్ను మన్నించు. నేను ఈ వివాహానికి ఒప్పుకోలేను. నీ మీద నాకు ఎలాంటి ప్రేమ కాని, కోపం కాని లేదు. అయితే, నే నిప్పుడు గురుకార్యానికి బద్ధుడిని. వివాహాలూ, సంపదలూ నా మనస్సును ఆకర్షింపజాలవు." అన్నాడు.

ఆ మాటలు విని, శఫాలిక జయసింహుడిని ఎన్నో విధాల ప్రాధేయపడింది. తనను వివాహం చేసుకోనలసిందిగా ప్రతిమలాడింది. అయినా, జయసింహుడు కనికరించ లేదు. దానితో శఫాలిక కన్నీరు పెట్టుకొన్నది.

"శఫాలికా, ఇది చాలా అన్యాయం! నన్ను ఈ విధంగా ఆకర్షించటం, కన్నీటితో కరిగించాలని ప్రయత్నించటం సజ్జనుల లక్షణాలు కావు. నన్ను గురుకార్యం నుండి ప్రక్కకు తప్పించటం మీకు ఏ విధంగానూ భావ్యం కాదు. నా మీద నీకు అభిమానమే ఉంటే నాకు జ్యోతిష్మతి మూలిక ఇచ్చి ఆశీర్వదించి పంపు." అన్నాడు


"జయసింహా, ఇందులో నీ తప్పేమీ లేదు. తప్పంతా మాదే! నీ వెంత వీరుడవైనా క్రొత్తవాడికి అపారసంపదలు ఇవ్వజూపటం మా తండ్రి చేసిన తప్పు. నీకు ఎంత పరాక్రమమూ



అందమూ ఉన్నప్పటికీ. నాకై నేను నిన్ను ప్రేమించటం, వివాహం చేసుకోమని అడగటం రెండవ తప్పు. నేను అడిగాను కాబట్టే, ఇంత చులకనై పోయాను. లోగడ ఈ జాంఘూలిక పర్వతం వద్దకు జ్యోతిష్మతి మొదలైన మూలికల కోసం ఎందరో యువకులు వచ్చారు. ఇక్కడ వనవిహారం చేస్తూన్న నన్ను చూచి, వారిలో కొందరు నన్ను ప్రేమించారు కూడా. అయితే, వారికి నేనుకాని, మూలికకాని దక్క లేదు సరిగదా, మా తండ్రి ఆగ్రహానికి గురియై వారిలో ఒక్కడూ ఈ గుట్ట దిగి క్రిందకు పోలేదు. ఇదిగో చూడు, అలాంటి యువకుల గతి ఏమైందో!" అంటూ శఫాలిక గుహాభవనం లోని ఒక గది తలుపు తెరిచింది.

శఫాలిక గది తలుపు తెరవగానే, లోపలి నుండి దుర్వాసన వ్యాపించింది. అక్కడ కొన్ని కపాలాలూ, అస్థిపంజరాలూ వ్రేలాడుతున్నాయి. చీకటి గదిలో నుండి గబ్బిలాలు గుంపులు గుంపులుగా ఎగురుతూ అటూ ఇటూ పరిగెత్తాయి.

జయసింహుడు అది చూచి నవ్వి, "శఫాలికా, ఇప్పుడు నాకు మీ అసలు రహస్యం ఏమిటో తెలిసిపోయింది. నన్ను నయాన కాని భయాన కాని వంచించి, లొంగదీసుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ధనరాసుల ప్రలోభానికి లొంగలేదని తెలిసి, కపాలాలు చూపి భయపెడుతున్నారు. ఇలాంటి వాటికి ఈ జయసింహుడు భయపడే ఘటం కాదు. ప్రాణం పోవటానికైనా సిద్ధమే కాని, గురు కార్యానికి మాత్రం నేను భంగం రానివ్వను.





మీరు చేసే పనులవల్ల, మీ మీద నాకున్న సానుభూతి పూర్తిగా నశించింది," అన్నాడు.

అది విని, శఫాలిక అతణ్ణి చూచి జాలిగా నవ్వింది

"ఓయీ, అమాయకుడా! రాబోయే నరక బాధలు తెలియక, ఇలా మాట్లాడుతున్నావు. ఈ గుహలోకి రావటమే కాని, పోవటమనేది లేదు. జ్యోతిష్మతి మూలిక, రాజకుమారి, గుర్వాజ్ఞ అన్నింటినీ ఇక మరచి పో. నువ్వు నన్ను అవమానించావని మా తండ్రితో ఒక్క మాట చెపితే చాలు. మరి కొద్దిసేపట్లో నువ్వు ఆ గదిలో వ్రేలాడుతూ వుంటావు," అని చెప్పి బెదిరించింది ఆమె.

జయసింహుడు అక్కడ ఒక్క క్షణం కూడా ఉండక తిరుగుముఖం పట్టాడు. శఫాలిక అతడికి అడ్డంగా వచ్చి, బలవంతంగా కౌగిలించుకొనాలని ప్రయత్నించింది.

జయసింహుడు ఆమెను విదిల్చి ప్రక్కకు నెట్టి, "ఓ గురుచరణ కులపతీ! పాహి మాం పాహి మాం!" అని తన గురువును స్మరించుకుంటూ ముందుకు సాగాడు.

ఆశ్చర్యం! ఎదురుగా శఫాలిక కనపడ లేదు. గురుచరణకులపతి సాక్షాత్కరించాడు.

"ధన్యోస్మి గురుదేవా, ధన్యోస్మి! పిలిచినంత మాత్రాన ప్రత్యక్షమయ్యే పరమదైవం మీరు. నా మొర విని నన్నాదుకొనేందుకు వచ్చారా?" అన్నాడు జయసింహుడు.

గురుచరణుడు చిరునవ్వు నవ్వాడు.

"గురువర్యా, మీ అజ్ఞానుసారము జ్యోతిష్మతీ మూలిక కోసం ఇక్కడకు వచ్చాను. నాకు ఇక్కడ ఒక గడ్డంమనిషి దాపురించాడు. ఈ శఫాలిక అతడి కూతురట," అంటూ అటు చూచాడు జయసింహుడు

అక్కడ శఫాలిక కనిపించలేదు అతడికి.


అప్పుడు గురుచరణుడు చిరునవ్వు నవ్వి, "నాయనా, నేనే ఆ గడ్డంమనిషినయ్యా! ఈ శఫాలిక నేను కల్పించిన భ్రాంతి మాత్రమే! నీ గుణశీలములు నాకు తెలుసు. అయినా, ఒకొక్కప్పుడు రాక్షసమాయలు అజేయంగా ఉంటాయి. వారు చూపే ప్రలోభాలు కూడా చాలా తిరుగులేనివిగా ఉంటాయి. నీవు వెళుతున్నది చాలా ప్రమాదభరితమైన మార్గం.

అందుకని నీ విషయంలో అవరం లేకపోయినా పద్ధతి ప్రకారం ఇలా పరీక్షించవలసి వచ్చింది. అందులో నీవే నెగ్గావు. పరీక్ష పెట్టినందుకు అన్యథా భావించ వద్దు," అన్నాడు.

"గురువర్యా, నిప్పులో పెట్టినప్పుడే బంగారం శోభిస్తుంది. సాన పట్టినప్పుడే వజ్రం రాణిస్తుంది. గురుపరీక్షకు నిలచినప్పుడే శిష్యుడి విలువ లోకానికి తెలుస్తుంది. మీ పరీక్షలో నెగ్గినందుకు నాకెంతో ఆనందంగా ఉంది," అన్నాడు జయసింహుడు.

"నెగ్గవలసింది నా పరీక్షలో కాదు, రాజకుమారిని అన్వేషించే పరీక్షలో నెగ్గాలి. అది నీకే కాదు. నాకు కూడా ఒక పరీక్షే! నాయనా. జయసింహా! నేను క్షేత్రసన్న్యాసం స్వీకరించాను. ఆశ్రమాన్ని వదలి ఇంత వరకు ఎక్కడికీ వెళ్ళలేదు. అయినా, నీ కోసం మొదటిసారి నియమభంగం చేశాను. అంటే, ఆ మాయావులు ఎవరో నన్ను కూడా పరీక్షకు గురి చేస్తున్నారని అర్థం. ఏది ఏమైనా నీకింక భయం లేదు. పేరుకు తగ్గట్టే జయసింహుడివై తిరిగి రావాలని ఆశీర్వదిస్తున్నాను. విజయోస్తు," అన్నాడు గురుచరణుడు.

అప్పటికే బాగా చీకటి పడింది. జాంఘాలిక పర్వతం మీద అక్కడక్కడ మిణుగురు పురుగుల వలె ఏవో వెలుగులు కనిపించాయి. అవి వెలుగుతున్న జ్యోతిష్మతీ మూలికలని గ్రహించాడు జయసింహుడు.



గురుచరణుడు పైనుండి పడుతున్న ఒక జలధారని చూపి, "జయా, ఈ నీళ్ళతో శుచివై వచ్చి అనుష్ఠానం చేయి," అన్నాడు.

జయసింహుడు అలాగే చేశాడు. ఆ తర్వాత గురువు ఆజ్ఞానుసారం మంత్రం చదువుతూ జయసింహుడు జ్యోతిష్మతీ మూలికలను ఏరుకున్నాడు. వాటిని గురువు ఆదేశించిన ప్రకారం పదిలపరచాడు.

"ఓయీ, జయసింహా! నే నిక ఆశ్రమానికి వెళుతున్నాను. కార్యం పూర్తి చేసుకొని వచ్చిన తర్వాతనే తిరిగి కలుద్దాం," అని శిష్యుడికి వీడ్కోలు పలికి, గురుచరణుడు జాంఘాలిక పర్వతాన్ని దిగి, భరద్వాజాశ్రమపు దిక్కుకు సాగిపోయాడు.

ఇది ఇలా ఉండగా, అక్కడ అమరావతీ నగరానికి గురుచరణకులపతిచే పంపబడిన శిష్యుడైన మైత్రేయుడు చేరి, రాజకుమారి అదృశ్యమైన వార్తను ముందుగా మహామంత్రి బృహస్పతిభట్టుకు చేరవేశాడు.

అప్పుడు మహామంత్రికి కలిగిన దుఃఖానికి అంతు లేదు. అయినా, వివేకం కలవాడు. కాబట్టి, వెంటనే కర్తవ్యాన్ని యోచించుకున్నాడు.

ఏకాంతంలో పరంతప మహారాజుని కలిసి జరిగిన సంగతి మెల్లగా విన్నవించాడు బృహస్పతిభట్టు. అది వింటూనే, మహారాజు మూర్ఛపోయాడు. అతడికి మళ్ళీ తెలివి వచ్చిన తర్వాత మహామంత్రి ఇలా అన్నాడు.

"మహాప్రభూ, ఇది విచారించటానికి తగిన సమయం కాదు. మానవమాత్రులమైన మనమేమి చేయగలం? తన ఆశ్రమంలో రాజకుమారి అదృశ్యమైనందుకు కులపతి గురుచరణులవారు కూడా ఎంతో బాధపడుతూ వున్నట్లు తెలిసింది. పైగా, ఈ సంఘటన తన మంత్రవిద్యకే ఒక పరీక్షగా ఆయన భావించినట్లు మైత్రేయుడు చెప్పాడు. రాజకుమారి త్వరలోనే తప్పక దొరుకుతుంది. ఈలోగా, మనం ఈ విషయం మహారాణి కల్పనాదేవికి మాత్రం తెలియకుండా జాగ్రత్త వహించాలి."

"మహామంత్రీ, ఎవరి మీదనో భారం వేసి ఊరుకొనాలంటే, నా మనస్సుకు ఊరట చిక్కటం లేదు. రాజకుమారిని వెతికి తీసుకొని వచ్చిన వీరుడెవరైనా సరే, అతడికి నా తర్వాత ఈ రాజ్యాన్ని ఇస్తాననీ రాజకుమారి అంగీకరిస్తే ఆమెను కూడా ఇచ్చి వివాహం చేస్తాననీ దేశమంతా దండోరా వేయించండి," అన్నాడు పరంతపుడు.

మహామంత్రి అలాగే దండోరా వేయించాడు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

5

[తన కూతుర్ని వివాహం ఆడితే తాను అన్ని పనులూ చేసి పెట్టగలనని గడ్డంమనిషి జయసింహుడికి చెప్తాడు. ఆమె అతన్ని తన వశం చేసుకోవాలని ప్రయత్నించి విఫలురాలవుతుంది. ఇదంతా భరించలేక జయసింహుడు గురువును స్మరిస్తాడు. గురువు ప్రత్యక్షమై జరిగినదంతా అతడికి ఒక పరీక్ష అని చెప్తాడు. ఇలాగా, పరంతపుడు రాజకుమారి అన్వేషణకై దండోరా వేయిస్తాడు. —తరవాత]

మహామంత్రి బృహస్పతిభట్టు ఈ విధంగా దండోరా వేయించి మరి కొన్ని ఏర్పాట్లు కూడా చేశాడు. పట్టపురాణి కల్పనాదేవి అంతఃపురం చుట్టూ తగిన కాపలా పెట్టించాడు. ఆమె పరిచారికలలో ఎవరూ రాజకుమారి వార్తను గురించి మాట్లాడకూడదు. తరచూ ఆమెతో రాజకుమారి సుఖంగానే కులపతి ఆశ్రమంలో ఉన్నట్లు చెపుతుండాలి.

అమరావతి రాజ్యంలోని ఈ పరిణామాలన్నింటినీ మైత్రేయుడు గమనించాడు. ఈ వార్తలన్నీ మోసుకొని అతడు తిరిగి భరద్వాజాశ్రమానికి బయలుదేరాడు.

రాజకుమారిని గూర్చిన చాటింపును అమరావతి రాజ్యంలోని వారే కాక, చుట్టు పక్కల రాజ్యాలలోని వారు కూడా విన్నారు. కొంతమంది ఉత్సాహవంతులు అయిన యువకులు మహామంత్రిని కలిసి, తాము యువరాణిని వెతకటానికి పోతున్నట్టు చెప్పారు.

అలా వెళ్ళేవాళ్ళందరికీ బృహస్పతిభట్టు రాజకుమారి రూపాన్ని చిత్రించిన తైలవర్ణ పటాలను ఇచ్చాడు.

అమరావతిలో కరటకశర్మ అనే ఒకడు వున్నాడు. అతడికి జిత్తులు ఎక్కువ. శాస్త్ర పాండిత్యం తక్కువ.

అతడికి ఈ దండోరా వార్త వినగానే దుర్బుద్ధి పుట్టింది. ఎలాగైనా రాజ్యం కాజేస్తే అంతకంటె కావలసినది ఏమున్నది? అందుకు ఇంతకు మించిన సువర్ణావకాశం మళ్ళీ దొర

యం. ఉమాదేవి



కటం అసంభవం. అయితే, ఈ పని తాను ఒక్కడే చేయలేడు. అందుకని, కరటకశర్మ గదాధరుడు అనే యువకుణ్ణి ఆశ్రయించాడు.

గదాధరుడి పూర్వీకులు శస్త్రోపజీవులు. రాజ్యాలు కూడా పరిపాలించిన వారే. కాని, గదాధరుడికి కొన్ని తరాల ముందే, ఆ వైభవ మంతా పోయింది. గదాధరుడి కాలం వచ్చే సరికి, అతడు దుర్మార్గాలు చేసి, డబ్బు సంపాదించి జీవితం గడిపే స్థితి వచ్చింది.

కరటకశర్మ గదాధరుడితో ఇలా చెప్పాడు.

"ఓయీ, గదాధరా! నీ పూర్వీకులు రాజ్యాలు పరిపాలించారు. నీవు మాత్రం తక్కువా ఏమిటి? నీ ముఖంలో రాచకళ ఉట్టిపడుతున్నది. నీ అరికాలిలో చక్రరేఖ స్పష్టంగా కనపడుతున్నది. అది మహారాజు లక్షణమని వేరే చెప్పనక్కర లేదు.

"అయితే, అదెలా సాధ్యమని నీవాలోచించ నక్కర లేదు. రాజయ్యే యోగం వుంటే, అందుకు పరిస్థితులు వాటంతటఅవే అను కూలిస్తాయి. మాట వరుసకు ఇప్పుడు రాజ కుమారి వృత్తాంతం చూడు. ఆమెను ప్రభు వుల వారు ఎంత భద్రంగా చూచారో, ఆమె అంత తేలికగా అదృశ్యమైంది.

"నీవు మహారాజువు కావటానికి భగవం తుడు నీకు ఈ మంచి అవకాశం కల్పించా డేమోననిపిస్తున్నది, మనిమిద్దరం వెళ్ళి రాజ కుమారిని వెతుకుదాము. ఆమెను మహా రాజుకు అప్పగించి, అమరావతీ రాజ్యాన్ని సంపాదిద్దాం. అప్పుడు నీవు రాజువు, నేను రాజగురువును. ఎలా ఉన్నది ఈ పథకం?"

గదాధరుడికి కరటకశర్మ గురించి బాగానే తెలుసు. అతడు అకస్మాత్తుగా యిలా తన వద్దకు వచ్చి ఈ పథకాన్ని చెప్పేసరికి, గదా ధరుడు పొంగి పోలేదు.

"అయ్యా. మీ తెలివి తేటలు నాకు తెలుసు. తిమ్మిని బమ్మిని చేయగల సమర్థు లని కూడా నాకు తెలుసు. అయితే, ఆ రాజ కుమారి ఎక్కడ ఉందో మనం తెలుసు కొనటం ఎలా? ఆమెను సంపాదించటమూ మహారాజునకు అప్పగించటమూ అంత తేలిక అని అనుకున్నారా?" అన్నాడు గదాధరుడు.

"ఓయీ, గదాధరా! నీవు వీరుడివి. నేను మేధావిని! నా బుద్ధి బలమూ, నీ భుజ బలమూ కలిస్తే, యీ ప్రపంచాన్నే జయించవచ్చు. అలాంటిది ఈ అమరావతి రాజ్యాన్ని స్వాధీనం చేసుకొనటం ఒక లెక్కా ఏమిటి? రాజకుమారి దొరికి తీరుతుంది. ఆమె దొరకకపోతే, ఆమెలాంటిదయినా దొరికి తీరుతుంది," అన్నాడు కరటకశర్మ.

గదాధరుడు ఆలోచనలో పడ్డాడు.

'ఆమెలాంటిది దొరకటం అంటే, ఒక వేళ రాజకుమారి దొరకకపోతే, ఆమె పోలికలు వున్న మరొక వ్యక్తిని వెతికి గాలించి తీసుకొని వచ్చి, ఈమెయే అవంతీసుందరి అని చెప్పి పరంతపుణ్ణి మోసగించాలని కరటకశర్మ పథకమా?

'ఈ కరటకశర్మ నమ్మదగ్గవాడు కాడు. అయినా, నా కేమి భయం? ఇతడు చేసే ప్రయత్నం లాభసాటిగా ఉంటే, దానిని ఉపయోగించుకోవచ్చు. లేక నన్ను కూడా మోసగిస్తే, అప్పుడే ఇతడి పని పట్టవచ్చు.

ఏమైతేనేం, గదాధరుడు కూడా బృహస్పతి భట్టును కలిసి రాజకుమారి తైలవర్ణ చిత్రాన్ని ఆనవాలుకై తీసుకొని వచ్చాడు. ఆ తర్వాత, ఒక మంచి రోజు చూచుకొని కరటకశర్మ, గదాధరుడు కలిసి రాజకుమారిని లేదా రాజకుమారి లాంటి వ్యక్తిని అన్వేషించేందుకై బయలుదేరారు.



అమరావతీ రాజ్యంలోని కథ ఇలా ఉండగా, అక్కడ జయసింహుడు గురువు గురుచరణుడు వెళ్ళిన తరవాత, జాంఘాలిక పర్వతం మీది నుండి క్రిందికి వచ్చాడు. జ్యోతిష్మతీ మూలికలను భస్మంగా మార్చుకొని భద్ర పరచుకొన్నాడు. కొద్దిపాటి ఆహార పదార్థాలూ, గురువు తనకు ఇచ్చిన యువరాణి చిత్రాన్నీ జోలెలో భద్ర పరచుకొన్నాడు. దానిని చంకకు తగిలించుకొని అన్వేషణ మొదలు పెట్టాడు.

రాత్రింబవళ్ళు తేడా లేకుండా జయసింహుడు అలా తిరగసాగాడు. మయూరాక్షి గూర్చి అతడికి సమాచారం కావాలి. మంత్రాల దీవిలో మయూరాక్షి ఉన్నట్లు గురువు వేయిం



చిన అంజనంలో కనపడినట్లు చెప్పారు గదా! మంత్రాల దీవి ఎక్కడ ఉంది? మయూరాక్షికి మంత్రాల దీవికీ ఏమిటి సంబంధం? రాజ కుమారి కోసం అంజనం వేస్తే, మయూరాక్షి ఎందుకు కనపడింది? ఇవి చిక్కు విడని సమస్యలు. వీటికి పరిష్కారం లభించటం లోనే తన అన్వేషణ విజయం ఆధారపడి ఉంటుందని అనుకున్నాడు.

జయసింహుడు అలా వెళుతూ వెళుతూ ఒకనాటి సాయంత్రం బాగా అలిసి పోయి, ఒక గ్రామం వద్ద ఆగాడు. అక్కడ పూట కూళ్ళ అవ్వ ఇల్లు ఎక్కడ ఉందో విచారించి ఆమె ఇంటికి పోయి. అక్కడ జయసింహుడు స్నానమూ భోజనమూ ముగించుకొని విశ్రాంతి తీసుకొనాలని అనుకున్నాడు. సులభంగానే అతడు అక్కడికి చేరగలిగాడు. పూటకూళ్ళ అవ్వ సాదరంగా అతడిని ఆహ్వానించింది.

"అవ్వా, నేను పరదేశియుడిని. తీర్థ యాత్రల కోసం తిరుగుతున్నాను. చీకటి పడే సరికి ఇవాళ ఇక్కడ ఆగిపోయాను. ఈ రాత్రి ఇక్కడ పడుకొని ఉదయమే వెళ్ళిపోతాను," అన్నాడు జయసింహుడు.

"అంత కంటేనా నాయనా! నీకు ఏ దేశపు భోజనం ఇష్టమైతే. ఆ దేశపు భోజనమే వండి పెడతాను. ఇక్కడికి అంగ వంగ కళింగ కాశ్మీర కాంభోజ మాళవ దేశాల నుండి ఎందరెందరో యాత్రికులు వస్తూ వెళుతూ ఉంటారు. వారి వారి ప్రాంతాల రుచులకు అనుగుణమైన వంటలను వండించటం నా కర్తవ్యంగా నేను భావిస్తూ ఉంటాను," అన్నది పూటకూళ్ళ అవ్వ.

జయసింహుడు స్నానం చేసి, గురువును స్మరించుకొని, దేవతార్చన చేసి పూటకూళ్ళ అవ్వ వడ్డించిన విందుభోజనాన్ని ఆరగించాడు.

"అవ్వా, ఏమిటి మీ ప్రాంతపు వింతలూ, విశేషాలూ?" అని అడిగాడు జయసింహుడు.


"ఏమి చెప్పను, నాయనా! దీన్ని ఐదరి ప్రాంతం అంటారు. మా గ్రామానికి పొలి మేరల్లో ఒక విశేషం జరుగుతూ వుంటుంది. పున్నమినాటి రాత్రి బాగా ప్రొద్దు పోయిన తరవాత, మధురమైన సంగీతం గ్రామం

వెలుపల నుంచి వినిపిస్తూ వుంటుంది. అదేమిటో తెల్సుకొందామని ఆసక్తితో కొందరు వెళ్ళారు. అలా వెళ్ళినవారెవరూ తిరిగి రాలేదు. అప్పటి నుంచీ పున్నమి వస్తూంది అంటేనే మా గ్రామంలోని వారికి ప్రాణభయం పట్టు కొంటుంది. గ్రామస్థులే కాదు. యిక్కడకు వచ్చిన యాత్రికులు కూడా కొందరు ఆ విశే షము తెలుసుకొందామని వెళ్ళారు. వెళ్ళిన వాడు వెళ్ళినట్లే అదృశ్యమౌతున్నారు. కాని, ఇంత వరకూ తిరిగి రావటం కనపడ లేదు. అందువల్ల, భయంతో నేను మా యింటికి వచ్చిన వారికి ఈ కథ చెప్పటం మాను కొన్నాను. ఈవేళ పున్నమి కావటమూ, నీవు ఆసక్తితో అడగటమూ సంభవించటాన ఈ విషయం చెప్పక తప్పింది కాదు," అన్నది పూటకూళ్ళ అవ్వ.

జయసింహుడు విని ఆశ్చర్య పడ్డాడు. ఈ సంగీత రహస్యం తెల్సుకొనాలనే ఉత్కంఠత అతడిలో చెలరేగి ఇలా అన్నాడు.


"అవ్వా, నీవు అన్యధా భావించకపోతే, ఈ విచిత్రమేమిటో చూడటానికి వెళదామను కొంటున్నాను. నేను తిరిగి వచ్చే వరకూ నా వస్తువులను జాగ్రత్తగా చూస్తూ వుండు."

అది విని పూటకూళ్ళ అవ్వ కన్నీరు పెట్టు కొని, "నేరకపోయి నీ కీ వార్త చెప్పి ప్రాణం మీదికి తీసుకొస్తున్నాను; నన్ను మన్నించు, నాయనా!" అన్నది.



"లేదవ్వా. నాకు సాహసకార్యాలు అంటే చాలా ఇష్టం. అందుకని ఈ సంగీత రహస్యం ఏమిటో తెలుసుకొని మళ్ళీ వస్తాను," అని చెప్పి, జయసింహుడు రాత్రి బాగా పొద్దు పోయిన తరవాత, పూటకూళ్ళ అవ్వ బస విడిచి ప్రయాణము సాగించాడు.

అది పున్నమిరాత్రి కావటంతో భయకంపి తులైన గ్రామస్థులు చంద్రోదయం కాగానే, తలుపులు బిడాయించుకొన్నారు. అందువల్ల, గ్రామపు పొలిమేరల వాతావరణం అంతా నిర్మానుషంగా వుంది. జయసింహుడు గ్రామం వెలుపల ఒక్కడే నిర్భయంగా తిరు గుతూ ఆ సంగీతపు వింత ఏమిటో చూద్దామని ఎదురు చూడ సాగాడు.



క్రమంగా అర్ధరాత్రి కావచ్చింది. ఉన్నట్లుండి దూరం నుండి మధురమైన సంగీతం అకస్మాత్తుగా వినపడ సాగింది. ఆశ్చర్యంతో జయసింహుడు ఆ వైపుకు నడిచాడు. అలా కొంత దూరం పోయేసరికల్లా, సంగీతం అతడికి బాగా దగ్గరయింది. సంగీతం వచ్చిన ప్రదేశాన్ని వెతుకుతూ జయసింహుడు బాగా ముందుకు పోయాడు.

అలా వెళ్ళేసరికి, అతడు ఒక చెట్టును చేరుకొన్నాడు. గాలికి చెట్టు కదలినప్పుడల్లా చెట్టు కొమ్మల్లో నుండి మధురమైన సంగీతం బయటికి వస్తున్నట్లు జయసింహుడు గమనించాడు. మెల్లగా చెట్టుకొమ్మలను సమీపించి, వెన్నెలలో వాటిని పరిశీలించి చూచాడు. కొమ్మలన్నీ మధురరాగాలను ఆలాపిస్తున్నాయి. జయసింహుడికి సంగీతంవలన కలిగే ఆనందం కన్నా, చెట్టుకొమ్మలు పాడటం వలన కలిగే ఆశ్చర్యం ఎక్కువ వింతను కలుగ జేసింది.

జయసింహుడు చెట్టు వద్దకు వెళ్ళి, ఆ కొమ్మలనూ అటూ ఇటూ కదిలించాడు. ఆకులను పట్టి గుంజాడు. బోదెను చేతితో మర్దించి చూచాడు. అతడు చెట్టును తాకేస్కల్లా అది పాడటం ఆపలేదు. కాని, అక్కడ నుంచి పరిగెత్తటం మొదలు పెట్టింది.

అది చూచేసరికి జయసింహుడికి నవ్వు వచ్చి, 'ఇది నిజమైన చెట్టే అయితే కదులుతుందా? ఒక చోటి నుండి మరొక చోటికి పరుగెత్తుతుందా? కాబట్టి, ఇందులో ఏదో మాయ వుండి వుండాలి. దీని రహస్యం ఏమిటో తెల్సుకొనాలి.' అన్న కోరిక అతడికి పుట్టింది.

అందుకని, చెట్టు వెంబడే నడుచుకొంటూ ముందుకు సాగాడు జయసింహుడు.

అప్పటికే చెట్టు గ్రామానికి చాలా దూరం వెళ్ళి పోయింది. జయసింహుడు దాన్ని అనుసరిస్తూనే వున్నాడు.

జయసింహుడికి విసుగు పుట్టి. "ఏయ్, చెట్టూ! నీ వెవరివి? మనిషివా? రాక్షసుడివా? లేక కామరూపంలో వున్న గంధర్వుడివా? లేకపోతే, చెట్టు ఇలా పాటలు పాడటం ఏమిటి? అసందర్భంగా వుందే!" అన్నాడు.

జయసింహుడిలా అనే లోపలే పొడవైన


చెట్టుకొమ్మలు అతణ్ణి హఠాత్తుగా చుట్టుకొన్నాయి. సంగీతవృక్షం జయసింహుడిని తన మీదికి ఎక్కించుకొని ఎగురుకొంటూ పోసాగింది.

అప్పటికి జయసింహుడికి అసలు రహస్యం కొంత వరకు అర్థమైంది.

'ఈ సంగీత వృక్షం వృక్షం కాదు. ఈ కొమ్మలు కొమ్మలు కావు. ఇదేదో రాక్షస మాయ. కొమ్మల వంటి చేతులతో ఆ రాక్షసుడు నన్ను అదిమి పట్టుకొని ఎక్కడికో తీసుకొని పోతున్నాడు,' అని గ్రహించాడు జయసింహుడు.

రోటిలో తల దూర్చి రోకటి పోటునకు వెరిస్తే లాభ మేమిటి? పూటకూళ్ళవ్వ చెప్పిన మాట విని అప్పుడే జాగ్రత్త పడితే తన దోవన తాను గురు కార్యానికై వెళ్ళి ఉండేవాడు. అనవసరంగా ఇప్పుడు తాను ఈ మాయలో చిక్కుకున్నాడు. దీనిలో నుండి బ్రతికి బయట పడతాడో లేడో తెలియదు.

జయసింహుడు చెట్టు మీది నుండి జారుకొనటానికి ప్రయత్నిస్తున్న కొద్దీ, చెట్టు కొమ్మలు అతడిని ఇంకా గట్టిగా అదిమి పట్టుకొనసాగాయి. దానితో, అతడు చెట్టు మీది నుండి ఎగిరిపోవాలని ప్రయత్నం విరమించుకొని ఏం జరుగుతుందో చూద్దామని వూరుకున్నాడు.



చెట్టు అలా కొంత దూరం పోయి తనంతట తానే ఆగిపోయింది. అది ఆగిపోగానే, దాని నుండి వినవస్తున్న సంగీతం కూడా నిలిచిపోయింది. చూస్తూండగానే చెట్టు కొమ్మలు పొడవైన రెండు చేతులుగా మారిపోయాయి.

వెంటనే జయసింహుడు పరిశీలించి చూచాడు. తనను ఎవరో ఒక రాక్షసుడు పొడవైన రెండు చేతులతో పొదివి పట్టుకొన్నట్లు గ్రహించ కలిగాడు.

"ఓయీ మాయావీ! నీ వెవరవు? ఎందుకు ఈ సంగీత వృక్ష రూపంలో మానవులను ఆకర్షించి బాధిస్తున్నావు?" అని జయసింహుడు సూటిగా ప్రశ్నించాడు.

"ఓరీ మానవుడా! నే నెవరో తర్వాత చెపుతాను. కాని, ముందు నీవు నా ప్రశ్నలకు

సమాధానం చెప్పాలి. నేను నిన్ను మోసం చెయ్యను. నా ప్రశ్నలకు నీ నుండి సరియైన సమాధానం వస్తే; నేను నిన్ను విడిచి పెడతాను. లేదా నిన్ను చప్పరించి వేస్తాను," అన్నాడు రాక్షసుడు.

జయసింహుడు రాక్షసుడి మాటలు విని ఆలోచనలో పడ్డాడు.

సంగీతాన్ని ఎరగా వాడి చెట్టు రూపంలో ఈ రాక్షసుడు వచ్చి మానవుల నాకర్షించి తీసుకు వెళుతున్నాడనీ, ఆ తర్వాత వారిని ఆహారంగా ఉపయోగించు కొంటున్నాడనీ గ్రహించాడు జయసింహుడు.

అయితే, అతడు ఏ మాత్రం బెదిరి పోకుండా, "మంచిది. అలాగే ప్రశ్నించు. నాకు తోచిన సమాధానం చెప్తాను," అన్నాడు.

"అయితే. నా మొదటి ప్రశ్న విను. అన్నింటి కంటే తేలికగా ఉండే వస్తువు ఏది?" అని అడిగాడు రాక్షసుడు.

"ఓయీ, మంత్రవాదీ! అన్నిటి కన్నా తేలికగా చులకనగా చూడబడేది యాచక వృత్తి. ధనహీనుణ్ణి సమాజం చాలా చులకనగా చూస్తుంది," అన్నాడు జయసింహుడు.

"అన్నిటి కన్నా బరువైనది ఏది?" అని అడిగాడు రాక్షసుడు.

"అన్నింటి కన్నా బరువైనది సౌశీల్యం. దాని ముందు దేవతలతో సహా అందరూ లొంగి పోవలసిందే!" అని సమాధానం ఇచ్చాడు జయసింహుడు.

"ఓయీ, యువకుడా! ప్రాణులకు ఏది అన్నింటి కన్నా ఇష్టం?" అని అడిగితే, "ఓయీ మాయావీ! జీవకోటికి అన్నింటి కన్నా తన ప్రాణం అంటేనే ఎక్కువ ఇష్టం!" అని చెప్పాడు జయసింహుడు.

"ఓ యువకుడా! భూలోకంలో అందరి కంటే ఎక్కువ సౌందర్యవతి ఎవరు?" అని అడిగాడు రాక్షసుడు. —(ఇంకా ఉంది)





మాయాదర్పణం

6

[ఆ దండోరా విని, కరటకశర్మ అనే జిత్తులమారి గదాధరుడనే యువకుడిని రాజకుమారి అన్వేషణకు బయలుదేర తీస్తాడు. ఆ పాటికి జయసింహుడు చాలా దూరం వెళ్ళి, ఒక పూటకూళ్ళ అవ్వ ద్వారా సంగీతవృక్షం గురించి వింటాడు. దాని రహస్యం ఛేదించి, ఆ రూపంలో వున్న ఒక రాక్షసుడి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వుంటాడు.
—తరవాత]

జయసింహుడు నవ్వి, "ఇది అర్థం లేని ప్రశ్న. అందరి కంటే గొప్ప సౌందర్యవతి అంటూ ఎవరూ ఉండరు. ఎవడికి ఎవతె నచ్చితే, వాడి కళ్ళకు ఆమెయే భూలోక రంభలాగా కనపడుతుంది," అన్నాడు.

ఇలా జయసింహుడు ఇచ్చిన సమాధానాలను విని రాక్షసుడు నివ్వెరపోయాడు.

"ధన్యుణ్ణి జయసింహా, ధన్యుణ్ణి! నేటితో నాకు శాప విమోచనమైంది. నేను ఒక గంధర్వుడిని! మా గురువు నాకు నేర్పిన సంగీత విద్యనంతా నాలో దాచుకొని, ఎవరు అడిగినా కూడా నేను ఒక్క స్వరమూ నేర్పలేదు. ఈ విద్యాలోభం ఫలితంగా, నాకు రాక్షస జన్మ ప్రాప్తించింది. నేటితో నీ వల్ల నాకు విముక్తి కలిగింది. నా సంగీత విద్యను నీకు ధార పోస్తున్నాను. నీ వేదైనా మరో వరం కోరుకో." అంటూ అతడు గంధర్వుడిగా మారాడు.

జయసింహుడు గంధర్వుడికి నమస్కరించి, "ఓ దివ్యమూర్తీ! గాంధర్వ సంగీత విద్య ధారపోసినందుకు కృతజ్ఞుడిని. అయితే, అమరావతీ నగరపు రాజకుమారి అవంతీ సుందరిని ఒక నెమిళ్ళ గుంపు అపహరించుకొని పోయింది. అంజనంలో మయూరాక్షి కనపడింది. మయూరాక్షికీ మాయా ద్వీపానికీ ఏమిటి సంబంధం? అవంతీసుందరి ఎక్కడ వున్నదో చెప్పగలవా?" అని అడిగాడు.

మయూరాక్షి పేరు వినగానే గంధర్వుడు భయపడిపోయాడు.

యం. ఉమాదేవి



జయసింహుడు గంధర్వుడి ముఖం చూచి ఆశ్చర్యపడి. "అదేమిటి? మయూరాక్షి పేరు చెప్పగానే, మీ ముఖం రంగులలా మారి పోయాయి?" అని ప్రశ్నించాడు.

"ఓయీ వీరుడా! విను. మయూరాక్షి పేరు నేను కాని, మా గంధర్వలోకంలో మిత్రులు కాని వినటమె కాని, ఎన్నడూ కన్నది లేదు. నేను సంగీత విద్యను నేర్చుకొని ఎవరికీ దానం చేయకపోవటం వల్ల, రాక్షసుడిగా మారాను. అలా మారక ముందు గంధర్వ లోకంలో ఉండే వాణ్ణి. మయూరాక్షి అనే శక్తిమంతమైన దేవత సముద్ర మధ్యంలోని ఒక మంత్రాలదీవిలో ఉన్నదట. అనేక దేశాలు తిరిగే మా గంధర్వ మిత్రులు కొందరు ఆ ద్వీపాన్ని అన్వేషిస్తూ పోయి నశించారు. ఆ వార్తలు మా గంధర్వలోకానికి వచ్చాయి. అప్పటి నుండి మా లోకంలోని వారికి మయూరాక్షి పేరు వింటేనే భయం. అందు వల్లనే నీవు మయూరాక్షి గురించి ప్రశ్నించ గానే భయపడ్డాను," అన్నాడు గంధర్వుడు.

జయసింహుడు కొన్ని క్షణాలాగి, "పోనీ, ఆ మయూరాక్షి ఉండే మంత్రాలదీవి ఏ దిక్కున ఉంటుందో చెప్పగలవా?' అని ప్రశ్నించాడు.


"ఓయీ జయసింహా! విను. హిమాలయ పర్వతాలకు దిగువ భాగంలో ప్రయాణం చేస్తూ పోతే సముద్రం వస్తుంది. సామాన్యంగా మా గంధర్వులు ఈ మార్గంలోనే ఎగురు కుంటూ పోతూ ఉంటారు. బహుశః, మా గంధర్వమిత్రులు మయూరాక్షి కోసం ఈ మార్గంలోనే పోయినట్లు విన్నాము. అలా కొంత దూరం పోతే శుక్లద్వీపం, కృష్ణద్వీపం, అరుణద్వీపం, నారికేళద్వీపం వస్తాయి. ఈ ద్వీపాలలో ఎక్కడో మయూరాక్షి ఉండే మంత్రాలదీవికి సంబంధించిన రహస్యం తెలిసే అవకాశం ఉంది. కాబట్టి, నేను నీకు చేయగలిగిన సహాయం ఒక్కటే. నీవు నా భుజాల మీద కూర్చుంటె. నిన్ను ఈ నాలుగు ద్వీపాల మీదా తిప్పుతాను. అక్కడ మనం మయూరాక్షికి సంబంధించిన సమాచారం మరికొంత సేకరిద్దాం," అన్నాడు గంధర్వుడు.

జయసింహుడు ఈ మాటలు విన్నాడు. అతడికి భయానికి బదులు ఆశ్చర్యం కలిగింది. ఎక్కడి మంత్రాలదీవి? ఎక్కడి అమరావతి నగరం? మానవులే కాదు, గంధర్వులు కూడా కని విని ఎరుగని ఆ భయంకర ప్రదేశంలోని నెమిలి రాక్షసుడు, అవంతి సుందరిని ఎందుకు అపహరించుకొని పోయినట్లు? ఎంత ఆలోచించినా ఈ రహస్యం బ్రహ్మదుర్భేద్యంగానే ఉండిపోయింది.


"ఓయీ జయసింహా! ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు గంధర్వుడు.

అది విని జయసింహుడు తన ఆలోచనల నుండి తేరుకొని, "మీ సహాయానికి కృతజ్ఞుణ్ణి. నేను మీ భుజాలపై ఎక్కి ఆ ద్వీపానికి వెళ్ళవలసిన అవసరం లేదు. నా మార్గం ఏదో నేనే చూచుకొనగలను. కాకుంటే, ఆ ద్వీపాల గురించి మరేమయినా సమాచారం ఉంటే చెప్పండి చాలు." అన్నాడు.

"నేను వాటిని గురించి కొంత వరకే విన్నాను. శుక్లద్వీపం అనేది ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుందట. అక్కడ సూర్యాస్తమయమనేది ఉండదట. కృష్ణద్వీపంలో వెలుతురే ఉండదట. ఎప్పుడూ గాఢాంధకారంతో నిండి ఉంటుందట. ఇక అరుణద్వీపం మంటలతోనూ, గంధకపు కొండలతోనూ నిండి ఉంటుందట. అక్కడ ప్రాణికోటి అనేది ఉన్నదో లేదో తెలియదు. ఈ



ద్వీపాలు దాటి వెళితే, నారికేళద్వీపం వస్తుంది. దీనిలో వృక్షములూ, జంతువులతో పాటు మానవసంచారం కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. ఆ మానవులు ఎలాంటి వారో నాకు తెలియదు. మరణించిన మా గంధర్వ మిత్రులు ఈ నాలుగు ద్వీపాలకు వెళ్ళినట్లు తెలిసింది. మయూరాక్షి ఉండే మంత్రాలదీవి వీటికి అవతల ఎక్కడో ఉంది. ఆ దీవికి పోయే మార్గానికి సంబంధించిన రహస్యం మాత్రం ఈ శుక్ల కృష్ణ అరుణ నారికేళద్వీపాలలో ఎక్కడో ఉన్నట్లు తెలుస్తుంది. నీవు నాకు సహాయం చేశావు. కాబట్టి, అవసరమైతే నేనూ నీ వెంట వస్తాను." అన్నాడు గంధర్వుడు.



"అయ్యా. నాకీ సమాచారం ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు నా వెంట వస్తే నాకు అంతకన్నా కావలసినదేమున్నది? అయితే, మీరు శాపాన్ని పొంది ఎంతో కాలమై ఉంటుంది. గంధర్వలోకంలో మీ కోసం మీ భార్యాబిడ్డలూ బంధుమిత్రులూ అంతా ఎదురు చూస్తూ ఉంటారు. అలాంటప్పుడు నేను నా స్వార్థం కోసం మిమ్మల్ని వెంట తీసుకొని పోవటం ఏమి న్యాయం? అందువల్ల దయ చేసి మీరు సుఖంగా గంధర్వ లోకానికి వెళ్ళిపొండి. నా దారిని నేను వెళ్ళి గురుకార్యం సాధిస్తాను," అన్నాడు జయసింహుడు.

గంధర్వుడు జయసింహుణ్ణి ఆశీర్వదించి అదృశ్యమైనాడు.

జయసింహుడు మళ్ళీ వెతుక్కుంటూ పూటకూళ్ళ అవ్వ ఉండే గ్రామానికి వచ్చాడు. అప్పటికి తెల్లవారు జాము కావస్తున్నది. రాత్రి అదే పోక పోయిన జయసింహుడు. ఎంతకూ ఇంటికి చేరకపోయేసరికి, అతడు కూడా ఆ రాక్షస మాయలో పడి ఉంటాడని పూటకూళ్ళ అవ్వ విచారపడుతూ ఉంది. నిజానికి ఆమెకు ఆ తెల్లవార్లూ నిద్ర లేదు. అలాంటిది తెల్లవారు జామునకు జయసింహుడు తిరిగి వచ్చేసరికల్లా ఆమె ఆనందానికి అంతు లేదు.

"నాయనా వచ్చావా!" అని పూటకూళ్ళ అవ్వ జయసింహుడి నాప్యాయంగా తల్లిలాగా కౌగిలించుకుంది.

"అవ్వా! మీ కింక భయం లేదు. ఈ రాత్రి నుంచి మీకు సంగీత వృక్షపు పీడ విరగడైంది. రాత్రే నేనా వృక్షాన్ని నిర్మూలించి వచ్చాను," అని జరిగిన కథనంతా పూటకూళ్ళ అవ్వకు చెప్పాడు జయసింహుడు.

ఇంతటి మహాకార్యం సాధించేసరికి అతడంటే పూటకూళ్ళ అవ్వకు ఎక్కడ లేని భక్తి పుట్టుకొని వచ్చింది. ఇతడెవరో మామూలు బాటసారి కాడనీ. మహామహిమలు కల వాడనీ ఊహించింది.

"బాబూ. నీవు ఏ విద్యాధరుడవో. మానవ రూపంలో ఉన్న సిద్ధుడవో అయి ఉండాలి. లేకపోతే, ఇంతటి మహాకార్యం సామాన్యులకు ఎలా సాధ్యమౌతుంది?" అన్నది ఆమె.

"అవ్వా: నేను సిద్ధుణ్ణీ కాను. విద్యాధరుణ్ణీ కాను. మాది దక్షిణభారత వర్షంలోని కృష్ణా నదీతీరంలో గల అమరావతీ రాజ్యం. మా గురువు గురుదక్షిణగా నా కొక పరీక్ష పెట్టారు. ఆ పని మీద బయలుదేరి వెళ్ళుతున్నాను. అన్నట్లు, అవ్వా! నీవు ఎన్నో సంవత్సరాలుగా ఈ భోజనశాలను నిర్వహిస్తున్నావు కదా! ఇక్కడికి ఎన్నో వేలమంది ఎన్నెన్నో దేశాల నుండి వస్తూంటారు గదా! వారు చెప్పుకొనే కథలూ కబుర్లూ వింటూ ఉంటావు కదా! నీవు ఎన్నడైనా మయూరాక్షి అనే పేరు విన్నావా?" అని ప్రశ్నించాడు జయసింహుడు.

అప్పుడు పూటకూళ్ళ అవ్వ ఇలా అన్నది. "బాబూ. నీవెవరవో మామూలు మానవుడి వలె కనబడటం లేదు. నీవు చేసే పనులూ, అడిగే ప్రశ్నలూ కూడా ఆశ్చర్యకరాలుగానే ఉన్నాయి. ఎన్నో సంవత్సరాల నుండి మా ప్రాంతానికి శనిగా దాపురించిన ఆ సంగీత వృక్షాన్ని నిర్మూలించావు. మయూరాక్షి గురించీ అడిగావు. చెపుతాను విను.

"కొంతకాలం క్రితం కొందరు సిద్ధులు ఈ దారిలోనే ప్రయాణం చేస్తూ చీకటిపడే వేళకు ఇక్కడ ఆగారు. వారికి నేను శుచిగా రుచిగా భోజనం చేసి పెట్టాను. భోజనానంతరం వారు నాకు ఓ బంగారు నాణేన్ని బహుమానంగా ఇచ్చారు.

"పెదరాసి పెద్దమ్మా! మేము తూర్పు సముద్ర ద్వీపములలో నరమానవులకు అందరాని మంత్రాలదీవికి పోతున్నాము. మయూరాక్షీ మాయాదర్పణాన్ని స్వాధీనం చేసుకొని త్వరలోనే తిరిగి వస్తాము. వచ్చేటప్పుడు నీకు ఒక బంగారు నాణెం కాదు. వందల నాణేలతో కనకాభిషేకం చేస్తాము. అప్పుడు ఈ భూమి మీద మమ్మిమించిన ధనవంతుడు మరొకడు వుండడు," అన్నారు వాళ్ళు.

"ఆ తర్వాత వారు వెళ్ళిపోయారు. అలా వెళ్ళి చాలా కాలమైంది. వారు అబద్ధం చెప్పే మనుష్యుల వలె కనిపించలేదు. ఏదో సాహస కార్యం చేయటానికి బయలుదేరిన హిమాలయ సిద్ధుల వలె కనిపించారు. సిప్రా నదీతీరంలో మహాకాళికి అభిషేకాలు చేసి కార్యసాధనకై





తిరిగి పోతున్నట్లు వారి మాటలను బట్టి గ్రహించాను.

"అయితే, నాటికీ నేటికీ వారి జాడ కనపడనే లేదు. బహుశః, ఏదో సాహసకార్యం చేయబోయి, వారు మరణించి ఉంటారని ఊహించాను. నీవు నేడు మళ్ళీ మయూరాక్షిని గూర్చి ప్రశ్నించేసరికి, ఆ నాటి సంఘటనా, వారు నా కిచ్చిన బంగారు నాణెం గుర్తుకు వచ్చాయి.

"నాటికీ నేటికీ మయూరాక్షి అనే పేరు తలచిన వారు లేరు. మళ్ళీ నీ వెవరో సాహస పురుషుడివి దానిని గూర్చి అడుగుతున్నావు."

జయసింహుడికి విషయమంతా అర్థమై పోయింది. మయూరాక్షిని గూర్చి అంజనం ద్వారానో, లేక ప్రాచీనమైన ఏ తాళపత్రం ద్వారానో ఆ సిద్ధులు సమాచారం సేకరించి ఉంటారు. వీరి మాటలను బట్టి చూస్తే ఆ మయూరాక్షి ప్రపంచం ఎన్నడూ కనీ వినీ ఎరగని సంపదలను ఇచ్చే మహాశక్తి వలె కనపడుతున్నది. మయూరాక్షి అన్వేషణలోనే వారు ఎక్కడో మరణించి ఉండవచ్చు. అందుకే తిరిగి వారు ఈ బదరీ ప్రాంతానికి వచ్చి తాము అన్నట్లుగా పూటకూళ్ళ అవ్వకు కనకాభిషేకం చేయలేకపోయారు.

జయసింహుడు పూటకూళ్ళ అవ్వను ఆ సిద్ధులేమి మాట్లాడుకున్నారో ఇంకా వివరాలు చెప్పవలసిందిగా ప్రశ్నించాడు. కాని, ఆమె ఇంతకు ముందు చెప్పిన మాటలనే మళ్ళీ మళ్ళీ చెప్పింది. కాని, ఇంతకు మించి మరేమీ చెప్పలేకపోయింది. ఈమె మాటలను బట్టి మయూరాక్షి తూర్పు సముద్ర ద్వీపాలలోని మంత్రాలదీవిలో ఉన్నదని స్పష్టమైంది. అయితే, ఆ మంత్రాల దీవి ఎక్కడున్నది? గంధర్వుడి మాటలను బట్టి, అది నారికేళ ద్వీపానికి అవతల ఎక్కడో ఉండి ఉండాలి.

జయసింహుడు ఇక ఆలస్యం చేయకుండా తూర్పుతీర ద్వీపాలకు ప్రయాణం కట్టాలనుకున్నాడు. మర్నాడు ఉదయమే అవ్వకు వీడ్కోలు చెప్పి, బదరికా ప్రాంతం నుండి ముందుకు సాగిపోయాడు. పగటిపూట నడచుకొంటూ రాత్రిపూట జ్యోతిష్మతీ భస్మపు సహాయంతో ఆకాశంలో ఎగురుతూ త్వరలో

హిమాలయ పర్వతసానువులకు అతడు చేరుకున్నాడు.

హిమాలయాల ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ జయసింహుడు తూర్పుతీర ద్వీపాలకు ఎక్కడి నుండి ప్రయాణం మొదలు పెట్టాలా అని యోచిస్తున్నాడు. గంధర్వుడు తనకు చెప్పిన సమాచారం ప్రకారం హిమాలయాల క్రింది భాగం సముద్రానికి ఎక్కడ సమీపంగా ఉందో; అక్కడి నుండి సాగర యానం ప్రారంభించాలన్న మాట.

హిమాలయపర్వతాల లోపల జయసింహుడు మంచు మనుష్యులను చూచాడు. వారు మనుష్యుల రూపంలో ఉన్న మృగాలు. చూడటానికి కొంచెం ఎలుగుబంట్ల పోలికలతో ఉంటారు. దట్టమైన మంచు కొండలలో మంచు గుహలలో దాక్కొని ఉంటారు. సామాన్యంగా పగటిపూట వారు గుహలలో నుండి బయటికి రారు.

రాత్రివేళలలో ఆకాశంలో ఎగురుతూ జయసింహుడు ఇలాంటి విచిత్రాలను ఎన్నిటినో చూచాడు. ఒక చోట రత్నాల గుట్ట కన్పడింది. జయసింహుడు కొన్ని రత్నాలను ఏరుకొని తన జోలెలో వేసుకొన్నాడు.

హిమాలయ పర్వతసానువుల చివరి వరకూ వెళ్ళి అక్కడి నుండి క్రిందికి వచ్చాడు. అంటే దాదాపు గంగానదీ పరీవాహక ప్రదేశము లోపలికి ప్రవేశించాడన్న మాట. గంగా



నది పాయలు పాయలుగా చీలి, చివరకు సముద్రంలో కలుస్తుంది. దానికి ఎగువభాగాన హిమాలయ పర్వతాలూ, తూర్పు దిశలో తూర్పు సముద్రమూ ఉన్నాయి.

ఈ ప్రాంతం నుండి సముద్రం మీద ఎగురుకుంటూ ముందుకు పోవాలని జయసింహుడు ఆలోచించాడు. అయితే, అతడికి ఓ చిక్కు ప్రశ్న ఎదురైంది. రాత్రి మొత్తమూ ఎగురుకుంటూ కొంత దూరం పోగలడు. కాని, సూర్యోదయవేళకు జ్యోతిష్మతీ మూలిక పని చేయదు. సరిగా ఆ సమయానికి తాను సముద్రంలో ఎక్కడో ఉండిపోతే, తన గతి ఏం కావాలి? పైగా నీటి తడి తగిలితే జ్యోతిష్మతీ

మూలిక పని చేయదని అతడి గురువు చెప్పి వున్నాడు కూడా.

సరే. ఎలా జరుగుతుందో చూద్దామనుకొని, ఒకనాడు చీకటి పడగానే సముద్రం మీద ఎగురుతూ జయసింహుడు పోసాగాడు.

రాత్రి మొత్తానికి నాలుగు జాములు ఉంటాయి. మహా వేగంతో రెండు జాముల పాటు సముద్రంపై సంచారం చేయవచ్చు. అప్పటికి అర్థరాత్రి అవుతుంది కదా! ఆ లోపల తనకు ఏదైనా చిన్న ద్వీపమో సముద్రంలోని కొండకొమ్మో కనపడితే తాను అదృష్టవంతుడే. ఒకవేళ అర్థరాత్రి వరకూ కూడా, ఏ ఆధారమూ దొరకకపోతే, తెల్లవారే లోపల తాను వెనుకకు తిరిగి వచ్చి భూమిని తాకవచ్చు.


ఇలా అనుకొని జయసింహుడు ముందుకు సాగాడు. మొదటి జాము గడిచే వరకూ జయసింహుడికి ఏ ఆధారమూ దొరకలేదు. అయితే, రెండవ జాము ప్రారంభమయ్యే వేళకు సముద్రంలో కాగడాలతో మెరుస్తూ ఏదో కనిపించింది. దాన్ని బట్టి ఏదో పడవ సముద్రంలో పోతున్నట్లు జయసింహుడు గ్రహించాడు.

ఆకాశంలోనే ఎగురుతూ చుట్టు ప్రక్కల ఏదైనా కొండ కాని, ద్వీపం కాని ఉందేమో నని జయసింహుడు పరిశీలించాడు. అయితే, అలాంటి జాడ ఏమీ కనపడలేదు. ఒక కన్ను పడవ మీదనే ఉంచి జయసింహుడు సముద్రాన్ని గాలించటం మొదలుపెట్టాడు.

తెల్లవారు జాము వరకూ అలా వెతికి విసిగి పోయాడు. ఇక లాభం లేదనుకొని తెల్లవారబోయే ముందు ఆ పడవ మీద దిగాలనుకొన్నాడు. అయితే, ఆ పడవ అప్పటికే సముద్ర తీరంలోని ఒక రేవు పట్టణానికి వచ్చింది. దీనిని బట్టి ఇదేదో వ్యాపారపు పడవ అయి వుండవచ్చునని జయసింహుడు ఊహించాడు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

7

[రాక్షసుడు శాపవిమోచనం పొంది గంధర్వుడై జయసింహుడికి గంధర్వ సంగీత విద్యను ప్రసాదిస్తాడు. ఆ తరవాత, పూటకూళ్ళ అవ్వ ద్వారా గతంలో కొందరు సిద్ధులు మయూరాక్షి అన్వేషణకి వెళ్ళారని తెలుసుకొని హిమాలయాలకు వెళ్ళి, అక్కడ వున్న రత్నాలగుట్ట నుంచి రత్నాలు ఏరుకొని, తూర్పు తీర సముద్రాన్ని చేరతాడు జయసింహుడు. అంతలో ఒక పడవ కనిపిస్తుంది. —తరవాత]

త్రనను ఎవరూ చూడకుండా జయసింహుడు భూమి మీద దిగాడు. పడవలోని వారిని పరిచయం చేసుకొని ఆ పడవలో కొంత కాలం సముద్రంలో ప్రయాణించటం శ్రేయస్కర మనిపించింది. ఈ లోపల ఏదైనా సమాచారం దొరకవచ్చు కదా!

మర్నాడు ఉదయం నావికులు పడవకు లంగరు వేసి, ఆ రేవు పట్టణంలో తమ సరుకులను దించుకున్నారు. వాటిలో సుగంధ ద్రవ్యాలతో బాటు, రక్త చందనం కూడా ఉంది.

వాటిని అమ్మి ఆ తీరంలో సమృద్ధిగా దొరికే ముత్యాలను కొనుగోలు చేసి పడవ లోనికి ఎక్కించుకొన్నారు. ఆ తర్వాత, పడవలో నుండి వారు నలుగురు బానిసలను దింపి, సముద్ర తీరంలో వారిని వేలం పాడ సాగారు నావికులు.

జయసింహుడు ఈ విచిత్రాన్నంతా గమ నిస్తూ ఉన్నాడు. అందులో ఇరువురు బాని సలు మాత్రం అమ్ముడు పోయారు. ఇంకొక ఇద్దరు మిగిలి పోయారు.

"ఒరేయ్, గాడిదల్లారా! మీకు తిండి దండగ. మిమ్మల్ని ఎవరూ కొనలేదు. చూచారా?" అని నావికులు వారిద్దరినీ కొరడా లతో కొట్టసాగారు.

"బాబోయ్ రక్షించండి, మమ్మల్ని కాపా డండి!" అని వారిద్దరూ పెద్దగా అరవసాగారు. వారి మాటలను విని జయసింహుడు

యం. ఉమాదేవి



ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే వారు కృష్ణా తీరంలోని దేశి భాషలోనే అరుస్తున్నారు.

"అయ్యా, మీరెవరు?" అని వారిని ప్రశ్నించాడు జయసింహుడు.

"బాబూ, మాది కృష్ణా తీరంలోని అమరావతీ నగరం. నా పేరు కరటకశర్మ. ఈయన పేరు గదాధరుడు. మేము బాగా బ్రతుకుతున్న వాళ్ళమే. కాని, బుద్ధి గడ్డి తిని అత్యాశతో మయూరాక్షి కోసం అన్వేషణ మొదలు పెట్టి, పడవ ప్రయాణం చేస్తూ ఈ దుర్మార్గుల చేతుల్లో పడ్డాము. వీళ్ళు మమ్మల్ని నానా హింసలు పెడుతూ బానిసలుగా అమ్మటానికి సిద్ధమైనారు," అని చెప్పాడు కరటకశర్మ.

ఈ మాటలు విని, జయసింహుడు ఇక వెనుకా ముందూ ఆలోచించకుండా, తన జోలెలోని ఒక రత్నం ఇచ్చి వారిరువురినీ కొనేశాడు. ఆ రత్నాన్ని చూచి నావికులు దిగ్భ్రాంతులైనారు. ఎందుకంటే, భూలోకములో వారింత వరకూ అలాంటి రత్నాన్ని చూచి ఎరుగరు.

ఆ పడవ పోగానే, "అయ్యా, మీరిక స్వేచ్ఛగా మీ మయూరాక్షిని వెతుక్కుంటూ వెళ్ళవచ్చు," అన్నాడు జయసింహుడు.

"బాబూ, నీ పేరేమిటి?" అని అడిగాడు కరటకశర్మ.

జయసింహుడు తన పేరు చెప్పాడు.

"నాయనా, జయసింహా! నీ వద్ద చాలా విలువైన రత్నాలు వున్నట్లున్నాయి. వాటి సహాయంతో మమ్మల్ని ఆదుకొన్నందుకు కృతజ్ఞులం. మేము సముద్రం మీద కొంత ప్రయాణం చేయవలసి ఉంది. నీవు ఎటు వెళుతున్నావు?" అన్నాడు కరటకశర్మ.

"నేను ఒక తీర్థయాత్రికుడిని. భూమి మీది సముద్రం మీది వింతలూ విశేషాలూ చూడటం కోసం బయలుదేరాను. మీకు అభ్యంతరం లేకపోతే, నన్ను కూడా మీతో తీసుకు వెళ్ళండి. వస్తాను," అన్నాడు జయసింహుడు.


ఆ తర్వాత, వారు ముగ్గురూ ఒక వ్యాపారపు పడవ ఎక్కి సముద్ర ప్రయాణం ఆరంభించారు.

గాలి బాగా అనుకూలంగా ఉండటంతో ప్రయాణం సులువుగానే సాగింది. అలా వారు కొన్ని రాత్రులూ, కొన్ని పగళ్ళూ సముద్రంలో ప్రయాణం చేశారు. అందరూ నిద్రపోయే వేళకు జయసింహుడు పడవపై భాగానికి చేరుకొనే వాడు. అక్కడి నుండి ఆకాశంలో ఎగురుతూ చుట్టు పక్కల ఏమైనా దీవులు కనపడతాయేమోనని అన్వేషించే వాడు. ఏమీ కనపడకపోయే సరికల్లా, తెల్లవారే వేళకు తిరిగి పడవ పైకి చేరుకొనే వాడు.

ఇలా కొన్నాళ్ళు గడిచింది. జయసింహుడు తన జోలెలోని ఒక రత్నాన్ని అమ్మి, దానివల్ల వచ్చిన అపార సంపదను పడవలోనే ఉంచి, ఆహారపదార్థాలు కొనుక్కొని కరటకశర్మకూ గదాధరుడికీ పెడుతూ ప్రయాణం చేస్తున్నాడు. జయసింహుడు వారికి దొరకటం పేదకు పెన్నిధి దొరికినట్లయింది.

ఒకసారి జయసింహుడు తన కేమీ తెలియనట్లు మయూరాక్షిని గురించి కరటకశర్మను ప్రశ్నించాడు.

కరటకశర్మ నవ్వి, "అదొక అద్భుతమైన దేవత. ఆమెను స్వాధీనం చేసుకొనేందుకోసం నేను బయలుదేరాను. ఆమె అనుగ్రహం లభిస్తే, నే నీ భూప్రపంచానికే రాజును కాగలను. అంతేకాదు మేము అవంతీసుందరి అనే ఒక అమ్మాయిని అన్వేషిస్తూ బయలు




దేరాము. ఆమెను ఎలాగైనా మా గదాధరుడు దొరికించుకొంటానని ప్రతిజ్ఞ పట్టాడు," అన్నాడు.

"అబ్బా. మీ మిత్రుడు చాలా గొప్ప ప్రతిజ్ఞనే పట్టాడు! మీకు ఆ అవంతీసుందరి అనే అమ్మాయి తప్పకుండా దొరుకుతుందా?" అన్నాడు జయసింహుడు.

"తప్పకుండా దొరుకుతుంది. ఒకవేళ ఆ అమ్మాయి దొరకకపోతే, ఆ అమ్మాయి పోలికలుగల అమ్మాయినైనా దొరికించుకొంటాము," అన్నాడు కరటకశర్మ.

ఈ మాటలు వినేసరికి, జయసింహుడికి నవ్వు వచ్చింది. అవంతీసుందరి పోలికలు గల అమ్మాయిని అన్వేషించి, అమరావతి



రాజ్యానికి తీసుకొని పోయి, 'ఆమెయే అవంతీసుందరి,' అని చెప్పి రాజ్యం కాజేయాలని వీరు పన్నాగం పన్నినట్లు అతడికి తెలిసిపోయింది. ఇలాంటి దొంగలు కాబట్టే, వీరిని బానిసలుగా పట్టుకొని, ఆ నావికులు కొట్టి తగిన శిక్ష విధించారని అనుకొన్నాడు. అయితే, వారి మీద కోపానికి బదులు జయసింహుడికి జాలియే కలిగింది.

"అయ్యా, మీరి మయూరాక్షి పేరెక్కడ విన్నారు?" అని ప్రశ్నించాడు జయసింహుడు.

"అది ఒక బ్రహ్మరహస్యం. నాయనా! అయినా, నీవు మా ప్రాణాలు రక్షించావు. కాబట్టి, నీకు చెప్తున్నాను. దక్షిణభారతంలో కృష్ణాతీరంలో గురుచరణ మహర్షి అనే ఒక తపస్వి ఉన్నాడు. ఆయన అవంతీసుందరి కోసం అంజనం వేయగా, అందులో ఈ మయూరాక్షి కనిపించింది. ఈమె ఎక్కడో సముద్ర మధ్యంలో ఉన్న దేవత అని తెలుస్తున్నది. అవంతీసుందరి అదృశ్యం కావటానికి, మయూరాక్షికి విడదీయరాని సంబంధం ఉన్నది. అది తెలుసుకొనటానికే మేమిద్దరమూ కథానాయకుల వలె బయలుదేరాము," అన్నాడు కరటకశర్మ.

జయసింహుడు నవ్వి, "మీరు కథానాయకులనే విషయం మీ ముఖాలు చూస్తేనే తెలుస్తుంది. ప్రతి రాజుకీ ఒక హాస్యగాడు స్నేహితుడుగా ఉంటాడు. అలాగే నన్నూ మీ వెంట తీసుకొని పొండి. ఏవో హాస్యాలూ, చమత్కారాలూ చెప్పి, అప్పుడప్పుడు నవ్వు కలిగిస్తూ ఉంటాను." అన్నాడు.

"తప్పకుండా నాయనా! నీవు బాగా మాట్లాడగలవని మేము గ్రహించాము. పైగా నీ వద్ద రత్నాలు కూడా ఉన్నవాయె. మా వద్ద బుద్ధిబలమూ, భుజబలమూ ఉంది. నీ వద్ద ధనబలముంది. వీటి నుపయోగించి మేము మయూరాక్షిని, రాజకుమారినీ సాధిస్తాము. నీవు మా వెంట ఉండి, మమ్మల్ని ఆనందపరుస్తూ ఉండు. మేము వింతలూ, విశేషాలూ నీకు చూపిస్తూ ఉంటాము." అన్నాడు కరటకశర్మ.

"అంతే, అంతే!" అన్నాడు గదాధరుడు.


'ఓరి, వీళ్ళ అహంకారం మండ!' అని మనసులోనే అనుకుంటూ జయసింహుడు నవ్వుకొన్నాడు.

ఎందుకైనా మంచిది అని జయసింహుడు తానే పని కోసం బయలుదేరినదీ, తనకు ఎన్ని శక్తులు వున్నదీ పొరపాటున కూడా వారికి చెప్పలేదు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో పడవ సముద్రం మీద ముందుకు సాగిపోతున్నది. జయసింహుడు పడవ పైభాగంలో నిలబడి రాత్రింబవళ్ళూ నిర్విరామంగా క్రొత్తద్వీపాల కోసం అన్వేషణ సాగిస్తూనే వున్నాడు. సముద్రంలో ఎక్కడైనా ఎగురుతున్న పక్షులు కనిపిస్తాయేమోనని అతడి ఆశ. పక్షులు అలా ఎగురుతూ వుంటే, సమీపంలోనే ఎక్కడో భూమి వుండాలన్న మాట. అయితే, ఎన్ని రాత్రులూ, ఎన్ని పవళ్ళూ ప్రయాణం చేసినా భూమి మాత్రం తగల లేదు.

జయసింహుడు పడవ నడిపే సరంగును పిలిచి, "ఏమయ్యా, మన మిప్పుడు ఏ దిశలో వెళుతున్నాము? ఎక్కడా కనుచూపుమేరలో భూమి కనబడటం లేదేమిటి?" అని ప్రశ్నించాడు.

అప్పుడు సరంగు, "అయ్యా, వ్యాపారార్థం బయలుదేరిన మా పడవ పదిహేను రాత్రులూ, పదిహేను పవళ్ళూ ప్రయాణం చేస్తేనే కాని, శంఖద్వీపం చేరదు. బహుశః మనమిప్పుడు



సగం దూరం వచ్చి వుంటాము. మీరు ఏమీ గాభరా పడకండి," అన్నాడు.

"మీరు ఈ సముద్రం మీద ఎన్ని సంవత్సరాలుగా పడవ నడుపుతున్నారు?" అంటూ మెల్లిగా కబుర్లలోకి దిగాడు జయసింహుడు.

"ఎన్నని చెప్పనూ? ఈ సముద్ర తరంగాల మీదనే నా తల మొత్తం పండి పోయింది. సముద్రాలలో నేను చూచినన్ని తిమింగలాలూ, రాక్షసిచేపలూ, నీటిగుర్రాలూ, గజ దొంగల పడవలూ ఇంక ఎవ్వరూ చూచి వుండరు. ఒక రత్నాకరమే కాదు, మహోదధి మొత్తమూ చుట్టబెట్టిన మొనగాడిని నేను," అంటూ తన గొప్పలన్నీ చెప్పుకొంటూ పోతున్నాడు సరంగు.



"మీరు ఇలా సముద్రప్రయాణం చేసే టప్పుడు క్రొత్త క్రొత్త ద్వీపాలు కూడా కన పడి వుండాలే!" అన్నాడు జయసింహుడు.

"అవునవును. కనపడ్డాయి. చిత్రవిచిత్ర మైన ద్వీపాలను చూచాను. ఆ ద్వీపాలలోని సంపద నా పడవలోనికి ఎక్కించుకొని వ్యాపా రాలు కూడా చేశాను." అన్నాడు సరంగు.

"అయ్యా, మీ మాటలను బట్టి చూస్తే మీరెవరో అనుభవజ్ఞులైన సరంగువలె కనపడు తున్నారు. మీరు ఇన్ని దశాబ్దాలుగా సముద్ర ప్రయాణం చేస్తున్నారు. కాబట్టి, మీ ప్రయా ణములో ఎప్పుడైనా ఒకప్పుడు శుక్లద్వీపం, కృష్ణద్వీపం, అరుణద్వీపం అనే వాటిని చూచే వుంటారు." అన్నాడు జయసింహుడు.

సరంగు క్షణం సేపు ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచించినట్లు ముఖం పెట్టి, "ఔనౌను. అవన్నీ చూచాను. శుక్లద్వీపం అంటే తెల్లని ద్వీపం. అందులో మంచు వుంటుంది. కృష్ణద్వీపం అంటే నల్లని ద్వీపం. అందులో నల్లకానుగు చెట్లు వుంటాయి. అరుణద్వీపం అంటే అందులో ఎర్ర కుంకుమ పూవు పండుతూ వుంటుంది. నేను ఒక సారి ఆ కుంకుమపూవును నా పడవ లోనికి కూడా ఎక్కించుకొన్నాను." అన్నాడు.

చూడలేదంటే, తన కెక్కడ అవమానమో నని యీ సరంగు అన్నీ చూచినట్లే చెపుతున్నా డని జయసింహుడు గ్రహించాడు.

"ఆ మూడు ద్వీపాల తరవాత ఏమి వస్తుందీ?" అని జయసింహుడు అడిగితే, "ఏముందీ, పచ్చద్వీపం వస్తుంది. ఆ తర వాత, ఇంద్రధనుస్సు ద్వీపం వస్తుంది. అందులో ఏడురంగుల పూవులు వుంటాయి," అని చెప్పాడు సరంగు.

జయసింహుడికి నవ్వు వచ్చింది. కాని, సరంగు ఎక్కడ చిన్నబుచ్చుకొంటాడోనని పైకి నవ్వలేదు. ఇక ఈ సరంగును ప్రశ్నించి లాభం లేదని జయసింహుడు ఊరుకొన్నాడు.


ఇలా పది రాత్రులూ, పది పవళ్ళు గడిచిపోయాయి. ఎటు చూచినా భయంకర మైన సముద్రమూ, సుదీర్ఘమైన ఆకాశమే తప్ప పిట్టపురుగు కనిపించలేదు. ఇలా

ఉండగా, ఒకనాటి మధ్యాహ్నం చూస్తూండగానే ఆకాశం మబ్బులు పట్టింది. చీకటి పడే వేళకు భయంకరమైన వర్షం ప్రారంభమైంది.

అది చూచిన సరంగు, "ఇదేదో పెద్ద తుఫాను వలె కనపడుతున్నది. మనం బయలుదేరిన వేళ అంత మంచిదిలాగా కనపటం లేదు. అన్నింటికీ భగవంతుడే ఉన్నాడు," అని పడవలోని వారితో అన్నాడు.

చూస్తూండగానే, సముద్రం కవ్వంతో చిలికిన మజ్జిగకుండ వలె మారిపోయింది. దేవదానవులు మథించిన క్షీరసాగరం వలె నురుగులతో తాటిచెట్టెత్తు ఉత్తుంగ తరంగాలతో ఆ సముద్రం ఘోషిస్తున్నది. చుక్కాని సరంగు స్వాధీనంలో నుండి తప్పిపోయింది. అతడు శంఖద్వీపం వైపు నడుపుతున్న పడవ తన ఇష్టం వచ్చిన దిక్కునకు పోసాగింది. ఇది చూచి, పడవలోని వారంతా గగ్గోలు పెట్టారు.

"ఓయీ, కరటకా! అనవసరంగా అవంతీ సుందరి అనీ, అమరావతీ రాజ్యం అనీ, నన్ను నట్టేట్లో కాదు, కాదు నడి సముద్రంలో ముంచావు. మొన్నటిదాకా బానిసలంగా పట్టుబడి దారుణ బాధలనుభవించాము. ఇప్పుడు ఈ తుఫానుకే బలి అయిపోతున్నాము. ఇదంతా నీ మూలాన్నే వచ్చింది," అంటూ కరటకశర్మని నోటికి వచ్చినట్లు తిట్టాడు గదాధరుడు.



పడవలోని ఇతర వ్యాపారస్థులతో పాటు నావికులు కూడా కంగారు పడటం మొదలు పెట్టారు.

తెల్లవారేసరికి పడవ సరంగు, "బాబూ, ఇక మనల్ని భగవంతుడే రక్షించాలి. పడవ ఏ దిక్కుకు పోతున్నదో ఏమైపోతున్నదో తెలియని పరిస్థితి ఏర్పడింది," అని చావు కబురు చల్లగా చెప్పాడు.

ఈ మాటలు విని, పడవలోని వారంతా ఏడ్పులు పెడబొబ్బలు పెట్టసాగారు. కొందరు భగవంతుణ్ణి ప్రార్థించ నారంభించారు. పడవ అలా దారి తెన్నూ లేకుండా దాని ఇష్టం వచ్చిన వైపుకు కొట్టుకొని పోతూన్నది.

ఇంత కల్లోలంలోనూ స్థిరచిత్తంతో

కూర్చున్న వాడు ఒక్క జయసింహుడు మాత్రమే అతడికి కూడా ప్రస్తుతం పరిస్థితులతో ఏం చెయ్యాలో తోచలేదు. బయట భయంకరమైన వర్షం పడుతున్నది. వానలో తడిస్తే, తన జ్యోతిష్మతీ మూలిక పని చేయదు. అందువల్ల, ప్రస్తుత పరిస్థితుల్లో ఏమీ చేయకుండా వాతావరణపు మార్పు కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు.


దారి తప్పిన పడవ ఎన్ని రాత్రులూ, ఎన్ని పవళ్ళూ ప్రయాణించిందో వారికే తెలియదు. ఆకాశమంతా తుఫాను ముసురుకొనటంతో ఎటు చూచినా వారికి ఒకే చీకటిగా కనిపిస్తున్నది. అలా ప్రయాణం చేస్తూ, బాగా అలిసిపోయి పడవలోని వారు ఒక కునుకు తీస్తున్నారు. మెలకువతో ఉన్నది జయసింహుడొక్కడే.


ఇంతలో, అతడికి ఏదో భయంకరమైన ధ్వని వినిపించింది. ధ్వని వినిపించటమేమిటి, పడవ ముక్కలు ముక్కలుగా పగిలిపోవటమేమిటి రెండూ ఒకేసారి జరిగాయి. సముద్ర మధ్యంలోని కొండకు గుద్దుకొని పడవ ఛిన్నాభిన్నమైంది. ఆ వేగానికి కొందరు కొండ మీదికి, కొందరు సముద్రం లోనికీ, విసరివేయబడ్డారు. జయసింహుడూ, కరటకశర్మా, గదాధరుడూ మరొక ఇద్దరు నావికులూ మాత్రం కొండపైన పడ్డారు.

వేగంగా పడవ కొండకు గుద్దుకొనటంతో జయసింహుడితో సహా అందరికీ స్పృహ తప్పిపోయింది. కొండపై వారు, రెండు దినాలు స్పృహ లేకనే పడి ఉన్నారు. అప్పటికి ఆ తుఫాను సద్దు అణిగింది.

సూర్యోదయమైంది. సూర్యుడి వేడి కిరణాలు శరీరానికి తగలటంతో ముందుగా జయసింహుడికి తెలివి వచ్చింది. కళ్ళు తెరిచి చుట్టూ కలియ చూచాడు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

8


[అనుకోకుండా జయసింహుడికి బానిసలుగా వున్న కరటకశర్మ, గదాధరులతో పరిచయమవుతుంది. వారిని ఆదుకొని, వారితో కలిసి ఓ పడవలో ప్రయాణిస్తూండగా, వారు కూడా రాజకుమారి అన్వేషణలోనే వున్నట్టు తెలుస్తుంది. ఇంతలో పడవ భయంకర తుఫాన్‌కు గురి అయి ముక్కలైపోతుంది. అందరూ స్పృహ పోగొట్టుకుంటారు. ఆపైన ముందుగా జయసింహుడికి తెలివి వస్తుంది. — తరవాత]

జయసింహుడికి మతి పోయింది. తానెక్కడ ఉన్నాడో తనకే తెలియలేదు. తన చంకకు జోలె పదిలంగానే చుట్టుకొని ఉంది. కాని అది పడవ ప్రమాదంలో బాగా తడిసి పోయింది. దానితో సంచీలోని రత్నాలు ఎక్కడో పడిపోయినాయి. అంతే కాదు, ఎంతో కష్టపడి సంపాదించుకొన్న జ్యోతిష్మతీ మూలికల భస్మం కూడా తడిసి పోయింది.

జయసింహుడు కాళ్ళూచేతులూ స్వాధీనం లోనికి తెచ్చుకొని మెల్లిగా, లేచి నిల్చుందామని ప్రయత్నించాడు. అయితే, కదలలేక పోయాడు. అంతే కాదు, తన కాళ్ళూ చేతులూ కూడా కట్టి వేయబడి ఉన్నట్లు గ్రహించాడు. ఏవో పొడవైన తీగెలతో తాను బంధింపబడి వున్నాడు. చుట్టూ చూచాడు. నేల మొత్తం చిత్తడిగా వుంది. కొద్దిపాటి గరుకుదేరిన రాళ్ళమీద తాను పడి వున్నాడు. కట్లను విప్పుకొనేందుకు కాళ్ళూ చేతులూ ఆడించాడు. కాని, సాధ్యపడలేదు. అవి సన్నటి ఊడలో లావుపాటి తీగెలో తెలియటం లేదు. కాని, వాటితో ఎవరో తనను గట్టిగా కట్టి వేశారు. తాను కట్టి వేయపడ్డందుకు తనకు బాధ కలగ లేదు. కాని, కష్టించి సంపాదించుకొన్న మూలికాభస్మం తడిసి పోయినందుకు చాలా విచారం కలిగింది.

కామరూప విద్యతో, అందులో నుండి తప్పించుకొందామని అనుకొన్నాడు జయసింహుడు. కోతిగానో, ఎలుకగానో మారి, ఈ

యం. ఉమాదేవి



కట్లను విడిపించుకొనవచ్చు. కాని, తనని బంధించినది ఎవరు? ఎవరో కట్టివేశారంటే, ఈ ద్వీపంలో నరసంచారం వున్నదన్న మాటే కదా? వారెవరో వచ్చే వరకూ కొంచెం సేపు ఎదురు చూస్తే మంచిది కదా?

జయసింహుడు కొద్దిగా తల పైకి ఎత్తి అటూ ఇటూ పరికించి చూచాడు. గుట్ట మీద కొంత దూరంలో గదాధరుడు, మరి కొంత దూరంలో కరటకశర్మ కనిపించారు. వారి పరిస్థితి కూడా ఇలాగే వుంది. అయితే, వారు స్పృహ తప్పి పడిపోయి వున్నారు. మరి కొంత దూరంలో ఇద్దరు నావికులు కనిపించారు. వారికి ప్రాణం వున్నదో లేదో తెలియదు.

జయసింహుడు ఇలా ఆలోచిస్తూ వుండేటప్పటికే కొంత ప్రొద్దెక్కింది. చల్లని నీరెండ శ్రమను మాత్రం కలిగించటం లేదు. ఇంతలో దూరంగా ఏదో అలికిడి వినిపించింది. జయసింహుడు శ్రద్ధగా గమనించాడు. సందేహం లేదు. ఎవరో గుంపులు గుంపులుగా యిటు వస్తున్నారు.

జయసింహుడు సగం కన్నులు మూసుకొని ఏమీ తెలియనట్లుండి వస్తున్నవారిని పరిశీలించసాగాడు. ఆ గుంపులు గుంపులుగా వస్తున్న వారు మనుష్యులా అంటే, మనుష్యులు కూడా కారు. జంతువులా అంటే, జంతువులు కూడా కారు. చూడటానికి కోతులకు కొంచెం సన్నిహితంగా వున్నట్లు కనిపించారు. కాని, వారి నడక మాత్రం మనుష్యులు నడిచినట్లే వుంది. గుంపులు గుంపులుగా వస్తున్న ఆ కోతిగుంపులు బంధింపబడిన తమ సమీపానికి వచ్చాయి.

జయసింహుడు అరమోడ్పు కన్నులతో వారేమి చేస్తారోనని గమనిస్తున్నాడు. వారు సాగరతీరంలో పడి వున్న మానవులను విచిత్రంగా చూస్తున్నారు. వారేదో మెల్లిగా అరుస్తున్నారు. అయితే, అది జంతువుల కేక కాదు. కాని, అట్లని మానవుల భాష కూడా కాదు.

కోతిగుంపు మానవులలో ఒకడు ముందుకు వచ్చి గుండె కొట్టుకొంటూ ఏదో అభినయిస్తూ, జయసింహుణ్ణి చూపి, అతడికి కట్టిన

కట్లను కూడా చూపి కీచుమంటూ ఏదో చెపుతున్నాడు. బహుశః, ఇతడూ ఇతడి మిత్రులూ కలిసి పడవప్రమాదంలో ఒడ్డు చేరిన తమను బంధించి వుంటారు. తరవాత, వారు ద్వీపం లోపలికి వెళ్ళి, తమ అనుచరులను బంధుమిత్రులను అందరనూ పిలుచుకొని వచ్చి వుంటారు. వీరంతా కలిసి వింతగా ఈ తుఫాను బాధితులను చూస్తూ వున్నారు.

జయసింహుడి ఊహ నిజమే అయింది. కోతిరూపులు వీరి దగ్గరకు వచ్చి మెల్లిగా అరుస్తూ చుట్టూ తిరుగుతూ పరిశీలిస్తున్నారు. ఒక కోతిరూపుడు జయసింహుడి చెవి పట్టుకొని అటూ ఇటూ ఊపి గిల్లి చూచాడు. మరి ఒకడు అతడి ముక్కును తాకాడు. వేరొకడు జయసింహుడి జుట్టు పట్టుకొని ఊపాడు.

ఇలా కొంతసేపు వారు జయసింహుడిని పరిశీలించి, అంతా కలిసి ఒక్కసారి పెద్దగా అరిచారు. ఆ తర్వాత, వారు కట్టతోనే వున్న జయసింహుడినీ, కరటకశర్మనూ, గదాధరుడినీ, ఇద్దరు నావికులనూ తమ భుజాలమీదికి ఎక్కించుకొన్నారు.

అలా మోసుకొంటూ వారిని ద్వీపం లోపల కొంత దూరం తీసుకొని పోయారు.

జయసింహుడు, 'ఏమి చేస్తే బాగుంటుందా?' అని ఆలోచిస్తున్నాడు. వీరు మృగాలు కారు. మనుష్యులు కారు. రెంటికీ మధ్య వున్న ఒక విచిత్రమైన జాతి. వీళ్ళు



నరభక్షకులా? ఇలా తమను మోసుకొని పోయి, మంటలలో కాల్చి తింటారా?

'సరే, చూద్దాం! అలాంటి పరిస్థితే వచ్చినప్పుడు, దానికి ఏం చేయాలో ఆలోచించవచ్చు,' అనుకొన్నాడు జయసింహుడు.

కోతిరూపులు వీరిని అలా మోసుకొంటూ దట్టమైన చెట్ల మధ్య నుండి ద్వీపములో ముందుకు సాగిపోయారు.

అలా కొంత దూరం పోయి కోతిరూపులు జయసింహుడినీ ఇతరులనూ క్రిందికి దింపారు. అక్కడ దట్టంగా పెరిగిన కొబ్బర చెట్లు వున్నాయి. కోతిరూపులు జయసింహుడినీ, ఇతరులనూ ఒక్కొక్కర్ని ఒక్కొక్క కొబ్బరి చెట్టుకు కట్టి వేశారు.



అప్పటికి గదాధరుడికీ కరటకశర్మకూ స్పృహ వచ్చింది. వారు తమ దురవస్థను చూచి బిగ్గరగా ఏడవసాగారు.

"ఓరి నాయనోయ్! మా పని పొగలో నుండి సెగలోనికి పోయినట్లయిందిరోయ్, తంత్రీ! బానిస వ్యాపారస్థుల నుండి తప్పించుకొని బ్రతికి బయట పడితే, ఇప్పుడెవరో నరభక్షకుల చేతిలో పడిపోయాముర్రో, నాయనో!" అని ఏడ్వసాగారు వారిద్దరూ.

"ఇదంతా నీ వలననే జరిగింది. హాయిగా తిని కూర్చునే నన్ను, అవంతీసుందరి అనీ అమరావతీ రాజ్యమనీ ఆశ పెట్టి ఇలా ప్రయాణం చేయించావు," అని గదాధరుడు కరటకశర్మను తిట్టి పోయసాగాడు.

కరటకశర్మ ఊరుకోకుండా, "నేను లోగడ చాలా సార్లు ప్రయాణం చేశాను. కాని, ఎన్నడూ ఇలాంటి విపత్తు సంభవించ లేదు. ఇది నా జాతకంలోని లోపం మాత్రం కాదు." అన్నాడు.

"అయితే, నాదే దరిద్రపు జాతకము అంటావా?" అని గదాధరుడు కరటకశర్మపై మండిపడ్డాడు.

ఇదంతా చూస్తున్న జయసింహుడికి చికాకు పుట్టింది. వీళ్ళ ఉత్తరకుమార ప్రగల్భాలు ఎలాంటివో తెలిసిపోయాయి.

"అయ్యా, పెద్ద మనుషులూ! మీరు కాస్త నోరు మూసుకొని వుండండి. తుఫానులో నుండి ప్రాణాలతో బ్రతికి బయట పడ్డాము. అందుకు సంతోషించండి. అనవసరంగా తిట్టుకోనకుండా కర్తవ్యము ఏమిటో ఆలోచించండి," అన్నాడు జయసింహుడు.

జయసింహుడి గొంతు వినేసరికి కరటకశర్మకు ప్రాణం లేచి వచ్చినట్లు అయి "నాయనా, జయసింహా! నీవు మానవమాత్రుడవు కావు. మాకు దైవ సమానుడవు. నీవే మమ్ము బానిసవ్యాపారుల నుండి రక్షించావు. నీవే తిరిగి మమ్మల్ని ఈ భయంకర ద్వీపం నుండి తప్పించాలి. అలా చేస్తే నీ మేలు మరచిపోలేము. నాకు పుట్టబోయే కొడుకుకు నీ పేరే పెట్టుకుంటాను," అన్నాడు ఏడుస్తూ కరటకశర్మ.

జయసింహుడికి కోపమూ, నవ్వూ రెండూ ఒకేసారి కలిగి, 'ఇంతటి అధైర్యవంతులా మయూరాక్షి అన్వేషణ కోసం బయలు దేరారు?' అని అనుకొన్నాడు.

ఈ లోపల కరటకశర్మ, "నావికులూ, ఓయ్ నావికులూ," అని గట్టిగా అరిచాడు.


నావికుల వద్ద నుండి బదులు రాలేదు. దానితో వారు చనిపోయారని నిర్ధారించుకొని కరటకశర్మ బిగ్గరగా ఏడ్వాడు.

జయసింహుడు అతడిని మందలించి, "ఇది దుఃఖించటానికి సమయం కాదు. ధైర్యం వహించి, జరుగవలసింది ఆలోచిద్దాం," అన్నాడు.

జయసింహుడికి బాగా ఆకలి వేస్తున్నది. అయినా, నిగ్రహించుకొన్నాడు. కరటకశర్మ మాత్రం ఆకలికి తట్టుకోలేక లబలబలాడి పోతున్నాడు. తానీ కట్లు విప్పుకొని ఏవైనా పండ్లు కోసుకొని తిని వారికి కూడా పెట్టవచ్చు. కాని, అలా చేస్తే తనకు కామరూప విద్య వచ్చుననే విషయం వీరికి తెలిసి పోతుంది. అందుకని రాత్రి వారు నిద్రపోయే సమయములో కట్లు విప్పుకొని బయట పడి ఏదైనా ఉపాయం ఆలోచించ వచ్చునని జయసింహుడు ఊహించాడు.


ఇంతలో దూరాన వీధిలో కలకలం వినిపించింది.

గుంపులు గుంపులుగా మళ్ళీ కోతిరూపులు



వస్తున్నారు. వారి చేతులలో కొబ్బరికాయలు, పనసకాయలు, అరటిగెలలు వున్నాయి. వారు బంధితుల దగ్గరకు వచ్చి సన్నగా అరుస్తూ చుట్టూ తిరుగుతూ గెంతసాగారు.

కోతిరూపులు తమ చేతులలోని కొబ్బరి కాయలను చేతులతోనే పగలగొట్టారు. లోపలి నీళ్ళనూ మెత్తని లేత గుజ్జును బంధితుల నోళ్ళకు అందించారు. కొందరు కోతిరూపులు పండిన పనసకాయలను తమ తలల కేసి కొట్టు కొన్నారు. పనసపండు లోపలి తొనలు బయటకు వచ్చాయి. వాటిని బంధితుల నోటికి అందించారు. పెట్టిందే తడవుగా కరటకశర్మ, గదాధరుడూ గబగబ భొక్కారు. జయసింహుడు మాత్రం తినలేదు. తాను



శుచిగా లేకపోవటం అందుకు మొదటి కారణము. పైగా, ఈ వింత జంతువులు పెట్టే ఆహారం శుద్ధమైనదో కాదో తెలియదు. వీళ్ళు ఏ మత్తు పదార్థములో కలిపిన పండ్లు తమకు అందిస్తే, దాని వలన క్రొత్త ప్రమాదం రావచ్చును కదా! కొన్ని కొన్ని ద్వీపాలలో రాక్షసులూ, నరభక్షకులూ ఇలాగే చేస్తూంటారట. మనుషులను బలి పశువుల వలె కట్టి వేసి, వారిని బాగా బలిసేట్టు మేపి, తరవాత ఏ కొండదేవతకో బలి ఇస్తారట. ఈ కోతిరూపులు కూడా అలాంటి వారేనా? జయసింహుడి కేమీ తోచలేదు.

కోతి రూపులు జయసింహుడిని కొంత సేపు బ్రతిమలాడి తినకపోయే సరికల్లా పనస తొనలు అరటి గెలలు అతడి ముందే వదలి వేసి, తమలో తామేదో గొణుక్కుంటూ మళ్ళీ కొబ్బరి చెట్ల మధ్యకు వెళ్ళి పోయారు.

పండ్ల రసం కడుపులో పడేసరికి కరటకశర్మకూ, గదాధరుడికీ మళ్ళీ ఓపిక వచ్చింది.

"నాయనా, జయసింహా! ఈ వింత జంతువుల నుండి తప్పించుకొని, ఈ ద్వీపం నుండి మనం బయట పడే మార్గం ఆలోచించు," అన్నాడు కరటకశర్మ.

"తొందర పడకండి. పరిస్థితి రేపటి లాగా చక్కబడుతుంది," అని ధైర్యం చెప్పాడు జయసింహుడు.

అయితే, పరిస్థితి చక్కబడే మాట అటుంచి, క్రమంగా విషమించ సాగింది. చూస్తూండగానే గదాధరుడు, కరటకశర్మ స్పృహ కోల్పోయారు. వారిద్దరూ అలాగే తమను కట్టి వేసిన చెట్ల బోదెల మీద వాలి పోయారు.


జయసింహుడది గమనించాడు. వారు సజీవంగా ఉన్నారో నిర్జీవంగా ఉన్నారో తెలియదు. తాను కట్లు విప్పుకొని బయట పడి వారిని పరీక్ష చేయాలి. అయితే, ఈ కోతి రూపులు ఎక్కడైనా నక్కి తానేమి చేస్తున్నాడో గమనిస్తూ వుండవచ్చు. అందువల్ల, వారు చూడని సమయంలోనే తాను మెల్లగా తప్పించుకొనాలి.

అలా తప్పించుకొన్నాక, ఏం చెయ్యాలో

కూడా జయసింహుడు ముందుగానే ఊహించు కొన్నాడు. అయితే, ముందు జాగ్రత్త కోసం తాను కూడా కళ్ళు మూసుకొని స్పృహ తప్పి నట్లే నటిస్తూ వుండి పోయాడు. అప్పుడతడి మనోనేత్రం ముందు ఒక వేణువు కనపడింది! తన గురుదేవుడు తనకు ఏదో సంకేతం అందిస్తున్నాడని జయసింహుడు భావించాడు.

క్రమంగా చీకటి పడింది. జయసింహుడు తన కామరూపవిద్యను ప్రయోగించి, బంధనాల నుండి బయట పడ్డాడు. జయసింహుడు ఒక చిలకగా మారి కట్లనుండి జారుకొన్నాడు. ఆ తరవాత కొద్దిసేపు అటూ ఇటూ ఎగిరాడు. ద్వీపమంతా జయసింహుడికి విచిత్రంగా కనపడింది. ఎత్తయిన కొండలొకవైపు ఆకాశాన్ని తాకుతున్నాయా అనిపించేటట్లు వున్న కొబ్బరి చెట్ల గుంపు ఇంకొక వైపు ద్వీపాన్ని ఆవరించుకొని వున్నాయి.

జయసింహుడు ఒక వెదురుపొద దగ్గర వాలాడు. చుట్టూ చూచాడు. అక్కడ ఎవరూ లేరని నిర్ధారించుకొని, తన పక్షిరూపాన్ని వదలి జయసింహుడిగా మారాడు. అక్కడ వెదురు పొదలో నుండి ఒక వెదురుకొమ్మను విరిచాడు. దానికి చిల్లులు పొడిచి వేణువుగా తయారు చేశాడు జయసింహుడు. ఆ తరవాత నడుచుకొంటూ ద్వీపంలో అటూ ఇటూ తిరిగాడు.



ద్వీపమంతా వాసయోగ్యంగా కనిపించలేదు. కొంత భాగం ఎగుడు దిగుడు రాళ్ళతోనూ, మరి కొంత భాగం చిత్తడి నేలతోనూ నిండి వుంది. దూరము నుండి వినిపిస్తున్న బుసలను బట్టి, పాములు కొండచిలువలు కూడా ఈ ద్వీపంలో వుండి వుంటాయని జయసింహుడు ఊహించాడు. తాను బయలుదేరిన ప్రయోజనం వేరు, చేరుకొన్న ప్రదేశం వేరు. ఇలా దిక్కూ మొక్కూ లేని ఆ ద్వీపములో చిక్కుపడిపోతామని జయసింహుడు అనుకొనలేదు. తనకు వున్న శక్తులతో ఏదో రకంగా బ్రతికి బయట పడగలడు. కాని, గదాధర, కరటకశర్మలను తప్పించటమెలా?

ఇంతకూ వారు సజీవులో, నిర్జీవులో కూడా తాను పరీక్షించనే లేదు. వారు ఇలా గుర్తుకు

వచ్చేసరికి, ఒక్క క్షణం కూడా అక్కడ నిల బడకుండా, తనను బంధించిన చెట్ల దిక్కుకు ప్రయాణం చేశాడు జయసింహుడు. పక్షిగా తాను ఎగిరిన దూరాన్ని భూమిపై నడవటానికి చాలా సేపు పట్టింది.

మొత్తానికి ఒక రాత్రివేళకు జయసింహుడు తాము బంధింపబడ్డ ప్రదేశానికి చేరుకొన్నాడు. పరుగు పరుగున వెళ్ళి కరటకశర్మనూ, గదాధరుడినీ పరీక్షించి చూచాడు. వారి గుండె బలహీనంగా కొట్టుకొంటూనే వున్నది. వారు సజీవంగానే ఉన్నారనీ, వారు తిన్న పండ్లలో ఏదో మత్తుపదార్థం వుండి వారు స్పృహ కోల్పోయారనీ ఊహించాడు జయసింహుడు.

ఇప్పుడు అతడికి రెండు మూడు ఊహలు వచ్చాయి. ఒకటి వీరిద్దరినీ కట్లు విప్పి వదిలించి, తన వెంట తీసుకొని పోవటం. వీరు తిన్న మత్తుపదార్థం ఏమిటో తెలియకుండానే దీనికి విరుగుడు ఈ క్రొత్త ద్వీపంలో యెలా సంపాదించటం? అది లేకుండా వీరిని ఇలా మోసుకొని, తాను ఎక్కడికి తీసుకొని పోవాలి? ప్రస్తుతానికి ఏ కొండగుహ చాటునో నక్కినా, తరవాత చేయవలసినది ఏమిటి? కోతిరూపంతో తలపడి వారిని నిర్మూలించటమా? వారి ద్వీపంలో వారికి వున్న బలం ఏమిటో తనకు తెలియదు. అలాంటప్పుడు, ఈ దశలో వారితో యుద్ధం పెట్టుకొని సాధించగలిగేది ఏమిటి?

కరటకశర్మా, గదాధరుడూ సజీవులేనన్న విషయం తెలిసేసరికి జయసింహుడికి మనసు కొంచెం నెమ్మది చిక్కింది. తాము కట్టివేయబడి వున్న ప్రదేశానికి కొంత దూరంలో కొండ చరియ నుండి ఒక సెలయేగు ప్రవహిస్తుంది. ముందుగా జయసింహుడు అక్కడకు వెళ్ళి స్నానం చేశాడు. ఆ ఏటినీరు విషపూరితం కాదని తెల్సుకొని కడుపు నిండా తాగాడు. ఆ తరవాత, కొంతసేపు గురుదేవుణ్ణి స్మరించి ధ్యానం చేయ సాగాడు —(ఇంకా ఉంది)





మాయాదర్పణం

9

[ఆ ద్వీపవాసులైన కోతిరూపులు తమను బంధించారని గ్రహిస్తాడు జయసింహుడు. వారు ఇచ్చిన ఫలాదులను తిని కరటక గదాధరులు స్పృహ తప్పిపోవటం జరుగుతుంది. ఆ తరవాత జయసింహుడు చిలుకరూపులో ఆ ద్వీపమంతా తిరుగుతాడు. వెదురుకొమ్మతో ఓ వేణువును చేసి, ఆ పైన ఓ సెల యేటిలో స్నానం చేసి, కర్తవ్యాలోచనకు దిగుతాడు.
—తరవాత]


గురుదేవుడిని అలా ధ్యానిస్తూ ఉండేసరికి, మనోనేత్రం ముందు సంగీతవృక్ష రూపంలో నడిచిన గంధర్వుడు కన్పించి ఆశీర్వదించాడు. గురువుని స్మరిస్తే గంధర్వుడు కనిపించాడు. ఎందుకని? తన ఊహకూ, ఈ గంధర్వ దర్శనానికీ దగ్గర సంబంధం వుందా?

మొత్తం మీద ఈ కోతిరూపులను సామోపాయం చేతనే జయించాలని నిశ్చయించుకొన్నాడు జయసింహుడు. తెల్లవారు జాము వేళకు చెట్టు వద్దకు చేరి, తాళ్ళను తన చుట్టూ చుట్టుకొని ఏమీ తెలియనట్లు నిద్ర మత్తు నటించ సాగాడు.

తెల్లవారింది. దూరంగా ఏవో చప్పుళ్ళు వినపడ్డాయి. కొండలపై నుండి రాళ్ళు దొర్లుతున్న శబ్దమూ, నారికేళ వృక్షాల నుండి కొబ్బరికాయలు రాలి పడుతున్న శబ్దాలూ వినవచ్చాయి. కోతిరూపులు దండుగా బయలుదేరి వస్తున్నారని జయసింహుడు ఊహించాడు. తన వద్ద దాచిపెట్టిన వేణువు తీసి ఊద సాగాడు. గంధర్వుడు ప్రసాదించిన వరాన్నిలా ఉపయోగించుకొన్నాడన్న మాట!

జయసింహుడి ఎత్తు ఫలించింది. ఊహ నిజమైంది. కోతిరూపులు జయసింహుడి గాన మాధుర్యానికి లోబడి పోయారు. గుంపులు గుంపులుగా వస్తున్న కోతిరూపులు ఈ సంగీతము విని, నాట్యం చేయసాగారు. వారంతా జయసింహుడిని చుట్టుముట్టి గెంతుతూ వున్నారు. జయసింహుడు వేణువును కొంచెం

యం. ఉమాదేవి



సేపు ఆపేసరికి, వారు మళ్ళీ వాయించవలసినదిగా అతడిని ఒత్తిడి పెట్టసాగారు. వీరికి సంగీతమంటే ఇష్టమనే సంగతి తెల్సుకొని అతడు ఆశ్చర్య పోయాడు.

'అందుకే కాబోలు నా కళ్ళ ముందు వేణువు కనిపించింది!' అనుకొంటూ జయసింహుడు, మనస్సులోనే తన గురుదేవుడికి కృతజ్ఞతలు చెప్పుకొని, మధురంగా మళ్ళీ వేణువును ఊదసాగాడు.

కోతిరూపులు పరవశంతో సామూహిక నృత్యం చేయ సాగారు.

అలా వారు చాలాసేపు ఆనందించాక, వారంతా గుంపుగా జయసింహుడి వద్దకు వచ్చారు. అతడికి మళ్ళీ కొన్ని పండ్లూ, కొబ్బరి చిప్పలూ ఆహారంగా పెట్టబోయారు. అయితే, ఈ సారి జయసింహుడు వారు చూస్తుండగానే వాటిని తిరస్కరించాడు.

అది చూచి, కోతిరూపులు తమలో తాము ఏదో మాట్లాడుకొన్నట్లు వినపడింది. ఈ లోపల మరి కొంతమంది కోతిరూపులు వెళ్ళి కరటకశర్మకూ, గధాధరుడికీ పనస తొనలూ, అరటి గెలలూ, కొబ్బరి చిప్పలూ తినిపించ పోయారు. అప్పుడే తెలివిలోకి వచ్చిన గధాధరుడూ, కరటకశర్మా అదేం ఇదేమని ఆలోచించకుండా, కోతిరూపులు పండ్లను నోటికి అందించటమేమిటి, వారు గబగబ నమిలి మ్రింగటం ఏమిటి ఒకే సారి జరిగాయి.

జయసింహుడు వారిని ఆ పండ్లు తినవద్దని వారిద్దామని అనుకొన్నాడు. కాని, అవి ప్రాణాన్ని తీసేవి కావనీ, కేవలం మత్తును మాత్రమే కలిగిస్తాయనీ తెలుసుకొన్నాక, సరే లెమ్మని ఊరుకొన్నాడు.

కోతిరూపులు జయసింహుడికి కట్టిన తాళ్ళను విప్పి, చెట్టు నుండి ఇవతలికి తీసుకొని వచ్చారు. కొందరు కోతిరూపులు జయసింహుడు ఎటూ పారిపోకుండా అతడి రెండు కాళ్ళను కలిపి కట్టారు. ఆ తరవాత, అతణ్ణి గుంపుగా వారు తమ భుజాలమీదికి ఎక్కించుకొన్నారు. జయసింహుడు ఏమీ మాట్లాడకుండా ఈ విచిత్రం చూస్తున్నాడు.


వీరు తనను ఎక్కడికి తీసుకొని వెళుతు

న్నారు? తనకేమైనా ప్రాణాపాయం తల పెట్టాలని ప్రయత్నిస్తున్నారా? అయినా, ఏం జరుగుతుందో చూద్దాం లెమ్మని జయసింహుడు వారి భుజాల మీద పడుకొని వున్నాడు.

కోతిరూపులు అలా జయసింహుణ్ణి భుజాల మీదకి ఎక్కించుకొని ఊరేగుతూ ఎక్కడికో పోసాగారు. జయసింహుడు పుచ్చపువ్వులాగా కన్నులు విప్పుకొని తనను తీసుకొని పోతున్న మార్గాన్ని శ్రద్ధగా పరిశీలించ సాగాడు.


వారు వెళుతున్న త్రోవ అంత సుగమంగా లేదు. ఎగుడు దిగుడుగా, ఎత్తు పల్లాలతో రాళ్ళూ రప్పలతో చాలా కఠినంగా వుంది. అయినా, కోతిరూపులు ఛంగు ఛంగున గెంతుకొంటూ ముందుకు సాగిపోతున్నారు. దారిలో ముళ్ళపొదలూ, జారుబండలూ కూడా వచ్చాయి. బుసలు కొడుతున్న సర్పాలు కోతిరూపుల హడావిడి చూచి బండలచాటుకు పారిపోయాయి. కోతిరూపులు గెంతుతూ, కేరింతలు పెడుతూ జయసింహుడితో అలా కొండ పైకి ఎక్కసాగారు. వారి పట్టుదల చూచి, అతడికి ఆశ్చర్యం కలిగింది.

ఈ కొండచివరకు తీసుకొని పోయి వారు తనను ఏమి చేయబోతున్నారు? వీళ్ళు నరమాంసభక్షకులా? లేక కొండచివరిదాకా తీసుకొని పోయి, అక్కడి నుంచి దొర్లిస్తారా? కొన్ని అడవిజాతులలో ఇలాంటి నరబలి సహజమే. వీరు అలాంటివారా? అలా అయితే, ముగ్గురినీ



తీసుకొని రాక, కేవలం తనను ఒక్కడినే ఎందుకు తీసుకొని వచ్చినట్లు?

ఈ చిక్కు ప్రశ్నలకు జయసింహుడు సమాధానం ఆలోచించే లోపలే, కోతిరూపులు మరి కొంత ముందుకు సాగిపోయారు. అలా పోయి పోయి, వారు దాదాపు పర్వతాగ్రానికి చేరుకొన్నారు. అక్కడ సెలయేళ్ళతో, దట్టమైన చెట్లతో కూడిన ఆ ప్రదేశం చాలా అందంగానూ, భయంకరంగానూ ఉన్నది. అక్కడ ఒక గుహాముఖానికి సమీపంగా వెళ్ళి కోతిరూపులు జయసింహుడిని క్రిందికి దించారు. ఆ తరవాత, అంతా గుహ ముందు నిలబడి, కిచకిచలాడుతూ లోపలి నుండి ఎవరినో పిలువ సాగారు.



ఇంతలో గుహలో నుండి ఏదో శబ్దం వినిపించింది. కోతిరూపులు అందరూ తమ మోకాళ్ళ మీద వంగి గుహకు నమస్కారం పెడుతూ కూర్చున్నారు. అప్పుడు గుహలో నుండి ఒక వ్యక్తి బయటకు వచ్చాడు. సుదీర్ఘమైన జడలూ, పొడవైనా గెడ్డమూ కల ఆ వ్యక్తిని చూడగానే కోతిరూపులంతా కిచకిచలాడుతూ ఏదో చెప్పబోయారు. అతడిని చూడగానే, ఎవరో ఋషి అని భావించాడు జయసింహుడు. అతడు పొడవైన చేతికర్ర సహాయంతో అడుగులు వేస్తూ ముందుకు వచ్చి జయసింహుణ్ణి చూచాడు.

ఆ తర్వాత చేతికర్ర పైకెత్తి కోతిరూపులందరినీ అక్కడి నుండి వెళ్ళిపోవలసిందిగా ఋషి సైగ చేశాడు. కోతిరూపులంతా పోయిన తర్వాత గుహలో నుండి వచ్చిన ఋషి జయసింహుడి వద్దకు వచ్చి ఏదో భాషలో ప్రశ్నించాడు. జయసింహుడికి ఆ భాష అర్థం కాలేదు. అప్పుడు ఋషి జయసింహుణ్ణి మరేదో భాషలో ప్రశ్నించాడు. ఆ భాష కూడా అర్థం కాలేదు. అప్పుడు జయసింహుడే చొరవ చేసుకొని సంస్కృత భాషలో ఇలా అన్నాడు.

"అయ్యా, మాది భరతఖండం. మేరువునకు దక్షిణంగా వున్న శ్రీశైలానికి ఈశాన్య ప్రదేశంలోని కృష్ణా నదీతీరం. నా పేరు జయసింహుడు. నేను ఒక రాజకుమారుణ్ణి సముద్రయానం చేస్తూ పడవ ప్రమాదంలో ఈ ద్వీపంలోకి చేరాను. నాకు సంస్కృతమూ, దేశభాషలూ వచ్చు. మీరు మాట్లాడిన భాషలు నాకు అర్థం కాలేదు. తమరెవరు? మానవులా? దేవతలా? మహర్షులా? సెలవీయండి. నన్ను ఈ కోతిరూపుల బారి నుండి విముక్తుణ్ణి చేయండి."

ఋషి కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఊరుకొని, ఆ తర్వాత మెల్లగా పెదవులు విప్పి, "నాయనా, జయసింహా! నీ మాటలు నేను నిజమనే నమ్ముతున్నాను. నీ చంకన వున్న జోలెలో ఏమయినా మారణాయుధాలు ఉన్నాయా?" అని సంస్కృత భాషలోనే అడిగాడు.

"స్వామీ, మీకు సంస్కృతం రావటం నా అదృష్టం. ఈ సంచిలో ఎలాంటి మారణాయుధాలూ లేవు. సముద్రజలాలకు తడిసిపోయిన వస్తువులూ, ఒక చిత్రపటం మాత్రమే ఉన్నాయి. కావాలంటే పరీక్షించి చూసుకొనవచ్చు," అన్నాడు జయసింహుడు.

"పర్వాలేదులే నాయనా! నీ మాటలు నమ్ముతాను. ముఖాన్ని చూచే ఎవరెవరు ఎలాంటి వారో తెల్సుకోగలను, నీ ముఖాన్ని బట్టి చూస్తే, నువ్వు మంచి వాడిలాగానే కనపడుతున్నావు. అంతే కాదు, సామాన్య మానవులకు లేని సిద్ధులేవో నీకు సంప్రాప్తించినట్లు కూడా నేను ఊహిస్తున్నాను. నీ గురువెవరో మహాతేజస్వి అయి వుండాలి. అంతే కాదు, నీవు వ్యాపారార్థం కాక, ఏదో గురుకార్యంపై ప్రయాణం కట్టినట్టూ అనిపిస్తున్నది," అంటూ వున్న ఋషి మాటలు విని, జయసింహుడు ఎంతో ఆశ్చర్యపడి పోయాడు.

గురుకార్యం అంటే సంస్కృత భాషలో రెండు అర్థాలు వున్నాయి. గురువు చెప్పి పంపిన పని అని ఒక అర్థం, చాలా భారమైన పని అని రెండవ అర్థం.

"మహర్షీ, మీరు చెప్పింది అక్షరాలా నిజమే! నేను గురుకార్యం మీదనే బయలుదేరాను. ఇంతకూ తమరెవరు? ఈ ద్వీపం పేరేమిటి?" అని అడిగాడు జయసింహుడు.

ఋషి దగ్గరగా వచ్చి ముందుగా జయసింహుడి కట్లు విప్పాడు. ఆ తరవాత అతడికి మధురమైన కొన్ని పండ్లు పెట్ట బోయాడు.



"వద్దు స్వామీ! మీ ద్వీపంలోని పండ్లు తింటే, మనుష్యులు స్పృహ తప్పిపోతున్నారు," అన్నాడు జయసింహుడు.

"పిచ్చివాడా, నేను నీకు అలాంటి పండ్లు పెడతానా? ఏమీ భయం లేదు. తిను," అన్నాడు ఋషి.

జయసింహుడు తిందామా వద్దా అని సంకోచిస్తున్నాడు. ఈ ఋషి ఎవరో తెలియదు. ఇతడు మనుష్యుడో రాక్షసుడో కూడా తెలియదు. అలాంటప్పుడు తొందరపడి తినటం చాపల్యం అనిపించుకొంటుంది కదా!

జయసింహుడు ఇలా ఆలోచిస్తూండగానే



ఋషి నవ్వి, "పోనీ అలాగే, తిన వద్దులే! నా మీద పూర్తి నమ్మకం కలిగిన తరవాతనే తిను. అయినా పెట్టిన వెంటనే వెనుకా ముందూ ఆలోచించకుండా తినటానికి నీవు నీ స్నేహితులవంటివాడవు కావు కదా!" అన్నాడు.

'కరటకశర్మ, గదాధరుల గురించి కూడా ఈయనకు తెలిసిందన్న మాట!' అని అనుకొని జయసింహుడు ఏమీ మాట్లాడ లేదు.

అప్పుడు ఆ ఋషి ఇలా చెప్పాడు.

"నా పేరు పర్వతకుడు. నేను చాలా సంవత్సరాల నుంచి ఈ ద్వీపంలో వుంటున్నాను. పెద్దవాడిని కావటంతో ఎన్ని వందల ఏళ్ళ నుంచి ఉంటున్నానో నాకే గుర్తు లేదు. ఇక్కడ ఉన్న కోతిరూపులు అంతా ఒకప్పుడు మనుష్యులే. కాలక్రమేణ వీరికి జంతు లక్షణాలు వచ్చాయి. అలా రావటానికి ఒక కథ వుంది. నీకు ఆ కథను చెప్తాను. వింటావా?" అన్నాడు.

"అలాగే స్వామీ, ఈ ద్వీపం పేరేమిటి?" అని అడిగాడు జయసింహుడు.

"దీనిని నారికేళ ద్వీపమంటారు బాబూ!" అన్నాడు ఋషి.

జయసింహుడికి కలిగిన ఆశ్చర్యానికి అంతు లేదు. శుక్లద్వీపం, అరుణద్వీపం మొదలైనవి దాటిన తరవాత కాని, ఈ ద్వీపం రాదని విని వున్నాడు. అంటే, ఈ పడవ ప్రయాణంలో తాను ఈ ద్వీపాలన్నీ దాటి వచ్చాడా? నిజానికి తాను అన్వేషిస్తూ వచ్చినది ఈ నారికేళద్వీపాన్నే!

'సృష్టిలీలలు ఎంత విచిత్రంగా వుంటాయి!' అని అనుకొన్నాడు జయసింహుడు.

అంతలో ఋషి, "నాయనా, జయసింహా! నీవు ఎప్పుడైనా మయూరాక్షి అనే పేరు విన్నావా?" అని అడిగాడు.

జయసింహుడు దిగ్భ్రాంతుడు అయ్యాడు. వెతక పోయిన తీగె కాలికి తగిలినట్లు అయింది. ఈ పర్వతకుడు మయూరాక్షిని గురించి తనను అడుగుతున్నాడంటే, బహుశః ఇతడికి దానిని గూర్చి పరిపూర్ణంగా తెలిసి వుండాలన్న మాట!

"మహర్షి, నేను మయూరాక్షి పేరును మా

గురువులవారి ద్వారా లోగడ విని వున్నాను. అయితే, అవేమిటో ఎక్కడ వుందో మాత్రం కని విని ఎరుగను. తమరు దయతో చెప్తే సంతోషిస్తాను." అన్నాడు జయసింహుడు.


పర్వతకుడు ఒక సారి పెద్దగా నిట్టూర్చి ఇలా అన్నాడు.

"ఓయీ, జయసింహా! సముద్రం మీద గంధర్వులూ, విద్యాధరులూ మయూరాక్షి అన్వేషణలో రావటం నేను ఎరుగుదును. వచ్చిన వాడెవడూ సజీవుడై వెనుకకు తిరిగి పోవటం ఇంత వరకూ చరిత్రలో జరగలేదు. నీవు పడవప్రమాదంలో ఈ ద్వీపానికి చేరినట్లు చెప్పినప్పటికీ, మయూరాక్షి అన్వేషణలోనే వచ్చావేమోననే అనుమానము నాకు లేక పోలేదు. సరే! అదలా వుంచు.

"ఈ ద్వీపంలో పూర్వం కొంత మంది సిద్ధులు వుండే వాళ్ళు. వారు కఠోరమైన తపస్సు చేస్తూ వుండే వారు. ఒక నాడు ఇప్పుడు మనం కూర్చున్న ఈ గట్టు మీదికి ఒక విద్యాధరుడు వచ్చి వ్రాలాడు. అతడి ద్వారా సిద్ధులు మయూరాక్షి గూర్చి చాలా విన్నారు.

"సర్వశక్తులనూ ప్రసాదించే మయూరాక్షి ఎక్కడో ఉందనీ, దాని రహస్యం తెలియాలంటే నారికేళద్వీపంలోనే లభ్యమౌతుందనీ ఆ విద్యాధరుడు విన్నాడట.

"ఇంకేం, ఈ ద్వీపంలోని సిద్ధులకు



అత్యాశ పుట్టుకొచ్చింది. మయూరాక్షి ఉండే ద్వీపాన్ని చేరే మార్గానికి సంబంధించిన రహస్యాలను, విద్యాధరుడూ సిద్ధులూ కలిసి ఈ ద్వీపం అంతా తిరిగి అన్వేషించటం మొదలు పెట్టారు.

"అలా వెతకగా వారి కొక తామ్రశాసనం లభించింది. దానిని వారు చదవటానికి ప్రయత్నించారు. అయితే, దాని మీది సాంకేతిక లిపి వారికి అర్థం కాలేదు. దాని మీది బొమ్మలను బట్టి, వారు మయూరాక్షి ఉండే స్థలం ఈ దిశగా వుంటుందని ఏదో ఊహించుకొన్నారు.

"అదే, నాయనా! వారు చేసిన మహాపరాధం. వారు ఆ అన్వేషణలో తప్పు మార్గాన్ని

తొక్కారు. ఫలితంగా విద్యాధరుడు ప్రాణాలను పోగొట్టుకున్నారు. సిద్ధులకు అందమైన తమ రూపాలు పోయి కోతిరూపాలు వచ్చాయి. అంతే కాదు. వారి నోళ్ళు కూడా పడిపోయాయి. అయితే, ప్రాణాలతో మాత్రం బయటపడ్డారు. దుఃఖంతో మళ్ళీ ఈ దీవికి చేరుకొన్నారు. కొందరికి మతిపోయింది. కొందరు పశుప్రాయులైనారు.

"ఇలా మళ్ళీ రెండు తరాలు గడిచాయి. వారి సంతతి వారే ఈ కోతిరూపులు. నేను సర్వస్మృతి మూలికను తిన్నవాణ్ణి. కాబట్టి, ఆ మూలిక ప్రభావం వల్ల ఇంతకాలం బ్రతికి ఉన్నాను. నాకు చావు రాదు. అట్లని నేను ఈ విచారాన్ని దిగమింగుకొని వుండలేను.


"ఈ ద్వీపంలోని వారికందరికీ నేనే గురువును. నా కళ్ళ ఎదుట ఒక తరం తర్వాత మరొక తరం వస్తున్నది. కాని, వీరి కష్టాలకు విమోచన లేకుండా పోయింది. వీరికి అతిథి మర్యాదలు తెలుసు. క్రొత్తగా వచ్చిన వారిని పాలూ పండ్లూ పనసతొనలూ ఇచ్చి సత్కరిస్తారు. అయితే, వీరికి వివేకం లేకపోవటంతో ఒక్కొక్కప్పుడు తమకు తెలియకుండానే మత్తు కలిగించే కొన్ని పండ్లను కూడా అతిథులకు పెడుతూంటారు. బహుశః నీ మిత్రులిద్దరూ అలాంటి మత్తులోనే పడి వుంటారు.

"అంతే కాదు, మా ద్వీపవాసులకు సంగీతమంటే మహా ఇష్టం. అది వారికి జన్మసంస్కారంగా సంక్రమించింది. నీవు వేణువు వూదావు, చూడు. అది విని, వారు పరవశించిపోయారు. నీవు ఎవరివో దేవదూతవని వారు అనుకొన్నారు. అందుకే నా వద్దకు నిన్ను ఇలా తీసుకొని వచ్చారు."

పర్వతకుడు చెప్పినదంతా జయసింహుడు విని ఎంతో ఆశ్చర్యపడి, "స్వామి, మీకీ విషయాలన్నీ ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

— (ఇంకా ఉంది)





మాయాదర్పణం

10

[వేణునాదము వినగానే, కోతి రూపులు పరవశించటం జయసింహుడికి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ సంతోషంలో వారు అతన్ని తమ భుజాల మీదికి ఎక్కించుకొని ప్రయాణించి, ఒక కొండ గుహ ముందు నిలబెడతారు. లోపలి నుంచి ఓ వృద్ధ ఋషి వచ్చి, అతడి పూర్వోత్తరాలు తెలుసుకొని, కోతి రూపులు ఒకప్పుడు మనుషులేనని చెప్పి, వారికి ఆ రూపు రావటానికి గల కారణాలు వివరిస్తాడు. —తరవాత]

పర్వతకుడు నవ్వుతూ జయసింహుడిని చూచి, "మా పిల్లలే చెప్పారు, నాయనా! వీరు నాకు బిడ్డలతో సమానం. వీళ్ళకు మాట రాక పోయినా సకిలింతల ద్వారా, కొన్ని అభినయాల ద్వారా తమ భావాలను వ్యక్తం చేయకలుగుతారు. అది నేను తెలుసుకోగలను," అన్నాడు.

"క్షమించండి, స్వామీ! నేను వీరిని అపార్థము చేసుకొన్నాను. వీరు ఇచ్చిన అతిథ్యం కూడా స్వీకరించలేదు. అంతే కాదు. వీరు ఏ ప్రమాదకరమయిన జంతువులో అని భావించి, అవసరమైతే వీరందరినీ నిర్మూలించాలని కూడా ఆలోచించాను," అన్నాడు జయసింహుడు వినయంగా.

"అది చాలా తప్పు నాయనా! వాళ్ళు నీ దగ్గరకు రాలేదు. నీవే వారి ద్వీపానికి వచ్చావు. వచ్చి వాళ్ళను చంపాలనుకొనటం మహాపాపం. సరే, ప్రాణరక్షణ కోసం ఏదో అలా అనుకొన్నావని సరిపెట్టుకుంటాను. ఇంతకూ నీకు కావలసిందేమిటి? భారతదేశములో శ్రీశైలానికి ఈశాన్య ప్రాంతంలో ఉన్న కృష్ణా నదీతీరానికి చేర్చమంటావా?" అన్నాడు పర్వతకుడు.

"స్వామీ. చల్లకు వచ్చి ముంత దాచటం ఎందుకు? ఇక అసలు విషయం చెప్పేస్తాను. నేనూ, నా ఇద్దరు మిత్రులూ బయలుదేరింది మయూరాక్షి అన్వేషణ కోసమే! దయవేసి నాకు ఆ దేవిని అన్వేషించే మార్గం చెప్పి

యం. ఉషాదేవి



పుణ్యం కట్టుకోండి. మీ మేలును ఈ జన్మలో మరచిపోలేను." అంటూ అతడికి నమస్కరించాడు జయసింహుడు.

ఈ మాటలు వినగానే, పర్వతక ఋషి నిశ్చేష్టుడయినాడు. అతడి ముఖంలో కోప రేఖలు కనిపించాయి.

"స్వామి. నేనేమైనా పొరపాటు మాట అన్నానా?" అన్నాడు జయసింహుడు.

"లేదు నాయనా! ఈ మానవాళి యొక్క బుద్ధిహీనతకు బాధపడుతున్నాను. అందని ద్రాక్షపళ్ళ కోసం అర్రులు చాచటం మానవులకు సహజ లక్షణం. నీవు కూడా అందుకు భిన్నంగా ప్రవర్తిస్తావని ఎలా అనుకోగలను?" అన్నాడు పర్వతకుడు.

"క్షమించండి స్వామి! మీ పాదాల సాక్షిగా చెపుతున్నాను. నాకు అణిమాది అష్ట సిద్ధుల మీద కాని, అమరత్వం మీద కాని ఎలాంటి కోరికా లేదు. మా అమరావతి రాజకుమారి అవంతీసుందరిని నెమిలి రూపంలోని రాక్షసులు ఎత్తుకొని పోయారు. ఈ అపహరణకూ మయూరాక్షికీ సన్నిహిత సంబంధం వున్నట్లు అంజనంలో తేలింది. అందుకని ఈ మయూరాక్షి సంగతి ఏమిటో తెలుసుకొని, మా రాజకుమారిని తీసుకొని రావలసినదిగా మా గురుదేవులు నన్ను ఆజ్ఞాపించారు. అందుకని నేను ఇలా వచ్చాను. మీరు చెపితే సంతోషం. చెప్పకపోతే, నా దారిన నేను మయూరాక్షిని వెతుక్కుంటూ పోతాను. అంతే కాని, గురుకార్యాన్ని వదిలి పెట్టటం మాత్రం చేయలేను." అన్నాడు జయసింహుడు దృఢంగా.

"నీ కర్తవ్యనిష్ఠకు సంతోషించాను. కాని, సిద్ధులూ, విద్యాధరులూ, దివ్యపురుషులూ కూడా సాధించలేని మయూరాక్షి రహస్యాన్ని నీవు సామాన్య మానవుడివి ఎలా సాధించగలవు బాబూ?" అని అడిగాడు పర్వతకుడు.

"మీ వంటి మహాత్ముల ఆశీర్వాదం వుంటే, నాకు ఈ మయూరాక్షి అన్వేషణ ఒక లెక్క లోనిది కాదు. నన్ను మరీ అంత సామాన్య మానవుడిగా తీసి వేయకండి. నాకు గురుదేవుల ఆశీర్వాదమే కాదు. వారి మంత్ర రక్షణ కూడా వుంది. వారు అంజనం వేసి

ఎప్పటి కప్పుడు నా యోగక్షేమాలను విచారిస్తూ వుంటారు. అవసరమైతే, అక్కడి నుండి తమ మంత్రశక్తి ద్వారా నాకు ప్రాణ రక్షణ కల్పిస్తూ వుంటారు," అన్నాడు జయసింహుడు.

"ఓరి పిచ్చివాడా! ఈ మాత్రం రక్షణలు లేకనేనా, విద్యాధరులంతా నశించి పోయినది? మయూరాక్షి వున్న ప్రదేశానికి ఎలాంటి వ్యక్తులూ ప్రవేశించలేరు సరికదా, మంత్ర రక్షణ కూడా నిరుపయోగమని విన్నాను," అన్నాడు పర్వతకుడు.

"నాకు కామరూపవిద్య వచ్చు. ఆకాశ గమనం తెలుసు. జ్యోతిష్మతీమూలికను స్వాధీనం చేసుకొన్న వాడిని. అంతే కాదు, ఓ గంధర్వుడి వలన దివ్యగాంధర్వగానం కూడా లభించింది," అన్నాడు జయసింహుడు.

"అలా చెప్పు. అందుకే మా పిల్లలంతా నీ వేణువు చేత ఆకర్షింపబడ్డారు. కాని, నాయనా! ఈ జ్యోతిష్మతులూ, సర్పిష్మతులూ మయూరాక్షి ద్వీపంలో పని చేయవని విన్నాను," అని హితవు చెప్పాడు పర్వతకుడు.

"ఏమైనా కానీయండి. నా అన్వేషణ మాత్రం ఆపటానికి వీలు లేదు," అన్నాడు జయసింహుడు.

"మంచిది. పరమేశ్వరుడి సంకల్పం ఎలా వుందో ఎవరికి తెలుసు? మయూరాక్షి ద్వీపానికి సంబంధించిన రహస్యం తెలుపగలిగింది




ఆ తామ్రశాసనం ఒక్కటే! ఎవరూ సరిగా చదవలేని ఆ రాగిరేకును నువ్వు చదవగలవా?" అన్నాడు పర్వతకుడు.

కొంత సేపు జయసింహుడి నోట మాట రాలేదు. పర్వతకుణ్ణి చూస్తూండి పోయాడు. ఆ తరవాత, తన గురువును స్మరించి, మనోధైర్యం తెచ్చుకొన్నాడు.

"ప్రయత్నిస్తాను. చూపించండి," అన్నాడు జయసింహుడు నిశ్చలంగా.

జయసింహుడు చదువగలడనే నమ్మకం పర్వతక ఋషికి కలుగలేదు. అయినా, చూపించటం తన కర్తవ్యంగా భావించి జయసింహుడిని వెంట బెట్టుకొని తామ్రశాసనం దాచిన ప్రదేశానికి బయలుదేరాడు.



ముందు జయసింహుడూ వెనుక పర్వతకుడూ కొంత దూరం సాగిపోయారు. మార్గ మధ్యంలో దట్టమైన ముళ్ళపొదలూ, కాళ్ళు తెగిపోయేటట్లు కోసుగా వున్న రాళ్ళూ వచ్చాయి. అతి కష్టం మీద ఆయాసంతో పర్వతకుడు నడుస్తున్నాడు. అది చూచేసరికి జాలి కలిగింది జయసింహుడికి.

జయసింహుడి భావాన్ని పర్వతకుడు అర్థం చేసుకొని, "బాబూ, ఏం చెయ్యను? సర్పిష్మతీ మూలిక ప్రభావంతో అయుర్దాయమైతే పెరిగింది కాని, ఓపిక ఎక్కడ నుండి వస్తుంది? వాకు ఎన్ని వందల సంవత్సరాలో నాకే తెలియదు," అన్నాడు.

జయసింహుడు వెంటనే తన గురుదేవుణ్ణి స్మరించుకొని, కామరూప విద్యామంత్రాన్ని చదివాడు. మరుక్షణమే జయసింహుడు హయగ్రీవుడి వలె మారిపోయాడు.

"స్వామీ, నా మీద ఎక్కండి. మిమ్మల్ని మోసుకొని, చెంగు చెంగున తీసుకొని పోతాను," అంటూ జయసింహుడు నాలుగు కాళ్ళూ వంచి, నేల బారుగా కూర్చున్నాడు.

పర్వతకుడు నవ్వుతూ ముందుకు వచ్చి అతడి భుజాన్ని తట్టాడు.

"నీ విద్యకు సంతోషించాను. కాని, మయూరాక్షి ముందు ఈ కామరూప విద్య ఎంత? కొందరు విద్యాధరులకు కూడా ఈ విద్యలు వచ్చు. అయినా, వారు దిక్కులేని చావు చచ్చారు. నిన్ను నిరుత్సాహ పరచటం కోసం నేను ఇలా అంటున్నానని అనుకోవద్దు. నేను నీవు ఆశించిన ఫలితం ఎంత ప్రమాదకరమైనదో తెలియ జేయటం కోసమే ఇలా చెపుతున్నాను," అంటూ అతడి భుజం మీద కూర్చున్నాడు పర్వతకుడు.

దానితో జయసింహుడితో పట్టుదల పెరిగి, "స్వామీ, మీలాంటి వారి దయ వుంటే చాలు. దారి చూపుతూ వుండండి. నేను గెంతుకుంటూ వేగంగా ముందుకు పోతాను," అన్నాడు.

పర్వతకుడు దారి చూపుతూ వుండగా హయగ్రీవుడు కొండను ఎక్కుతూ ముందుకు సాగిపోయాడు. అలా కొంత దూరం పోయారు.

సరికి భయంకరమైన బుసలు వినిపించాయి వారికి.


"జయసింహా, మనం ఇప్పుడు సర్పాల కోనకు వచ్చాము. ఇక్కడ కొండ చిలువలూ, నాగుపాములూ గుట్టలు గుట్టలుగా పడి వుంటాయి. దీనిని దాటితే కాని, తామ్రశాసనము వున్న గుహను చేరలేము," అన్నాడు పర్వతకుడు.

"ఇంత భయంకరమయిన సర్పాల బారి నుండి ఎలా తప్పించుకొనటం. స్వామీ?" అని జయసింహుడు అడిగాడు.

అప్పుడు పర్వతకుడు, "అది మానవ మాత్రులకు సాధ్యం కాదు. విద్యాధరులూ గంధర్వులూ ఎగురుకుంటూ పోతూండే వారు," అన్నాడు.


"అలా అయితే, నేను కూడా ఎగురుకుంటూ పోగలను. కాని, మీరు అవతలికి ఎలా చేరగలరు?" అని జయసింహుడు అడిగితే, పర్వతకుడు నవ్వి, "ఈ సర్పాలన్నీ తపనోదయ సమయం నుండి కొన్ని ఘడియలు నిద్ర పోతాయి. అందువల్ల అరుణోదయ సమయానికి ముందే నేను అక్కడికి చేరుకొనే వాణ్ణి. నా వద్ద వున్న కొన్ని మూలికలతో వాటికి మత్తు కల్పించి ముందుకు సాగిపోయే వాణ్ణి. అలా అప్పుడప్పుడు కొన్ని సార్లు చేశాను," అన్నాడు.

"ఇప్పుడు సూర్యుడు బాగా నడినెత్తి



మీదికి వచ్చాడు కాబట్టి, మీ విధానం ఫలించక పోవచ్చు?" అన్నాడు జయసింహుడు.

"అవును. నేను యిక్కడే ఆగుతాను. నీవు చిలకలాగా మారి ఎగురుకుంటూ ముందుకు పో. అక్కడ ఒక గుహ వస్తుంది. దాని లోపలికి నిర్భయంగా పో. గుహ చుట్టూ పాములూ, గబ్బిలాలూ వుంటాయి. కాని, భయ పడవద్దు. అక్కడ ఎత్తు అయిన ఒక రాతి మీద శిలామందసం వుంటుంది. నిజానికి అది పెట్టె కాదు. ఒక రాతి సొరంగ ద్వారం. మందసాన్ని చమత్కారంగా తెరిస్తే గుహలో ఒక చోట రహస్య మందిరం కనపడుతుంది. అక్కడ ఎత్తు అయిన ఒక వేదిక మీద తామ్రపత్రం వుంటుంది. శ్రద్ధగా



చూస్తే తప్ప అది తామ్రపత్రమని తెలియదు. దాని మీది లిపిని పఠిస్తే మయూరాక్షి మాయలను గూర్చి నీకు చాలా సమాచారం తెలుస్తుంది," అన్నాడు పర్వతకుడు.

"మహర్షి, ఈ పని నేను విజయవంతంగా సాధించుకొని వస్తాను. అప్పటి వరకూ తమరు ఇక్కడే విశ్రమించండి. సూర్యాస్తమయం లోగా వచ్చేస్తాను," అన్నాడు జయసింహుడు.

"మరో ముఖ్య విషయం. చదవటం చేత కాలేదు కదా అని తామ్రపత్రాన్ని ముక్కున గరచుకొని ఎగురుకుంటూ రావద్దు. మందిరములో నుండి దానిని ఇవతలకు తెచ్చిన వాడు ఎవడూ సజీవుడై రాలేదు. గుర్తు వుంచుకో," అని హెచ్చరించాడు పర్వతకుడు.

పర్వతకుడు సమీపంలోని దట్టమైన ఒక పొద క్రింద కూర్చున్నాడు. జయసింహుడు హయగ్రీవ రూపాన్ని వదలి, కామరూప మంత్రాన్ని పఠించాడు. మరుక్షణమే అతడు చిలుకగా మారిపోయాడు.

"వస్తాను, గురుదేవా! వస్తాను, మహర్షి చీకటి పడే లోపలే మీ పాదాల దగ్గరకు వచ్చి వాలుతాను. కీ కీ కీ," అని గట్టిగా అరుస్తూ చిలుక రూపంలో సర్పాల కొనపై ఎగురుకొంటూ వెళ్ళి పోయాడు జయసింహుడు.

పైన ఎగురుతున్న రామచిలుకను చూచి ఒక కొండ చిలువ తల పైకెత్తింది. కొన్ని పాములు బుసలు కొడుతూ, పడగ విప్పి పైకి లేచాయి.

"గురుదేవా, గురుదేవా!" అని తన గురువును తలచుకొంటూ ముందుకు సాగి పోయాడు జయసింహుడు.

పర్వతకుడు చెప్పిన గుర్తులను బట్టి చిలుకగా వున్న జయసింహుడు తామ్రపత్రం వున్న గుహను తేలికగా పోల్చుకోగలిగాడు. గుహ చుట్టూ పాములు తిరుగుతున్నాయి. గబ్బిలాలు గుహలో నుండి ధారాళంగా బయటకు ఎగురుతూ వున్నాయి.

చిలుకగా ఎగురుతూ గుహలోకి చేరాడు జయసింహుడు.

లోపల కన్ను పొడుచుకొన్నా కానరాని భయంకరమైన చీకటి. భరించలేని వాసన

చుట్టూ మానవుల అస్థిపంజరాలు కూడా చెల్లాచెదరుగా పడి వున్నాయి.

'వీరంతా మయూరాక్షి కోసం వచ్చిన సాధకులు కావచ్చు. సాధనలో ఏదో పొరపాటు జరిగి శవాలుగా మారిపోయి వుండవచ్చు,' అని ఊహించాడు జయసింహుడు.

గురుచరణ మహర్షిని స్మరిస్తూ గాలిలోనే గిరికీలు తిరుగుతూ చీకట్లో దోవను అన్వేషింప సాగాడు జయసింహుడు. ఏదో ఉపాయం తట్టింది. చిలుక రూపాన్ని వదిలి వేశాడు.

ఒక అస్థిపంజరంలో నుండి రెండు ఎముకలను గుంజి, ఒక దాని మీద ఒకటి పెట్టి గట్టిగా రుద్దాడు జయసింహుడు. ఆ రాపిడికి ఎముకల మధ్య నుండి నిప్పు పుట్టింది. ఎముకలు నూనె కాగడాల వలె భగభగ మండ సాగాయి.

జయసింహుడు ఆ వెలుగులో గుహను పరిశీలించాడు. అక్కడి దృశ్యాలు చూచి దిగ్భ్రాంతుడైనాడు.

కొన్ని అస్థిపంజరాలు గుహలో తల్లక్రిందులుగా వ్రేలాడుతున్నాయి. వాటి మెడలలో స్ఫటిక తావళాలూ, రుద్రాక్ష మాలలూ వున్నాయి. బహుశః, మయూరాక్షి సాధన కోసం వచ్చిన సిద్ధులు అలా అయి వుండవచ్చునని ఊహించాడు జయసింహుడు.

ఇంతలో జయసింహుడి వెనక ఎవరో నవ్వినట్లు శబ్దం వినిపించింది. అతడు భయంతో



ఒక్క క్షణం స్తంభించి పోయాడు. ఎవరో అతడి వీపు మీద ఫెళ్ళుమని కొట్టారు.

జయసింహుడు రక్షోహరణ మంత్రాలు పఠిస్తూ, ఎముక కాగడాను చేతితో పట్టుకొని గభాలున వెనుకకు తిరిగి చూచాడు. ఒక దయ్యపు గబ్బిలం అతడి వీపు మీద దబదబ బాది భయంకరంగా అరుస్తూ గుహలో నుండి బయటకు పరుగెత్తి పోయింది.

'ఈ గబ్బిలాల దెబ్బలతో గుండె ఆగిపోయి కొందరు సాధకులు మరణించి వుంటారు,' అని అనుకుంటూ అతడు మెల్లగా శిలా మందసాన్ని తిప్పాడు.

అవతలి కుడ్య ద్వారం తెరుచుకొంది. అందులో ఎత్తయిన వేదిక మీద తామపత్రం

కనిపించింది. దాన్ని గట్టిగా చుట్టుకొని ఒక భయంకరమైన సర్పం పడుకొని వుంది.

జయసింహుడు ఎముక కాగడాతో దానిని తరుమబోయాడు. కాని, అది భయపడకుండా అలాగే పడుకొని వుంది.

కామరూప విద్య నేర్చుకొనటానికి ముందు, గురువు వద్ద బహు శ్రద్ధగా జయసింహుడు మరికొన్ని ముఖ్యమయిన మంత్రాలను నేర్చుకొని ఉన్నాడు.

అందులో గారుడం ఒకటి. ఇది గరుత్మంతుడికి సంబంధించిన మంత్రం. ఎవరయినా మంత్రాలతో సృష్టించిన పాములను ఒక నిక్షేపానికి కాపలా ఉంచితే, ఆ మంత్రసర్పాలు ఈ గారుడ విద్యా ప్రభావంతో నశిస్తాయి.


ఈ కష్టసమయంలో గారుడ మంత్రాన్ని ప్రయోగించాడు జయసింహుడు అది ఫలించింది. అక్కడ కాపలాగా వున్న మంత్ర సర్పం చూస్తూండగానే అదృశ్యమైపోయింది.

జయసింహుడు తామ్రశాసనాన్ని చేతిలోకి తీసుకొని శుభ్రంగా తుడిచి చదవటానికి ప్రయత్నించాడు. అయితే, అందులో ఏముందో అతడికి అర్థం కాలేదు. శాసనం మీద కొన్ని బొమ్మలూ, మరికొన్ని గీతలూ, ఇంకొన్ని సంకేతాలూ వున్నాయి. కాబట్టి, ఇది నాగరిలిపి, బ్రాహ్మీలిపి వంటి మానవులకు సంబంధించిన లిపి కాదనీ, ఇదేదో ఎవరికీ అర్థం కాని బొమ్మల భాష అనీ గ్రహించాడు జయసింహుడు.

అయితే, దీనిని ఎలా చదవటం? ఈ సంకేతాలకు అర్థం ఎలా చెప్పుకొనటమో జయసింహుడికి వెంటనే తెలిసింది కాదు.

జయసింహుడు తన గురుదేవుణ్ణి స్మరించి, 'గురుదేవా, నేను నిస్సహాయ స్థితిలో వున్నాను. నాకు ఏదైనా ఉపాయం స్ఫురించేటట్లు చేయటము మీ బాధ్యత.' అని మనవి చేసుకొన్నాడు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

11

[ఆ తరవాత, జయసింహుడు తాను అటుగా వచ్చినది ఎందుకో వివరిస్తాడు. మయూరాక్షి ద్వీపానికి సంబంధించిన రహస్యం, సర్పాల కోన ప్రాంతాలలో వున్న ఒక గుహలోని ఒక తామ్రశాసనంలో భద్రపర్చ పడి వుందని చెప్పి, దాన్ని సాధించే విధానం బోధిస్తాడు పర్వతకుడు. జయసింహుడు దాన్ని చేరగలుగుతాడు. కాని, దానిలో వున్న బొమ్మల భాషను చదవలేక కంగారు పడతాడు. —తరవాత]

మళ్ళీ ఇప్పుడు శ్రద్ధగా తామ్రశాసనాన్ని మరొకసారి పరిశీలించాడు జయసింహుడు. శాసనం మొత్తం బొమ్మలతో నిండి ఉంది. చుట్టూ చుక్కలు వున్నాయి. చుక్కలన్నింటినీ శ్రద్ధగా పరిశీలించి చూస్తే, ఒక నెమిలి బొమ్మ వస్తున్నది. మధ్యలో అలల వంటి గీతలూ, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు నక్షత్రాలు, నెమిలి పింఛము వంటి బొమ్మలు కనపడుతున్నాయి. ఒక చోట అద్దం వంటి బొమ్మ వుంది.

ఈ బొమ్మల వెనుక భాగంలో కొన్ని గీతలున్నాయి. ఇవన్నీ ఒక చోట లేవు. ఒక్కొక్క దిక్కులో కొన్ని కొన్ని గీతలు ఉన్నాయి. ఒక చోట కాళ్ళూ, మరొక చోట చేవులూ, వేరొక దిక్కున తోకా ఉన్నాయి. దీనిని బట్టి ఇవన్నీ సంకేతాలనీ వీటన్నింటినీ మానవ భాషలోనికి అనువదించుకొనాలనీ గ్రహించాడు జయసింహుడు.

ఈ తామ్రపత్రం అంచుల మీద కోణాలూ, చక్రాలూ ఉన్నాయి. వాటి లోపల ఏవో అక్షరాలు ఉన్నాయి. అదేమి భాషో జయసింహుడికి తెలియలేదు.

జయసింహుడు అయోమయ స్థితిలో పడిపోయాడు.

దానికి ఒక మూల, అంకోలపు గింజ బొమ్మ, మరొక మూల మామిడి పండు, వేరొక దిక్కులు చెరుకుగడ, నాలుగవ దిక్కులో కుంచె బొమ్మ వేసి ఉన్నాయి.

యం. ఉమాదేవి

జయసింహుడు ఆ తామ్రపత్రాన్ని చూస్తూ కొంతసేపు ఆలోచించాడు.

ఉన్నట్టుండి భగవదనుగ్రహం వల్లనో, గురుచరణుడి ఆశీర్వాదం వల్లనో, జయసింహుడి మేధ పాదరసంలాగా పని చేసింది.

అంకోలమూ. ఆమ్రము (మామిడి). ఇక్షుకాండము (చెరకుగడ). ఈషికా వృక్షము (కుంచెలు తయారుచేసే చెట్టు). ఈ నాలుగు బొమ్మల మొదటి అక్షరాలూ వరుసగా అ, ఆ, ఇ, ఈ లు వచ్చాయి.

ఈ నాలుగింటి రసమునూ పిండి, దాని మీద పోసి శుద్ధి చేస్తే, ఇందులోని భాష చదివేందుకు అవకాశం కలుగుతుందని జయసింహుడికి తోచింది. వెంటనే తామ్రపత్రాన్ని యథా స్థానంలో పెట్టాడు.

గుహలో నుండి బయటకు వచ్చి. సర్పాల కోన దాటాడు జయసింహుడు. పర్వతకుడిని కలుసుకొని తనకు వచ్చిన ఊహను వివరించాడు. అతడు సంతోషించి నారికేళ ద్వీపములో ఆ నాలుగు వృక్షాలూ ఎక్కడ ఉన్నాయో వివరించాడు.

జయసింహుడు వెళ్ళి అంకోలపు గింజలూ ఆమ్ర ఫలమూ. ఇక్షు కాండమూ, ఈషికా కేసరములు సేకరించాడు. వాటిని పిండి రసం చేశాడు. దాన్ని ఒక నారికేళపు కరండం (డిప్ప)లో నింపుకొని, మళ్ళీ వెనకటి పద్ధతిలోనే గుహ లోపలికి వెళ్ళాడు. రసంతో తామ్రపత్రాన్ని శుద్ధి చేశాడు.

ఆశ్చర్యం. శాసనంలోని భాష జయసింహుడికి ఇలా అర్థమైంది.




“సప్త సముద్రాల కవతల, సూర్యుడూ చంద్రుడూ నక్షత్రాల వెలుతురూ కనపడని చోట, సప్త పర్వతాల మధ్య ఒక ద్వీపం ఉంది. దాని పేరే మయూర ద్వీపం, మానవులూ, రాక్షసులూ, యక్షులూ, సిద్ధులూ, ఎవ్వరూ ప్రవేశింప లేని దుర్భేద్యమైన మంత్ర ద్వీపం అది. ఇంత వరకూ అక్కడ కాలు మోపిన మానవుడూ లేడు. కాలు మోపిన మరుక్షణం కాలి భగ్గున బూడిదగా మారి పోతాడు. ఈ ద్వీపంలో భూగర్భపు సొరంగంలో సృష్టిలోని సమస్త సంపదలను మించిన మహా ఐశ్వర్యాలు ఉన్నాయి. కొన్ని వందల కోట్ల బంగారు కణికెలు ఉన్నాయి. కణికెలు అన్నీ నెమిలి కన్నుల ఆకారంలో ఉంటాయి. ఈ సొరంగ ద్వారానికి పై భాగంలో ఉన్న రతనాల వేదిక మీద ఉన్న దేవత పేరే మయూరాక్షి. ఈమె నెమిలి ఆకారంలో ఉంటుంది. మయూరాక్షి ముక్కుకు వ్రేలాడుతున్న అద్భుత శక్తి గల విచిత్ర వస్తువు పేరు మాయాదర్పణం. ఇదొక అద్దం వలె కనపడుతుంది. కాని, అది మహాశక్తిగల దర్పణం. మయూర ద్వీపానికి ఈ మాయా దర్పణమే రక్షణ.

“మయూరాక్షిని ఉపాసించే మంత్రసిద్ధుడి పేరు ఉగ్రభైరవుడు. అతడి ముఖం కుక్క వలె ఉంటుంది. భయంకరమైన కోరలూ, పొడవైన చెవులూ, వంకర తిరిగిన తోకా కలిగి మిడిగుడ్లతో చూస్తూ వుంటాడు. ఉగ్రభైరవుడి అరుపు భయంకరంగా ఉంటుంది.

“అయితే, ఉగ్రభైరవుడు తన నిజ స్వరూ





పాన్ని ఎప్పుడూ ఒక ముసుగుతో కప్పుకొని ఉంటాడు. అతడు మనిషి కాడు. ఎగరగలడు కాని, పక్షి కాడు. మనుష్యులను చీల్చుకొని తింటాడు. కాని, రాక్షసుడు కాడు. ఈశ్వరుడి సృష్టిలో ఇదొక విచిత్ర ప్రకృతి. ఈ ఉగ్ర భైరవుడి ప్రాణాలు శరభద్వీపంలో ఉన్నాయి. అతడని చంపటం దేవ దానవ మానవుల వలన సాధ్యం కాదు.

"అయితే, అతడి పాపం పండినప్పుడు. అతడి మృత్యువు భరతఖండంలో వింధ్యకు దిగువ, శ్రీశైలానికి ఎగువ, కృష్ణానదీ తీరంలో ఒక రాజకుమార్తెగా జన్మిస్తుంది. శక్తిశ్వరూపిణి అయిన ఆ రాజకన్య చేతిలో తప్ప, ఉగ్ర భైరవుడు మరెవ్వరి చేతిలోనూ మరణించడు.

"విచిత్రం ఏమంటే, ఉగ్రభైరవుడికి ఈ విషయం కూడా తెలుసు. అందువల్ల, తన ప్రాణాలను హరించే రాజకన్య ఎవరో తెలుసుకొని, ఆమెకు పదహారేళ్ళు రాగానే, అపహరించుకొని పోతాడు. ఆమెను రాతిగా మార్చటం తప్ప మరేమీ చేయలేడు.

"మాయాదర్పణములో ముఖం చూచుకొన్న ప్రతివారూ శిలా ప్రతిమగా మారిపోతారు. దానితో శత్రువులను ముఖం చూచుకొనేట్లు చేయటం ఉగ్రభైరవుడి కిటుకు. ఉగ్ర భైరవుడిని నిర్మూలించి, మయూరాక్షిని స్వాధీనం చేసుకొన్న వాడు, అణిమాద్యష్ట సిద్ధులను, పాతాళ దుర్గంలోని నెమలికనుల బంగారు రాసులను స్వాధీనం చేసుకోవటంతో పాటు మూడు లోకాలకు ప్రభువు ఔతాడు. ఇదే మయూరద్వీప రహస్యం."

తామ్రశాసనాన్ని చదివి అర్థం చేసుకొన్న తరవాత, ఉగ్రభైరవుడు అవంతీసుందరిని ఎందుకు అపహరించుకొని పోయాడో ఇప్పటికి అర్థమైంది జయసింహుడికి. అయితే, అవంతీ సుందరిని ఎందుకు ఉగ్రభైరవుడు చంపలేక పోయాడు? అవంతీసుందరి ప్రస్తుతం శిలా ప్రతిమగా మారి మయూరద్వీపంలో బంధింపబడి ఉందా? అడుగు పెట్టిన వారు భగ్గున మండిపోయే ద్వీపము లోనికి ప్రవేశించటం ఎలా? ఉగ్రభైరవుడిని జయించటమెలా?

జయసింహుడికి ఇప్పుడు భయం కన్నా

బాధ ఎక్కువైంది. తామ్రశాసనాన్ని యథా స్థానంలో ఉంచాడు. శిలా మందసాన్ని తిప్పి కుడ్య ద్వారాన్ని మూశాడు. దయ్యపు గబ్బిలాలు వీపు మీద ఫెడీ ఫెడీ మని కొడుతున్నా లెక్క చెయ్యకుండా, గుహలో నుండి బయటకు వచ్చాడు జయసింహుడు.


రామచిలుకగా మారి సర్పాల కోనపై నుండి ఎగురుకుంటూ ముందుకు వచ్చి, జరిగినదంతా పర్వతకుడికి పూస గుచ్చినట్లు వివరించాడు జయసింహుడు. పర్వతకుడి కలిగిన ఆనందానికి మితి లేదు. అతణ్ణి ఒక్కసారిగా కౌగిలించుకొని కంట తడి పెట్టుకొన్నాడు.

"నాయనా, జయసింహా! నీవు సామాన్య మానవుడవు కావు. నీ శక్తి యుక్తుల మీద నాకు విశ్వాసం కలిగింది. నీవు తప్పక మయూరాక్షిని సాధించ గలవు. నీకు జయమగు గాక!" అని ఆశీర్వదించి, ఆనంద బాష్పాలను తుడుచుకొన్నాడు పర్వతకుడు.

"స్వామీ, నాకు తెలియని విషయం ఒకటి మిగిలి పోయింది. మయూరాక్షి రహస్యాన్ని తెలిపే ఈ తామ్రశాసనం నారికేళద్వీపము లోనికి ఎలా వచ్చింది?" అని అడిగాడు జయసింహుడు.


పర్వతకుడు ఒక్క క్షణం నిట్టూర్చి, ఇలా చెప్పాడు.

"సరియైన ప్రశ్నయే వేశావు నాయనా! మా ద్వీపంలో పూర్వం ఒక సిద్ధుడు ఉండేవాడు.



అతణ్ణి అందరూ నారికేళ మహర్షి అని పిలుస్తూ ఉండే వారు. అతడు కొబ్బరి నీళ్ళతో స్నానం చేసి, కొబ్బరి నీటినే తాగి, కొన్ని శతాబ్దాల పాటు కఠోర తపస్సు చేశాడు. అతడు నీవు తామ్రశాసనాన్ని ఏ గుహలో చూచావో ఆ గుహలోనే తపస్సు చేశాడు. అతడికి తపో మహిమ వల్ల కొన్ని సంకేతాలు, రేఖలూ కనపడ్డాయి! తనకు కనపడ్డ బొమ్మ లన్నింటినీ రాగిరేకుపై గీచాడు. కాని, వాటి అర్థం ఏమిటో అతడికి కూడా తెలియదు. అలా తపస్సు చేస్తూనే అతడు తనువు చాలించాడు.

"అతడు పరలోకం చేరబోయే ముందు తన అనుయాయులను పిలిచి, ఎక్కడో గుర్తు తెలియని ఒక గుహలో కనీ వినీ ఎరుగని నిక్షే



పాలు వున్నాయి. దానికి అధి దైవం పేరు మయూరాక్షి. ఆమెను స్వాధీనం చేసుకొనే విధానం అంతా ఈ తామ్రశాసనములో ఉన్నది. ఈ శాసనం అయోగ్యుల చేతిలో పడకుండా ఉండే నిమిత్తం, దీనికి అన్నివిధాలైన మంత్ర రక్షణలూ కల్పించాను. ఈ ఆస్తిని భద్రంగా దాచే బాధ్యత మన ద్వీపం వారిదే," అని చెప్పాడు. నాటి నుండి ఈ మంత్ర రహస్యం మా ద్వీపం వారి సొత్తు అయింది.

"అయితే, దీనిని చదివిన వాడు కాని, సాధించిన వాడు కాని ఇంత వరకూ పుట్టలేదు. ఈ రహస్యం తెలిసిన కొందరు హిమాలయ సిద్ధులూ, విద్యాధరులూ గంధర్వులూ కూడా మా ద్వీపానికి వచ్చి సాధన చేశారు. కాని, ప్రయోజనం లేకపోయింది. బొమ్మల భాషను తమకు తోచిన తీరుగా వ్యాఖ్యానం చేసుకొన్నారు. ఫలితంగా, ఒక దానికి బదులు ఒకటి అర్థమైంది. ఒక దిక్కుకు బదులు మరొక దిక్కుకు చేరారు. పోయిన వారే కాని వచ్చిన వాడు ఇంత వరకూ లేడు."

అప్పుడు జయసింహుడు నవ్వి, "మహర్షి, అలా అయితే, ఇప్పుడు నేను చదివి వ్యాఖ్యానించిన అర్థం మాత్రం సరైనదే నన్న నమ్మకం ఏమిటి?" అన్నాడు.

"అవును. అలా అనుమానించేందుకు ఆస్కారం లేక పోలేదు. కాని, సర్పిష్మతీ మూలిక తిని వందల ఏళ్ళుగా తపస్సు చేసుకొంటూ జీవిస్తున్న వాణ్ణి. నాకు నీవు చెప్పిన అర్థమే సరి అయినదిగా స్ఫురిస్తున్నది. ఏ ప్రమాణమూ లేనప్పుడు మనస్సే ప్రమాణం అవుతుంది, నాయనా! రాజకుమార్తెను విడిపించటంతో పాటు ఉగ్రభైరవుణ్ణి నిర్మూలించ కలిగితే, అటు నీకు మయూరాక్షి, పాతాళ దుర్గపు నిధులూ స్వాధీనం అవుతాయి, ఇటు మా ద్వీపంలోని కోతిరూపులు తిరిగి మానవులుగా జీవించే అవకాశం కూడా కలుగ వచ్చునేమో! అందుకే త్వరగా వెళ్ళి అసాధ్యమైన ఈ ప్రయత్నాన్ని నీవు సాధ్యం చేసుకో," అన్నాడు పర్వతకుడు.

"స్వామి, మా గదాధరుడూ, కపటకశర్మల మాట ఏమిటి? మీ కోతిరూపులు వారిని

వదలి పెడితే, వారిని నా వెంట తీసుకొని పోతాను," అన్నాడు జయసింహుడు.

"నాయనా, వయస్సులోనే కాదు, అనుభవములోనూ నేను పెద్దవాణ్ణి. వాళ్ళిద్దరూ అల్పసత్త్వులు. వారిని వెంటబెట్టుకొని పోవటం ద్వారా నీకు లేని చిక్కులు వస్తాయి. పైగా, వారు ప్రాణాలు కూడా పోగొట్టుకొనే ప్రమాదం ఉంది." అన్నాడు పర్వతకుడు.

ఏమి చెయ్యాలో తోచలేదు జయసింహుడికి. ఆలోచిస్తూనే జయసింహుడు హయగ్రీవుడిగా మారి పోయాడు. పర్వతకుడు అతడి వీపు మీద ఎక్కాడు. హయగ్రీవుడు చెంగు చెంగున దూకుతుంటూ, కొండ దిగి, కోన దాటి, నారికేళ వృక్షాల నడుమ నుండి దూసుకొని ముందుకు వచ్చాడు.

పర్వతకుడు భూమి మీదికి దిగగానే, హయగ్రీవుడు జయసింహుడిగా మారి పోయాడు. ఇద్దరూ వేగంగా నడుచుకుంటూ గదాధరుడూ, కరటకశర్మా ఉన్న చోటికి వచ్చారు.

అప్పటికి సాయం కాలమైంది. కరటకశర్మ గదాధరులలో మత్తు కొంత దిగింది. జయసింహుడిని చూడగానే వారిద్దరూ భోరున ఏడ్చారు. జయసింహుడు వారిని ఓదార్చ సాగాడు.

జయసింహుడూ, పర్వతకుడూ వచ్చే సరికి, ఆ అలికిడి విని దూరం నుండి కోతిరూపులు



వచ్చి గుంపులు గుంపులుగా అక్కడ జమ కూడసాగారు.

కోతిరూపులను చూచి, పర్వతకుడు గంభీరంగా విచిత్రమైన ధ్వని చేశాడు. అది విని, కోతిరూపులు పర్వతకుడికి నమస్కరించి చేతులు కట్టుకొని నిలబడ్డారు.

"జయసింహా, నీ మిత్రులను విప్పుకొని నీ విక వెళ్ళవచ్చు," అని పర్వతకుడు అనగానే జయసింహుడు కరటకశర్మ గదాధరుల కట్లు విప్పాడు.

కరటకశర్మ అపసోపాలు పడుతూ. "నేరక పోయి వచ్చాం, తండ్రీ! అవంతీసుందరీ వద్దు, అమరావతీ రాజ్యం వద్దురా నాయనా!" అంటూ అరవ సాగాడు.

గదాధరుడు మాత్రం కరటకశర్మను కోపంగా చూస్తూ కసిరాడు.

అప్పుడు పర్వతకుడు వారిని చూచి, "మిత్రులారా! జయసింహుడు ఇప్పుడు కార్య సాధన కోసం బయలుదేరాడు. మీరు అతడితో వెళ్ళటం అంత క్షేమకరం కాదు. మీకు ఇష్టమైతే, సురక్షితంగా ఈ ద్వీపం లోనే ఉండి పొండి. జయసింహుడు తిరిగి వచ్చాక, అతడితో కలిసి, మీ దేశం వెళ్ళవచ్చు. కాదంటారా, భరత ఖండంలోని కృష్ణానదీ తీరానికి మిమ్మల్ని పంపే ఏర్పాట్లు చేస్తాను," అన్నాడు.

"మాకు నిలువెత్తు బంగారు నాణేలు ఇచ్చినా, మేం మీ కోతిరూపుల మధ్య ఒక్క క్షణం కూడా ఉండలేమా నాయనోయ్!" అన్నాడు కరటకశర్మ.


జయసింహుడు గదాధరుణ్ణీ, కరటకశర్మనూ తన వెంటనే తీసుకొని పోవటానికి సిద్ధపడ్డాడు.


పర్వతకుడు కోతి రూపులతో, "బిడ్డలారా, మన అతిథులు వెళ్ళి పోతున్నారు. వారికి ఘనంగా వీడ్కోలు చెప్పండి," అన్నాడు.

పర్వతకుడి భావం అర్థం చేసుకొని, తల వంచుకొని, కోతిరూపులు నమస్కరిస్తూ, ఆ ముగ్గురికీ వీడ్కోలు చెప్పసాగారు. కొందరు కోతిరూపులు అరటిపళ్ళ గెలలను, కొబ్బరి బోండాలను, పనసపళ్ళను సొరకాయ బుర్రలో దాచి పెట్టుకొన్న ఇప్పపూలనూ ముగ్గురు అతిథులకూ కానుకలుగా సమర్పించారు. జయసింహుడు వారి ఆతిథ్యానికి ముగ్ధుడైనాడు.

పర్వతకుడు వారి కోసం ఏర్పాటు చేసిన గూడు పడవలోకి ఎక్కి ఆ ముగ్గురూ సముద్రంలో ముందుకు సాగిపోయారు. నారికేళ ద్వీపం ఒడ్డున నిలబడి పర్వతకుడూ కోతిరూపులూ విచారంతో వీడ్కోలు వారికి చెప్పారు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

12

[తన ప్రజ్ఞతో తామ్రశాసనం లోని విషయాన్ని గ్రహించ కలుగుతాడు జయసింహుడు. దానిని బట్టి, మయూరాక్షిని ఉపాసించే ఉగ్రభైరవుడి ప్రకృతి అర్థం అవుతుంది. అంతేకాదు, కొన్ని వందల బంగారు కణికెలు ఆ మయూర ద్వీపంలో వున్నట్టు తెలుస్తుంది. పర్వతకుడి ఆశీర్వాదంతో జయసింహుడు ఓ గూడు పడవలో గదాధర కరటకశర్మలతో బయలు దేరుతాడు. —తరవాత]

సముద్రంలో ప్రశాంతంగా గూడుపడవ సాగిపోతున్నది. అప్పటికి బాగా చీకటి పడింది. కరటకశర్మ వెల్లికిలా పడుకొని, ఆకాశంలోని చుక్కలు లెక్కపెడుతున్నాడు. గదాధరుడు మాత్రం ఆందోళనగా చూస్తున్నాడు.

పడవ నడుపుతున్న జయసింహుడితో కరటకశర్మ ఇలా అన్నాడు.

“మనం ఎక్కడ బయలు దేరాం? ఎక్కడికి చేరాం? ఏం సాధించాం? మళ్ళీ ఎక్కడికి వెళుతున్నాం? పైన హద్దులేని ఆకాశం, క్రింద అనంతమైన సముద్రం. మొదలు, తుద తెలియని ఈ ప్రయాణంలో మరణించటం తప్ప గత్యంతరం లేదు. అవంతిసుందరిని పోలిన అమ్మాయిని ఏ ఉత్తర భారతదేశంలోనో వెదికి పట్టుకొని పోయి ఇస్తే, సమస్య పరిష్కారమయ్యేది. నేరకపోయి ప్రాణం మీదికి తెచ్చుకొన్నాం. ప్రాణాలతో ఇక కొంప చేరటం కలలోని వార్త.”


ఇలా అంటూ కరటకశర్మ పెద్దగా వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టాడు.

గదాధరుడు నిబ్బరంగా నవ్వి, “ఎలా కావలసి వుంటే అలా ఔతుంది. ఇలా ఏడ్చి ఏం-ప్రయోజనం? రోటిలో తల దూర్చి రోకటి పోటుకు వెరిస్తే లాభం ఏమిటి?” అన్నాడు.

జయసింహుడికి వీరిద్దరి మీదా జాలి కలిగింది. ఇక అసలు రహస్యం చెప్పేద్దామనుకున్నాడు.

“ఓ మిత్రులారా! మీరు అంతగా భయ

ఎం. ఉమాదేవి



పడకండి. మనం రావలసిన చోటికే వచ్చాం. తెలుసుకోవలసిందే తెలుసుకున్నాం. మయూరాక్షి వుండే మంత్రాలదీవి దోవ నారికేళ ద్వీపంలో తెలిసింది." అన్నాడు జయసింహుడు.

కరటకశర్మ ఒక్కసారి ఎగిరిపడి లేచి, "ఏమిటీ! మయూరాక్షి వుండే మంత్రాలదీవి దోవ తెలిసిందా? ఎలా తెలిసింది? ఎవరు చెప్పారు?" అని ప్రశ్నించాడు అదుర్దాగా.

"పర్వతకుడు చెప్పాడు," అని మాత్రం చెప్పి జయసింహుడు తామ్రశాసన రహస్యాన్ని దాచి పెట్టాడు.

గదాధరుడు కూడా ఆత్రంగా, "ఆ వివరాలు ఏమిటి?" అని అడిగాడు.

అప్పుడు జయసింహుడు మంత్రాలదీవి గూర్చి, మయూరాక్షి గూర్చి. ఉగ్రభైరవుడి గూర్చి, మాయాదర్పణం గూర్చి వివరంగా చెప్పి, "ఉగ్రభైరవుడి ప్రాణం అవంతీసుందరి చేతుల్లో వుంది. అందుకని, అవంతీసుందరిని అపహరించుకొని పోవటం కోసం నెమిలి రూపులైన భటులను ఉగ్రభైరవుడు పంపి ఉండవచ్చునని నా ఊహ." అన్నాడు.

అవంతీసుందరి పేరు వినగానే గదాధరుడికి మళ్ళీ ఆశ పుట్టింది. అంతే కాదు, మయూరాక్షి కింద పాతాళదుర్గంలో నెమిలి కన్నుల బంగారు కణికలు వేలవేల కోట్లు ఉన్నాయని వినగానే పళ్ళు వులిసి పోయాయి. ఒళ్ళు జలదరించింది.

కరటకశర్మకు కూడా కళ్ళు బైర్లు కమ్మాయి. మతి చలించినట్లు అయింది.

వేల వేల కోట్ల బంగారు నాణేలే స్వాధీనమైతే, ఇంక ఈ అమరావతీ రాజ్యం ఎంత? అప్పటి కప్పుడే వారిద్దరికీ జయసింహుడి మీద అసూయ బయలు దేరింది. ఇతణ్ణి ఎలాగైనా వేరే దోవకు పట్టించి ఈ గుప్త నిధినిక్షేపాలు, అణిమాది అష్టసిద్ధులూ అవంతీసుందరిని కాజేయాలని కుత్సితంగా ఆలోచించ సాగారు.

'అంతా బాగానే వుంది. ఈ దొక్కు పడవలో మనం సప్తసముద్రాలు దాటట మెలా? మయూరాక్షిని జయించట మెట్లా?' అని గదాధరుడు ఆలోచిస్తూ వున్నాడు.

"ఓయీ జయసింహా! నీవు నడిపే యీ పడవలో కూర్చుంటే, మేము ఇక మంత్రాల ద్వీపానికి చేరటం, కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్లే ఔతుందయ్యా! మా ఖర్మ కొద్దీ మాకు నీవంటి కళాసీ దొరికాడు," అన్నాడు కరటకశర్మ.

గదాధరుడు కూడా కోరమీసాలు దువ్వుతూ, "ఔ నౌను." అన్నట్లు తల ఆడించాడు.

'ఓరి, వీళ్ళ అఘాయిత్యం మండ!' అనుకొని తనలో తానే నవ్వుకొన్నాడు జయసింహుడు.

"అయ్యలారా, మనం ప్రయాణం చేస్తున్నది గోదావరి కాదు. నేను కుక్కతోకనూ కాను. మీరిలాంటి ప్రశ్న వేస్తారని నేను ఊహించే పాదలేపనం ఒకటి సంపాదించాను. దీని పేరు జ్యోతిష్మతి మూలిక. ఈ భస్మం అరికాళ్ళకు రాసుకుంటే, ఆకాశంలో ఎగురుతుంటూ పోవచ్చు. కాని, ఒక్కటే ప్రమాదం. ఇది రాత్రి వేళలు మాత్రమే పని చేస్తుంది. నీటిలో తడియ కూడదు. తడిస్తే మళ్ళీ ఆరే వరకు అది పని చేయదు," అన్నాడు జయసింహుడు.

"ఇంకేం మరి! మామీద ప్రేమతో, మా వీరత్వం చూచి, పర్వతకుడు ఇలాంటి భస్మం కూడా ఇచ్చాడాయె. ఇంక ఉగ్రభైరవుణ్ణి జయించటం చిటికెలో పని. ఆ భస్మపు సంచీ ఇలా ఇయ్యి నాయనా!" అన్నాడు కరటకశర్మ.




జయసింహుడు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ జ్యోతిష్మతి భస్మాన్ని కరటకశర్మకు అందించాడు.

"ఓయీ జయసింహా! ఉగ్రభైరవుడి ప్రాణ రహస్యం శరభద్వీపంలో ఉందని చెప్పావు కదా! నీవు ఆ దిక్కుకు పో. ఈలోగా మేము అవంతిసుందరిని చేజిక్కించుకొని, శరభ ద్వీపానికి చేరతాము. నీకు ఏదైనా ఆపద కలిగితే, మా గదాధరుడు వచ్చి రక్షిస్తాడు. భయపడకు," అన్నాడు కరటకశర్మ.

"చిత్తం. అలాగే అలాగే," అన్నాడు జయసింహుడు.

పడవలో ముందు జాగ్రత్త కోసం కొన్ని బూరుగు చెక్కల బల్లలు ఉంచబడ్డాయి.



గదాధరుడూ, కరటకశర్మా చెరొక్క బల్లి చెక్కనూ వీపుకు కట్టుకున్నారు.

రాత్రి తెల్లవార్లూ ఎగురుతూ సూర్యోదయం వేళకు ఎక్కడైనా నేల కనపడితే దిగవచ్చు. లేని పక్షంలో బూరుగు చెక్కల సహాయంతో సముద్రం మీద చీకటి పడే వరకూ తేలుతూ పొద్దుపుచ్చ వచ్చు కూడా. ఇలా గదాధరుడూ కరకటశర్మా తర్కించుకొని ఒక పథకం సిద్ధం చేసుకున్నారు.

"వీరులారా, క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రండి," అని జయసింహుడు వారికి శుభాకాంక్షలు అందించి వీడ్కోలు చెప్పాడు.

ఇంకేం, ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా చెప్పులకు మూలికా భస్మం పట్టించి, "జై పరమేశ్వరా!" అంటూ ఇద్దరూ పక్షుల్లాగా ఆకాశంలోకి ఎగిరి పోయారు.

జయసింహుడు పడవలో అలా ఒంటరిగా చాలా సేపు వుండి పోయాడు.


'చూస్తూ చూస్తూ ఈ దురాశాపరు లిద్దర్నీ నేను మృత్యుముఖం లోనికి పంపలేదు కదా!' అని బాధ పడ్డాడు జయసింహుడు.

వీరు ఎలా వచ్చారో అలాగే వెళ్ళారు. కేవలం తాను నిమిత్త మాత్రుడిగానే మిగిలి పోయాడు. వీలైతే తాను చేతనైన సహాయం చేశాడే కాని అపకారం చేయలేదు. అలాంటప్పుడు, వారి కర్మకు తానేలా బాధ్యుడు అవుతాడు?

ఇలా అనుకొనగానే, మానసికంగా అతడికి కొంత బరువు దిగినట్లనిపించింది. ఇక పడవ ప్రయాణం అనవసరమని భావించి, గరుత్మంతుడిలాగా మారి, శరభద్వీపాన్ని వెతుక్కుంటూ ఆకాశ మార్గములో పయనించ సాగాడు జయసింహుడు.

పోగా పోగా, మరునాడు సూర్యోదయం వేళకు ఒక ఎత్తు అయిన పర్వతం వచ్చింది. విశ్రాంతి కోసం సముద్ర మధ్యంలోని ఆ కొండ కొమ్ము మీద దిగాడు జయసింహుడు.

గరుత్మంతుడి రూపులోనే ఉండి, జయసింహుడు అక్కడి నుండి ప్రకృతిని పరిశీలించ సాగాడు. అధొక నిర్మానుషమైన పర్వతంగా కనపడుతున్నది. పర్వతంపైన అక్క



[illegible]
సాగేను.

ఇంతలో సూర్యోదయమైంది.

అతను నదిని దాటి కొంత దూరం వెళ్ళి ఎక్కడైనా జలాశయం ఉంటుందేమోనని వెతకసాగాడు. అతనికి ఒక సెలయేరు కనబడింది. ఆనందంతో అక్కడికి వెళ్ళి స్నానం ముగించుకొని సూర్యునికి అర్ఘ్యం ఇచ్చాడు.

ఆ తరవాత కన్నులు మూసుకొని "ఓం శివాస్త్రాయ విద్మహే కాలానలాయ ధీమహి తన్నో అస్త్రః ప్రచోదయాత్." అని సూర్యుడిలో అంతర్యామిగా ఉన్న పరమేశ్వరునికి అర్ఘ్యం సమర్పించాడు జయసింహుడు.

"ఓం భవం తర్పయామి. ఓం మృడం తర్పయామి, ఓం హరం తర్పయామి." అని సూర్యునికి, పరమేశ్వరునికి నమస్కరించింది. జలాన్ని వదులుదామని చూసేసరికి, అతని చేతిలో బంగారు ద్రావకం ఉంది.

జయసింహుడు వింతపడి ఓసారి చుట్టూ చూచాడు.


అంతకు ముందు జయసింహుడు చూచిన సెలయేటి జలాలు బంగారు ద్రావకం ప్రవహిస్తున్నాయి.

తానేమైనా భ్రమపడ్డాడా? లేక ఇవేమైనా రాక్షస మాయయా? అతనికి ఏమీ అర్థం కాలేదు.

'ఈ సెలయేరు ఎక్కడ పుట్టి ఎక్కడికి పోతుందో పరిశీలించాలి,' అని తనలో తాను అనుకొని మెల్లగా సెలయేరు వస్తున్న దిక్కుగా కొండను ఎగువ భాగానికి పాక్కుంటూ పోయాడు జయసింహుడు.

అలా కొంత దూరం పోయేసరికి సెలయేరు పుట్టిన ప్రదేశం వచ్చింది. కొండలో ఒక బండ క్రింది నుంచి లావాటి ఒక జలధార వస్తున్నది. అదే కొంత దూరం పోయేసరికి సెలయేటిగా మారుతున్నదన్న మాట.

ఈ బండను పైభాగంలో ఒక చెట్టు ఉన్నది. సెలయేరు పుట్టిన ప్రదేశంలో ఈ చెట్టునీడ పడుతున్నది. చెట్టునీడ పడుతున్నంత మేర సెలయేరు సెలయేరుగానే ఉంది. సూర్యుని కిరణ స్పర్శ తగులుతున్న ప్రదేశం నుండి,



సెలయేరు బంగారు ద్రావకంగా మారి పోతున్నది.

జయసింహుడు ఈ విచిత్రాన్ని గమనించాడు. అయితే, ఈ సెలయేరు ఎక్కడికి పోతున్నది? ఈ బంగారు ద్రావకం కడ్డీలుగా మారి సముద్రంలో పడిపోతున్నదా?

జయసింహుడు ఇప్పుడు సెలయేటి దిగువ భాగాన్ని అంటి పెట్టుకొని నడుచుకొంటూ క్రిందికి పోసాగాడు. అలా కొంతదూరం పోయేసరికి ఒక సొరంగం లాంటిది వచ్చింది. ఈ బంగారు ద్రావకపు ప్రవాహం ఈ సొరంగం నుండి పారుతూ ఎక్కడికో పోతున్నది. ఈ సొరంగం లోపలికి వెళ్ళి లోపల ఏముందో చూద్దామనే కుతూహలం కలిగింది అతడికి.

అయితే, జయసింహుడు తొందర పడ లేదు. తనను మోసగించటం కోసం ఎవరైనా ఇలాంటి విచిత్రాలను సృష్టించి ఉండవచ్చు.

అందుకని, జయసింహుడు కొంచెం ఆగి, ముందు ఆకలి తీర్చుకోవాలనుకున్నాడు.

అక్కడ కొండ మీద పెరిగే బొమ్మజెముడు చెట్లు కనపడ్డాయి. వాటికి ఎర్రటి పండ్లు పండి ఉన్నాయి. జయసింహుడు కొన్ని పండ్లు కోసుకొని తిని, ఒక బండ చాటున విశ్రమించాడు. తెల్లవార్లూ నిద్రలేక పోవటం వలన వెంటనే నిద్ర పట్టేసింది అతడికి.

మెలకువ వచ్చి లేచి చూచేసరికి సూర్యుడు పడమటి దిక్కుకు తిరిగి ఉన్నాడు. ఎండవేడి తగ్గి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. సముద్రముపై నుండి చిరుగాలులు వస్తున్నాయి.

జయసింహుడు అలాగే తన సాహసయాత్ర గురించి ఆలోచిస్తూ చాలా సేపు ఉండి పోయాడు.

ఇంతలో చంద్రోదయమైంది.

చూస్తూండగానే, సెలయేరు వెండి ప్రవాహముగా మారి పోయింది!

దీనిని బట్టి, సెలయేరు సూర్య స్పర్శతో బంగారు ద్రావకంగాను, చంద్రస్పర్శతో వెండి ద్రావకంగాను మారిపోతున్నదని నిర్ధారించుకొన్నాడు జయసింహుడు. ఈ ద్రావకం సొరంగంలో నుండి ఎక్కడ పడుతున్నదో ఇక తెలుసుకోవాలి.

జయసింహుడు ఆ సొరంగపు ముందు కూర్చొని, లోపలి భాగాన్ని పరిశీలించాడు. అది పాతాళపు బిలంగా కనపడుతుంది.

'ఈ ద్రావకమంతా ఆ బిలంలో పడిపోతున్నదా? లేక క్రిందికి జారిపోయి సముద్రంలో పడిపోతున్నదా?' అని ఆలోచించాడు జయసింహుడు.


ఆపైన జయసింహుడు గబ్బిలంలాగా మారి, సొరంగంలోకి ప్రవేశించాడు. అలా కొంత దూరం పోయేసరికి, సొరంగం క్రిందికి మలుపు తిరిగినట్లు అయింది. అక్కడి నుండి ద్రావకపు ప్రవాహం ధనధనమని క్రింద పడుతున్నట్లు శబ్దం వినవస్తూ ఉంది.

'అంటే అక్కడి నుండి ప్రవాహం జలపాతంగా మారిపోయిందన్న మాట! అలా జలపాతం వెంట క్రిందికి వెళితే ఏమౌతుంది? ఇది క్రొత్త ప్రదేశం. ఏమీ తెలియని చోటు. రాత్రివేళ! లేనిపోని కష్టాన్ని కొని తెచ్చుకోపట మెందుకు?' అని ఒక్క క్షణం అనిపించినా, సాహస ప్రవృత్తిగల జయసింహుడి మనస్సుకు ఈ జలపాతపు దిగువ భాగంలో ఏముందో చూడాలనే అనిపించింది.

అందుకని, అలా మరి కొంత దూరం ముందుకు పోయేసరికి, గబ్బిలం రూపుడైన అతడు ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

సొరంగపు పైభాగం నుండి బంగారు పొడీ, వెండి పొడీ జలజల రాలుతున్నది! జయసింహుడు ముందుకు పోలేక పోయాడు.

ఇక వెను దిరుగుదామని ప్రయత్నించే లోపలే పెద్ద బంగారపు రాతిపలక జయ



సింహుడి నెత్తిన పడింది. దానితో గబ్బిలం రూపున్న అతడికి కళ్ళు తిరిగాయి. మంత్రం వదులుతూ మానవ రూపంలోకి వచ్చాడు. అలా వస్తూనే స్పృహ తప్పి పోయాడు.

ఎగురుతున్న గబ్బిలం జయసింహుడిగా మారి, వెండి ప్రవాహంలో పడిపోవటంతో అతడు కూడా ప్రవాహంతోపాటు ముందుకు కొట్టుకొని పోయాడు.

అలా కొంత దూరం పోయే సరికల్లా వెండి జలపాతం వచ్చింది! జలపాతపు ప్రవాహ గమనంలో జయసింహుడు వేగంగా క్రిందికి పడి పోయాడు.

అక్కడ తిమింగలపు జాతికి చెందిన ఒక రకమైన పొడుగు తోక చేపలు వున్నాయి. అందులో ఒక చేప జయసింహుణ్ణి తోకతో గట్టిగా కొట్టింది.

ఆ దెబ్బకు జయసింహుడు గాలిలో పల్టీలు కొట్టుకొంటూ ఎగిరిపోయి, ఒక చోట పడ్డాడు.

అలా పడిన పాటుకు అతడికి స్పృహ వచ్చింది. కళ్ళు తెరచి చూసేసరికి అతడు నిలయొక్క మొదటిలో ఉన్నాడు.


జయసింహుడు ఒళ్ళు విరుచుకొని లేచి నిలబడ్డాడు. తాను జలపాతంలో పడిపోవటం గుర్తున్నది. కాని, గిరికీలు కొట్టుకొంటూ కొండ పైకి రావటం అతడికి తెలియదు. ఈ పని సహజమైనది కాదని, దీని వెనుక ఏదో ఒక రహస్యం ఉండి ఉంటుందని జయసింహుడికి అనిపించింది.


అప్పటికి అర్ధరాత్రి దాటింది.

ఇంతలో, ఏదో మధురమైన గానం వినపడింది అతడికి. గభాలున చెట్టు చాటుకు వెళ్ళి దాక్కున్నాడు.

ఆకాశం నుండి ఎవరో దిగి వస్తున్న అలికిడి వినిపించింది. జయసింహుడు అటు వైపు చూచాడు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

13

[ఆ పడవ ప్రయాణాన్ని ఈనడించుకుంటూన్న గదాధర కరటకశర్మలతో తాము సరైన చోటికే పోతున్నామంటూ, కొన్ని వివరాలు చెపుతాడు జయసింహుడు. దానితో, వారు తమ గొప్పతనం చాటుకోవటానికి ఉబలాట పడటం చూసి, జ్యోతిష్మతి మూలికా భస్మాన్ని యిచ్చి పంపి, ఆ తరవాత తానూ ఆకాశ మార్గాన వెళ్ళి, ఒక వింత సెలయేటిని చూస్తాడు జయసింహుడు. అంతలో, ఆకాశాన్నుంచి ఎవరో దిగి వస్తున్నట్లు కనిపిస్తుంది అతడికి. —తరవాత]

తెల్లని వెన్నెలలో తెలతెల్లని వస్త్రాలు ధరించిన అప్సరసలు గుంపులుగా వస్తున్నట్లు పోల్చుకున్నాడు జయసింహుడు. మరు క్షణమే తానొక రామచిలుకగా మారి చెట్టు ఆకుల మధ్య నక్కాడు.

ఆనందముగా పాడుకుంటూ వస్తూన్న అప్సరసలు సెలయేటి పుట్టుక చోట దిగారు. అందరూ కిల కిలమని నవ్వుతూ హర్షధ్వానాలు చేస్తూ హల్లీవక నృత్యం చేశారు.

“ఏమే మనమిక వెన్నెలలో రజితస్నానం చేద్దామా?” అన్నది ఒక అప్సరస.

“చిత్తం మదనమంజుషాదేవీ! ముందుగా ఇవ్వాళ కుముద్వతిని జలపాతంలోకి నెట్టివేద్దాం,” అన్నది మరొక అప్సరస.

మదనమంజుషాదేవి సరేనని అన్నట్లు తల ఊపింది.

వెంటనే కుముద్వతి అనబడే ఆ అప్సరసను అందరూ బలవంతంగా సెలయేటిలోకి నెట్టివేశారు.

కుముద్వతి సెలయేటి ప్రవాహంలో కొట్టుకొని పోయింది. వెండిద్రావకంలో మునుగుతూ లేస్తూ కొంత దూరం పోయి సారంగములో పడిపోయింది.

అలా పడిన కొన్ని క్షణాలకు దభీమని ఒక శబ్దం వినిపించింది. కుముద్వతి గిరికీలు తిరుగుతూ గాలిలోనుండి వచ్చి కొండకొమ్ము చివర మళ్ళీ సెలయేటి మొదట్లో పడింది.

క్రింద పడిన కుముద్వతిని అప్సరస

యం. ఉమాదేవి

లంతా చేతులతో పట్టుకొని ఉయల ఊపి మళ్ళీ సెలయేటిలోకి విసిరి వేశారు.

మళ్ళీ వెండి జలపాతములో నుండి కుముద్వతి క్రింద పడి, చేపతోకతో కొట్టబడి పైకి వచ్చి సెలయేటి మొదటికి చేరింది.

అలా కొంతసేపు జరిగాక, "ఈ వేళకు ఈ ఆట చాలు. నేను బాగా అలసి పోయాను," అన్నది కుముద్వతి.

సెలయేటి గట్టున కుముద్వతి కూర్చోగానే మరొక అప్సరస ఆమెలాగే సెలయేటిలోకి దూకింది.

ఆమె తరవాత ఇంకొకతె! ఆపై, మరొకతె ఇలా అందరూ వరుసగా వెన్నెలలో వెండి స్నానాలు చేశారు.

అందరూ సెలయేటి ఒడ్డున కూర్చున్నాక, మదనమంజూష తన విలువైన వస్త్రాలను గట్టు మీద పెట్టి సెలయేటి లోకి దూకింది.

అలా వెళ్ళి సారంగంలోనుండి క్రిందపడి, తిమింగలంచేప తోకతో కొట్టగానే గిరికీలు తిరుక్కుంటూ పైకి వచ్చి చెట్టు మొదట్లో పడింది. ఆ తాకిడికి కొమ్మలు కదిలాయి. రామచిలుక అరచింది. మదనమంజూష కళ్ళు వెంటనే దాని మీద పడ్డాయి. ఆమె ఎగిరి గభాలున దాన్ని చేత్తో పట్టుకున్నది.

అది చూచి తక్కిన అప్సరసలంతా తమ నాయకురాలి చుట్టూ గుమిగూడారు. ఈ రామ చిలుక ఎక్కడ నుండి ఎగురుతూ వచ్చిందో నని అంతా ఆశ్చర్యపోయారు.

"పక్షులూ, జంతువులూ, మానవులూ ఎవ్వరూ, ప్రవేశించటానికి వీలుకాని ఈ



హేమకూటానికి ఈ రామచిలుక ఎలా వచ్చి చేరింది?" అని అడిగింది మదనమంజూషా దేవి.

"తల్లీ, ఒక్కొక్కప్పుడు సముద్రాలలో వ్యాపారపు పడవలు వెళుతూ ఉంటాయి. వాటిలో పెంపుడు చిలుకలూ, పావురాళ్ళు ఉంటాయి. అలా పడవ పగిలినప్పుడు కొన్ని, పంజరాల నుండి తప్పించుకొన్నప్పుడు కొన్ని ఎగిరి గగనతలం లోకి వస్తూ వుంటాయి. ఇది అలా తప్పించుకొని వచ్చిన పక్షియే కావచ్చు," అని అప్సరసలలో ఒకామె చెప్పింది.


మదనమంజూష రామచిలుకను చూచి, ముచ్చట పడి ముద్దు పెట్టుకుని, హృదయానికి హత్తుకొన్నది.

"గురుదేవా, ఈ మదనమంజూష నన్ను ముద్దు పెట్టుకొంటున్నది. ఇందులో నా తప్పు లేదు," అనుకుంటూ ఉక్కిరి బిక్కిరి అయిపోతూ అంది రామచిలుక.

"ఓహో! ఈ పక్షికి మాటలు, కూడా వచ్చునే. తన యజమానిని. 'గురుదేవా' అని పిలుస్తున్నది. అంతే కాదు. మనం మదన మంజూషాదేవిని పేరు పెట్టి పిలవటం విని క్షణంలో నేర్చుకున్నది." అన్నది కుముద్వతి

కుముద్వతి మదనమంజూషాదేవి చేతిలో నుండి రామచిలుకను పట్టుకుంది. మదన మంజూష తిరిగి వస్త్రాలు ధరించి ఆ తరవాత తిరిగి ఆ రామచిలుకను కుముద్వతి చేతిల నుండి అందుకొన్నది. ఆ పైన అప్సరసలంతా రామచిలుకతో సహా గగనమార్గంలో ఎగు





ంటూ కులాసా కబుర్లను హాయిగా చెప్పుకుంటూ పోసాగారు.

సూర్యోదయం వేళకు వారంతా ఓ ద్వీపం చేరుకున్నారు. మదనమంజూష చెలికత్తెలతో క సౌధపరిభాగానికి చేరుకున్నది. మానవు ల్వ్వరూ కనీ వినీ ఎరుగని రత్నములతో పచ్చ తో పొదిగిన ఆ మందిరం లోపలికి మదన ంజూష రామచిలుకతో సహా ప్రవేశించింది. మె రాగానే దివ్యకాంతలు స్వాగతం పలి రు. రామచిలుకను తన అంతరంగిక ందిరంలో ఒక బంగారుపంజరంలో ఒదిలి మె తన పని మీద తాను వెళ్ళి పోయింది. రామచిలుకకు పరిస్థితి అయోమయంగా యారైంది. తన కర్తవ్యం ఏమిటి? బంగారు పంజరాన్ని పగులకొట్టుకొని బయటకి పారి పోవటమా? లేక ఇక్కడే వుండి ఈమె సహా యాన్ని పొందటమా? అలా కొంత సేపు ఆలోచించింది రామచిలుక.

వీరి మాటలను బట్టి చూస్తే, ఈ మదన మంజూష చాలా శక్తిమంతురాలుగా కనబడు తుంది. ఒక వేళ తాను నిజమైన రామచిలు కను కాదనే విషయం తెలిస్తే, అప్పుడు ఆమెకు కోపం రావచ్చును. అందుకామె ప్రతీ కారం తీర్చుకుంటె అప్పుడు తానేమి చేయాలి? అలా కొంతసేపు సంశయాలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది రామచిలుక.

'ఓసీ రామచిలుకా! అలాంటి సన్నివేశమే వస్తే, ఏమి చేయాలో ఆ క్షణమే ఆలోచించు కోవచ్చులే,' అని రామచిలుక తనకు తానే, ధైర్యం చెప్పుకుంది.

అలా వెళ్ళి పోయిన మదనమంజూషాదేవి మధ్యాహ్నం వేళకు తిరిగి అక్కడకి వచ్చింది. రామచిలుకకు స్వయంగా పాలు పంచదార తినిపించింది.

"ఓసీ రామచిలుకా! నీకు మాటలు వచ్చునా?" అని పలకరించింది ఆమె.

"వచ్చును, మదనమంజూషాదేవి!" అని రామచిలుక అంటే "నీకెవరు నేర్పారే రామ చిలుకా?" అని అడిగింది ఆమె.

"మా యజమాని నేర్పారు. అయన పేరు జయసింహుడు," అని జవాబు యిచ్చిన

రామచిలుకని మదనమంజూషాదేవి నిమురుతూ, "ఆయనెవరు?" అని అడిగింది.

"అతిలోక సుందరుడు. అత్యంత సాహసి, సర్వవిద్యాకోవిదుడు. సాధకుడు. కర్మయోగి ఆజన్మబ్రహ్మచారి. గురువాక్య పరిపాలకుడు పరస్త్రీలను కన్నెత్తి చూడని వాడు." అంటూ గబగబ చెప్పింది రామచిలుక.

మదనమంజూష చప్పట్లు చరిచి ఫక్కున నవ్వి, "అబ్బో చాలా మాటలే నేర్చావే? మీ ఆజన్మ బ్రహ్మచారి, గడ్డాలూ, మీసాలూ పెంచుకొని ఎక్కడ తపస్సు చేసుకుంటున్నాడూ?" అని ప్రశ్నించింది.

"ఆయన తపస్సు అయిపోయింది, రాజకుమారీ! ప్రస్తుతం ఆయన మయూరాక్షి సాధనలో నారికేళద్వీపం నుండి బయలుదేరాడు. దారిలో పడవ పగిలింది. నేను ఎగురుతూ వచ్చాను," అన్నది రామచిలుక.

ఈ మాటలు వినగానే, మదనమంజూషకి చాలా బాధ కలిగి, కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేక పోయింది.

"మదనమంజూషాదేవీ! ఎందుకలా విచారిస్తున్నారు?" అని అడిగింది రామచిలుక.

"ఎలా చెప్పను, రామచిలుకా? ఎన్నాళ్లు చూచినా అదే కథ? ఎవరి నోట విన్నా అదే వ్యథ. సిద్ధులు, గంధర్వులు. విద్యాధరులు. మానవులూ. దానవులూ. అందరూ



మయూరాక్షి కోసమే బయలుదేరటం. మానవులు సముద్రం పాలు కావటం, దేవతలూ దానవులూ మయూర ద్వీపానికో శరభ ద్వీపానికో బలి కావటం. ఈ కథకు ముగింపు లేనట్లే కనబడుతున్నది," అంది ఆమె విచారంగా.

కథ అంటూ మొదలైతే, దానికి ఎక్కడో ఒక చోట ముగింపు ఉండనే ఉంటుంది. కాకుంటే, ఆ ముగింపు మీకు తెలియకపోవచ్చు. అంతే!" అంది రామచిలుక.

"చాలా చమత్కారంగా మాట్లాడుతున్నావే," అంటూ దాన్ని మెచ్చుకోలుగా చూచింది ఆమె.

"మదనమంజూషాదేవి, నన్ను వట్టుకో



...తెచ్చారు కదా? ఏం చేస్తారు చంపుతారా?" ...ని అడిగింది రామచిలుక.

"ఓసీ, నేనెంత త్రిశరుడి కుమార్తెను ...యినా అందాల రామచిలకను రెక్కలు ...రిచి చంపే కసాయిదానినని ఎందుకు అను ...కున్నావు?" అంది ఆమె ఆశ్చర్యంగా.

"మీ అభిమానానికి నా కృతజ్ఞతలు. ...ంతకూ ఆ త్రిశరులవారు ఎవరు?" అని ...డిగింది రామచిలుక.

"మా తండ్రి. ముప్పయి ద్వీపాలకు అధి...తి," అని సమాధానం ఇచ్చింది ఆమె.

"శరభద్వీపానికీ, మయూరద్వీపానికీ ...డానా?" అంది రామచిలుక.

"శరభద్వీపం ఆయన పరిధిలోనే ఉంది. మయూరద్వీపానికి ఉగ్రభైరవుడు తప్ప మరెవరూ అధికారికారు," అంది మదనమంజూష.

"రాజకుమారీ, నాదొక మనవి. నాకు శరభద్వీపం గూర్చి వినాలని ఉంది," అని రామచిలుక అనటంతో మదనమంజూషకు ఏదో అనుమానం కలిగింది.

"నీవు నిజమైన రామచిలుకవేనా? లేక మాయావివా?" అని ఆమె అడిగితే, "మా యజమాని ఎప్పుడూ ఈ ద్వీపాలను గురించి తలచుకుంటూ ఉండే వారు. అందుకని అలా అడిగాను, అంతే!" అంది రామచిలుక.

"అలాగా దానికి సంబంధించిన వివరాలు అదిగో ఆ భూర్జరపత్రాలలో ఉన్నాయి? నీవు చదవలేవు." అన్నది ఆమె.

మదనమంజూషకు అనుమానం వస్తుందని మరేమీ ప్రశ్నించ లేదు రామచిలుక.

"రాజకుమారీ, నేనొక పాట పాడుతాను వింటారా?" అని రామచిలుక గంధర్వుడు ప్రసాదించిన, సంగీతవిద్యను ప్రదర్శించింది.

దానితో మదనమంజూష, సమ్మోహితురాలై పారవశ్యంతో నిద్ర పోయింది. అప్పుడు రామచిలుక పంజరం పగులగొట్టుకొని బయటకి వచ్చింది. వస్తూనే రామచిలుక రూపంలోని జయసింహుడు నిజరూపం ధరించి భూర్జర పత్రాలను చదవసాగాడు.

జయసింహుడికి అందులోనిది ఏమీ అర్థం కాలేదు.

ఇంతలో ఫక్కున నవ్వు వినిపించింది అతడికి.

"ఛీ, మాయావీ! ఇదా నీ నిజరూపం?" అన్న మాటలు విని జయసింహుడు వెనుదిరిగి చూశాడు.

మదనమంజూష కోపంతో నిలబడి ఉంది.


జయసింహుడు మాత్రం భయపడకుండా, "ఇదేమిటి సుందరి మాట తప్పిందే! ఈ భూర్జర వస్త్రాలలో శరభమయూరద్వీపాలను గూర్చిన రహస్యాలు ఉన్నాయన్నారు. కాని, ఇందులో వేరే ఏవో మంత్రాలు ఉన్నాయి," అన్నాడు.

"ఓయీ, మూర్ఖుడా! నీలాంటి వాళ్ళను నేను కొన్ని వేల మందిని చూచాను. మాట్లాడే రామచిలుక మయూరద్వీపాన్ని గురించి అడుగుతూ వుంటే మోసపోయేందుకు నేను బుద్ధిహీనురాలిననుకున్నావా? నీవే ఆ జయసింహుడువి. అవునా?" అంది ఆమె.

"ఔను," అన్నాడు జయసింహుడు.

"మరి ఎందుకు నన్నిలా మోసగించావు?" అంది ఆమె కోపంగా.

"స్త్రీలు చాలా చమత్కారులు. పడవ పగిలి పోయి ప్రాణరక్షణార్థం చిలుక రూపం ధరించి, ఎక్కడో కొండకొమ్ము మీద తల దాచుకుంటున్న నన్ను బలవంతంగా పట్టుకొని, గుండెలకు హత్తుకొని, పంజరంలో పెట్టి బంధించింది నువ్వే! పైగా నేను, నిన్ను మోసగించానని అనటం మీ వంటి దేవతా



స్త్రీలకు సహజమే! తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరవు. నేను గురుకార్యం మీద బయలుదేరాను. బ్రహ్మరుద్రాదులు వచ్చినా నేను కర్తవ్యం నుండి ప్రక్కకు తొలగను. ప్రాణాన్ని బలిపెట్టి అయినా కార్యాన్ని సాధించుకొని పోతాను." అన్నాడు జయసింహుడు దృఢంగా.

"నీ గురుకార్యం ఏమిటి?" అంది ఆమె.

"మాది భారతదేశంలో వింధ్య పర్వతాలకు దిగువ భాగాన, శ్రీశైలానికి ఎగువభాగాన కృష్ణా నదీతీరము లోని అమరావతి మా దేశపు రాజకుమారి అవంతీసుందరిని ఉగ్రభైరవుడు అపహరించుకొని పోయినట్లు సమాచారం అందింది. మా గురుదేవులవారు ఆ దేశ రాజ


గురువు. నేను వారి ప్రియశిష్యుణ్ణి. అవంతి సుందరిని విడిపించుకొని తెచ్చే బాధ్యత వారు నాకు అప్పగించారు. అందుకని బయలు దేరాను. మా గురువులవారి పాదాల సాక్షిగా చెప్తున్నాను. నే నేమీ దాచి పెట్ట లేదు. నేను అసత్యవాదిని కాదు. కర్తవ్యనిష్ఠ కల వాణ్ణి. నన్ను నమ్మి నీకు తెలిస్తే, శరభద్వీపం గురించి, మయూరద్వీపం గురించి చెప్పు. మీకు అలా ఇష్టం లేకపోతే, నా దోవ నన్ను పోనీయండి. నా పాట్లు నేను ఏవో పడతాను," అన్నాడు జయసింహుడు.

జయసింహుడి మాటలు విని, మదన మంజూష నిరుత్తరురాలైంది. అలాగే అతణ్ణి కన్నార్పకుండా చూస్తూ ఉండి పోయింది.

"ఓయీ జయసింహా! నీ మాటలు విన్నాక కోపానికి బదులు నీ మీద జాలి కలుగుతున్నది. రామచిలుక రూపంలో నీవు మాట్లాడుతూ, జయసింహుడు జగదేకసుందరుడని అన్నావు. నిన్ను నీవు పొగుడు కోవటం తప్పే అయినప్పటికీ, నీ మాటలలో నిజమున్నదని నిన్ను చూచి నేను ఇప్పుడే గ్రహించాను. నీవు జగదేక సుందరుడవే కావు, అతిలోక గాంధర్వ సంగీత విద్యా విశారదుడివి. ఇంతటి సుందరుడూ, వీరుడూ, మాయాదర్పణానికి బలి కావటం బాధను కలిగించే విషయమే!" అంది ఆమె.

"నీకు అభ్యంతరం లేకపోతే, దయ చేసి నాకు ఆ వివరాలు చెప్పు," అన్నాడు జయసింహుడు.

"చెప్తాను, తప్పకుండా చెప్తాను. నిన్ను చూచాక, నీ మీద నాకు అది అభిమానమో, ప్రేమయో- ఏదో చెప్పలేని ఒక విచిత్రభావం ఏర్పడింది. లోగడ ఎవరితోనూ నేను ఈ రహస్యాలు చెప్పలేదు. ఏ మానవమాత్రుడూ నాతో మాట్లాడేందుకూ సాహసించ లేదు. కాని నీతో నే నీ రహస్యాలు మనస్సు విప్పి చెప్తున్నాను," అంది ఆమె.—(ఇంకా ఉంది)





మయూరద్వీపం

14

[ఆకాశాన్నుంచి దిగి వచ్చిన అప్సరసలు సెలయేటిలో జలకాలాడుతారు. రామచిలుకగా మారిన జయసింహుడు వారి నాయకురాలైన మదనమంజూష దృష్టిలో పడతాడు. అది మాట్లాడటం చూసి ఆమె దాన్ని తనతో బాటు తీసుకొని పోతుంది. ఆమె ద్వారా చాలా విషయాలు తెలుసుకున్న జయసింహుడు, ఆమెను మయూరద్వీపం గురించి అడిగితే, ఆమె ఆ వివరాలు చెప్పసాగింది. —తరవాత]

మదనమంజూషాదేవి మాటలకు జయసింహుడు ఎంతో సంతోషించి, "చాలా సంతోషం సుందరీ! నీ యీ మేలు ఎన్నటికీ మరిచిపోను," అన్నాడు.

అప్పుడు మదనమంజూషాదేవి నవ్వి, "ఓయీ, జయసింహా! మా తండ్రి పేరు త్రిశరుడు. ఆయన ఈ చుట్టు పక్కల గల ముప్పయి ద్వీపాలకు అధిపతి. అందులోని ఒక ద్వీపం పేరే శరభ ద్వీపం. ఈ ద్వీపాన్ని దశదిశల పది శరభమృగాలు కాపలా కాస్తూ ఉంటాయి. అందుకని అందులో ప్రవేశించటం ఎవరికీ సాధ్యం కాదు. ఈ ద్వీపంలోని మధ్య భాగాన పున్నాగవనం ఉంది. అందులో ఒక చెట్టు నీడలో పాముపుట్ట ఉంది. దానిలో మృత్యువును ఎరుగని నాగేంద్రుడు నిద్రిస్తూ ఉంటాడు. ఆ నాగేంద్రుడి నెత్తి మీద జీవమణి ఉంది. దానిలో ఉగ్రభైరవుడి ప్రాణం ఉంది. జీవమణిని పగల గొడితే తప్ప ఉగ్రభైరవుడు మరణించడు." అంది.

"అయితే, ఇంకేం? పని చాలా సులభమైంది. మయూర ద్వీపానికి బదులు శరభద్వీపానికే పోయి, మణిని చేజిక్కించుకొని పగల గొడతాను," అంటూన్న జయసింహుణ్ణి చూచి నవ్వి ఆమె ఇలా అన్నది.

"ఓయీ పిచ్చివాడా! ఈ పని అంత సులభమైతే, ఎప్పుడో మయూరాక్షి సాధకులకు స్వాధీనమై ఉండేది. ఉగ్రభైరవుడు బ్రతికి వున్నంత వరకూ, మయూరాక్షి దాని క్రింది

యం. ఉమాదేవి



గుప్త నిధులూ ఎవరికీ దక్కవు. ఉగ్రభైరవుడు ఎవరి చేతిలోనూ చావడు. భారతదేశంలోని కృష్ణానదీ తీరంలో దేవి అంశతో జన్మించిన ఒక రాజకుమార్తె చేతిలో ఉగ్రభైరవుడికి చావు వ్రాసి పెట్టి వుంది. ఈ గండం గడిచి గట్టెక్కితే, అతడు మళ్ళీ కొన్ని వేల సంవత్సరాల వరకూ అజేయుడే!"

"మదనమంజూషా, ఆ రాజకుమారి ఒక వేళ మా అవంతీసుందరియే కావచ్చు: అది గుర్తెరిగిన కారణంగానే నెమిళ్ళ గుంపును పంపి అతడు ఆమెను అపహరించుకొని పోయి వుండ వచ్చు," అన్నాడు జయసింహుడు.

"కావచ్చు, అయితే, ఆమె తన ముఖాన్ని మాయాదర్పణంలో చూచుకొని వుండవచ్చు. మాయాదర్పణంలో ఎవరు తమ ముఖాన్ని చూచుకున్నా వారు శిలాప్రతిమలుగా మారి పోతారు. ఒక్క ఉగ్రభైరవుడికి మాత్రం ఇది వర్తించదు, అంతే కాదు: ఉగ్రభైరవుడు మాయాదర్పణంలో నుండి చూస్తూ వుంటే శరభద్వీపంలో జరిగే ప్రతి పనీ అతడికి ప్రత్యక్షంగా కనబడుతూ వుంటుంది. అందువల్ల, అతడి కన్నులు గప్పి శరభద్వీపంలో ప్రవేశించటం అసంభవం," అంది మదనమంజూష.

అది విని జయసింహుడు నీరసపడిపోతూ, "మరి ఉగ్రభైరవుడికి చావే లేదా, యేం?" అని అడిగాడు.

"లేకేం, వుంది. దేవి అంశతో జన్మించిన స్త్రీ మీ అవంతీసుందరియే అయి వుంటే, ఆమెను ముందు శిలాప్రతిమ రూపం నుండి మామూలు స్త్రీగా మార్చాలి. ఆమె చేత నాగేంద్రుడి నెత్తిమీది జీవమణిని పగలగొట్టించాలి. సరిగ్గా అదే సమయంలో, ఉగ్రభైరవుడి తలను నరకాలి. ఇదంతా ఉగ్రభైరవుడికి తెలియకుండా చేయాలంటే, ముందు మాయాదర్పణాన్ని మాయం చేయాలి. ఈ పనులు నీవు చేయగలిగితే, ఉగ్రభైరవుణ్ణి జయించటం మయూరాక్షినీ, గుప్త నిక్షిప్తాలనూ స్వాధీనం చేసుకోవటం, మీ రాజకుమారిని విడిపించుకోవటం మూడూ సిద్ధిస్తాయి. కాని, ఇవి జరగటం అసంభవం, ఎందుకంటే మయూర

ద్వీపంలోకి అడుగు పెట్టిన వెంటనే ఎవరైనా సరే భగ్గున మండి బూడిదగా మారిపోతారు," అన్నది మదనమంజూష.

అప్పుడు జయసింహుడు నవ్వి, "నేను మయూర ద్వీపంలో అడుగు పెట్టను. ఎగురుతుంటూ పోతాను. నాకు కామరూప విద్య వచ్చు," అన్నాడు.

"ప్రయోజనం లేదు. నీ కామరూప విద్యలు ఆ ద్వీపంలో పని చేయవు. అంతే కాదు, మరో భయంకరమైన రహస్యం వుంది," అంటూ గవాక్షం దగ్గరికి వెళ్ళి, ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తూ నిలుచున్నది మదనమంజూష.

"ఏమిటా రహస్యం?" అని అడిగాడు జయసింహుడు.

"అసలు ఉగ్రభైరవుడెవరో ఎవరికీ తెలియదు. ఆ ద్వీపంలో పన్నెండు మంది ఉగ్ర భైరవ ఆకారులు తిరుగుతూ ఉంటారు. వారిలో ఒకడు మాత్రమే నిజమైన వాడు! మిగిలిన వారు, అతడు సృష్టించిన మాయా రూపులు. వీరిలో నిజమైన వాడి తలను నరుకుతూ, జీవమణిని అదే సమయంలో అవంతిసుందరి పగలగొట్టినప్పుడే ఉగ్రభైరవుడు మరణిస్తాడు," అంది ఆమె.

"అలాగా, ఇదంతా నిజమేనా?" అని అడిగాడు జయసింహుడు.

"నూటికి నూరుపాళ్ళూ నిజం! మా తండ్రి చాలాసార్లు ఈ సంగతి నాకు చెప్పారు. నేను జీవితంలో ఈ రహస్యాన్ని తొలిసారిగా నీకే చెపుతూన్నాను," అంది మదనమంజూష.

"కృతజ్ఞుణ్ణి. మీ మేలు మరచిపోలేను.





కష్టమో నిష్ఠూరమో కార్యాన్ని సాధించక తప్పదు కదా! నే నిక మయూర ద్వీపానికి వెళుతాను. సెలవు," అంటూ కదలబోయాడు జయసింహుడు.

ఆమె గబగబ వెళ్ళి అతడికి అడ్డు నిలిచి. "ఆగు జయసింహా! ఎక్కడికి వెళుతావు? నిన్ను నేను ఎక్కడికి పోనిస్తాను? మృత్యు ముఖంలోకి పంపి, నీవు చనిపోతే చూస్తూ ఊరుకునేందుకు నేను బుద్ధిహీనురాలిననుకొన్నావా, జయసింహా! నిన్ను నేను ప్రేమిస్తున్నాను. కాబట్టే నేను నీకు ఈ రహస్యాలు చెప్పాను. నీవు నన్ను వివాహం చేసుకోవటమే యీ సమస్య లన్నింటికీ పరిష్కార మార్గం," అంది.

జయసింహుడు ఒక్క క్షణం విచిత్రంగా ఆమె వైపు చూచాడు

"మదనమంజూషా, ఏమిటి నువ్వు అంటున్నది? పెళ్ళి చేసుకొంటే పరిష్కార మార్గం చెప్తావా? లేకుంటే చెప్పవా? అయినా, నా పెళ్ళి నా చేతిలో ఉన్నదా? పూజ్య కులపతి గురుచరణుల వారు అంగీకరించ వద్దా?" అన్నాడు జయసింహుడు.

మదనమంజూష సిగ్గుతో తల వొంచి, "నీవు ముందు ఒప్పుకుంటే వారిని ఒప్పించే విషయం నేను చూచుకుంటాను," అంది.

జయసింహుడు ఆమెను ఒక్క క్షణం తదేకంగా చూచి, ఆ పైన ఇలా అన్నాడు.


"ముందు చూచుకోవలసినది అదే. నా అంగీకారం అంత ముఖ్యం కాదు."

"నీకంటూ అభిరుచులు లేవా?" అంది ఆమె ఆశ్చర్యంగా.

"కార్యసాధకుడి నాలుకకు రుచులూ, మనస్సుకు అభిరుచులూ వుండవు. ముందు నా పని ఆ అవంతీసుందరిని విడిపించటం," అని చెప్పాడు జయసింహుడు నిర్మొహమాటంగా.

జయసింహుడి నిజాయితీకి ఎంతో సంతోషించింది మదనమంజూష.

"నేను ఎలాగైనా మా తండ్రిని ఒప్పిస్తాను. ఆయన మీ గురువు గురుచరణుల వారితో స్వయంగా మాట్లాడతారు. అవంతీసుందరిని



విడిపించే ప్రయత్నంలో నీకు నేను సంపూర్ణంగా సహకరిస్తాను. మిగిలిన బాధ్యత నాకు వదిలివేయండి," అన్నది మదనమంజూష

జయసింహుడు ఆలోచనలో పడ్డాడు.

మదనమంజూష తనను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నది. ఆమె సహకారంలో కూడా మోసమేమీ లేదు. తన గురువు ఒప్పుకొన్నప్పుడు కదా వివాహ ప్రసక్తి వచ్చేది. కాబట్టి ఈ స్థితిలో ఆమె సహకారాన్ని స్వీకరించటం అన్ని విధాలా తెలివైన పనేనని అనిపించి ఆ పైన ఇలా అన్నాడు జయసింహుడు.

"మదనమంజూషా, నేను హృదయపూర్వకంగా నీ సహకారాన్ని అర్థిస్తున్నాను. ముందు గురుకార్యము నిర్వర్తింపబడాలి. అవంతి సుందరిని ఆమె తండ్రికి అప్పగించాలి. ఆ తర్వాత, మన వివాహానికి అటు మా తలిదండ్రులూ, ఇటు మా గురువులవారూ అంగీకరించాలి. అప్పుడు నిన్ను పెళ్ళాడటానికి నాకేమీ అభ్యంతరం లేదు."

మదనమంజూష సంతోషించింది, వెంటనే వెళ్ళి తన తండ్రిని కలుసుకొన్నది. అయితే, ఆ విషయాన్ని ఎలా కదిలించాలా అని అనుకుంటూండగా, త్రిశరుడే ఆమె వచ్చిన కారణం ఏమిటని అడిగాడు.

"తండ్రీ, నేనొక మానవ రాజకుమారుణ్ణి ప్రేమించాను. అతడు కూడా నన్ను వివాహం చేసుకొనేందుకు అంగీకరించాడు. అయితే, అతడు ఒక గురుకార్యం మీద వచ్చి నాకు పట్టుబడ్డాడు. అది నెరవేరితేనే కాని వివాహం చేసుకోనంటున్నాడు," అని చెప్పింది ఆమె.

ఆమె మాటలను విని ఎంతో ఆశ్చర్యపడ్డాడు త్రిశరుడు. ఆ తరవాత, ఇలా అన్నాడు.

"మంజూషా, నీవు కో అంటే కోటి మంది గంధర్వులూ, విద్యాధరులూ బారులు తీరి నీ ముందు నిలుచుంటారు. అలాంటిది మన విద్యాధర రాజవంశపు గౌరవ మర్యాదలూ, గుణ రూప యౌవనములూ కల ఒక వరుణ్ణి ఎంచుకోకుండా, ఓ మానవుడి మీద నువ్వు మక్కువ చూపటం వింతగా వుంది. అయినా నీవంటే నాకు వున్న ప్రేమ నీకు తెలియనిది కాదు. అందువల్ల, అలాగే కానీయ్."



“తండ్రీ, అంతటితో మన బాధ్యత తీరి పోదు ఈ యువకుడి పేరు జయసింహుడు. ఇతడు ఒక గురుకార్య నిమిత్తం తిరుగుతున్నాడు. దానిని సాధించి పెట్టవలసిన బాధ్యత మన మీద వుంది. అదీ అసలు ముఖ్యమైన సంగతి,” అంది ఆమె.

“అదెంత పని తల్లీ! నీవు తలచుకొంటే క్షణంలో చేయగలవు. లేదా, నాకు చెప్పు. నిమిషాల మీద చేయిస్తాను,” అన్నాడు త్రిశరుడు.

“తండ్రి, అదంత సులభమైనది కాదు అనిపిస్తుంద నాకు,” అంటూ తల వొంచుకొని నిలబడింది మదనమంజూష.

త్రిశరుడు అందుకు ఎంతో ఆశ్చర్యపడి, గట్టిగా అడిగిన మీదట అసలు విషయం ఇలా చెప్పింది ఆమె.

“భారతదేశంలోని కృష్ణానదీ తీరములో అవంతీసుందరి అనే రాజకుమారిని ఉగ్రభైరవుడు అపహరించుకొని వచ్చినట్లు తెలిసింది. ఆమెను విడిపించుకొని తిరిగి ఆమె తండ్రి వద్దకు చేర్చాలి”

ఈ మాటలు విని త్రిశరుడు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

‘నీకేమైనా మతి పోయిందా?’ అన్నట్లు మదనమంజూష వంక చూచాడు.

అయితే మదనమంజూష మొండి పట్టుదల గమనించిన తరవాత, అది సాధించటం అనివార్యమని తెలిసి పోయింది త్రిశరుడికి.

“తల్లీ మంజూషా! నీవు నా పీకల మీదికి తెసున్నావు. సరే, కానున్నది కాకమానదు. ఆ రాజకుమారుణ్ణి నా వద్దకు పంపు,” అన్నాడు త్రిశరుడు.

మదనమంజూష వేగంగా తన అంతఃపురానికి వెళ్ళి జరిగినదంతా చెప్పి తండ్రి వద్దకు జయసింహుణ్ణి పంపింది.

జయసింహుడు త్రిశరుణ్ణి చేరి వినయంగా నమస్కరించి, తన వివరాలు చెప్పాడు.

త్రిశరుడు జయసింహుణ్ణి పరీక్షించి చూశాడు. ఎన్నో ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ జయసింహుడు యుక్తియుక్తంగా సమాధానాలు చెప్పాడు.

దానితో, తన కుమార్తె తగిన వరునే ఎన్నుకొన్నదన్న తృప్తి కలిగింది త్రిశరుడికి. అప్పుడు అతడు జయసింహుడితో ఇలా అన్నాడు.

"ఓయీ జయసింహా! ఎవరికీ తెలియని మయూరద్వీప రహస్యాలు నీకు చెప్తున్నాను విను. మయూరద్వీపం మొత్తం, పడుకొన్న ఒక నెమిలి ఆకారంలో వుంటుంది. దీనికి చుట్టూ ఏడు ప్రాకారాలు వున్నాయి.

"మొదటి దానిని భూధరుడూ, రెండవ దానిని జలముఖుడూ, మూడవ దానిని వాయుముఖుడూ, నాల్గవ దానిని అగ్నిముఖుడూ, అయిదవ దానిని నిరూపుడూ కాపలా కాస్తూ వుంటారు. ఆరవ ప్రాకారము చుట్టూ అప్సరసలు వుంటారు. ఏడవ ప్రాకారంలో నెమిళ్ళ సైన్యం వుంటుంది.

"ఇవన్నీ ఉగ్రభైరవుడు తన రక్షణ కోసం సృష్టించుకొన్న మాయలు. వీటిని దాటి ఇంత వరకూ లోపలికి పోయిన వాడెవడూ లేడు అంటే అతిశయోక్తి కాదు.

"ఆ ద్వీపానికి మధ్య భాగంలో మహా మందిరంలో మయూరాక్షి వుంటుంది. ఆ దేవత ముక్కున మాయాదర్పణం వ్రేలాడుతూ వుంటుంది.

"అందులో ఎవరు ముఖం చూచుకొన్నా, చూచిన వెంటనే వారు రాతి ప్రతిమలుగా మారిపోతారు.



"ఉగ్రభైరవుడు మాత్రం ఈ మాయా దర్పణంలోకి చూస్తే, అతడికి శరభద్వీపంతో సహా సమస్త పరిసరాలలోను ఎవరెవరు ఎలా సంచరిస్తున్నదీ కనబడుతుంది. అందువలన ఈ ఏడు ద్వారాలనూ, మాయాదర్పణాన్నీ జయించనిదే ఉగ్రభైరవుడు లొంగడు. ఇవి మయూరద్వీప రహస్యాలు!"

అంత వరకూ త్రిశరుడు చెప్పిన విషయాలన్నీ వింటూ వున్న జయసింహుడికి ఆ ఏడు ద్వారాలను జయించేందుకు తగిన మార్గం ఏమిటో అర్థంకాలేదు. తన మనసులోని సంశయాన్ని బయటపెట్టాడు.

"లేకేం వున్నది! కాని, వచ్చిన చిక్కు ఏమిటంటే, ఈ మార్గమంతా ఉగ్రభైరవుడికి

ఎప్పటికప్పుడు మాయాదర్పణంలో కనపడుతూనే వుంటుంది," అన్నాడు త్రిశరుడు.

"ప్రభూ, ఇదంతా దుర్భేద్యమైన మహా రహస్యం వలె కనబడుతూంది. కేవలం నా సాహసం, పరాక్రమం కామరూప విద్య మాత్రమే సరిపోయేటట్లు లేవు. మీ శక్తి యుక్తులు కూడా తోడ్పడితేనే కాని, నేను గురుకార్యాన్ని నిర్వహించలేను అని అనిపిస్తూంది. కనుక, మీ అండదండలు నాకు లభించినట్లు అయితే, నేను ప్రాణాలు ఒడ్డి అయినా, అది సాధిస్తాను," అన్నాడు జయసింహుడు వినయంగా.

"జయసింహా, నా శక్తి యుక్తులు కావాలని అన్నావే అందులో రెండవది చాలా ముఖ్యంగా నాకు కనపడుతూంది. ఇంత వరకూ మయూరాక్షి సాధనకై బయలుదేరిన వారు సిద్ధులూ, విద్యాధరులూ, పరాక్రమవంతులైన రాజకుమారులూ. వీరి శక్తి కేమీ కొదువ లేదు.


"కాని ఇది కొంత యుక్తితో కూడి సాధింప వలసిన కార్యం. అందువల్ల, మనం ఈ పనిలో మంత్రబలం, భుజబలంతో పాటు బుద్ధిబలాన్ని కూడా ఉపయోగించాలి.

"నిన్ను నా కుమార్తె అభిమానించింది. కాబట్టి, నీవు నాకు అభిమానపాత్రుడవైనావు. నేను ముప్పయి ద్వీపాల కధిపతిని అయిన విద్యాధరుడినైనా నాకు నా కుమార్తె కన్నా ఈ ద్వీపాలూ, వీటిపై అధిపత్యమూ ఎక్కువవి కావు. అందువలన నీ ప్రాణాలను రక్షించటం నా విధి."

ఈ మాటలు విని జయసింహుడు పరమానందభరితుడైనాడు. కృతజ్ఞతతో త్రిశరుడికి నమస్కరించాడు.

అప్పుడు త్రిశరుడూ, జయసింహుడూ కలిసి మొత్తం చిక్కుపడిన దారంలాగా వున్న ఈ సమస్యనంతా విడి విడిగా విశ్లేషించి చూడ సాగారు. —(ఇంకా ఉంది)





మాయాదర్పణం

15

[మదనమంజూష ఉగ్రభైరవుణ్ణి ఎలా చంపవచ్చో వివరించి, తనని అతడు వివాహం చేసుకుంటే తన తండ్రి సహాయం లభిస్తుందనీ, దానితో అతడి కార్యసాధన సులభతరం అవుతుందని చెపుతుంది. జయసింహుడు అంగీకరిస్తాడు. అప్పుడు ఆమె తండ్రి త్రిశరుడు అతడికి చాలా రహస్యాలు తెలుపుతాడు. అప్పుడు ఇద్దరూ ఆ సమస్యలోని సాధక బాధకాలను విశ్లేషించటం మొదలు పెడుతారు. —తరవాత]

వారికి తమకు ముందు వున్న సమస్యల సారాంశం ఇలా తేలింది.

నెమిలి కన్ను ఉండే స్థానంలో ఉగ్రభైరవుడి మందిరం వుంటుంది. మందిరంలో మయూరాక్షి ఉంటుంది. మయూరాక్షి ముక్కున మాయాదర్పణం వుంటుంది. మాయాదర్పణంలో ఎవరు ముఖం చూచుకొన్నా, వారు ఎంత శక్తికల వారైనా వెంటనే రాయిగా మారిపోతారు.

ఒక్క ఉగ్రభైరవుడికి మాత్రం ఇది వర్తించదు. అతడు మాయాదర్పణంలో చూస్తే సప్త ప్రాకారాలతో పాటు శరభద్వీపం కూడా కనబడుతుంది.

శరభద్వీపంలోని సర్పవృక్ష తల మీద మణిని పగలగొడుతూ అదే సమయంలో ఉగ్రభైరవుణ్ణి నరికితే అతడు మరణిస్తాడు.

ఉగ్రభైరవుడు కేవలం కారణజన్మురాలైన ఒక రాజకుమార్తె చేతిలోనే చనిపోతాడు. ఆమె అవంతీసుందరి అని ప్రస్తుతం అనుమానించటానికి అవకాశం ఉంది. అవంతీసుందరిని ఉగ్రభైరవుడు శిలా ప్రతిమగా మార్చి వుంటాడు.

మయూరద్వీపంలో ఎవరు కాలు పెట్టినా వారు వెంటనే భగ్గున మండిపోతారు.

ఉగ్రభైరవుడు మనిషి కాడు. జంతువూ కాడు. రెండింటి సమ్మేళనం అయి వుండాలి. అతడి ముఖం ఎలా ఉంటుందో ఎవరూ చూడలేదు. ముఖానికి ముసుగు వేసుకుంటాడు.

యం. ఉమాదేవి

ఉగ్రభైరవుడి వంటి మూర్తులు పన్నెండు మయూరద్వీపంలో తిరుగుతూ వుంటాయి. అందు వలన అసలు ఉగ్రభైరవుడిని పోల్చు కోవటం అందరికీ సమస్యే!

మయూరాకికి అడుగు భాగాన పాతాళ దుర్గంలో గుప్త నికేపాలు వున్నాయి. వాటిని చేరే ద్వారం ఎక్కడ వుందో మరో కంటి వాడికి ఎవరికీ తెలియదు.

త్రిశరుడూ, జయసింహుడూ కూర్చొని ఈ సమస్య లన్నింటికీ వరుసగా పరిష్కారాలు ఆలోచించ సాగారు.

సుదీర్ఘమైన చర్చలూ, సిద్ధాంతాలూ, రాద్ధాంతాలు చేసిన తరవాత, చివరికి వారొక నిశ్చయానికి వచ్చారు.

మాయలూ, మంత్ర తంత్రాలూ అన్నీ అవసరమే. కాని, ఉగ్రభైరవుణ్ణి జయించా లంటే మోసం కూడా అవసరం అవుతుంది.

"జయసింహా, ఉగ్రభైరవుణ్ణి ఎలా మోస గించాలో నేను కొన్ని కిటుకులు చెప్తాను. వాటిని ప్రయోగిద్దాం. మన యెత్తు ఫలించ వచ్చు- ఫలించక పోవచ్చు. అయినా, సరే! సాహసిద్దాం. ముందు నీవు సప్త ప్రాకారాలనూ భేదించుకొని మయూరద్వీపం లోపలి కెళ్ళు. నీ మూలికాశక్తితో కాళ్ళు మయూరదీపానికి తగలకుండా చూచుకో," అన్నాడు త్రిశరుడు.

"ప్రభూ, జ్యోతిష్మతీ భస్మం కేవలం రాత్రి వేళల్లో మాత్రమే పని చేస్తుంది," అన్నాడు జయసింహుడు అనుమానంగా.

"అలాగే. ఒక్క రాత్రి పని చేసినా చాలు. మరునాట నుండి అక్కడ ఎలా తిష్ఠ వేసు



కావాలో మనం ఆలోచించవచ్చు," అన్నాడు త్రిశరుడు.

"ఈ సప్త ప్రాకారాలను జయించటం ఎలా?" అన్న సంశయం జయసింహుడు వెలిబుచ్చితే, త్రిశరుడు ఇలా అన్నాడు.

"చెప్తాను విను. మొదటి ప్రాకారంలో ఉండే వాడు భూధదరుడు. ఇతడు ఒక బ్రహ్మరాక్షసుడు. ఉగ్రభైరవుడు వాణ్ణి పట్టి తెచ్చి, తొలి ప్రాకారంలో కాపలా వుంచుకొన్నాడు.

"అతడు వచ్చిన వారినందరినీ ఏవేవో ప్రశ్నలడుగుతూ వుంటాడు. అడిగిన తరవాత వారిని భుజిస్తూ వుంటాడు.


"నాకు ఇంత మటుకే తెలుసు. ఇలా ఎందుకు జరుగుతున్నదో తెలియదు.

"నేను ఉగ్రభైరవుణ్ణి ఒక్క రాత్రి మోసగిస్తాను. అంటే అతణ్ణి మాయాదర్పణం దగ్గర లేకుండా అక్కడి నుండి చాలా దూరం వెళ్ళిపోయేటట్లు చేస్తాను.

"ఆ రాత్రి లోపలే నీవు ఏడు ద్వారాలను భేదించుకొని మయూరద్వీపం లోనికి ప్రవేశించి అవంతీసుందరిని కలియాలి. ఆలస్యమైతే, మళ్ళీ మొదటికే మోసం వస్తుంది. సూర్యోదయమైతే నీ జ్యోతిష్మతి పనిచేయదు. ఉగ్రభైరవుణ్ణీ ఆపలేము."

జయసింహుడు గట్టిగా నిట్టూర్చి, "ప్రభూ, ఒక్క రాత్రిలో ఏడు ప్రాకారాలనూ జయించటం దుస్సాధ్యమైన పనిలాగానే కనపడుతున్నది. అయినా ప్రాణాలకు తెగించి నేనీ సాహస కార్యం చేస్తాను," అన్నాడు.





అప్పుడు త్రిశరుడు నవ్వి, "లోగడ వచ్చిన వారంతా ప్రాణాలకు తెగించే ఈ సాహస కార్యం చేశారు. నీవు కూడా అలా చేయటంలో విశేషమేముంది? ప్రాణాలు పోవటం సమస్యకు పరిష్కారం కాదు కదా!" అన్నాడు.

"ప్రాణాలు రక్షించుకుంటూనే నేనీ కార్యం తప్పక సాధిస్తాను. ఆ నమ్మకం నాకు వుంది," అన్నాడు జయసింహుడు.

"భేష్, అలా అన్నావు బాగుంది. ఇక ఆలస్యమెందుకు? మనం ఇక్కడి నుండి బంగారు ద్రావకపు సెలయేటి వద్దకు పోవాలి. అక్కడ కొండకొమ్ము మీద నుండి మయూరాక్షీ ద్వీపానికి పోయే మార్గం నీకు చూపిస్తాను. ఈ లోపల నేను ఉగ్రభైరవుణ్ణి మాయా దర్పణం నుండి కొంత సేపు తప్పిస్తాను. పద," అన్నాడు త్రిశరుడు.

మదనమంజూష వచ్చి, "ఏమి జరిగింది?" అని ప్రశ్నించింది.

త్రిశరుడు తన వ్యూహాన్ని ఆమెతో చెప్పి, ఆ తరవాత ఇలా అన్నాడు.

"తల్లీ, నీవు జయసింహుణ్ణి కొండకొమ్ము వద్దకు తీసుకొని పో. ఈలోగా నా ఆధీనంలో వున్న శరభద్వీపం వద్దకు నేను పోతాను. మాయాదర్పణంలో నన్ను ఉగ్రభైరవుడు చూస్తాడు. అతడికి నేను శరభద్వీపం నుండే ఒక సందేశం ఇస్తాను. దానితో, అతడు మాయాదర్పణం వున్న గది నుండి దూరంగా వస్తాడు. ఈ లోపల నీవు జయసింహుణ్ణి మయూర ద్వీపానికి సాగనంపు."


అందుకు అంగీకరించింది మదనమంజూష సంతోషంగా.

త్రిశరుడు జయసింహుణ్ణి ఆశీర్వదించి పంపేశాడు.

అక్కడి నుండి ముగ్గురూ బయలుదేరారు.

మదనమంజూష జయసింహుణ్ణి వెంట బెట్టుకొని తన మందిరంలో నుండి ఇవతలికి వచ్చి, "మీరు మళ్ళీ రామచిలుకగా మారిపోతే చేతి మీదికి ఎక్కించుకొని, సెలయేటి వద్దకు చేరుస్తాను," అంది.

జయసింహుడు నవ్వి, "వద్దు, నేను కఠోర బ్రహ్మచారిని. రామచిలుకగా మారటం



ఎందుకు? నీ చేతులలో నలిగిపోవటమెందుకు? రాజహంసగా మారి నీతోపాటు ఎగురుకుంటూ వస్తాను. పద," అన్నాడు.

మదనమంజూష జయసింహుడితో ఆకాశ మార్గంలోనికి ఎగిరింది. జయసింహుడు రాజ హంసగా మారి, మదనమంజూషను అనుస రించాడు. ఇరువురూ అలా ఎగురుతూ ముందుకు సాగిపోయారు.

కొంత సేపటికి సెలయేరు వున్న పర్వతం వచ్చింది.

అక్కడ మదనమంజూష దిగింది. ఆమె వెనుకనే జయసింహుడు కూడా దిగి తన నిజ రూపాన్ని ధరించాడు.

అక్కడ కొండ మీద రెండు బండల మధ్య ఇరువురు పడి ఉండటం కనిపించింది వారికి.

"వీరెవరు? ఎలా వచ్చారు?" అంటూ విచి త్రంగా చూస్తున్నది మదనమంజూష.

ఈలోగా జయసింహుడు వారిని పోల్చు కున్నాడు.

"మంజూషా, వీరిద్దరూ నా మిత్రులు. వీరి పేర్లు కరటకశర్మ, గదాధరుడు. వీరు కూడా మయూరాక్షి సాధన కోసం వచ్చిన వారే. వీరికి జ్యోతిష్మతీ భస్మాన్ని ఇచ్చి పంపాను. పగటి పూట ఏ చోటనో సముద్రంలో మునిగి వుంటాయి. కొట్టుకొని వచ్చి ఈ తీరం చేరి, చేప తోకల తాకిడికి కొంతకొమ్ము మీదికి చేరి వుంటారు." అని చెప్పి జయసింహుడు వారి దగ్గరకు వెళ్ళి, వారిద్దరినీ అటూ ఇటూ కదిపి చూచాడు.

వారిద్దరూ స్పృహ తప్పారే కాని ప్రాణాల



త్రనే వున్నారు. జయసింహుడు వారికి సప ర్యలు చేసి కొద్దిగా మంచినీళ్ళు తాగించాడు.

దానితో ఇద్దరూ లేచి కూర్చున్నారు. జయ సింహుణ్ణి చూచి కరటకశర్మ బావురుమన్నాడు.

జయసింహుడు అతి కష్టం మీద వారిని ఓదార్చాడు.

"మదనమంజూషా! వీరు నా స్నేహితులు. నేను వచ్చే వరకూ వీరిని చూస్తూ వుండు!" అన్నాడు జయసింహుడు.

"బాబూ! జయసింహా! నీవు ఎక్కడికి పోతు న్నావు? నిన్ను వదిలి మేము ఇక్కడ వుండ లేము. మేమూ నీతోనే వస్తాము." అని మంకు పట్టు పట్టాడు కరటకశర్మ.

మదనమంజూష వీరి ముఖాలు చూస్తూనే వీరి స్వభావాలను గ్రహించింది. వీరంత నమ్మ దగిన మనుష్యులు కారని ఆమెకు తెలిసి పోయింది.

"అడుగు పెడితేనే భగ్గున మండి పోయే మయూరద్వీపం లోనికి మీరు ఎలా పోగలరు? జయసింహుడు వెళ్ళి అవంతీసుందరిని విడిపించుకొని వస్తాడు. అప్పటి వరకూ మీరు నా వద్ద ఉండండి," అన్నది మదనమంజూష.

గదాధరుడు మదనమంజూషను చూశాడు. ఇలలో కాదు. కలలో కూడా అతడు అంతటి మహా సౌందర్యాన్ని చూడలేదు.

'అవంతీసుందరీ, అర్థరాజ్యమూ లేకపోతే పోనీ. ఈ మదనమంజూష భార్య అయితే ఎంత బాగుండును,' అని అనుకున్నాడు మన సులో గదాధరుడు.

"పొరపాటున సముద్రంలోకి దిగటంతో



మూలికా ప్రభావం నశించిపోయి కొట్టుకొని వచ్చాము కాని, జయసింహుడి పాటి సాహసం మాకు లేక కాదు. మయూరద్వీపానికి ఎలా పోవాలో చెప్పండి. నేనే అవంతీసుందరిని సాధించుకొని వస్తాను," అంటూ మదన మంజూష ముందు ప్రగల్భాలు పలికాడు గదాధరుడు.

మదనమంజూష ఈ మాటలు విని తనలో తాను నవ్వుకొని, "అలా అయితే మీరొక పని చేయండి. ఇక్కడికి కొంత దూరంలో శరభ ద్వీపమనే ఒక ద్వీపం ఉంది. ఉగ్రభైరవుడి ప్రాణాలు అందులో వున్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో నేను చూపిస్తాను. మీరు వాటిని హరించండి. ఉగ్రభైరవుణ్ణి చంపితే అవంతీ సుందరిని స్వాధీనం చేసుకోవటం చాలా సులభం!" అన్నది.

"అలా చెప్పండి. ఉగ్రభైరవుడి ప్రాణాలను నిమిషంలో పట్టుకుంటాము. ఆ శరభద్వీపం ఎక్కడ ఉందో చూపించండి," అన్నారు వారిద్దరూ.

జయసింహుడు తన జోలెలో నుండి కొంత జ్యోతిష్మతీ భస్మాన్ని తీసి వారికి ఇచ్చాడు.

మదనమంజూష జయసింహుణ్ణి దూరంగా తీసుకొని వెళ్ళి, అతడి చెవిలో, "నీ స్నేహితులంత నమ్మదగినవారిలా కనిపించటం లేదు," అంటూ మయూరద్వీపానికి గల మార్గాన్ని చెప్పింది.

జయసింహుడు నిజమేనన్నాడు.

"మంచిది. మీరిక క్షేమంగా వెళ్ళి లాభంగా రండి. వీళ్ళ సంగతి నేనే చూచుకుంటాను," అన్నది మదనమంజూష.

అప్పటికి సాయంకాలమైంది.

అప్పుడు జయసింహుడు మదనమంజూష వద్ద సెలవు తీసికొని, గురుదేవుణ్ణి స్మరించి, రాజహంస లాగా మారి మయూరద్వీపం వైపు ఎగురుతూ పోయాడు. —(ఇంకా ఉంది)





మాయాదర్పణం

16

[జయసింహుడూ త్రిశరుడూ ఉగ్రభైరవుణ్ణి నిర్జించేందుకు తాము పన్నిన వ్యూహాన్ని మదనమంజూషకు వివరిస్తారు. ఆ పైన ఆమె జయసింహుణ్ణి కొండకొమ్మకు తీసుకొని పోతుంది. అక్కడ వారికి గదాధర కరటకశర్మలు కనిపిస్తారు. వారి ప్రగల్భాలు విని, ఆమె నవ్వుకుంటుంది. జయసింహుడు రాజహంసగా మారి మయూరద్వీపానికి బయలుదేరుతాడు.
—తరవాత]

మదనమంజూష కరటకశర్మనూ, గదాధరుణ్ణీ వెంటబెట్టుకొని త్రిశరుడి వద్దకు తీసుకొని పోయింది. త్రిశరుడు వాళ్ళను చూచి వివరాలు చెప్పి అడిగాడు. అప్పుడు మదనమంజూష జరిగినదంతా తండ్రితో చెప్పింది.

"సరే, వీళ్ళు కూడా సమయానికే వచ్చారు. వీళ్ళను నాతో శరభద్వీపానికి పంపు. వీళ్ళతో ఒక పని సాధించ వచ్చు," అన్నాడు త్రిశరుడు.

తాము ఏదో మహా కార్యానికి పనికి వస్తామనీ, తమలను శరభద్వీపానికి తీసుకొని పోతారనీ త్రిశరుడి అనగానే ఎక్కడలేని సంతోషం పొంగి వచ్చింది వారిద్దరికీ.

"మమ్మల్ని శరభద్వీపం తీసువెళ్ళండి చాలు. ఉగ్రభైరవుడి ప్రాణాలను నిమిషములో స్వాధీనం చేసుకుంటాము. మీకు ఏమైనా కష్టం వస్తే ఆదుకొనేందుకు మేమున్నాము," అన్నాడు కరటకశర్మ.

ఈ మాటలు విని త్రిశరుడికి, వీళ్ళు వట్టి కోతలరాయుళ్ళు," అన్న విషయం తెలిసిపోయింది.

సింహం వంటి జయసింహుడికీ ఈ గుంటనక్కలు ఎలా స్నేహితులుగా దొరికారో అర్థం కాలేదు త్రిశరుడికి.

"మంచిది. నాతో రండి." అని త్రిశరుడు గగన మార్గంలోకి ఎగిరాడు.

వారిద్దరూ జ్యోతిష్మతీ ప్రభావంతో త్రిశరుణ్ణి వెంబడించారు. అప్పటికే బాగా చీకటి

యం. ఉమాదేవి



పడి రాత్రి అవటంవల్ల వారి జ్యోతిష్మతీ మూలిక పని చేసింది.

పొద్దు పోయిన తరవాత వారు ముగ్గురు శరభద్వీపం చేరుకున్నారు.

త్రిశరుడు వారిని వొకచోట నిలుచోబెట్టి, "మీరిద్దరూ ఇప్పుడొక కార్యం సాధించాలి. నేను చెప్పినట్లు చేయండి," అని కరటక శర్మను గదాధరుడి వీపు మీది కెక్కించాడు.

ఆ తరవాత, ఇరువురి ముఖాలూ కనపడకుండా ఒక పెద్ద దయ్యపు ముసుగును కప్పాడు త్రిశరుడు. ఆపైన వారిని నడవమని చెప్పాడు.

కరటకశర్మ గదాధరుడి వీపు మీదికి ఎక్కినా పొడవైనవాడు కాబట్టి, కాళ్ళు నేలకు అనుతున్నాయి. ఇరువురూ తమ రెండు జతల కాళ్ళూ నేలకాన్చి నడుస్తున్నారు. దూరం నుండి ఈ దృశ్యం చూచే వారికి ఒక విచిత్రమైన జంతువు నాలుగు కాళ్ళతో నడుస్తూ నాలుగు చేతులు ముందుకు ఊపుకుంటూ పోతున్నట్లనిపిస్తుంది.

ఈ లోపల త్రిశరుడు ఒక అగ్నిదండం చేత పట్టుకొని శరభద్వీపానికి అవతలి వైపుగా వెళ్ళి ద్వీపంలోని చెట్లమీద నిప్పులు కురిపించాడు. ఆకాశం నుండి నిప్పులు పడటంతో ఎండిన చెట్లు అంటుకొని భగ్గున మంట చెలరేగింది.

ఇది చూచి, కాపలా ఉన్న పది శరభాలూ పెద్దగా ఘీంకరించాయి. సర్పాలవలె బుసలు కొట్టాయి. ఉగ్రభైరవుడు మాయాదర్పణంలో నుండి ఈ దశ్యాన్ని చూచాడు.

అప్పుడు త్రిశరుడు చేతులు జోడించి, "అయ్యా, ఉగ్రభైరవుల వారూ! శరభద్వీపానికి ఏదో ముప్పు వచ్చింది, నాలుగు కాళ్ళ విచిత్రపు దయ్యం ఎక్కడి నుండో శరభద్వీపం మీదికి దండయాత్రకు వచ్చింది. నేను దీనితో పోరాడుతూ వుంటాను. ఈ లోపల మీరు మయూర సైన్యాన్ని పంపించండి," అని అన్నాడు

త్రిశరుడి రూపమూ, గొంతు మాయా దర్పణం ద్వారా గ్రహించిన ఉగ్రభైరవుడు మయూరాక్షి మందిరం నుండి వెలుపలికి వచ్చి ఇలా ఆజ్ఞాపించాడు.

"ఓ మయూర సేనానీ! నెమిలి సైన్యంతో శరభద్వీపానికి ఒకసారి వెళ్ళు."


"చిత్తం మహాప్రభో!" అంటూ మయూర సేనాని తన నెమిళ్ళగుంపును వెంట తీసుకొని శరభద్వీపానికి అభిముఖముగా పయనింప సాగాడు.

మయూర సైన్యం చేత పరివేష్టింపబడి ఉన్న మందిరంలో అవంతీసుందరి శిలా ప్రతిమ ఉంది. ఉగ్రభైరవుడు ఓసారి అవంతీసుందరితో మాట్లాడాలని అనుకొన్నాడు. వెంటనే, శిలా ప్రతిమను ఒక బల్ల ఉయ్యాల మీదికి ఎక్కించాడు.

మందిరపు పై భాగంనుండి వ్రేలాడుతున్న బంగారు గొలుసునకు ఆ బల్ల ఉయ్యాల బిగింపబడి ఉంది. ఈ కారణం చేత బొమ్మ కాళ్ళు మయూరద్వీపంలోని నేలకు తాకటం లేదు. ఉగ్రభైరవుడు తన చేతిలోని మంత్రదండాన్ని అవంతీసుందరి ప్రతిమ తలకు తాకిందాడు.


మరుక్షణమే అవంతీసుందరి తన నిజ స్వరూపం దాల్చింది. ఆమెకు ఎదురుగ్గా ఉగ్రభైరవుడు వున్నాడు. అతడి ముఖం నల్లని ముసుగుతో కప్పబడి ఉంది.

"అవంతీసుందరీ, నీవు ఎవరవో నాకు తెలుసు. కాని నేను నీకు తెలియదు. అయితే, నేను ఎంత శక్తిమంతుడనో ఇప్పటికి గ్రహించి ఉంటావు. నేను తలచుకొంటే క్షణంలో నిన్ను బూడిదకుప్పగా మార్చగలను. కాని, నిన్ను



చంపకపోవటానికి కారణం ఉంది. నీ రూపం చూచాక, నీ మీద నాకు అభిమానం ఏర్పడింది. నేను తల్చుకొంటే విద్యాధర రాజ కన్యలూ, అప్సరసలూ నా ముంగిట్లోనే ఉన్నారు. వారిని క్షణంలో వివాహం చేసుకొనగలను. నా మనస్సు ఎందుకో నీ మీదికి పోయింది. నీవు నన్ను పెళ్ళిచేసుకో. భారత స్త్రీలకు భర్తయే ప్రత్యక్ష దైవం కదా! అప్పుడు నిరంతరం నీవు నన్ను సేవిస్తూ ఉంటావే కాని నాకు అపకారం తల పెట్టలేవు. అందుకే ఇలా కోరుకుంటున్నాను," అన్నాడు ఉగ్రభైరవుడు.

ఉగ్రభైరవుడు ఇలా అవంతీసుందరిని లోగడ ఒకటి రెండు సార్లు పలకరించక పోలేదు. అయితే, ఆమె కన్నెత్తికూడా అతడి



వైపు చూడలేదు. ఈసారి మాత్రం సాహసించి ఆమె ఇలా అన్నది.

"నేను భారతదేశపు రాజకుమారిని. నీవు చూస్తే ఒక జంతువు లాగా కనిపిస్తున్నావు. నీ దయ్యపు ముసుగూ, మంత్రదండమూ చూస్తుంటే నాకు భయం ముంచుకొస్తున్నది. నీవు ఇంతకూ జంతువువో, మనిషివో, పామువో, మంత్రాల భైరవుడివో నాకు తెలియదు. నీకూ నాకూ ఎలా పొత్తు కుదురుతుంది?"

ఉగ్రభైరవుడు ఈ మాటలు విని కోపగించు కోలేదు.

"అదేనా నీ సందేహం? చూడు, నేను అతిలోక సుందరుడిగా మారి నీముందు నిలువ గలను. నీవు మాత్రం ఈ బంగారపు ఉయ్యాల నుండి క్రిందికి దిగవద్దు. కాలు నేలకు తగి లితే భగ్గున మండి భస్మమైపోతావు," అని చెప్పి, ఆపైన తన శయన మందిరం లోపలికి వెళ్ళాడు ఉగ్రభైరవుడు.

అక్కడ తన రూపంలోనే ఉన్న ఉగ్ర భైరవ సేవకులను పిలిచి, "నేను ఎలా ఉంటే అతిలోక సుందరుడివలె ఉంటానో అలా నన్ను అలంకరించండి," అన్నాడు.


"చిత్తం. మహాప్రభో!" అంటూ ఉగ్రభైరవ సేవకులు తమ యజమానిని జయంతుడి లాగా, ఆపైన మన్మథుడిలాగా అలంకరించ టము మొదలు పెట్టారు.


ఎలా అలంకరించుకున్నా, ఉగ్రభైరవుడికి తన చక్కదనం తనకే తృప్తి కలిగించటం లేదు. అందువల్ల అలంకరణ చేయటం, తీసి వేయటం, మళ్ళీ చేయటం ఇలా తెల్లవార్లూ అలంకరణ సాగుతూనే ఉంది.

ఇక్కడి పరిస్థితి ఇలా వుండగా, జయసిం హుడు రాజహంస రూపంలో గగన మార్గంలో ఎగురుతూ మదనమంజూష సూచించిన దారిలో పయనించాడు.

అలా పోయిపోయి రాత్రి బాగా పొద్దుపోయే సరికి సాగరతీరాన్ని చేరుకున్నాడు.

అక్కడి నుండి వెన్నెల్లో మయూరద్వీపం పడుకొన్న ఒక నెమలి ఆకారంలో కనపడు తున్నది. రాజహంస నేల మీదికి కాలు మోప కుండా మొదటి ప్రాకారంలోకి ప్రవేశించింది.





రాజహంస ప్రవేశించగానే ఆ ప్రాకారంలోని భూమి కదిలినట్లు అనిపించింది.

"అరెరే, ఎవడురా వాడు? మనిషా? పిట్టా? మసి చేసేస్తా," అంటూ భూమి దద్దరిల్లేటట్లు అరిచాడు భూధరుడు.

'అమ్మో, రాక్షసుడు మేలుకొనే వున్నాడే!' అని మనస్సులో అనుకొని, ఆ పైన పైకి, "అయ్యా, రాక్షసులవారూ! మీకు నేను అపకారం తలపెట్టే దాన్ని కాను. నేను దారి తప్పిన రాజహంసను. ఇలా దిక్కు తోచకుండా ఎగురుతూ ఈ వైపుకు వచ్చాను, బాబూ!" నన్ను ఈ రాత్రికి ఇక్కడ విశ్రమింపనీయండి. సూర్యోదయం కాగానే, వెళ్ళి పోతాను," అని ప్రార్థించింది రాజహంస.

"నీ దొంగమాటలు కట్టిపెట్టవే కొంగజాతికి చెందిన పక్షీ! మయూరద్వీపంలోని నిధుల కోసం ఇలా మారువేషాలలో నువ్వు కాదు నీ తలలోని జేజెమ్మల వంటివారు వచ్చారు. వచ్చి మసి అయిపోయారు. నిన్ను నేను నమ్ముతానా?". అన్నాడు భూధరుడు.

"నమ్మండి, రాక్షసులవారూ! నిజంగా నేను ఓ తపోవనంలోని రాజహంసను. మా గురువులవారు, వేదాలూ, శాస్త్రాలూ తన శిష్యులచేత వల్లె వేయిస్తూంటే విని నేర్చుకొన్నాను. అబద్ధం చెప్పను." అంది రాజహంస.

"మంచిది. అలా అయితే నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను, జవాబు చెప్పు. తప్పు చెప్పావంటే ఇక్కడే భగ్గున మండి బూడిద అయిపోతావు" అన్నాడు భూధరుడు.

"అడగండి, రాక్షసులవారూ! యథాశక్తి ప్రయతిస్తాను," అంది రాజహంస.

"నిప్పుకు ఆధారం ఏమిటి?" అని అడిగాడు భూధరుడు.

"నిప్పుకు ఆధారం నీళ్ళు. నీటినుండి నిప్పు పుడుతుంది. 'అగ్నిర్వా మాపా మాయతనం!' అన్నారు కాదా!" అంది రాజహంస.

"అయితే, ఆ నీటికి ఆధారం ఏమిటి?" అని అడిగాడు భూధరుడు.

"నీటికి ఆధారం గాలి. 'వాయుర్వా అపా మాయతనం!' అన్నది ఆర్యోక్తి," అంది రాజహంస.

దానికి భూధరుడు పెద్దగా నవ్వి. "అయితే, ఆ గాలికి అధారం ఏదో చెప్పు, రాజహంసా?" అని అడిగాడు.

అప్పుడు రాజహంస, "గాలికీ మళ్ళీ నీళ్ళే ఆధారం. 'అపోవై వాయో రాయతనం', అని కదా ఆర్యోక్తి!" అంది.


"ఆ నీటికి అధారం గాలి అన్నావు కదూ?" అని నొసలు చిట్లించాడు భూధరుడు.

"అవును, కాదు. ఈ నీటికి మళ్ళీ ఆధారం సూర్యుడు. సూర్యుడి వలన మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తాయి, 'అపోవా అముష్య తపత అయతనమ్,' అన్నారు పెద్దలు," అని జవాబు ఇచ్చింది రాజహంస.

"ఈ నీళ్ళకు ఆశ్రయం భూమి. భూమి మీదనే నీళ్ళు వున్నాయి కదా? నాకు నువ్వు ఏదో తికమకలు చెప్పుతున్నావు," అన్నాడు నవ్వుతూ భూధరుడు.

"కాదు, భూధరులవాడూ! నీళ్ళలో భూమి నావ వలె నిలబడి ఉంది. మళ్ళీ ఆ నీళ్ళన్నీ భూమి మీదనే ఉన్నాయి. నీటికి అధారం భూమి. ఆ భూమికి అధారం నీరు," అని చెప్పి రాజహంస రూపంలోని జయసింహుడు ఇలా ఒక మంత్రం చదివాడు.

"యోప్సునావం ప్రతిష్ఠితామ్
వేద ప్రత్యేవ తిష్ఠతి
ఇమే లోకా అప్సుప్రతి
ష్ఠితాః తదేషా అభ్యసూక్తా."



ఈ మంత్రం వినగానే, భూధర రాక్షసుడు తల తిరిగి పోయి ఇలా అన్నాడు.

"అయ్యా, నీవు రాజహంసవు కావు! వేద మూర్తివి! నీ మంత్రాలతో నేను పునీతుడనైనాను. నేనొక బ్రహ్మరాక్షసుణ్ణి. నన్ను ఉగ్రభైరవుడు బంధించి తెచ్చి తన మొదటి ప్రాకారంలో కాపలా ఉంచుకొన్నాడు.

"నాటి నుండీ మయూరాక్షి కోసం వచ్చిన ఎందరిని నేను బలి తీసుకున్నానో నాకే తెలియదు. ప్రతివాడూ తన మంత్ర తంత్రాలతో నా మీదికి దూకేవాడే కాని, నా ప్రశ్నలకు సమాధానం చెప్పగలవాడు ఎవడూ లేక పోయాడు.

"ఓ రాజహంసా! నీవు నిజమైన రాజహంస

వంటే నమ్మలేకుండా ఉన్నాను. నీవు ఎందుకు ఈ ద్వీపం మీదికి వచ్చావు?"

"అవంతీసుందరి అనే మా దేశపు రాజకుమార్తెను ఉగ్రభైరవుడు బంధించి తెచ్చాడు. ఆమెను చూచేందుకు నేను లోపలికి వెళుతున్నాను," అంది రాజహంస.

అప్పుడు భూధరుడు ఒక్క క్షణం ఆలోచించి ఇలా అన్నాడు.

"ఓ రాజహంసా! నీవు చాలా సాహసం చేస్తున్నావు. ఇంత దాకా ఉగ్రభైరవుణ్ణి ఎదుర్కొన్నవారు లేరు. అయినా, నీకీ బుద్ధి ఎందుకు పుట్టిందో నాకేం తెలుసు? నీవు నాకు సహాయం చేశావు. కాబట్టి, నేను నీకు ఒక ఉపకారం చేసి పెడతాను.

"ఈ ప్రాకారం దాటిన వెంటనే నీవు జలముఖుణ్ణి ఎదుర్కొన వలసి వస్తుంది. అతణ్ణి ఎవరూ జయించలేరు. తాటిచెట్టు అంత ఎత్తు అలలతో నిన్ను ముంచి చంపుతాడు. అందువలన వెళుతూనే, 'నేను భూధరుడి స్నేహితుణ్ణి. భూవిష్వక్షట్' అనే మాటను అగకుండా అంటూ ఉండు.


"ఇది ఒక రహస్య సంకేతం. దానితో జలముఖుడు నిన్ను వదిలి పెడతాడు.

"ఆ తరవాత, వాయుముఖుడు నిన్ను సుడిగాలిలో తిప్పి చంపవేయుటాసికి ప్రయత్నిస్తాడు. నీవు తెలివి తేటలతో అతడి సుడిగాలిలోనికి ప్రవేశించకుండా అవతలి ప్రాకారం లోపలికి వెళ్ళు.

"అక్కడ అగ్నిముఖుడు ఉంటాడు. అతడు మంటను ఉమ్ముతూ ఉంటాడు. దానిని కూడా నీవు తెలివితోనే జయించాలి. భుజబలం పనికి రాదు. ఆ తరవాత...."

భూధరుడు ఆగి ఆలోచించటం చూచి రాజహంస ఆతురతతో ఏదో అడగబోయింది. అంతలో భూధరుడు నవ్వి, మళ్ళీ ఇలా చెప్ప సాగాడు. — (ఇంకా ఉంది)





మాయాదర్పణం

17

[త్రిశరుడు సులభంగానే ఉగ్రభైరవుణ్ణి బోల్తా కొట్టిస్తాడు. తన నెమిలి సైన్యాన్ని బయటికి పంపి, ఉగ్రభైరవుడు తన చేత బంధించబడిన అవంతిసుందరిని ఆకర్షించేందుకు అలంకరించుకుంటూ వుండగా, రాజహంసగా జయసింహుడు మొదటి ప్రాకారంలోని భూధరుడి మెప్పు పొందుతాడు. అతడు కొన్ని రహస్యాలు జయసింహుడికి చెప్పటం మొదలు పెడతాడు. —తరవాత]

"ఆ తర్వాత, ప్రాకారంలో ఎవరూ ఉండరు. కాని, అందులో ఒక రూపం లేని భూతం ఉంటుంది. అది నిన్ను పట్టి చంపివేస్తుంది.

"దానిని దాటితే అప్సరసల ప్రాకారం వస్తుంది. వాళ్ళు నిన్ను లోబర్చుకొనేందుకు ఎన్నో విధాల ప్రయత్నిస్తారు. నీవు వారిని చూచి నవ్వావో, నాశనమైపోయినట్లే లెక్క!

"నిన్ను నవ్వించేందుకు వారెన్నో ఎత్తులు వేస్తారు. ఎన్నో రహస్య కథలు చెపుతూ వుంటారు. నీవు మాత్రం నవ్వ కూడదు.


"ఇకపోతే, ఏడవ ప్రాకారంలో నెమిళ్ళ సైన్యం ఉంటుంది. అది ఇందాకనే ఎగురుకుంటూ శరభద్వీపానికి పోవటం నేను చూచాను. కాబట్టి, ఆ సైన్యం తిరిగి వచ్చే లోపల నీవు ఏడవ ప్రాకారం కూడా దాటగలిగితే నిన్ను ఆపేవారు వుండరు.

"కృతజ్ఞతలు. మరి మయూరద్వీపంలో వచ్చే కష్టాలేమిటి చెప్పి పుణ్యం కట్టుకోరాదా, భూధరుడా!" అంది రాజహంస.

"కాలు నేలకు తాకించకుండా సంచరించాలి. పన్నెండుమంది ఉగ్రభైరవ రూపులను జయించాలి. మిగిలిన వివరాలు నీకే తెలుస్తాయి. ముందు, ఈ ఏడు ప్రాకారాలను జయించు. నీకు శుభమౌతుంది," అన్నాడు భూధరుడు.

రాజహంస ఒక్క క్షణం కూడా ఆగకుండా వెళ్ళి, జలముఖుడి ప్రాకారంలోకి ప్రవేశించింది.

యం. ఉమాదేవి



ఇదిలా ఉండగా, అక్కడ అమరావతి నగరంలో రాజాంతఃపురంలోని వారికి ఆందోళన ఎక్కువైంది. ముఖ్యంగా పరంతప మహారాజుకు దినం ఒక యుగంగా గడవ సాగింది. అవంతీసుందరిని అన్వేషించటానికి వెళ్ళిన వారిలో ఒక్కరూ తిరిగి రాలేదు. గురుచరణుల వారి వద్ద నుండి కూడా సమాచారం ఏదీ మళ్ళీ అందలేదు.

పైగా, మహారాణి కల్పనాదేవికి ఎంత కాలమని ఈ రహస్యం తెలియకుండా దాచిపెట్టి ఉంచటం? ఏ చెలికత్తె అయినా నోరు జారి అన్నదంటే ఇంతకాలం నుండి తాము చేసిన ప్రయత్నం అంతా వ్యర్థమై పోయినట్లే!

ఇలా మహారాజు మనోవ్యాధితో బాధపడుతూ వుండగా, కల్పనాదేవి పరంతపుడి దగ్గరికి వచ్చి, "ప్రభూ, నాకు ఒకసారి మన చిన్నారి అవంతిని చూడవలెనని ఉన్నది. ఆమెను ఒకసారి పిలిపించండి," అన్నది.

పరంతపుడి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయి, తేరుకొని, "దేవీ, బాలారిష్టాలు తీరే వరకూ ఆమె గురుచరణుల వారి వద్దనే ఉండటం మంచిది అనుకొన్నాం కదా! ఆమెను ఎప్పుడు పంపాలో స్వామివారే నిర్ణయిస్తారు!" అన్నాడు.

"అలా అయితే, ఒకసారి మనమే భరద్వాజాశ్రమానికి వెళ్ళి, అమ్మాయిని చూచి వద్దాం," అన్నది కల్పనాదేవి.

కల్పనాదేవితో అమ్మాయిని చూడటానికి వీల్లేదని పరంతపుడు ఎలా చెప్పగలడు?

"సరే, గురువుల వారికి కబురు చేసి, బయలుదేరుదాం." అంటూ మహారాజు వెంటనే గురుచరణుడికి ఒక లేఖ వ్రాసి నమ్మకస్థుడి ద్వారా పంపాడు.

గురుచరణుడు ఆ లేఖను చదివి, "భయం లేదు. కల్పనాదేవిని తీసుకొని రండి." అని మైత్రేయుడితో సందేశం పంపించాడు.

పరంతపుడికి ఆశ్చర్యం వేసింది. కల్పనాదేవి ఆశ్రమం లోనికి వెళ్ళి కుమార్తెను చూపమంటే గురుచరణుడు ఏమి చేయగలడు? ఏ ధైర్యంతో ఇలా రమ్మని కబురు పంపాడు? పరంతపుడు బరువుబాధ్యతలన్నీ భగవంతుడి

మీద ఉంచి, గురుచరణుడి సన్నిధికి మహారాణితో సహా రథం మీద బయలుదేరాడు.

మహామంత్రి బృహస్పతిభట్టు మరొక రథంలో ప్రభువును అనుసరించాడు.

వారు భరద్వాజాశ్రమానికి చేరేసరికి చీకటి పడింది. అందరూ రథాలు దిగి ఆశ్రమం లోనికి ప్రవేశించారు. వారికి అప్పుడు ఏదో విచిత్రమైన నవ్వు వినిపించింది.

ముగ్గురూ పర్ణశాలకు బయటనే కొన్ని క్షణాలాగి కిటికీలో నుండి లోనికి చూచారు. గురుచరణుడు పర్ణశాల లోపల ముగ్గు వేసి చుట్టూ నిమ్మకాయలు పెట్టి మధ్యలో చిన్న సిద్ధుణ్ణి కూర్చోబెట్టాడు. మంత్రాలు చదివి అతడికి ధూపం వేశాడు.

"చూడు, చూడు, అంజనదేవతా! జయసింహుడు ఎక్కడ ఉన్నాడు?" అని ప్రశ్నించాడు గురుచరణుడు.


చిన్నసిద్ధుడు తలను ఊగిస్తూ, "మానవులకు, దేవతలకు, దానవులకు అందని మయూరద్వీపం, అంజనానికి కూడా అందని మయూరద్వీపం ... లోని మయూరాక్షి .... మయూరాక్షి మక్కున మాయాదర్పణం.... హా హా హా హా హా మాయాదర్పణం," అన్నాడు.

"ఓ అంజనదేవతా! జయసింహుణ్ణి చూడు," అని గురుచరణుడు అంటే. చిన్నసిద్ధుడు, "రాజకుమారుడు కనపడటం లేదు. రాజహంస కనపడుతున్నది.... కామరూపధారి అయిన జయసింహుడు రాజహంసగా మొదటి ప్రాకారాన్ని జయించాడు. భూధరుణ్ణి చెర నుండి విడిపించాడు. జలంధర రాక్షసుణ్ణి ఏమరొక్కనే నిమిత్తం రెండవ ప్రాకారం లోనికి రాజహంస ప్రవేశించింది!" అన్నాడు.



"ఆ పైన ఏం జరిగింది? అంజనదేవతా!" అని అడిగాడు గురుచరణుడు.

"హా హా హా హా హా!" అని చిన్నసిద్ధుడు నవ్వుతూ, తల తిప్పుతూ, అటూ ఇటూ ఊగుతూ, "రాజహంస రెండవ ప్రాకారం లోనికి ప్రవేశించింది. రాజహంసను చూచిన జలధరుడు ఆకాశం ఎత్తున ఎగిరి పడ్డాడు. తాటిచెట్టు ఎత్తు ప్రమాణంగల అలలతో రాజహంసను ముంచటానికి ప్రయత్నిస్తు



న్నాడు. అదిగో, రాజహంస ఏదో మంత్రం చదువుతున్నది! 'జలధరులవారూ, నేను మీ భూధరుడి స్నేహితుణ్ణి. నన్ను జల ప్రళయంలో ముంచవద్దు. భ్రూవిష్వక్షట్, భ్రూవిష్వక్షట్,' అని అంటున్నది రాజహంస," అన్నాడు.

"ఆ పైన ఏమైంది అంజనదేవతా! చెప్పు." అన్నారు గురుచరణుడు.

"అలలు శాంతించాయి! ఆకాశంలోని రాజహంస చిరునవ్వు నవ్వుతున్నది. జలధరుడు రాజహంసను మూడవ ప్రాకారం లోనికి వదిలి పెట్టాడు. మూడవ ప్రాకారం వాయుముఖుడు వుండేది. సుడిగాలి. పెను గాలి.... భయంకర గాలి హా హా హా హా...."

అంటూండగా, చిన్నసిద్ధుడి ధ్యానం చెదిరి పోయి, స్పృహ తప్పి మంత్రాల ముగ్గులో పడిపోయాడు.

'ఇప్పుడేం చేయాలి?' అని గురుచరణుడు ఆలోచిస్తూండగా, ప్రభువుల రాకను నివేదించారు శిష్యులు.

గురుచరణుడు ఏమీ కంగారు పడకుండా వెళ్ళి వారిని లోనికి ఆహ్వానించాడు.


"నా చిట్టి తల్లి ఏది? ఎక్కడ నా అవంతి?" అన్నది కల్యాణాదేవి ఆదుర్దాగా.

"ఇక్కడే ఉన్నానమ్మా! మీ రాకను గురుదేవులు నాకు ముందే చెప్పారు," అంటూ కుటీరంలో నుండి వచ్చి, తల్లిదండ్రులకు పాదాభివందనం చేసింది అవంతీసుందరి.

పరంతపుడూ, బృహస్పతిభట్టూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. తమ కళ్ళను తామే నమ్మలేక పోయారు.

కల్యాణాదేవి అవంతీసుందరిని కౌగిలించుకొని పరవశించి పోయింది. కుమార్తె యోగ క్షేమాలను విచారించింది. అవంతీసుందరి యుక్తియుక్తంగా జవాబులు చెప్పింది తల్లికి. దానితో తల్లి దిగులంతా తీరిపోయింది.

మహారాజును గురుచరణుడు తన ఏకాంత మందిరం లోనికి తీసుకొని వెళ్ళి, "మహారాజా, నీవు ఏమీ భయపడ వద్దు. అంతా సవ్యంగానే జరుగుతుంది. ఇందాక నీవు విన్న అంజనంలోని విషయాలు రాజకుమారి





అన్వేషణకు సంబంధించినవే. నా శిష్యుడు జయసింహుడు ఆమెను త్వరలో తీసుకొని రాగలడనే నమ్ముతున్నాను," అన్నాడు.

"గురువర్యా, ఇంతకూ అమ్మాయి జాడ తెలిసిందా?" అన్నాడు పరంతపుడు.

"కొంత వరకూ తెలిసినట్లే! అంజనాన్ని బట్టి, ఆమె ప్రస్తుతం మయూరద్వీపంలో ఉన్నట్లు ఊహిస్తున్నాను. పూర్తి వివరాలు త్వరలో నేనే చెప్తాను," అన్నాడు గురుచరణుడు.

"మరి మహారాణికి కనబడినది ఎవరూ?" అని అడిగాడు పరంతపుడు.

ఆ ప్రశ్న విని గురుచరణుడు నవ్వి, "ఆమె మాయా అవంతీసుందరి. కల్పనాదేవిని ఓదార్చటం కోసం తాత్కాలికంగా ఈ భ్రమ కల్పించాను," అంటూ ఎందుకో ఉన్నట్లుండి ఒక్క క్షణం ఆగి పోయాడు.

తళుక్కున అతడి మనస్సులో ఏదో ఊహ స్ఫురించింది. మరు క్షణమే అతడు కళ్ళు మూసుకొని ఏదో ఆలోచిస్తూ, తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు అనిపించింది పరంతప మహారాజుకి.

అది గ్రహించి పురంతపుడు. "కులపతీ, మరి నాకు సెలవు ఇప్పిస్తారా?" అని వేడుకున్నాడు.

"మంచిది మహారాజా! నీవు వచ్చి పని అయింది కదా! మరి కొద్ది కాలం కల్పనాదేవికి ఈ విషయం తెలియకుండా కాపాడండి. మన ఆశ్రమం లోనికి నిజమైన అవంతీ సుందరిని తీసుకొని వచ్చి చూపిద్దాము," అన్నాడు గురుచరణుడు.

ఆ ఆత్మవిశ్వాసాన్ని చూచి, పరంతపుడు కూడా ధైర్యం తెచ్చుకొన్నాడు. ఆ తర్వాత. అందరూ తిరిగి రాజధానికి వెళ్ళి పోయారు.

ఆ తర్వాత. గురుచరణుడు తన పూజా మందిరం లోనికి వెళ్ళి ఏకాంతంగా కూర్చున్నాడు. భగవతిని ధ్యానించి కన్నులు మూసుకొని, జయసింహుడికి ఒక సంకేతం పంపాడు.

అప్పుడు జయసింహుడు మూడవ ప్రాకారములో ప్రవేశించాడు. అదంతా భయంకరమైన సుడిగాలులతో నిండి ఉంది.

"దీనిని ఎలా జయించాలా?" అని ఆలోచిస్తూన్నంతలో జయసింహుడి మనస్సులో తటుక్కున ఏదో ఊహ మెరిసింది. దాని గురించి కొంత సేపు తర్కించుకున్నాడు.

'లోపల అవంతీసుందరి ఉండి ఉంటుంది. ఆమెను తప్పించాలి అంటే ఒక మాయా అవంతీసుందరిని సృష్టించటం మంచిది. లేదా, నేనే అవంతీసుందరిగా మారి నా వేషంలో అవంతీసుందరిని శరభద్వీపానికి పంపటం ప్రయోజనకరంగా ఉండవచ్చు.' అని అనుకున్నాడు జయసింహుడు.

ఉన్నట్టుండి, ఈ ఊహ తనకు ఎలా వచ్చిందో జయసింహుడికి అర్థం కాలేదు. బహుశః గురుదేవుడి అనుగ్రహం వలన తనకు ఈ సంకల్పం కలిగినట్లు ఊహించాడు. కష్టకాలంలో ఆశీర్వాదమూ సంకేతాలూ కూడా గురుదేవుడు తనకు అందేటట్లు చేస్తున్నారు.

మాయా అవంతీసుందరి మాట అటుంచి ముందు వాయుప్రాకారాన్ని ఎలా దాటాలా అని ఆలోచించాడు జయసింహుడు.

ఈ గాలి మొత్తం భయంకరమైన హోరుతో నిండి ఉంది. నిజానికిది గాలి కాదు. ఒక రాక్షసుడి నిట్టూర్పులు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు!

దానికి విరుగుడుగా జయసింహుడు మధుర గానం ఆలపించాడు. గంధర్వుడు తనకి ఇచ్చిన విద్యాప్రభావంతో వాయు మండలాన్ని మధుర నాదంతో నింపి వేశాడు. ఆ సంగీత ప్రభావం వలన వాతావరణమంతా ఎటు చూచినా, ఆనందతరంగాలతో ఓలలాడుతున్నది. చూస్తూండగానే సుడిగాలి తగ్గింది.



"ఏయ్ పక్షీ! ఎవరు నువ్వు? పాటపాడుతూ నా ప్రాకారంలోనికి రావటానికి ఎంత ధైర్యం?" అన్న మాటలు వినపడినాయి రాజహంసగా వున్న జయసింహుడికి.

"అయ్యా, నేను దారి తప్పి ఇలా ప్రవేశించాను. వచ్చిన దాన్ని ఆ మయూర ద్వీపాన్ని కూడా చూచి పోదామని ఆశ కలిగింది. నా వలన మీకు ఎట్టి అపకారమూ జరగదు. చిన్న పక్షిని. నా మీద మీకు ఎందుకు కోపం?" అన్నది రాజహంస.

"నీ వలన నాకు అపకారం జరగక పోవచ్చు. కాని, మా వలన నీకు అపకారం జరుగుతుంది. ఈ తర్వాతి ప్రాకారంలో అగ్నిముఖుడు అనే రాక్షసుడు ఉన్నాడు. ఇతడు నిప్పులు కురిపిస్తూ వుంటే నీవు మల మల మాడి పోతావు. ఇక మయూరద్వీపం లోనికి ఎలా వెళతావు?" అని అడిగాడు వాయుముఖుడు.


"మీరే ఏదో పరిష్కారం చూపించాలి." అంది రాజహంస.

"మంచిది. నిన్ను చూస్తే ముద్దు వస్తుంది. నీవు అగ్నిప్రాకారం లోనికి ప్రవేశించగానే ఒక నిప్పులు కక్కే జంతువు నీ మీదికి వస్తుంది. దాన్ని తప్పించుకోవటం అసంభవం. అది నిప్పులను ఉమ్ముతూ, 'అ ఆ ఇ ఈలు అంటే ఏమిటి? అది వ్రాసిన ఒక ఫలకం ఉన్నదా?,' అని ప్రశ్నిస్తూంటుంది. దానికి సమాధానం చెప్పక పోతే మింగి వేస్తుంది," అన్నాడు వాయుముఖుడు.

దానితో, జయసింహుడికి ఆ సమాధానం ఏమిటో స్ఫురించింది. అంతేకాదు, ఈ అగ్ని ముఖుడికీ నారికేళద్వీపానికి ఏదో సంబంధం ఉండాలని తోచింది. అది ఎలాంటిది అయి వుంటుందా అని ఓ క్షణం ఆలోచించాడు. తోచలేదు అతడికి.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

18

[భూధరుడు చెప్పిన రహస్యాలు విని, ముందుకు సాగుతాడు జయసింహుడు. ఈ లోగా, మహారాణి తన కూతుర్ని చూడగోరితే గురుచరణుడు మాయా అవంతిసుందర్ని చూపి, ఆమెను శాంత పరిచి, మహారాజుకి ధైర్యం చెప్పి పంపుతాడు. ఆ సరికి, జయసింహుడు మూడవ ప్రాకారం లోకి ప్రవేశించి, వాయుముఖుణ్ణి మెప్పించి, నాలుగవ ప్రాకారంలో కెళ్ళి చేయవలసిన కిటుకులు తెలుసుకుంటాడు. —తరవాత]

వేగంగా అక్కడి నుంచి బయలుదేరి అగ్ని ప్రాకారం లోనికి ప్రవేశించింది రాజహంస. అందులో ఎక్కడ చూచినా మంటలే కనిపించాయి.

అగ్ని శిఖలకు తన తోక ఎక్కడ అంటుకుంటుందోనని భయపడుతూ దూరంగా ఎగరసాగింది రాజహంస.

అంతలో అగ్నిముఖుడు రాజహంసను చూడనే చూచాడు.


"ఔరౌరా! ఎంత సాహసం? దిక్కు లేని పక్షి మయూరాక్షిని చూడటానికి వెళ్ళటమా? క్షణంలో నేల కరిపిస్తాను," అంటూ భయంకరమైన అగ్నిజ్వాలలను రాజహంస మీదికి కురిపించాడు అగ్నిముఖుడు.

దానితో రాజహంస ఉక్కిరి బిక్కిరి అయిపోయింది.

మరు క్షణమే పక్షిరూపాన్ని వదిలి ఏనుగు రూపం ధరించి, తొండంతో సముద్రంలో నుండి నీటిని పీల్చుకొని తెచ్చి, ఆ మంటల మీద చిమ్మటం మొదలు పెట్టాడు జయసింహుడు. అది చూచి అగ్నిముఖుడు కోపంతో ఇంకా మండిపోయాడు.

"ఔరౌరా! నీవు మామూలు పక్షివి కావనీ మాయావివనీ తెలిసి పోయింది. ఇంక నిన్ను ప్రాణంతో బ్రతకనివ్వను." అంటూ అగ్నిముఖుడు విజృంభించే లోపలే, ఏనుగు తొండం ఊపుతూ, "అ ఆ ఇ ఈ లంటే ఏమిటి? అవి వ్రాసిన ఫలకం ఎక్కడ

యం. ఉమాదేవి



ఉంది?" అని అంటూన్న ఆ ఏనుగు అనే ఈ మాటలు విని అగ్నిముఖుడు నివ్వెర పోయాడు.

"ఔరౌరా మాయావీ! నా విచిత్ర ప్రశ్న నీకు ఎలా తెలిసింది రా?" అని అడిగాడు అగ్నిముఖుడు.

"ప్రశ్నయే కాదు, దానికి సమాధానం కూడా నాకు తెలుసు అగ్నిముఖా! విను. అ అంటే అంకోలం. ఆ అంటే ఆమ్రం. ఇ అంటే ఇక్షువు. ఈ అంటే ఈషిక. ఇవి వ్రాసిన పలక నారికేళ ద్వీపంలో ఉంది. నేను అక్కడి నుంచే వస్తున్నాను. కోతి రూపులు నాకు మిత్రులు. పర్వతకుడు నాకు గురుతుల్యుడు," అన్నది ఏనుగు.

"ఏమిటి? గుహ లోనికి నువ్వు ఎలా వెళ్ళావు?" అని అడిగాడు అగ్నిముఖుడు.

"సర్పాల కోన దాటి ఎగురుకుంటూ పోయాను." అని ఏనుగు అంటూనే, అగ్నిముఖుడు చప్పున చల్లారి పోయాడు.

"నా ద్వీపం వారంతా కోతిరూపులయి పోయారా?" అన్నాడు అగ్నిముఖుడు.

"అవును. మయూరాకి సాధనలో మంత్ర భంగం జరిగింది. ఉగ్రభైరవుడి కోపానికి గురియై కోతిరూపులుగా మారిపోయారు," అన్నది ఏనుగు.

ఆ మాటలు విని అగ్నిముఖుడు ఎంతో బాధ పడ్డాడు.

"నేను నారికేళద్వీపానికి అధిపతిని. ఆ ద్వీపవాసులందరూ నా వారసులే. నన్ను ఉగ్రభైరవుడు పట్టి తెచ్చి, తన ప్రాకారంలో కాపలా ఉంచి, బానిసగా చేశాడు. ఇది జరగటానికి ముందు నేను నా శిష్యుడైన నారికేళ మహర్షికి నేను ఎక్కడున్నదీ సంకేతాల ద్వారా తెలిపాను. తపస్సులో అతడికి ఈ ద్వీప రహస్యాల్ని బొమ్మలు బొమ్మలుగా స్ఫురింప జేశాను. తనకు కనబడ్డ బొమ్మలను సంకేతాలను రాగిరేకు మీద ఆ మహర్షి భద్రపరిచాడు. బానిసగా మారిన నేను మయూర దీపం మీదికి ఎవరు వచ్చినా వారిని సంహరిస్తూ కాపలా కుక్కలాగా పడి ఉన్నాను. ఇదీ నా కథ! ఏనుగు రూపంలో వున్న ఈ


పుణ్యపురుషుడా! నీవు ఎవరవు? ఎందుకు వచ్చావు? మయూరాక్షి గుప్త నిధుల కోసమా?" అని అడిగాడు అగ్నిముఖుడు.

"కాదు. ఉగ్రభైరవుడు తీసుకొని వచ్చిన అవంతిసుందరి కోసం. ఆమె మా దేశపు రాజకుమార్తె," అన్నది ఏనుగు.

అప్పుడు అగ్నిముఖుడు, ఏనుగుకు మాత్రమే వినపడేటట్టు, "మయూరద్వీపం లోపల నీ మాయలూ. కామరూప విద్యలూ ఫలించవు. అయినా. నీ ప్రయత్నం నీవు చేయి. దీని తర్వాత ప్రాకారాన్ని నిరూపుడు కాపాడుతూ ఉంటాడు. అక్కడ ఎవ్వరూ లేరుగదాని నువ్వు ముందుకు సాగిపోతుంటావు. కొంతసేపైన తర్వాత చూచుకుంటే, నీవు ఎక్కడ బయలుదేరావో అక్కడికే చేరుకుంటావు. ఎంత దూరం పోయినా అంతే. ఎన్ని సార్లు పోయినా అంతే. ఏ దిశగా పయనించినా అంతే. బయలుదేరిన చోటికే రాకతప్పదు. ప్రయత్నించు. శుభం కలుగుగాక!" అన్నాడు.

జయసింహుడు ముందుకు సాగిపోతూ ఉండగా రివ్వున ఒక మంటగాలి అతడి చెవి ప్రక్క నుండి అత్యంత వేగంగా దూసుకొని పోయింది.

"ఇక్కడే జరిగే ప్రతి దృశ్యం ఉగ్రభైరవుడి మాయాదర్పణంలో కనపడుతూ ఉంటుంది. ఎలా తప్పించుకొంటావో ఏమో!"



అంటూ మంటగాలి లాగా వున్న అగ్నిముఖుడు ఏనుగు చెవిలో సందేశం వినిపించి ఏమీ ఎరగనట్లు వెళ్ళి పోయాడు.

ఐరావతంలాగా ఠీవిగా తొండం ఊపుకుంటూ ఏనుగు రూపంలోని జయసింహుడు నిరూపుడి ప్రాకారం లోపలికి వేగంగా ప్రవేశించాడు.

లోనికి ప్రవేశించగానే పెద్దగా వికటాట్టహాసాలు అతడికి వినపడ్డాయి!

బహుశః నిరూపుడే ఇలా నవ్వుతూ ఉంటాడని ఊహించాడు జయసింహుడు. తొండం ఊపుకుంటూ ఆ నవ్వు వినవచ్చే వైపుకు వెళ్ళాడు.

విచిత్రం! అక్కడ ఎవరూ కనిపించలేదు



సరికదా, ఎవరో తనను వెనకకు నెట్టివేసినట్లు అయింది. ఏనుగు గభాలున తిరిగి వచ్చి మళ్ళీ అగ్నిముఖుడు వుండే ప్రాకారం లోపలే పడిపోయింది.

జయసింహుడు దుమ్ము దులుపుకొని పక్షి రూపాన్ని ధరించి మళ్ళీ వెళ్ళాడు. ఈసారి ఎవరో పది మంది పెద్దగా ఏడుస్తున్నట్లు వినిపించింది.

వాళ్ళను ఓదార్చాలా వద్దా అనుకుంటూ అటువైపుకు పోబోయే లోపల ఏడుపు అకస్మాత్తుగా ఆగి పోయింది. అంతలో దాన్ని ఎవరో విసిరివేసినట్లు అయింది పక్షి తిరిగి వచ్చి అగ్నిముఖుడి ప్రాకారంలో పడిపోయింది.

పట్టుదలతో జయసింహుడు మళ్ళీ లేచి ఘటసర్పంలాగా మారి నిప్పులు గ్రక్కుతుంటూ ముందుకు వెళ్ళి పోయాడు.

నిరూపుడి ప్రాకారం లోపలికి నిప్పుల సర్పం ప్రవేశించింది. దానికి లోపల గుంపులు గుంపులుగా గరుత్మంతులు తిరుగుతున్నట్లు కనిపించింది.

"అయితే ఇది రాక్షసమాయ," అని గ్రహించిన సర్పం రూపంలోని జయసింహుడు, గరుత్మంతుల గుంపు మీదకి నిప్పులను క్రక్కటం మొదలు పెట్టాడు.


ఆ దెబ్బతో, గరుత్మంతుల గుంపు మాయమైంది కాని, జయసింహుడు ఎవరి చేతనో నెట్టబడినట్లు మళ్ళీ వచ్చి అగ్నిముఖుడి ప్రాకారంలోనే పడ్డాడు.

ఇలా లోనికి వెళ్ళటం, విసిరివేయబడటం, మళ్ళీ లోనికి వెళ్ళటం, విసిరివేయబడటం ఎన్నోసార్లు జరిగింది. అజేయమైన నిరూపుడి మాయకు జయసింహుడు భయపడకపోయినా బాధ పడ్డాడు.

తెల్లవార్లూ ఈ ప్రాకారం వద్దనే గడిచిపోతే ఇక లోనికి పోవటం ఎలా సాధ్యం అనే జయసింహుడి బాధ.

ఇక లాభం లేదనుకొని జయసింహుడు కంటికి కనపడని సముద్రగాలిలాగా మారాడు ఆ గాలికెరటం నిరూపుడి ప్రాకారం లోనికి ప్రవేశించింది.





నిరూపుడు ఏమీ ప్రతిఘటించ లేదు.

"అమ్మయ్య!" అనుకొని మెల్లగా గాలి కెరటంలాగా వున్న జయసింహుడు ముందుకు సాగిపోయాడు. అతడు నిరూపుడి ప్రాకారాన్ని దాటి లోపల ఉన్నట్టుండి ఒక్కసారి ప్రాకారమంతా భయంకరంగా మండిపోసాగింది.

దానితో, మంటల మధ్యలో నుండి దూసుకొని ముందుకు పోలేక ప్రాకారంలోని గాలి మొత్తం వ్యాకోచం చెంది బయటకు వెళ్ళిపోయింది. పిల్లతెమ్మెరగా మారిన జయసింహుడు మళ్ళీ అగ్నిముఖుడి ప్రాకారంలోనికి వచ్చి గిరగిర తిరుగుతూ సొమ్మసిల్లి పడిపోయాడు.

అప్పటిదాకా అగ్నిముఖుడు జయసింహుడి దురవస్థనంతా గమనిస్తూనే ఉన్నాడు. నిరూపుడి ప్రాకారాన్ని జయసింహుడు దాటటం అసంభవమని అతడు గ్రహించాడు. ఇంతలో మయూర సైన్యం బయటకు వెళ్ళిన విషయం అతడికి గుర్తు వచ్చింది మాయను మాయతో కాక యుక్తితో జయించటమే మేలని అతడికి అనిపించింది.

అగ్నిముఖుడు జయసింహుణ్ణి లేవతీసి, "నీవు నెమిలిగా మారు. ఈ లోపల నేను ఒక యుక్తి పన్నుతాను. నీవు నిరూపుడి ప్రాకారం లోనికి మళ్ళీ ప్రవేశించి, 'మహ మయూరుణ్ణి వచ్చాను. దారి విడువు, నిరూపా!' అను. అప్పుడు భూమ్యాకాశాలు పట్టని ఒక మహాకాయుడు నీ ముందు నిలబడి నమస్కరిస్తాడు. అతడి బొడ్డును ముక్కుతో పొడువు. ఇదొక్కటే మార్గం. అంతేకాదు, అలా వెళుతూ, 'కరరవరట్ కరరవరట్,' అనే సంకేత పదాన్ని ఉచ్చరించు," అన్నాడు.

అగ్నిముఖుడు చెప్పిందంతా విని జయసింహుడు ఎంతో సంతోషించి, పొడవైన ముక్కుగల నెమిలి రూపాన్ని ధరించి, నిరూపుడి ప్రాకారం లోనికి ప్రవేశించాడు.

"మయూరసేనాని నెమిళ్ళదండుతో తిరిగి వస్తున్నాడు, దారి విడువు నిరూపా!" అని తన ప్రాకారాన్ని దాటి వచ్చి చెప్పాడు అగ్నిముఖుడు.

ఆ సమయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా నెమిలి రూపంలో జయసింహుడు నిరూపుడి ప్రాకారం లోనికి అతి వేగంగా ప్రవేశించాడు.

"మయూర సేనానిని. నెమిళ్ళదండుతో వచ్చాను. నా ప్రాకారానికి నన్ను పోనివ్వు. కరరవరట్, కరరవరట్!" అన్నాడు జయసింహుడు.

ఆ సాయంత్రం నెమిళ్ళ దండు ఏదో పని మీద బయటికి వెళ్ళటం నిరూపుడు కూడా చూచాడు కదా! పైగా మయూర సేనాని తిరిగివస్తున్నట్లు అగ్నిముఖుడే స్వయంగా చెప్పాడాయె. దానికి తోడు 'కరరవరట్' అనే ఎవరికీ తెలియని రహస్య సంకేత పదాన్ని కూడా జయసింహుడు ఉచ్ఛరించటంతో, నిరూపుడికి నిజంగానే ఆ వచ్చింది మయూర సేనాని అన్న నమ్మకం కలిగింది.

మరుక్షణమే భూమ్యాకాశాలు పట్టని ఒక భయంకరమైన రూపం ఒకటి అక్కడ సాక్షాత్కరించింది.

"ఇందాకటి నుంచి ఎవరో మాయావులు లోనికి పోవాలని ప్రయత్నిస్తున్నారు. వారిని చావగొట్టి అగ్నిముఖుడి ప్రాకారపు నిప్పులలో పడేశాను. మయూర సేనానీ! నీకు స్వాగతం;" అని నిరూపుడు అంటూ వుండగా, నెమిలి తన భయంకరమైన ముక్కుతో నిరూపుడి బొడ్డులో పొడిచింది.

"హతోస్మి!" అని అరుస్తూ రూపం లేకుండా తన ప్రాకారలో పడిపోయాడు నిరూపుడు.

నిరూపుడి మరణంతో జయసింహుడికి పెద్ద



అడ్డంకి తొలగి పోయింది. అజేయమైన ఈ రాక్షస మాయను అతి కష్టం మీద ఇలా జయించి ఆరవ ప్రాకారం లోనికి నిజ స్వరూపములో ప్రవేశించాడు.

అగ్నిముఖుడు తనతో చెప్పిన దాని ప్రకారం ఇక్కడి నుండి ఇక కామరూప విద్యకాని జ్యోతిష్మతీ మూలికగాని పని చేయవని తెలిసిపోయింది.

మానవుల మాయలకు, మంత్రాలకు అప్సరసల ప్రాకారం చివరి మెట్టు. ఉగ్రభైరవుడి మయూర సామ్రాజ్యానికి ఇదే తొలి మెట్టు. అందువలన జయసింహుడు మామూలు రాజకుమారుడి వలెనే అప్సరసల ప్రాకారం లోనికి ప్రవేశింపక తప్పలేదు.

ఆ ప్రాకారమంతా మధుర గానాలతో వీణా నాదాలతో, సుగంధ పరిమళాలతో నిండి ఉంది. స్వర్గమంటే ఇలాగే ఉంటుందేమోనని అనిపించింది జయసింహుడికి.

ఇంతలో, కలకలమని నవ్వులు వినిపించాయి జయసింహుడికి.

తెరలు తెరలుగా, అలలు, అలలుగా వస్తున్న నవ్వులు జయసింహుణ్ణి దిగ్భ్రాంతుణ్ణి చేశాయి.

చూస్తూండగానే, వెన్నెల దుస్తులను ధరించిన అప్సరసల సమూహం ఒకటి జయసింహుణ్ణి చుట్టుముట్టింది.

"ఓహో, మానవవీరుడే!" అన్నది ఓ అప్సరస సంతోషంగా.

"రాజకుమారుడిలాగా ఉన్నాడే!" అంది మరో అప్సరస.

"చూడ చక్కని వాడే. అయిదు ప్రాకారాలు దాటి వచ్చిన అతి సాహసికుడే!" అంది మరొకతె

ఇలా అంటూ అప్సరసలు జయసింహుడికి చక్కిలిగింతలు పెట్టసాగారు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

19

[తన తెలివి తేటలను ఉపయోగించి, నాలుగవ ప్రాకారంలోని అగ్నిముఖుణ్ణి మెప్పించి, అతడి తోడ్పాటుతో అయిదవ ప్రాకారంలోని నిరూపణ్ణి చంపి, ఆరవ ప్రాకారంలోకి తన తొలి రూపుతో ప్రవేశిస్తాడు జయసింహుడు. అక్కడ అతడికి కలకల మని నవ్వులు వినిపిస్తాయి. ఆ పైన వెన్నెల దుస్తులతో అప్సరసల సమూహం కనిపిస్తుంది. వారు అతడిని చుట్టుముట్టుతారు. —తరవాత]

జయసింహుడు నిర్భయంగా అప్సరసలతో, "నా పేరు జయసింహుడు. నేను మయూరాక్షిని చూడాలని వచ్చాను. మీ ముందు నా మాయలూ మంత్రాలూ పని చేయవని తెలుసు, పుణ్యవనితలారా! నాపై దయదల్చి నన్ను లోనికి పోనివ్వండి. మీకు కృతజ్ఞతలు చెప్పుకుంటాను," అన్నాడు.

జయసింహుడి మాటలు విని వారంతా విరగబడి నవ్వసాగారు. వారు అలా ఎందుకు నవ్వుతున్నారో జయసింహుడికి అర్థం కాలేదు.

"ఓ దేవవనితలారా! నన్ను చూస్తే మీకు నవ్వు వస్తున్నదా?" అన్నాడు జయసింహుడు.

"లేదు, ఎగతాళి చేయాలనిపిస్తున్నది. నర మానవులు కాలు పెడితే, బూడిద కుప్పగా మారిపోయే మయూరాక్షి ద్వీపంలో ఎలా ప్రవేశిస్తావు? ఆపైన ఉగ్రభైరవుడి హుంకారం నుండి ఎలా బతికి బట్టకడతావు నాయనా?" అన్నది ఒక అప్సరస.

"నాతో ఆడుకోవటం మీకు తగదు. తెల్లవారే లోపల నేను మయూరాక్షిని చూచి తీరాలి. ఇది గురువాజ్ఞ," అన్నాడు జయసింహుడు.

"అలాగా? మంచిది. మా పరీక్షలకు నిలబడు. లోనికి వదులుతాం," అన్నది అప్సరసల నాయకురాలు!

"సరే, తల్లుల్లారా! అదేదో త్వరగా అడగండి," అన్నాడు జయసింహుడు.

"మేమంత మరీ ముసలమ్మల్లాగా కనపడుతున్నామా?" అంది మరొక అప్సరస.

యం. ఉమాదేవి

"తల్లీ అనటం ఇష్టం లేకపోతే, చెల్లీ అంటాను. అదీ నచ్చకపోతే చెలీ అంటాను. అడిగే ప్రశ్నలు ఏవో అడగండి." అన్నాడు జయసింహుడు.

"ఈ సొగసరితో గడసరితో అనవసరపు మాటలేమిటే! అడగవలసింది అడిగి, అటో ఇటో తేల్చండి," అన్నది అప్సరసల నాయకురాలు.

"ధన్యవాదాలు, సుందరీమణీ!" అన్నాడు జయసింహుడు.

"ఓయీ జయసింహా! ఇదిగో, ఈ అప్సరసను ఏడిపించాలి. అదిగో, ఆమెను నవ్వించాలి. ఈ రెండింటిలో నీవు గెలిస్తే, నేను అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలి. నేను అవునంటే నీవు కాదనాలి. నేను కాదంటే నీవు అవుననాలి. ఇందులో, నెగ్గితే నీకు శుభం కలుగుతుంది. లేకుంటే అటు చూడు," అన్నది అప్సరసల నాయకురాలు.

జయసింహుడు అటు వైపుకు తిరిగి చూచాడు.

అక్కడ ఎత్తైన గుట్ట వున్నది. అది సముద్రపు ఉప్పుతో నిండిన కొండా? కాదు, మానవుల ఎముకల కుప్ప.

అది చూచేసరికి, జయసింహుడికి భయానికి బదులు జాలి కలిగింది. ఇందరు మానవులను పొట్టన బెట్టుకొన్న ఈ ఉగ్రభైరవుడి అంతు తప్పకుండా తేల్చుకోవలసిందేనని అనుకున్నాడు.

"మంచిది, ఇక పరీక్ష మొదలుపెట్టండి," అన్నాడు జయసింహుడు.



వెంటనే ఏడ్చే వనిత ఒకామె జయసింహుడి ముందుకొచ్చి కూర్చొని, "నవ్వించరా వీరుడా! నన్ను నవ్వించు," అంటూనే ఏడుస్తూ వుంది.

జయసింహుడు ఆలోచించాడు.

ఈమెది వట్టి ఏడుపు మొహం. ఎన్ని చమత్కార వాక్యాలు పలికినా హాస్యాలు చిలకరించినా ఆమె నవ్వదని జయసింహుడికి ముందే తెలిసి పోయింది.

అందుకని, సంభాషణతో తన సమయం వ్యర్థం చేసుకోదల్చుకోలేదు జయసింహుడు. ఆమె చుట్టూ ఏదో ఆలోచిస్తున్నట్లు నటిస్తూ గుండ్రంగా తిరుగుతున్నాడు.

'వీడు ఏం చేస్తాడా?' అని ఆమె కూడా ఆశ్చర్యపోతూ ఏడుస్తూ ఉంది.

"ఓ దివ్యవనితా! నేను మంచి మంచి హాస్యకథలు చెప్తాను. నవ్వుతావా?" అన్నాడు జయసింహుడు.

"నవ్వనురా నవ్వను," అంది ఆమె.

"పోనీ, నేను పిల్లిమొగ్గలు వేసి, వెకిలి చేష్టలతో హాస్యం సృష్టిస్తాను. నవ్వుతావా?" అని అడిగాడు జయసింహుడు.


"నవ్వనురా నవ్వను," అంది ఆమె మళ్ళీ.

"మరి ఏం చేస్తే నవ్వుతావు, తల్లీ?" అని అడిగాడు జయసింహుడు.

"ఏం చేసినా నవ్వను. కొంచెం సేపట్లో నిన్ను చప్పరించి తిని, ఏడుస్తూ పోతాను," అంది ఆమె.

జయసింహుడు భయపడి పోతున్నాడని అప్సరసల నాయకురాలు గ్రహించింది.





నిజమే! ఆమె అనుకున్నంతా అయింది. జయసింహుడు తటాలున అప్సరస కాళ్ళమీద పడ్డాడు.

"నన్ను రక్షించు తల్లీ. రక్షించు, భక్షించకు తల్లీ, నన్ను భక్షించకు!" అంటూ ఆమె కాళ్ళు గట్టిగా పట్టుకొని వదిల పెట్టలేదు జయసింహుడు.

అప్సరసల నాయకురాలు జయసింహుడి పని అయిపోయిందని అనుకున్నది.

'పాపం జయసింహుడు! ఆరు ద్వారాలూ దాటి అతి సాహసంతో వచ్చాడు. అయినా ఏం లాభం! నా చేతిలో చిత్తు అయినాడు,' అని అనుకోసాగింది ఏడ్చే అప్సరస.

అలా అనుకునేంతలో జయసింహుడు గభాలున ఆ అప్సరస అరికాళ్ళలో చక్కిలి గిలి పెట్టసాగాడు.

"గిలిగిలి. చక్కిలి గిలి!" అని అరిచాడు జయసింహుడు.

దానితో ఏడ్చే అప్సరస ఒక్కసారి ఫక్కున నవ్వింది.


"ఒరేయ్, ఒదిలిపెట్టరా, నా కాళ్ళు ఒదిలి పెట్టు," అంటూ విరగపడి నవ్వుతున్నది అప్సరస.

"శభాష్ నాయకుడా! జయించావురా!" అన్నది అప్సరసల నాయకురాలు.

"ఓ దివ్యవనితలారా! నేను గురుచరణ మహర్షి శిష్యుణ్ణి. ఆయన ఆశీర్వాదం ఉంటే కష్టాలు నా కొక లెక్కలోనివి కావు," అని జయసింహుడు అంటూండగా, అతడి మనస్సులో విష్ణుకూబరుడు చనిపోయాడనే సంకేతం అందింది.

ఈ మాటలు తనకు ఎలా స్ఫురించాయో అతడికి అర్థం కాలేదు. బహుశః గురుచరణుడు తన కేదో సంకేతం పంపినట్లున్నాడని సరిపెట్టుకున్నాడు జయసింహుడు.

"అమ్మలారా, నేను వచ్చింది కేవలం స్వకార్యం కోసం మాత్రమే కాదు. స్వామి కార్యం కోసం కూడా! ఈ ఉగ్రభైరవుడు ఎందరినో చంపాడు. అతడి చేత చంపబడిన వారిలో విష్ణుకూబరుడు కూడా వున్నాడు అతడు చేసిన తప్పు ఏమీ లేదు. ఎవరో అప్స



రసను ప్రేమించాడట. అందుకని పగబట్టి నెమిలి రూపంలో వెళ్ళి చంపివచ్చాడు, అప్సరసలారా! ఇట్లాంటి రాక్షసుడిపై మీరు ఎందుకు కరుణ చూపిస్తారు?" అన్నాడు జయసింహుడు.

ఈ మాట వినగానే, అప్పటి దాకా నవ్వుతూన్న రెండవ అప్సరస కన్నుల వెంట నీళ్ళు తిరిగాయి.

"నా ప్రియుణ్ణి ఈ రాక్షసుడు చంపాడా?" అంటూ ఏడ్చింది ఆమె.

జయసింహుడి ముఖం వికసించింది. అనుకోకుండా అతడు మరోటి సాధించాడు. అదే నవ్వే అప్సరసను ఏడ్పించటం!

"అప్సరసలకు నాయకురాలా! ఏడ్చే ఆమెను నవ్వించాను. నవ్వే స్త్రీని ఏడిపించాను. ఈ విష్ణుకూబరుడు ఎవడో నాకు తెలియదు. ఏదో ఊరికే అట్లా అన్నాను. ఇక మీ పరీక్ష ప్రారంభించండి," అన్నాడు జయసింహుడు.

అప్సరసల నాయకురాలు జయసింహుడి మేధాశక్తికి ఆశ్చర్యపోతూ, "ఓయీ జయసింహా! నీవేదైనా ఒక వాక్యం చెప్పు. నేను ఖండిస్తాను," అన్నది.

"చిత్తం సరే! నీ తల్లి పతివ్రత," అన్నాడు జయసింహుడు.

అప్సర నాయకురాలు గుడ్లు మిటకరించుకొని చూస్తూ వుండిపోయి, కొంతసేపటికి తేరుకొని, "మరొక వాక్యం చెప్పు," అన్నది.

"దివ్యసుందరీ! నిన్ను కన్న నీ తల్లి గొడ్రాలు కాదు," అన్నాడు జయసింహుడు.



"శభాష్, వీరుడా! నీవు సాహసవంతుడవే కాదు మేధావంతుడవు కూడా!" అంది ఆమె.

"అయితే నన్ను మయూరాక్షి దగ్గరికి పోనీయండి," అన్నాడు జయసింహుడు.

"ఓయీ పిచ్చివాడా! అంత తేలిగ్గా నిన్ను పోనిస్తే, మా కట్టడి ఏం కావాలి? నీవు ఒక ప్రమాణం చేస్తే వదులుతాం," అన్నది ఆమె.

"విషయం ఏమిటో చెప్పండి. తప్పకుండా ప్రమాణం చేస్తాను," అన్నాడు జయసింహుడు.

అప్సరసల నాయకురాలు నవ్వి, "వరమాల వేసి నిన్ను పెళ్ళి చేసుకోమని అడగము. మమ్మల్ని ఆదుకుంటానని మాట ఇవ్వు. చాలు!" అంది.

"ఓ అప్సరసా! నేను జన్మతః క్షత్రియుణ్ణి అభయం ఇయ్యటం ఆదుకోవటం మా జీవ లక్షణాలు. నా ప్రాణం ఇచ్చి అయినా సరె రక్షిస్తాను," అన్నాడు జయసింహుడు.

ఆ మాట విని దివ్యసుందరి ఇలా అన్నది.

"జయసింహా, నిన్ను మయూరద్వీపం లోనికి వదిలిపెట్టటానికి నాకు ఎట్టి అభ్యంతరమూ లేదు. అయినా, సాహసివి కాబట్టి చెపుతున్నాను విను. మేమంతా గంధర్వ రాజ పుత్రికలం. ఈ ఉగ్రభైరవుడు మమ్మల్ని తీసుకొచ్చి, తన మంత్రశక్తితో రాళ్ళుగా మార్చాడు. అతడి శత్రువులు ఎవరైనా ఈ సప్తమ ప్రాకారం లోనికి ప్రవేశించినప్పుడు మాకు మా స్వరూపం లభిస్తుంది. అయినా, ఈ ద్వీపపు పొలిమేరలు దాటి బయటికి పోలేము. మాచేత ఓడిపోయిన శత్రువు నశి



స్తాడు. అందుకు భిన్నంగా మేము చేస్తే మా ప్రాణాల్నే తీస్తాడు ఈ ఉగ్రభైరవుడు.

"ఇంకొక విశేషమేమిటంటే ఈ ఏడవ ప్రాకారం దగ్గర జరుగుతున్నదంతా ఉగ్రభైరవుడికి కనిపిస్తూంటుంది. అందువల్ల అతడిని ఏమార్చటం సాధ్యం కాదు.

"అయితే, ఈ రాత్రి అతడు అవంతీసుందరి అనే రాజకుమార్తెను వశం చేసుకొనే యోచనలో ఉండి మయూరాక్షి వైపు చూడ లేదు. కాకుంటే, ఈ పాటికి నీవూ నేనూ నశించి పోయి ఉండేవారమే!"

"మయూరాక్షి ఏమిటి?" అని అడిగాడు జయసింహుడు.

"చెప్తాను విను. ఈ ద్వీపంలో మయూరాక్షి అనే దేవత ఉన్నది. ఆ దేవతా విగ్రహానికి పైన అచ్ఛాదనగా ఒక నెమిలి బొమ్మ ఉంది. దాని ముక్కుకు ఒక అద్దం ఉంది. అందులోకి ఉగ్రభైరవుడు చూస్తే, అన్నీ కనపడుతూంటాయి. తనకు ఇష్టం కాని వారిని బలవంతంగా మయూరాక్షి ఎదుటికి తెచ్చి బలి ఇస్తాడు. అంతేకాదు, ఉగ్రభైరవుణ్ణి చంపాలనుకొని అతడి ముఖం వైపు చూస్తే చాలు, మనిషి రాయిగా మారిపోతాడు. ఈ ప్రమాదాన్ని దాటి మయూరాక్షిని నిర్మూలిస్తే మాయాదర్పణం ముక్కలైపోతుంది. మాకు బానిసతనం నుండి విముక్తి కలుగుతుంది. అది చేయగలనని మాట ఇవ్వగలవా?" అని అడిగింది అప్సరసల నాయకురాలు.

"తప్పక మిమ్మల్ని మీ దివ్యలోకాలకు పంపుతాను. ఇంతకూ ఉగ్రభైరవుడు అవంతిసుందరిని ఎందుకు తెచ్చినట్టు? తెచ్చి, చంపకుండా ఎందుకు వదలినట్టు?" అని అడిగాడు జయసింహుడు.

"అదొక దేవరహస్యం. అయినా చెప్తాను. విను," అంది అప్సరసల నాయకురాలు.

—(ఇంకా ఉంది)





మాయాదర్పణం

20

[అప్సరసల సమూహాన్ని అతి సులభంగా ఓడించి, వారి నాయకురాలి మెప్పును పొందుతాడు జయసింహుడు. అప్పుడు ఆమె తమను ఉగ్రభైరవుడు తన మంత్రశక్తితో సప్తమ ప్రాకారంలో బంధించాడనీ, మయూరాక్షిని నిర్మూలిస్తే మాయాదర్పణం ముక్కలై తమ బానిసత్వం పోతుందనీ అంటూ ఒక దేవ రహస్యం చెప్పటం మొదలు పెడుతుంది.
—తరవాత]

జయసింహుడు అప్సరసల నాయకురాలి వైపు తదేకంగా చూస్తూ, ఆమె చెప్పే మాటలను వినటానికి సిద్ధంగా కూర్చున్నాడు. అప్పుడు ఆమె ఇలా చెప్ప సాగింది.

"ఉగ్రభైరవుడికి ఎన్నో దివ్య శక్తులు వున్నాయి. అతడి ప్రాణం వేరే చోట ఉంది. అతడికి ఒక రాజకుమార్తె వల్ల మృత్యువు రావచ్చునన్న శాపం ఉంది. అందుకని దొరికిన రాజకుమార్తెనల్లా తెచ్చి రాళ్ళుగా, రప్పలుగా మార్చి వేస్తూంటాడు. అప్సరసలు దొరికితే చాలు, తీసుకు వచ్చి బానిసలుగా మార్చుకుంటూ వుంటాడు. అతడి దుర్మార్గానికి ఇప్పటి దాకా హతమైన వారెందరో లెక్క లేదు.

"ఇటీవల ఉన్నట్టుండి ఒకసారి మయూరాక్షి బిగ్గరగా అరిచిందట! కారణం తెలియని ఉగ్రభైరవుడు దేవిని ఉపాసించి, మాయా దర్పణాన్ని పలుక వలసిందిగా కోరాడు. అందులో అతడికి దేవి సందేశం లభించిందట.

"ఉగ్రభైరవుడి మృత్యువుకి కారణభూతురాలైన రాజకుమార్తె మరెవ్వరో కారు. అవంతీ సుందరియే అని తెలిసిందిట!

"అందుకే అతడు నెమిలి వేషాలలో ఉన్న తన మయూర సైన్యాన్ని పంపి, ఆమెని అపహరించి తెప్పించాడు. అంతే కాదు, ఆమెను అన్వేషిస్తూ ఎవరైనా బయలుదేరితే, వారిని హతమార్చటానికి వేయి కళ్ళతో కాచుకొని కూర్చున్నాడు."

యం. ఉమాదేవి



ఇది వింటూనే, జయసింహుడికి ఏదో సందేహం కలిగి, "ఓ దివ్య వనితా! అవంతీ సుందరి రాగానే ఎందుకు చంపలేదు?" అని అడిగాడు.

ఆమె ఒక్క క్షణం మౌనంగా వుండి పోయింది. ఆ పైన చిరునవ్వు నవ్వింది.

"అవంతీసుందరిని చూడగానే అతడికి వ్యామోహం కలిగి ఉండ వచ్చు. అందు చేత, ఆమెను వెంటనే చంపకుండా రోజులో సగం సేపు రాయిగా మార్చి పడేస్తున్నాడు. ఆమెని రక్షించటం నీకు అంత తేలిక కాక పోవచ్చు. ఎందుకంటే, నీవు ఈ సప్తమ ప్రాకారాన్ని దాటి, ఆ ద్వీపంలోకి అడుగు పెట్టగానే నశించి పోతావు. అక్కడ నీ మాయలూ కామరూప విద్యలూ ఏవీ పని చేయవు. పక్షిగా మారి ఆకాశంలోనూ ఎగుర లేవు," అంది అప్సరసల నాయకురాలు.

జయసింహుడు నవ్వి, "కాలు పెడితే మాడిపోతాను. గాలిలోకి ఎగిరితే రాలి పడి పోతాను. కాని, రెంటికీ మధ్యలో ఉంటే ఏమౌతుంది?" అన్నాడు.

"భూమిపై నడవకుండా ఆకాశంలో ఎగర కుండా త్రింశకు స్వర్గంలో ఎట్లా వ్రేలాడ గలవు?" అంది అప్సరసల నాయకురాలు.

"ఇట్లా వ్రేలాడ గలను," అంటూ జయ సింహుడు ఒక్క గెంతు గెంతి ఎగిరి ఆమె మెడ మీద ఎక్కి కూర్చున్నాడు.

"ఇదేమిటి? దిగు దిగు," అంది అప్స రసల నాయకురాలు ఆశ్చర్యంగా.

"ఓ దివ్య అప్సరసా! నీకు అర్థమవు తుందో లేదోనని ప్రత్యక్ష పురాణం చెప్తున్నాను. కాలు నేల మీద పెట్టకుండా ఆకాశంలో ఎగర కుండా ఇలా ప్రయాణం చేయ వచ్చు కదా! నీ సమాధానం సూటిగా చెప్పు," అన్నాడు జయసింహుడు.

జయసింహుడి తెలివికి అప్సరసల నాయకు రాలు లోలోన ఎంతో సంతోషిస్తూనే ఇలా అన్నది.

"చెయ్యవచ్చు. కాని, ఒకటే అభ్యంతరం నీవు మారు వేషములో ఉండలేవు. ఏ రూపంలో ఎక్కడ ఉన్నా ఉగ్రభైరవుడు

చూస్తూనే ఉంటాడు. అప్పుడు ఏం చెయ్య గలవు?" అంది ఆమె.

"మారు వేషం ఎందుకు? అసలు వేషం లోనే లోనికి పోదాం," అన్నాడు జయ సింహుడు.

"ఎలా? ఏమిటో నువ్వు అనేది ఏమీ అర్థం కావటం లేదు," అంది ఆమె.

అప్పుడు జయసింహుడు నవ్వి ఆమెతో ఇలా చెప్పాడు.

"వివరంగా చెప్తాను విను. నీవు నాకు ఇప్పుడు ఒక సహాయం చేయాలి. నేను నీ మీద ఇలాగే సొమ్మసిల్లి పడిపోయి వుంటాను. నీవు నన్ను లోనికి తీసుకొని పో. ఉగ్రభైరవుడి ఎదుటే నిలబెట్టి ఇలా చెప్పు.

"ఓ స్వామీ! ఇతణ్ణి అవంతీసుందరి ప్రేమించింది. ఆ విషయం గ్రహించి మేము ఇతణ్ణి పట్టుకున్నాం.

"అప్పుడు నేను ఉగ్రభైరవుడితో అవంతి సుందరి మనస్సు మారుస్తానని చెప్తాను. ఇలా నమ్మించి ఏదో ఒక ఉపాయంతో అతణ్ణి చంప వచ్చు. ఎలా వుంది నా పథకం?"

అప్సరసల నాయకురాలు ముఖం చిట్లించి, "నీ ముఖం లాగా వుంది! రాళ్ళుగా మారిన మేము నిన్ను ఎలా పట్టుకున్నామని నమ్ము తాడు? ఆరు ప్రాకారాలు దాటి లోనికి వచ్చిన అతిలోక సాహసుణ్ణి అంత త్వరగా నమ్మేటంత వెర్రిబాగుల వాడు కాడు ఉగ్రభైరవుడు," అంది.

"మరి ఎలా చేద్దాం?" అని అడిగాడు జయసింహుడు నీరసంగా.





"అది ఏదో నువ్వు త్వరగా ఆలోచించు," అంది ఆమె.

జయసింహుడు ఒక్క క్షణం ఆలోచించి ఇలా అన్నాడు.

"నేను నీ భుజం మీదనే మయూరద్వీపం లోనికి ప్రవేశించటం మాత్రం ఖాయం. అయితే, నాకు మీరు ఉగ్రభైరవుడి వేషం వెయ్యండి. ఈలోగా, అసలు ఉగ్రభైరవుణ్ణి ఏవో మాటలు చెప్పి, ఈ ప్రాకారం లోపలికి పిలిపించండి. ఇది జరిగే సమయంలో నేను ఒకసారి రాజకుమారి అవంతిసుందరితో మాట్లాడతాను."

అప్సరసల నాయకురాలు కొంచెం సేపు ఆలోచించి, "ఈ ఊహ కొంత బాగానే వున్నట్లు తోస్తూంది. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అన్నారు పెద్దలు. అసలు ఉగ్రభైరవుణ్ణి నీవు పోల్చు కోవటం కష్టం. ఎందుకంటే ఆయన సైనికులు కొందరు ఉగ్రభైరవుడి వేషంలోనే ఇక్కడ తిరుగుతూంటారు. దీనిని తెలుసుకోవటం నీకు సాధ్యపడే విషయం కాదు. సరే, ఏమైతే అదే అవుతుంది! లోపలికి తీసుకుపోతాను," అని జయసింహుడికి హామీ ఇచ్చింది.


వెంటనే ఆమె ఒక్క క్షణమైనా ఆగకుండా కార్యక్రమం లోనికి ఉపక్రమించింది. తోటి అప్సరసలకు కనుసైగ చేసింది.

వెంటనే వారు తొమ్మిది రంగులు గల పెద్ద పాత్రలను తెచ్చారు.

అప్సరసల నాయకురాలు మళ్ళీ కనుసైగ చేసింది. వారు మళ్ళీ వెళ్ళి, ఒక విచిత్రమైన జంతువును తెచ్చారు. అది జలచరమో భూచరమో తెలియదు. దానికి శరీరమంతటా పొడవైన జడలు వున్నాయి.

అది చూడటానికి పెద్ద నీటి ఏనుగులా వుండి, 'గుర్ గుర్ గుర్,' అని అంటూన్నది.

అప్సరసలు దానిని పట్టుకున్నారు. ఒకామె దాని తోకను గట్టిగా పట్టుకొంది. ఇంకొకామె దాని మూతిని కదలకుండా బిగించింది. వేరొకామె దాని మెడను పట్టుకున్నది. మిగిలిన అప్సరసలు మెల్లిగా దాని జడలు పట్టి గుంజారు. ఒక్కొక్కతే ఒక్కొక్క జడను లాగసాగింది.





ఇలా చూస్తూండగానే, అప్సరసలు దాని శరీరం మీద వున్న జడలన్నీ పీకి ఒక చోట కుప్ప వేశారు.

జయసింహుడు దీని నంతటినీ వింతగా చూస్తున్నాడు.

ఆ తర్వాత, నాయకురాలి అనుమతి తీసుకొని, అప్సరసలు ఆ జంతువును సముద్రపు ఒడ్డుకు తీసుకు వెళ్ళారు. అటూ ఇటూ ఊపి ఒక్కసారి దానిని సముద్రం లోనికి ఎత్తి పడేశారు.

వెంటనే అది బుళుక్కు బుళుక్కు మని శబ్దం చేస్తూ సముద్రం లోనికి ఈదుకుంటూ వెళ్ళి పోయింది.

అప్సరసల నాయకురాలు ఆ జడలన్నింటినీ తెచ్చి జయసింహుణ్ణి అలంకరించ సాగించి.

జయసింహుడు వాటిని తాకి చూచాడు. అవి జడల్లాగా లేవు. పొడవైన పాముల్లాగా ఉన్నాయి.

జయసింహుడు ఆశ్చర్య పడుతూండగా, అప్సరసల నాయకురాలు అతడిని అలంకరిస్తూ ఇలా చెప్పింది.

“ఇప్పుడు మేము తెచ్చిన జంతువు పేరు జలభేతాళం. ఇది మయూరాక్షి ద్వీపానికి మొదటి మెట్టు. ఉగ్రభైరవులు కాకుండా మయూరద్వీపం లోనికి ఎవరు అడుగు పెట్టినా సరే, వెంటనే పసిగట్టి తన జడలు ఆడిస్తుంది ఇది. దానితో సముద్రంలో కొన్ని కదలికలు ఏర్పడుతాయి. అవన్నీ మాయాదర్పణంలో ప్రతిబింబిస్తూ వుంటాయి. దానిని బట్టి, ఇక్కడ ఏమి జరుగుతున్నదో క్రొత్తవారెవరు వచ్చారో ఉగ్రభైరవుడు పోల్చుకోగలుగుతాడు. దీని జడలను పీకటం ద్వారా ఆ అవకాశం లేకుండా చేశాము. ఇక పోతే, ఉగ్రభైరవుడి జడలు అచ్చంగా ఈ జలభేతాళపు జడల్లాగానే వుంటాయి. నిజానికి జలభేతాళం జంతువు కాదు. జలచరమూ, భూచరమూ కాదు. అవసరమైతే, పక్షిలాగా కొంచెం ఎత్తులో ఎగరగలదు కూడా. దీని జడలు ఒక విధమైన పాములు! విచిత్రం ఏమంటే ఉగ్రభైరవుడి జడలు కూడా పాములే!”

ఇలా చెపుతూనే అప్సరసల నాయకురాలు జయసింహుణ్ణి ఆ జడలతో అలంకరించింది. తర్వాత తొమ్మిది రంగుల గిన్నెల నుండి కొన్ని రంగులు తీసి జయసింహుడికి పూసింది.

జయసింహుడి చేతికి ఒక మంత్రదండం వంటి కర్రని ఇచ్చింది ఆమె. ఇప్పుడు జయసింహుడు అచ్చంగా ఉగ్రభైరవుడి లాగానే వున్నాడు

"ఓ వీరుడా! ఇక మయూరాక్షి ద్వీపం లోనికి నీవు ప్రవేశిస్తున్నావు. అద్భుతాలలో కెల్లా పరమాద్భుతమైన దిది. ఉన్నది లేనట్లు లేనిది వున్నట్లు కనపడే విచిత్ర గంధర్వ నగరం. వింతలో కెల్లా వింత. విచిత్రాలలోని కెల్లా విచిత్రం. అష్టసిద్ధులూ, నవనిధులూ ప్రసాదించే అపూర్వ శక్తి మయూరాక్షికి నిలయం. ఓ సాహసవంతుడా! నీ ఇష్టదేవతని స్మరించుకొని ప్రయాణానికి సిద్ధంగా వుండు," అన్నది ఆమె.

జయసింహుడు వెంటనే తన గురువయిన గురుచరణ మహర్షిని స్మరించాడు.

'ఓ గురుదేవా! నీ ఆజ్ఞానుసారం నేను మయూరద్వీపం లోనికి ప్రవేశిస్తున్నాను. నన్ను రక్షించి కార్యసాఫల్యం చేసే బాధ్యత మీదే!' అని మనస్సులోనే అనుకున్నాడు జయసింహుడు.

అప్సరసల నాయకురాలు ఉన్నట్టుండి ఒక్కసారి గాలి లోనికి ఎగిరింది. ఆమె సముద్రం మీదగా గాలిలో తేలుతూ ముందుకు పోయింది.

కొంచెం దూరం పోయే సరికి, భయంకర



మయిన అగ్నిచక్రాలు కనిపించాయి. నిజానికి అవి నిప్పులు కావు. అగ్ని కరవాలాలు! అవి గిర్రున తిరుగుతున్నాయి.

అప్సరసల నాయకురాలు అలా వేగంగా కొంత దూరం ముందుకు పోయింది.

ఒక చోట భయంకరులైన ఉగ్రభైరవులు కాపలా కాస్తూ నిలబడి వున్నారు. ఆమె భుజం మీది జయసింహుణ్ణి వారు చూశారు కూడా.

"జయసింహా, నీవు ఇప్పుడు కుక్క లాగా మొరగాలి!" అన్నది అప్సరసల నాయకురాలు రహస్యంగా.

జయసింహుడు అచ్చంగా కుక్క లాగానే మొరిగాడు.

దానితో, కావలి ఉగ్రభైరవులు అందరూ, 'ఈతడు మన నాయకుడైన నిజమైన ఉగ్ర భైరవుడే!' అని అనుకున్నారు.

వెంటనే వారు అందరూ కుక్కల్లాగానే 'భౌభౌభౌ' మని మొరుగుతూ దండాలు పెట్టారు.

జయసింహుడు తన ముఖాన్ని అద్దంలో చూచుకోలేదు. కాని, అచ్చంగా కుక్క వలెనే ఆమె అతణ్ణి తయారు చేసింది.

ఉగ్రభైరవుడు అంటే ఒక భయంకరుడైన కాలభైరవుడు!

జయసింహుడు మయూరద్వీపం లోనికి ప్రవేశించే సరికి, అతడి శరీరం గాలి లోనికి తేలి పోతున్నట్లు అనిపించింది.

జయసింహుణ్ణి కొన్ని మందిరాలు దాటించి లోనికి తీసుకుపోయింది అప్సరసల నాయకురాలు.

"అదో వచ్చేదే: అవంతీసుందరిని వుంచిన అంతఃపురం! ప్రస్తుతం ఆమె మానవ స్త్రీ రూపంలోనే వుంది," అని చెప్పింది అప్సరసల నాయకురాలు.

—(ఇంకా ఉంది)





21

[ఉగ్రభైరవుడి గురించి మరి కొన్ని వివరాలు అప్సరసల నాయకురాలి ద్వారా తెలుసుకొన్న జయసింహుడు ఉగ్రభైరవుణ్ణి హతమార్చేందుకు తగిన ఉపాయాన్ని ఆమెతో చర్చిస్తాడు. అప్పుడు ఆమె జంభేతాళం అనే జంతువు జడలతో జయసింహుణ్ణి ఉగ్రభైరవుడి లాగా అలంకరిస్తుంది. ఆ తరవాత, ఇద్దరూ మయూరద్వీపం వైపు వాయు మార్గాన ప్రవేశించటానికి పూనుకుంటారు. — తరవాత]

జయసింహుణ్ణి తీసుకొనిపోయి అవంతీసుందరి ముందు నిలబెట్టింది అప్సరసల నాయకురాలు.

అవంతీసుందరి ఉగ్రభైరవుడి రూపంలో ఉన్న జయసింహుణ్ణి చూచి, ఎంతో భయపడి పోయి, 'వీడు మళ్ళీ దాపురించాడే!' అనుకున్నది.

"ఓ అవంతీసుందరి! నీవు అనుకున్నట్టు నేను ఉగ్రభైరవుణ్ణి కాను. నా పేరు జయసింహుడు. మీ గురువులవారే నాకూ గురువు. పూజ్యశ్రీ గురుచరణుల ఆదేశం మేరకు నేను భరద్వాజాశ్రమం నుండి వస్తున్నాను. ఈ రాత్రి ఎలాగైనా సరే, ఉగ్రభైరవుణ్ణి చంపాలి. తెల్లవారితే అసంభవం," అని అతడేదో చెప్పబోతూండగా, అవంతీసుందరి నవ్వి, "ఒరే ఉగ్రభైరవా! నీ మాయలు నాకు తెలియవా? మళ్ళీ ఇది ఒక నాటకమా?" అన్నది.

"అవంతీసుందరి, గురుచరణులవారి పాద సాక్షిగా చెపుతున్నాను. నేను నీ రక్షణకై వచ్చిన ఒక రాజకుమారుణ్ణి. ఆరు ప్రాకారాలూ అతి కష్టం మీద దాటాను. ఏడవ ప్రాకారంలో ఉండవలసిన మయూరసైన్యం ఎక్కడికో పోయింది. అందుకని, ఈ అప్సరస సహాయంతో లోనికి వచ్చాను. ఈ రాత్రి మనం ఉగ్రభైరవుణ్ణి చంపగలిగితే, రేపే నీకు విముక్తి," అన్నాడు జయసింహుడు.

ఈ మాటల్ని నమ్మాలో నమ్మనక్కరలేదో తేల్చుకోలేక పోయింది అవంతీసుందరి. జయసింహుడు మళ్ళీ ఇలా చెప్పసాగాడు.

యం. ఉమాదేవి



"జాగ్రత్తగా విను. మరి కొద్ది ఘడియలలో ఉగ్రభైరవుడు అలంకరించుకొని, నిన్ను మెప్పించటానికై వస్తాడు. ఈ అప్సరస నాకు ఈ విషయాన్ని ఇప్పుడే చెప్పింది. ఆమె నీ వద్దకు నన్ను తీసుకొని వస్తూ, ఉగ్రభైరవుడు తన అలంకరణ మందిరంలో ఉండటం చూచిందట.

"నేను మరి కొద్ది క్షణాలలోనే శరభ ద్వీపానికి వెళ్ళిపోతాను. అక్కడ ఏదో గందరగోళం జరుగుతుంది. 'అదేమిటా?' అని ఉగ్రభైరవుడు మాయాదర్పణంలోకి చూస్తూ ఉంటాడు. 'ఏమిటండీ? ఏమైందీ?' అంటూ నువ్వు ప్రేమను నటిస్తూ అతణ్ణి అడుగు.

"అప్పుడు ఉగ్రభైరవుడు,'ఎవరో జీవమణిని బ్రద్దలు చేస్తూన్నారు,' అని భయంతో అరుస్తాడు. అదే నీకు సంకేతం. వెంటనే నువ్వు ఖడ్గంతో ఉగ్రభైరవుడి తల ఒక్క దెబ్బతో నరికేయ్!"

అప్పుడు అప్సరసల నాయకురాలు అవంతి సుందరిని చూచి," ఓ అవంతీసుందరి! ఇది కూడా గుర్తు వుంచుకో. ముసుగు తీస్తే ఉగ్రభైరవుడి ముఖం ఒక కపాలంగా ఉంటుంది. దానిని చూచిన వారు భస్మీపటలమైపోతారు. పైకి మాత్రం వాడు ఒక్క మూతి వాడిలాగా కనపడతాడు. మరీ ప్రాణాపాయం వస్తే, వాడు ముసుగు విప్పి వికటాట్టహాసం చేస్తాడు. అంతే, ఎదుటివారు బూడిదకుప్పగా మారిపోతారు," అన్నది.

ఇంతలో బయట ఎవరో నడిచి వస్తూన్న శబ్దమైంది.

"ఉగ్రభైరవుడు వస్తున్నాడు," అంటూ భయంతో గడగడ వణికిపోసాగింది అప్సరసల నాయకురాలు.

జయసింహుడు వెంటనే అవంతీసుందరి చెవిలో ఏదో రహస్యం చెప్పాడు. అవంతీసుందరి సరేనన్నట్లు తల ఊపింది.

ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా అప్సరసల నాయకురాలు జయసింహుడితో సహా మయూరాక్షి వెనుకకు వెళ్ళి, ఆ విగ్రహానికి వెనుక వైపున ఉన్న పొడవయిన నెమిలితోక చాటున దాక్కున్నది.

అంతలో ఉగ్రభైరవుడు అక్కడికి వచ్చాడు. ముక్కుతో ఏదో గట్టిగా వాసన పట్టాడు. ఆ తరవాత కుక్కలా మొరిగాడు.

"నరవాసన నరవాసన!" అన్నాడు ఉగ్రభైరవుడు.


'జయసింహుడు గదిలోకి వచ్చిన వాసనని ఈ కుక్కముఖంగాడు పోల్చుకున్నాడన్న మాట.' అని అనుకుంటూ భయపడి పోయింది అవంతీసుందరి.

అవంతీసుందరి లేని నవ్వును ముఖం మీదికి తెచ్చుకొని, "నేనూ మానవస్త్రీనే! నా వాసనే మీకు వస్తున్నది," అన్నది.

అప్పుడు ఉగ్రభైరవుడు నవ్వి, "ఓ సుందరీ! ఇంతకూ నీవు నాకు లొంగినట్టా? లేనట్టా?" అన్నాడు.

"ప్రభూ, నాకు మీ రూపం చూస్తే భయం వేస్తున్నది. మీరు ఎంత బాగా అలంకరించుకున్నా కుక్కమూతితోనే కనిపిస్తున్నారు! మీరు కూడా ఇరవై ఐదు ఏండ్ల రాజకుమారుడిలాగా మారితే, నేను సంతోషంగా గాంధర్వ వివాహం చేసుకుంటాను," అన్నది అవంతీసుందరి.


"ఓస్, అదెంత పని? కాని వెర్రి మొఖమా! రాజకుమారులు అందరూ ముసలివాళ్ళు అయి దవడలు వ్రేలాడుతూ చచ్చిపోతారు. కాని, నేను మాత్రం ఇలాగే అందంగా శాశ్వతంగా ఉండిపోతాను. ఈ రూపాన్ని మోహించటం నేర్చుకో." అంటూ పెద్దగా నవ్వాడు ఉగ్రభైరవుడు.



"ప్రయత్నిస్తాను, స్వామీ! అయితే, నాకు ఎవరు మీరో, ఎవరు కాపాలా ఉగ్రభైరవులో తెలియటం లేదు. ఈ ద్వీపంలో కాపున్న పన్నెండుమందిలో ఒకరిద్దరు అప్పుడప్పుడు వచ్చి తమని వివాహం చేసుకోవలసిందిగా అర్థిస్తున్నారు. నాకు ఈ బెడద లేకుండా ఇక ముందు చూడకోరుతాను," అన్నది అవంతీసుందరి.

ఈ మాటలు వింటూనే, ఉగ్రభైరవుడు అగ్గిమీద గుగ్గిలమైపోయాడు. భయంకరంగా మొరిగాడు.

"నా ఉప్పు తింటూ నాకే ద్రోహం తల



పెడతారా? ఆ సంగతి ఏదో ఇప్పుడే తేలుస్తాను," అంటూ మాయాదర్పణం ఉన్న మయూరాక్షి వద్దకు వెళ్ళసాగాడు ఉగ్రభైరవుడు.

'ఇంకేముంది? అంతా అయిపోయింది. మాయాదర్పణంలో చూస్తూ ఉగ్రభైరవుడు మయూరాక్షిని ప్రశ్నిస్తాడు. వెంటనే తోక చాటున జయసింహుడు కనపడతాడు,' అనుకొన్నది అవంతిసుందరి.

ఉగ్రభైరవుడు మాయాదర్పణం వైపు వెళ్ళే లోపల, "అమ్మో!" అంటూ బిగ్గరగా కేక వేసి పెద్దగా చప్పుడు చేస్తూ, ఉయ్యాలపై పడిపోయింది అవంతిసుందరి.

"ఏమైంది?" అని మొరుగుతూ అవంతిసుందరి వైపు వచ్చాడు ఉగ్రభైరవుడు.

"నన్ను బెదిరించిన కాపలా ఉగ్రభైరవులు గుర్తుకు వచ్చారు," అన్నది అవంతిసుందరి భయంగా.

"అవును, వాళ్ళ పని ఇప్పుడే పట్టిస్తాను," అంటూ గబగబ ఆ మందిరంలో నుండి బయటకి నడిచాడు ఉగ్రభైరవుడు.

'అమ్మయ్య,' అంటూ నిట్టూర్చింది అవంతిసుందరి.


ఆ తరుణంలో ఒక్క క్షణం కూడా ఆలస్యము చేయకుండా జయసింహుడు, అప్సరసల నాయకురాలు గాలిలో తేలుతూ అవంతిసుందరి ఉయ్యాల దగ్గరికి వచ్చారు.

"అవంతిసుందరీ, నేను శరభద్వీపానికి వెళ్ళిపోతున్నాను. నీవు ఉగ్రభైరవుణ్ణి ఎలా చంపాలో చెప్తాను. విను," అంటూ ఆమె చెవిలో ఒక రహస్యం చెప్పాడు జయసింహుడు.

"అలాగే." అన్నది అవంతిసుందరి.

మయూరాక్షి పాదాల వద్ద మాయాదర్పణానికి క్రింద ఉన్న ఓ కత్తినీ, డాలునూ చూపాడు జయసింహుడు.

"అవంతిసుందరీ, నేను వచ్చిన పని అయిపోయింది. ఈ మహాకార్యాన్ని నీవే నెరవేర్చాలి," అని చెప్పి, ఆ పైన అప్సరసల నాయకురాలితో, "ఇక మనం బయటకి వెళ్ళే మార్గం ఆలోచించు," అన్నాడు జయసింహుడు.





"రాజకుమారా, నిన్ను ఎక్కడికి చేర్చమంటావు?" అంది ఆమె.

"నన్ను మయూరద్వీపానికి అవతల వున్న సముద్రం మీద వదిలిపెట్టు," అన్నాడు జయసింహుడు.

"అలాగే," అన్నది అప్సరసల నాయకురాలు వినయంగా.

కాని, జయసింహుడిని ఎలా బయటికి చేర్చాలా అని ఆలోచనలో పడిపోయింది ఆమె.

ఈలోగా, ఉగ్రభైరవుడు బయటికి వెళ్ళి కుక్కలాగా పెద్దగా మొరిగాడు. భయంకరమైన అరుపులకు భయపడి, కాపలా కాస్తున్న పన్నెండు మంది కాపలా ఉగ్రభైరవులు అతడి దగ్గరకు వచ్చి నమస్కరించారు.

"ఏమిరా, వ్యవస్థ ఏమైనట్లు? నా ద్వీపంలో వుంటూ నాకే ద్రోహం తలపెట్టే వారిని ఏమి అనాలి?" అన్నాడు ఉగ్రభైరవుడు.

ఈ మాటలు ఎవరిని ఉద్దేశించి ఉగ్రభైరవుడు అన్నాడో ఆ పన్నెండు మంది కాపలా ఉగ్రభైరవులకు తెలియలేదు.

వారు పన్నెండు మందీ ఏక కంఠంతో, "ప్రభూ, మీకు ద్రోహం తలపెట్టినది ఎవరో చెప్పండి. వాణ్ణి భస్మం చేసేస్తాం," అన్నారు.

"అది తెలుసుకోటానికే వచ్చాను. నేను ఇక్కడ లేని సమయంలో అవంతీసుందరి వగ్గరకు మీలో ఎవరెవరు వెళ్ళారో చెప్పండి," అన్నాడు ఉగ్రభైరవుడు కోపంగా.

కాపలా ఉగ్రభైరవులు భయపడుతూ, "మేమా? లోపలికి వెళ్ళటమా? అవంతీసుందరి వద్దకా? అయ్యో, భగవంతుడా! ఇదెక్కడి అన్యాయం?" అన్నారు.

"దబాయించి లాభం లేదు. మీలో ఒకరో ఇద్దరో నా అంతరంగిక మందిరానికి వచ్చినట్లు తెలిసింది? ఎవరో చెప్పండి లేదా చెప్పేవరకూ మిమ్మల్ని చిత్రహింస పాలు చేస్తూ ఉంటాను," అన్నాడు ఉగ్రభైరవుడు.

పన్నెండు మందికీ బాధ, భయములతో పాటు అసహ్యము కూడా కలిగింది. వారి ఆలోచనలు పరిపరి విధాలుగా పోయాయి.

'ఇన్నేళ్ళూ మేము ప్రాణాలు కూడా లెక్కచేయకుండా ఈ ద్వీపాన్ని రేయిం

వళ్ళు కాపలా కాస్తున్నందుకు ఇదా మాకు లభించిన ప్రతిఫలం?

'అంతే కాదు. రావణుడు లంకకు సీతను తీసుకొని వచ్చాడు. ఫలితం ఏమైంది? తానే కాదు. మొత్తం లంక అంతా నాశనం అయి పోయింది.

'అవంతీసుందరిని తీసుకు రావటమే ఉగ్రభైరవుడు చేసిన తప్పు. తెచ్చాడు పో, చంపకుండా ఆమెను అంతరంగిక భవనంలో దాచి పెట్టటం, సరసాలు ఆడటం ఏ ప్రమాదానికి దారి తీస్తుందో ఊహించుకోలేదు.

'ఇది ముప్పు! ఇది నిప్పు! ఇది తప్పు! ఈ పరిమాణం యజమాని ఉగ్రభైరవుడు తప్పించుకో గలడా?'

ఈ లోగా ఉగ్రభైరవుడు తన చేతిలోని మంత్రదండాన్ని ఆ పన్నెండు మంది వైపు సారించాడు. మంత్రదండం మహిమ వల్ల, వారు తన గురించి ఏదో చెడుగా ఆలోచిస్తూ వున్నట్లు తెలిసి పోయింది అతడికి.

"మీ పని పట్టిస్తాను," అని హూంకరిస్తూ ఉగ్రభైరవుడు, "ఘటకర్పరా!" అని పెద్దగా ఓ కేక వేశాడు.

పగటి వేళ కన్నులు మూయకుండా కాపలా కాచే నిప్పులు కక్కే ఓ సర్పం పేరు ఘటకర్పరుడు.

వెంటనే, మయూరద్వీపం వద్ద సరిహద్దులలో కాపలా కాచే ఘటకర్పరుడు యజమాని దగ్గరికి వచ్చాడు.

"చిత్తం స్వామీ!" అంటూ ఉగ్రభైరవుడి కాళ్ళకు మ్రొక్కాడు ఘటకర్పరుడు.



"ఓయీ, ఘటకర్పరా! ఈ పన్నెండు మంది ఉగ్రభైరవులలో నా అంతఃపురము లోనికి, నేను లేని సమయంలో పోయినదెవరో తెల్పు," అని ఆజ్ఞాపించాడు ఉగ్రభైరవుడు

వెంటనే ఘటకర్పరుడు తోక మీద లేచి చుట్టూ చూస్తూ నలుదిక్కులలో నిప్పులు చిమ్మటం మొదలు పెట్టాడు.

ఆ నిప్పుల ప్రవాహం పన్నెండు మంది కాపలా ఉగ్రభైరవుల్ని అటూ ఇటూ కదల కుండా చక్రబంధంలో నిలిపి వుంచింది.

"ఇదే తగిన సమయం జయసింహా! మనం త్వరగా బయటపడాలి," అంటూ అతడి వైపు చూచింది అప్సరసల నాయకురాలు.

వెంటనే తుళ్ళిపడింది ఆమె. అతడు నెమలి రూపంలో వున్నాడు! అంతే కాదు, తాను కూడా ఆడ నెమలిగా మారిపోయినట్లు గ్రహించింది ఆమె.


'ఇదెలా జరిగింది? ఎందుకు జరిగింది?' అని ఇద్దరూ ఆలోచించగా, కొంత సేపటికి వారికి ఓ రహస్యం స్ఫురించింది.

ఇంతకు ముందు వారిద్దరూ మయూరాక్షి తోక చాటున దాక్కొన్నారు కదా! అప్పుడు ఆ మహా మంత్రశక్తి గల మయూరాక్షి స్పర్శ వారికి తగిలి వుంటుంది. దానితో వారిలో ఈ మార్పు వచ్చి వుండాలి.

"అంతే జరిగి వుండాలి! అయితే, ఇప్పుడు మనం ఏం చేయాలి? మనం మామూలు రూపంలోకి ఎలా రాగలం?" అని ఇద్దరూ ఒకర్ని ఒకరు ప్రశ్నించు కున్నారు.

అయితే, వారికి ఎక్కువ సేపు అలా ఆలో చించుకుంటూ వుండేందుకు సమయం లేదు. ఏమైతే అదే అవుతుందని అనుకొని, నెమళ్ళ రూపంలోనే జయసింహుడూ, అప్సరసల నాయకురాలూ సముద్రం మీదికి ఎగురు కుంటూ పోయారు. వారిని మయూర భటులు చూచారు.

— (ఇంకా ఉంది)





మాయాదర్పణం

22

[అవంతిసుందరిని జయసింహుడు సులభంగానే కలుసుకొని సంకేతం చెపుతాడు. ఆమె మంచి మాటలతో భృత్యుల మీద అనుమానం రేకెత్తించగా, ఉగ్రభైరవుడు ఘటకర్పరుడు అనే సర్పాన్ని పిలిచి, అనుమానస్తుడిని నిర్ధారించమని ఆజ్ఞాపిస్తాడు. ఈలోగా, మయూరాక్షి స్పర్శతో నెమిళ్ళుగా మారిన జయసింహుడూ అప్సరసల నాయకురాలూ బయటికి వస్తారు.
— తరవాత]

కాపలా ఉగ్రభైరవులూ లేరు. ఘటకర్పరుడూ లేడు. జడలను పీకి పారేయటంతో జలభేతాళం కూడా అరవలేక పోయింది. అయితే ఒకరిద్దరు మయూర భటులు వారిని చూడక పోలేదు.

'ఈ నెమిళ్ళు మన మయూర సైన్యానికి సంబంధించినవి అయి వుండాలి!' అని అనుకున్నారు వాళ్ళు.

అందువల్ల, జయసింహుడూ, అప్సరసల నాయకురాలూ ఆ ద్వీపాన్ని దాటి సముద్రం మీదికి సులభంగా చేర గలిగారు.

"ఇల్లలకగానే పండుగ కాదు, జయసింహా! ఉగ్రభైరవుడు మాయాదర్పణంలోకి చూస్తే, అప్పుడు మనం కనబడతాం. ఈ నెమిళ్ళు ఎక్కడివి అనే అనుమానం అతడికి రావచ్చు. అప్పుడు మనల్ని తరుముతూ మయూర సైన్యాన్ని పంపుతాడు ఉగ్రభైరవుడు," అంటూ హెచ్చరించింది అప్సరసల నాయకురాలు.

"భయపడకండి!" అని ఏదో వాక్కు వినిపించింది వారికి.

ఇద్దరూ దిగ్భ్రాంతులై చుట్టూ చూచారు. ఎవరూ కనబడలేదు.

"ఎవరు మాట్లాడుతున్నది?" అంటూ గట్టిగా అరిచాడు జయసింహుడు.

దానికి జవాబుగా, "నాయనా జయసింహా! నేనే నీకు సందేశాన్ని పంపుతున్నాను. భయపడకు. మనది దైవకార్యం. ధర్మపథం.

యం. ఉమాదేవి

కాబట్టి, నువ్వు తప్పకుండా జయిస్తావు. శరభద్వీపానికి పద," అనే మాటలు మరోసారి వినిపించాయి.

ఆ మాటల్ని జాగ్రత్తగా విన్నాడు జయసింహుడు.

అది తన గురువుల వారి గొంతే! ఎంతో సంతోషం కలిగింది అతడికి.

"ధన్యుణ్ణి గురుదేవా! నన్ను మీరు కంటికి రెప్పలాగా అక్కడ నుంచే కాపాడుతున్నారన్న మాట!" అన్నాడు జయసింహుడు.

"అవును, జయసింహా! ముహూర్తం మించిపోతూన్నది. ఉగ్రభైరవుడి భరతం పట్టించే సమయం వచ్చింది. త్వరగా శరభద్వీపానికి బయలుదేరు," అన్న గురుచరణుడి ఆజ్ఞ వినిపించింది అతడికి.

"అలాగే, గురుదేవా! నేను నెమలిగా మారిపోయాను. నాకు ఏమిటి ఒక్కు?" అన్నాడు జయసింహుడు.

"ఒరే, పిచ్చివాడా! ఒకొకప్పుడు శాపాలే వరాలుగా పరిణమిస్తాయి. ఈ నెమలి రూపమే నీకు ఇప్పుడు కార్యసాధనకు ఉపయోగ పడుతుంది. మాయూరాక్షి స్పర్శలో నీవు నెమలిగా మారావు. కాబట్టి, భయం ఏమీ లేదు. వెంటనే శరభద్వీపం లోపలికి పో. ముక్కుతో పాము పుట్టను బ్రద్దలుకొట్టు. జీవమణిగల సర్పం పైకి వస్తుంది," అని వినపించింది జయసింహుడికి మళ్ళీ.

"అది కాటు వేయదా, గురుదేవా?" అని అడిగాడు జయసింహుడు.

"లేదు. నీది నెమలిరూపం! నిన్ను చూడ



గానే అది భయపడి ముడుచుకొని పోతుంది. నిర్భయంగా జీవమణిని బ్రద్దలుకొట్టు. విజయోస్తు," అంటూ చెప్పి గురుచరణుడి వాణి ఆగి పోయింది.

నెమిలి రూపములో ముందు జయసింహుడూ, ఆ వెనుగ అప్సరసల నాయకురాలూ ఎగురుకుంటూ వెళ్ళి పోయారు.


అప్సరసల నాయకురాలు శరభద్వీపానికి దారి చూపుతూండగా, ఇరువురూ గగన మార్గంలో శరభద్వీపాన్ని చేరారు.


అయితే, అక్కడి పరిస్థితి అప్పటికే గందరగోళంగా వుంది. దానికి ఓ కారణం వుంది.

గదాధరుడూ. కరటకశర్మా నాలుగు కాళ్ళ విచిత్రపు దయ్యం జంతువులాగా నటిస్తూ ముందుకు పోయారు కదా! వారిని శరభద్వీపంలోని శరభాలు చూచాయి. దూరం నుండే అవి తమ నోళ్ళ నుండి భయంకరమైన వాయువులను వదిలి పెట్టాయి.

ఆ విషవాయువుల ప్రభావానికి గదాధరుడూ, కరటకశర్మా సొమ్మసిల్లి పడిపోయారు. ఆ తరవాత, నాలుగైదు శరభాలు భయంకరంగా అరుస్తూ, వారిరువురినీ చంపటానికి రాసాగాయి.

అయితే, దూరం నుంచి ఇదంతా చూస్తూన్న త్రిశరుడు, తన చేతిలోని మంత్ర దండంతో మళ్ళీ మంటల్ని సృష్టించాడు. దానితో శరభాలు భయంకరంగా ఘీంకరిస్తూ అడ్డదిడ్డంగా పరుగులు తీయసాగాయి. అవి ఒకదాన్ని ఒకటి తొక్కుకుంటూ కుమ్ముకుంటూ అరుస్తూ తిరుగుతూన్నాయి.





ఈలోగా, అప్సరసల నాయకురాలు జయసింహుడికి దూరం నుంచే శరభద్వీపానికి దారి చూపించి వెనుతిరిగింది. నెమిలి రూపములో ఉన్న జయసింహుడు శరభద్వీపాన్ని సులభంగా చేరాడు.

అయితే, నెమిలి రూపంలో వున్నది జయసింహుడని తెలియక, త్రిశరుడు తికమక పడ్డాడు. శరభ ద్వీపంలో ఏర్పడిన కల్లోలం చూచి, ఉగ్రభైరవుడు మయూర సైన్యాన్ని పంపుతూన్నాడేమోననీ, ఆ సైన్యానికి జెందిందే ఈ నెమిలి అనీ అతడికి సంశయం కలిగింది.

అందుకు అతడేదో చేయాలని అనుకుంటూ వుండగా, "ప్రభూ, నేను జయసింహుణ్ణి. నెమిలి రూపంలో వున్నాను," అంది నెమిలి.

"జయసింహా, అక్కడ ఏమైంది?" అంటూ త్రిశరుడు అడగబోయేంతలో, నెమిలి తల అడ్డంగా వూపుతూ, "ప్రభూ, ఇప్పుడు అదంతా చెప్పేందుకు సమయం లేదు. నేను మయూరాక్షి స్పర్శతో నెమిలిగా మారి పోయాను. అవంతీసుందరికి సంకేతం చెప్పాను. నన్ను ఇప్పుడు ఏం చేయమంటారు?" అంది.

త్రిశరుడు అంతా గ్రహించి, "అంతా మన మంచికే జరిగింది. నీ తోకకు నిప్పు అంటిస్తాను. నువ్వు ఎగురుతూ ద్వీపంలోకి వెళ్ళు. ఆ మంటలను చూచి, శరభాలు తప్పక భయపడతాయి. నీవు మయూరాక్షి స్పర్శ వల్ల నెమిలిగా మారిన వాడివి కాబట్టి, శరభద్వీపంలోని మంటలు నిన్ను ఏమీ చేయవు," అంటూ మంత్రదండాన్ని ఊగించి, జయసింహుడి తోకకు నిప్పు అంటించాడు.

బయటి వారికి అది భయంకరమైన మంటలాగా కనిపించినా, జయసింహుడికి అది చల్లగా చందనం రాసుకున్నట్లుగా వుంది. ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా, అతడు శరభద్వీపంలోకి దూకాడు. అది చూచి శరభాలు భయంకరంగా అరిచాయి. నిప్పు కుంచ వంటి తోకతో విజృంభించాడు జయసింహుడు.

ఒక దూకుతో పుట్టను సమీపించి, ప్రక్కనే వున్న చెట్టుకు నిప్పు అంటించాడు జయసింహుడు.



వెంటనే పుట్టను ముక్కుతోనూ, కాళ్ళతోనూ చిన్నాభిన్నం చేయ సాగాడు జయసింహుడు.

దానితో, లోపలి నుంచి నల్లటి సర్పం పడగ విప్పుకొని బుస్సుమంటూ పైకి లేచింది. అయితే, నెమలిని చూచి కొద్దిగా జంకింది.

అంతలో, దాని తల మీద ధగ ధగ మెరిసే జీవమణిని చూచిన జయసింహుడు, తన కాళ్ళతో దాన్ని తొక్కి పట్టి, ముక్కుతో జీవమణి మీద బలంగా మోదాడు.

దానితో, ఉగ్రభైరవుడి గుండెల్లో ఎవరో గునపాలతో పొడుస్తూన్నట్లు బాధ కలిగింది. ఆ బాధతో అరుస్తూ, మయూరాక్షి గదిలోకి వేగంగా పరుగెత్తాడు.

సమయం కోసం ఎదురు చూస్తూన్న అవంతీసుందరి, "ప్రభూ, ఏమైందీ?" అని అడిగింది అమాయకంగా.

ఈలోగా, ఉగ్రభైరవుడు పరుగెత్తుకుంటూ మాయాదర్పణం దగ్గరికి వెళ్ళి, దానిలో శరభ ద్వీపాన్ని చూచాడు.

అక్కడ జరుగుతున్నదంతా మాయా దర్పణంలో కనిపించింది ఉగ్రభైరవుడికి. దానితో, అతడిలో ఎక్కడ లేని కంగారూ, భయమూ పుట్టాయి.

"ఏదో ఒక నెమలి జీవమణిని బ్రద్దలు కొడుతూన్నది," అని ఉగ్రభైరవుడు అరుస్తూండగా, అవంతీసుందరి వెంటనే ఉయ్యాలను అటూ ఇటూ ఊగిస్తూ వెళ్ళి, కత్తినీ డాలునూ అందుకుంది.

అది చూచిన ఉగ్రభైరవుడు నివ్వెరపోతూ,



"ఓసీ రాక్షసీ! నన్నే చంపుదామని అనుకుంటున్నావా?" అంటూ తన ముసుగును తటాలున తొలగించాడు.

భయంకరమైన శునకాకారంతో ఉగ్రభైరవుడి ముఖం కనిపించింది. అంతే కాదు, మాయాదర్పణాన్ని ఓ చేత్తో పట్టుకొని, రెండో చేత్తో ఉయ్యాలను ఆపుతూ. ఆమె దాన్ని చూచేటట్లు చేశాడు.

అంతకు ముందు జయసింహుడు చెప్పినదంతా గుర్తుకు తెచ్చుకొంది అవంతీసుందరి. వెంటనే పెడ ముఖం పెట్టింది.

అంతే కాదు, అవంతీసుందరి తనకు జయసింహుడు చెప్పిన విధంగా, అద్దంలాగా మెరుస్తూన్న డాలును పైకెత్తి అందులో ఉగ్రభైరవుడి ప్రతిబింబాన్ని చూస్తూ, కత్తితో అతడి తలను ఒక వేటుతో తెగి పడేటట్టు నరికి పారేసింది.

అక్కడ జీవమణి పగలటమూ, ఇక్కడ అవంతీసుందరి కత్తి ఉగ్రభైరవుడి తల మీద పడటమూ ఒకేసారి జరిగి, అతడి తల తెగి మయూరాక్షి ముందు పడి దొర్లింది! అతడి రక్తం రివ్వున ఎగజిమ్మింది.

ఉగ్రభైరవుడి రక్తంతో మయూరాక్షి తడిసిపోయింది. వెంటనే మయూరాక్షిలో తీవ్రమైన కదలిక ఏర్పడింది. క్షణాలలో అది పెటిల్లున బ్రద్దలైంది. దానితో పాటు మాయాదర్పణం కూడా ముక్కలు ముక్కలుగా పగిలి క్రింద పడి పోయింది.

సరిగ్గా అక్కడ ఒక పెద్ద భూసొరంగం క్షణాల్లో ఏర్పడింది.



ఇది చూచి అవంతీసుందరి సొమ్మసిల్లి క్రిందపడి పోయింది.

మయూరాక్షి పతనంతో, అక్కడ వున్న ఉయ్యాల మాయమై పోయింది. కాపలా కాలభైరవులూ, ఘటకర్పరుడూ, జలభేతాళమూ, ఏడు ప్రాకారాలూ అన్నీ నశించి పోయాయ్.

అది కేవలం ఒక ఇసుక ఎడారితో నిండిన ద్వీపంగా మారి పోయింది.

మయూరాక్షి పగిలి పోవటంతో నెమిళ్ళుగా మారిన జయసింహుడూ, అప్సరసల నాయకులూ నిజరూపాల్ని పొందారు.

అది వారిద్దరిలో ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఈ లోగా, గదాధర కరటకశర్మలను ఒక సురక్షిత ప్రదేశానికి చేర్చి, త్రిశరుడు జయసింహుడితో గగన మార్గాన మయూరద్వీపానికి బయలు దేరాడు.

ఆ సరికి, ఉగ్రభైరవుడి మంత్రజాలం నుంచి అప్సరసలూ, భూధర జలధరాది రాక్షస రూపులూ స్వస్వరూపాల్ని పొందారు. గతంలో మయూర ద్వీపానికి వచ్చి, రాళ్ళుగా మారిన యక్ష గంధర్వాదులు కూడా నిజ స్వరూపాల్ని పొందారు.

అకస్మికంగా జరిగిన ఈ పరిణామాన్ని గూర్చి వారందరూ ఆశ్చర్యంతో ముచ్చటించుకుంటూ అటూ ఇటూ తిరుగుతూ వుండగా, వారికి ఒక చోట అవంతీసుందరి దివ్యమంగళ రూపం కనిపించింది.

"ఇదో ఈమెయే ఆదిపరాశక్తి దేవి అవతారము అయి వుంటుంది," అని వారందరూ అనుకుంటూ వుండగా, జయసింహ త్రిశరులు అక్కడికి వచ్చి చేరారు.

త్రిశరుడు ఆమెకు స్పృహ వచ్చేటట్లు చేశాడు.

— (ఇంకా ఉంది)





23

[నెమిలి రూపంలోని జయసింహుడు శరభ ద్వీపంలో కల్లోలం సృష్టిస్తూ, సర్పం పడగ మీది జీవమణిని పగలగొడుతూండగా, అవంతీసుందరి ఉగ్రభైరవుడి తల తెగ వేస్తుంది. మయూరాక్షి, మాయాదర్పణం, ఉగ్రభైరవుడి మాయలు అన్నీ నశిస్తాయి. అందరూ తొలి రూపాలు పొందుతారు. ఈలోగా మూర్ఛపోయిన అవంతీసుందరికి స్పృహ తెప్పిస్తాడు త్రిశరుడు.
—తరవాత]

తెలవారుఝామున ఉషోదయకాంతులలో అవంతీసుందరి మూర్ఛనుండి తేరుకుంది. చుట్టూ చూచి ఆమె జయసింహుణ్ణి గుర్తు పట్టింది.

ఉగ్రభైరవుడి మాయామందిరం అదృశ్యం కావటం, అక్కడ ఒక ఎడారి ఏర్పడి వుండటము ఆమెకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అప్పుడు జయసింహుడు ఆమెకు అన్ని విషయాలు వివరించాడు.

ఆ తరవాత, భూధరుడు ఎంతో సంతోషపడి పోతూ, "జయసింహా, నేటితో నారికేళ ద్వీపానికీ, అందులో నివసించే వారికీ మంచి రోజులు వచ్చినట్లే! ఉగ్రభైరవుడి అంతంతో పాటు మా ద్వీపవాసుల కోతి రూపాలు పోయి, మానవదేహాలను పొంది వుంటారు. అందుకు నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి నేను," అన్నాడు.

అంతే కాదు, అక్కడ వున్న అప్సరసలూ, గంధర్వులూ మిగతా వారు తమ తమ కృతజ్ఞతలను వ్యక్త పరిచారు.

అప్పటి దాకా ఏదో ఆలోచిస్తూ మౌనంగా వున్న త్రిశరుడు జయసింహుడి భుజం తట్టి, "జయసింహా, నువ్వు చేయవలసింది ఇంకా వుంది. నిజానికి మాయాదర్పణం వున్న చోట ఈ పాటికి ఒక భూసొరంగం ఏర్పడి వుండి వుంటుంది. దాని కుండా పోతే, పాతాళలోకం వస్తుంది. అందులో ఎవరూ కనీ వినీ ఎరుగని ధనరాసులు వున్నాయట. ఇక దాని

యం. ఉమాదేవి



అన్వేషణ ప్రారంభించాలి,'' అని హెచ్చరించాడు.

అది విని జయసింహుడు ఆశ్చర్యపోతూ వుండగా, త్రిశరుడు నవ్వి, "అవును, జయసింహా! నువ్వూ, ఈ అవంతీసుందరీ మాత్రమే అక్కడికి వెళ్ళేందుకు అర్హులు కాబట్టి, వెంటనే బయలుదేరండి" అన్నాడు.

అప్పుడు ఆ ఇద్దరూ ఆ భూసారంగం వుండే చోటికి వెళ్ళారు. దానికి అడ్డుగా ఒక గుండ్రని అద్దంలాంటి పొర వుంది. దాన్ని జయసింహుడు చేత్తో తాకాడో లేదో, అది తనంతట తానే తెరుచుకుంది.

జయసింహుడికి తెలియదు కాని, జీవమణిని పగలకొట్టగానే అతడికి అంతులేని దివ్యశక్తులు, త్రిలోకాధిపత్యము మొదలైనవి లభించాయి.

అందుకే సంకల్ప మాత్రంగానే, ఆ దారి తనంతట తానే ఏర్పడింది. ఇద్దరూ ఆ దారి గుండా కొంత దూరం పోయారు. అంతలో, హఠాత్తుగా జర్రున జారుతూ వెళ్ళి, ఓ సెల ఏటి ఒడ్డున పడిపోయారు.

దెబ్బ తగలకుండా కాపాడుకొనే నిమిత్తం అవంతీసుందరి ఏదో మర్రి వూడలాంటి దాన్ని చేతికి దొరికితే పట్టుకొని, ఆ తరవాత కెవ్వున అరిచి దాన్ని వదిలి వేసింది. అది సర్పం.

తల క్రిందులుగా వ్రేలాడుతూన్న అనేక సర్పాలలో అది ఒకటి.

ఆమె చేతిని పట్టుకొని జయసింహుడు చకచక ముందుకు నడిచాడు. కొంత దూరంలో ఒక సోపాన పంక్తి వుంది. దానిపై నుండి సన్నని వెలుగు కిరణాలు వస్తూన్నాయి. ఆ వైపు ఏదో విశేషం వుంటుందన్న తలంపుతో జయసింహుడు అటు దారి తీశాడు.

కొన్ని సోపానాలను ఎక్కిన తరవాత వారికి ఒక మైదానమూ, ఎత్తుగా వున్న పర్వతమూ కనిపించాయి. దాని దగ్గరికి వెళుతూండగా ఒక విచిత్ర దృశ్యం కనిపించింది. దానితో అది అద్దంలో ప్రతిఫలిస్తూన్న దృశ్యం అని గ్రహించారు ఇద్దరూ.

అది అనంతంగా-తుది ఏదో తెలియనంతగా చుట్టూ వ్యాపించి వున్న వింత అద్దం అని

లుసుకొన్నారు. అయితే, వెనుతిరిగి చూచినప్పుడు ఆ మైదానమూ పర్వతమూ కనిపించక పోవటం వల్ల, అది లేని దృశ్యాన్ని వున్నట్లు చూపుతూందని అనుకొని ఒకరిని ఒకరు చూచుకొన్నారు.

"ఇదేదో తెల్సుకోవాలి!" అంటూ జయసింహుడు చరాలున కత్తి దూసి. బలంగా దాన్ని మోదాడు.

కాని, అది పగలలేదు. జయసింహుడు అవంతీసుందర్ని ప్రయత్నించి చూడమని అన్నాడు. వెంటనే ఆమె ఒక బండరాతిని దాని పైకి విసిరింది. దానితో, ఆ వింత అద్దం ముద్దలై, పెద్ద శబ్దం చేస్తూ గలగలలాడుతూ క్రింద పడిపోయింది.

అప్పుడు వారి దృష్టికి అంతకు ముందు తాము చూచిన మైదానమూ, ఎత్తు అయి పర్వతమూ కనిపించాయి. ఆ పర్వతం నెమిలి ఆకారంలో వుంది.

దాని మీద స్వేచ్ఛగా కప్పలూ, పాములూ కలిసి మెలిసి తిరుగుతున్నాయి.

ఇద్దరూ ఆ విచిత్రాన్ని చూస్తూ, ముందుకు ప్రయాణించారు.

అంతలో మధురంగా ఓ నెమిలి కూసిన శబ్దం వారికి వినిపించింది. ఆ పైన ఇలా వినిపించింది కూడా.

"ఓయీ మహా సాహసీ! వీరజయసింహా! ఓసారి వచ్చి నన్ను తాకు-రా, నాయనా! నా దగ్గరికి రా!"

"ఎవరు తల్లీ నువ్వు?" అని అడిగాడు జయసింహుడు ఆశ్చర్యంగా.





"నేను నీకు ఎదురుగ్గా వున్న పర్వతాన్ని. మయూర దేవతను," అంటూ మృదుమధురమైన కంఠశ్వరం వినిపించింది.

"చిత్రంగా వుంది, తల్లీ! నువ్వు ఈ రూపంలో వుండటానికి కారణం ఏమిటి?" అన్నాడు జయసింహుడు.

అప్పుడు మయూరదేవత జయసింహుడితో ఇలా చెప్పింది.

"పూర్వం శర్మిలుడు అనే ఋషి ఉండేవాడు. అతడు పరమేశ్వరుడి గురించి ఘోర తపస్సు చేశాడు. ఆయన ప్రత్యక్షం కాలేదు. దానితో శర్మిలుడు ఒక చెట్టు కొమ్మ నుంచి తలక్రిందులుగా తపస్సు చేయ మొదలుపెట్టాడు.


"చెట్టు క్రింద శివలింగం వుంది. శర్మిలుడు తన నాలుకకు పొడుచుకొన్న రంధ్రం నుంచి కారే రక్త బిందువులతో శివలింగానికి రక్తాభిషేకం చేస్తున్నాడు. అతడి శరీరంలోని రక్తం అంతా అలా బిందువుల రూపంలో కారుతూ శివలింగాన్ని తడిపి -వేయసాగింది.

"అప్పుడు శివుడు పార్వతితో సహా ప్రత్యక్షమై, 'ఓయీ శర్మిలుడా! నీ భక్తికి మెచ్చాను. నీవు దేని కోసం తపస్సు చేస్తున్నావో గ్రహించాను. అణిమాద్యష్ట సిద్ధులు అనంత ధనరాసులు, త్రిలోకాధిపత్యము నీకు ఇస్తున్నాను. ఇక తపస్సు చాలించి, వాటితో సుఖించు.' అన్నాడు.

"అయితే, శర్మిలుడికి పార్వతీదేవి మీద వ్యామోహం కలిగి, 'స్వామీ, పార్వతీదేవి లేని నా అంతఃపురానికి ఎన్ని ధనరాసులున్నా ఏమి శోభ కలుగుతుంది? కనుక, నా మీద దయవుంచి, పార్వతీదేవిని అనుగ్రహించ కోరుతున్నాను,' అన్నాడు.

"అప్పుడు శివుడు చిరునవ్వుతో అతడి మూర్ఖత్వానికి జాలి పడుతూండగా, పార్వతి మండిపడుతూ కనులు ఎర్రచేసి, 'ఓరీ నీచ కామాంధుడా! నీవు భయంకరమైన భైరవ రూపంతో జన్మిస్తావు. అనంత శక్తులూ, అష్ట సిద్ధులూ లభించినా నీవు అర్తితో అల్లాడుతూ వుంటావు. నా అంశంలో పుట్టిన రాజకుమారి ఒకతె తప్పక నీ అంతఃపురానికి వస్తుంది. ఆ





విధంగా నీ కోరిక తీరుతుంది. కాని, ఆమె చేతిలోనే నీకు చావు వ్రాసి పెట్టి వుందని గుర్తు ఉంచుకో,' అంటూ అదృశ్యమైపోయింది.

"అప్పుడు శివుడు, 'తథాస్తు!' అంటూ అదృశ్యుడైపోయాడు.

"ఆ శర్మిలుడే ఉగ్రభైరవుడిగా జన్మించాడు. ఈ మయూరద్వీపానికి అధిపతి అయినాడు. వరబలంతో ఇన్ని సంవత్సరాలుగా లోకాల్ని అల్లకల్లోల పరుస్తూ వచ్చాడు. ఇక్కడ ఉన్న అణిమాది అష్టసిద్ధులను గురించి విని వచ్చిన వారినందరినీ రాళ్ళూ రప్పలుగా మార్చి వేస్తూ వచ్చాడు. ఇది జరిగిన కథ.

"ఇప్పుడు తెలిసింది కదా, ఈ అవంతీ సుందరి మరెవరో కాదు, ఉగ్రభైరవుడిని చంప టానికి పార్వతి దేవి అంశతో జన్మించిన దివ్య వనిత అని?"

జయసింహుడు అవంతీసుందరి వైపు చూచి, "అబ్బా ఇదన్నమాట, నీ శక్తి కారణం!" అన్నాడు.

ఆమెకు తటాలున ఏదో గుర్తుకు వచ్చి సిగ్గుతో తలవంచుకుంది.

అప్పుడు మయూరదేవత జయసింహుణ్ణి చూచి, "జయసింహా, మరో విషయం చెప్తాను, విను. ఇంతకూ నువ్వు ఎవ్వరివో తెలుసా? పరమశివుడి అంశంలో జన్మించిన రుద్రమూర్తివి. ఆంజనేయుడు కూడా నీ వలనే రుద్రాంశలో జన్మించాడు, కనుక, నువ్వు కామరూప సిద్ధి పొందిన తరవాత, మొట్ట మొదటసారిగా మీ గురువులవారికి కనిపించినప్పుడు కోతి రూపంలోనే ఉన్నావు. ఇది నీకు తెలియని మహా రహస్యం. ఇకపోతే, మదన మంజూష గంగాదేవి అంశంతో జన్మించింది." అన్నది.

జయసింహుడు ఆశ్చర్యపోతూ ఉండగా మయూరదేవత నవ్వి, "ఇక నువ్వు ఈ పర్వతాన్ని తాకు," అన్నది.

జయసింహుడు పర్వతాన్ని తాకగానే, ఆ పర్వతం మొత్తమూ బంగారు కణికలతో నిండిన మహారాసిగా మారిపోయింది. కణికలన్నీ నెమిలి కన్నుల ఆకారంతో మెరుస్తూ

...న్నాయి. అక్కడ తిరుగుతూ ఉన్నవి ...ర్పాలు కావు, వజ్రాలహారాలు! ఎగురు...తున్నవి కప్పులు కావు, రత్నాలు! ఆ రాసి మధ్య మయూరదేవత ధగధగ మెరిసిపోతూ నిలిచి ఉంది.


ఇదంతా చూచి జయసింహుడూ, అవంతీ సుందరీ ఎంతో ఆశ్చర్యపడి పోయారు.

"జయసింహా, నువ్వూ అవంతీసుందరీ వెళ్ళి, అదిగో ఆ సెలయేటిలోని నీరు తాగండి. మీకు అమరత్వం సిద్ధిస్తుంది. ఇది మీకు తెలియచేయటంతో నా పని ముగిసింది," అంటూ చెప్పి ఆ వెంటనే అదృశ్యమైపోయింది మయూరదేవత.

మయూరదేవత చెప్పినట్లు ఆ ఇద్దరూ సెలయేటి నీటిని త్రాగారు. దానితో వారికి దివ్యత్వం లభించింది. సకల్ప మాత్రంతోనే అక్కడికి బ్రహ్మాండమైన మయూర విమానం వచ్చింది. ఆ ఇద్దరూ దాన్ని ఎక్కి మయూరద్వీపం చేరారు. అక్కడ తమ కోసం ఎదురు చూస్తున్న త్రిశరుడూ, భూధరుడూ మొదలైన వారందరినీ మయూరవిమానంలోకి ఎక్కించుకొన్నారు.

అప్సరసలూ, గంధర్వులూ వారికి నమస్కరించి సెలవు తీసుకొని తమ తమ నివాసాలకు వెళ్ళి పోయారు.

ఆ తర్వాత అక్కడి నుంచి మయూర విమానం బయలుదేరింది. శరభద్వీపం వద్ద పడి వున్న గదాధర కరటకశర్మలను కూడా ఎక్కించుకున్నారు. ఆ తరవాత, దారిలో మదనమంజూషను కూడా విమానం ఎక్కించు



కొని, నారికేళ ద్వీపం చేరారు. దారిలో జరిగినదంతా మదనమంజూషకు తెలియ పరిచాడు జయసింహుడు.

అక్కడ నారికేళ మహర్షికి వందనాలు సమర్పించి, నరులుగా మారిన కోతి రూపులకు అభినందనలు తెలిపి, భూధరుణ్ణి అక్కడ దించి ముందుకు సాగాడు జయసింహుడు.

"కరటకశర్మా, ఈ విజయాన్ని అంతా మనం సాధించినట్లే చెప్పుకొందామా?" అన్నాడు గదాధరుడు మెల్లగా.

"నోర్మూయ్. ప్రాణాలతో నిలిపి బ్రతుకనిచ్చినందుకు సంతోషపడవోయ్! గట్టిగా మాట్లాడితే ఈ విమానంలో నుంచి నిన్నూ నన్నూ క్రిందికి తోసివేస్తారు. జాగ్రత్త!" అన్నాడు కరటకశర్మ.

ఇంతలో విమానం గురుచరణ మహర్షి ఉండే భరద్వాజాశ్రమం చేరింది. అప్పటికే ఇదంతా గ్రహించి గురుచరణుడు పిలిపించగా, అక్కడికి వచ్చి చేరిన మహారాజు పర తపుడికీ, మహారాణి కల్పనాదేవికీ అవం సుందరిని అప్పగించాడు జయసింహుడు.

కూతుర్ని చూచుకొని వారు మురిసి పోతూ వుండగా జయసింహుడు జరిగినదంతా వారిక వివరించాడు.

గురుచరణుడి నిర్ణయం ప్రకారం, ఒక శుభముహూర్తంలో జయసింహుడు అవంతి సుందరినీ, మదనమంజూషనూ వివాహం చేసుకొన్నాడు.

జయసింహుడు త్రిలోకాలకూ పాలకుడై నాడు. అతడి అనుగ్రహంతో గదాధర కరటక శర్మలు అమరావతి రాజ్యంలో ఉన్నత పదవు లను అలంకరించారు. తనకు లభించిన మయూరద్వీపంలోని అపార సంపదతో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు పూనుకున్నాడు జయసింహుడు.

—(అయిపోయింది)

